# గొల్లపూడి కాలమ్ 2013

## - గొల్లపూడి మారుతీరావు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 96

# Index


(January 07,2013) Melukolupu మేలుకొలుపు .......... 4

(January 14,2013) Burada Kolanulo.. బురదకొలనులో ఒంటరి మొగ్గ .......... 7

(January 21,2013) Railu Prayanam రైలు ప్రయాణం .......... 9

(January 28,2013) Tanalo Taanu తనలో తాను .......... 11

(February 04,2013) Viswarupam విశ్వరూపం .......... 13

(February 11,2013) Battalleni Samasyalu బట్టల్లేని సమస్యలు .......... 15

(February 18,2013) Maro Kumbhakonam మరో కుంభకోణం .......... 18

(February 25,2013) Mrutyuvu మృత్యువు .......... 21

(March 04,2013) Devudu Chegodeelu, దేవుడూ–చేగోడీలూ .......... 24

(March 11, 2013) Dosela ..Doshula..!దోశెలా..దోషులా!? .......... 26

(March 18, 2013) Avyavasthaku Avaligattu అవ్యవస్థకు ఆవలిగట్టు .......... 28

(March 25, 2013) Sanjay Vishada Yogam సంజయ విషాద యోగం .......... 31

(April 1, 2013) 'Penta' Raajakeeyalu 'పెంట' రాజకీయాలు .......... 33

(April 8, 2013) Vinta Manishi Konta Navvu వింతమనిషి – కొంత నవ్వూ .......... 35

(April 15, 2013) Oka Alochana – Oka Meemamsa ఒక ఆలోచన – ఒక మీమాంస .......... 37

(April 22, 2013) Maro Telugu Peethadhipati మరో తెలుగు పీఠాధిపత .......... 39

(April 29, 2013) Medhavi Astamayam మేధావి అస్తమయం .......... 41

(May 6, 2013) Varaala Velluva వరాల వెల్లువ .......... 44





(May 13, 2013) Vandella Cinema వందేళ్ళ సినిమాకు వందనాలు ........ 46

(May 20, 2013) V49 O ........ 48

(May 27,2013) Mudu Cheppula Kathalu మూడు 'చెప్పుల' కథలు ........ 50

(June 3, 2013) Chattaniki Kallu Levu చట్టానికి కళ్లు లేవు ........ 52

(June10,2013) Vidya Vyaparam – 1 విద్యా వ్యాపారం – 1 ........ 54

(June17,2013) Vidya Vyaparam – 2 విద్యా వ్యాపారం – 2 ........ 57

(June 24,2013) Vidya Vyaparam – 3 విద్యా వ్యాపారం – 3 ........ 60

(July 1, 2013) Mudo Kannu మూడో కన్ను ........ 63

(July 8, 2013) Vruddhapyaniki Aahvanam వృద్ధాప్యానికి ఆహ్వానం ........ 66

(July 15, 2013) Nookala Znapakalu నూకల జ్ఞాపకాలు ........ 68

(July 22, 2013) Oka Mugimpu ఒక ముగింపు ........ 70

(July 29, 2013) Kukkapilla Katha కుక్కపిల్ల కథ ........ 72

(August 05, 2013) Goonda Rajyam గూండారాజ్యం ........ 75

(August 12, 2013) Tomotolu Ullipaayalu టొమాటోలు– ఉల్లిపాయలు ........ 77

(August 19, 2013) Malli Ulli మళ్ళీ ఉల్లి ........ 79

(August 19, 2013) MalathiChandur ZnapakAlu మాలతీచందూర్ జ్ఞాపకాలు ........ 81

(September 02, 2013) Sangeethaniki Ellalunnayi సంగీతానికి ఎల్లలున్నాయి ........ 83

(September 09, 2013) Jaillalo Chillara Devullu జైళ్లల్లో 'చిల్లర' దేవుళ్లు! ........ 86

(September 16, 2013) Jaillalo Chillara Devullu నేరము–శిక్ష ........ 88

(September 23, 2013) Nurella Cinema నూరేళ్ళ సినిమా ........ 90

(September 30, 2013) Kreeda Kshetramlo Karnudu క్రీడా క్షేత్రంలో కర్ణుడు ........ 93

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

(October 07, 2013) Amma Kodukula Bhagotam అమ్మా కొడుకుల భాగోతం ..... 95

(October 14, 2013) Sarikotta Devudi Katha సరికొత్త దేవుడి కథ ..... 97

(October 21, 2013) Arachakaniki Ellalu అరాచకానికి ఎల్లలు ..... 100

(October 28, 2013) Malli Taj మళ్ళీ తాజ్ ..... 103

(November 05, 2013) Tagore Nobel Prize టాగోర్ నోబెల్ కి నూరేళ్ళు ..... 106

(November 11, 2013) EvaDabba Sommu ఎవడబ్బ సొమ్ము? ..... 108

(November 25, 2013) Manishi Mahatmudu మనిషి మహాత్ముడు ..... 110

(December 02, 2013) Taliban Deshabhakti తాలిబన్ దేశభక్తి ..... 112

(December 09, 2013) Nalla Suryuni Astamayam నల్ల సూర్యుని అస్తమయం ..... 115

(December 16, 2013) Cheepuru Rajakeeyam చీపురు రాజకీయం ..... 118

(December 23, 2013) Oka Neram Oka Nirupana ఒకనేరం ఒక నిరూపణ ..... 120

(December 30, 2013) Samadhipai Akhari Raayi సమాధిపై ఆఖరి రాయి ..... 125

## (January 07,2013) Melukolupu మేలుకొలుపు

అక్బరుద్దీన్ ఒవైసీకి నేను మనసారా కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను. శరీరంలో స్థిరపడి దానిని నయం చెయ్యాలని కూడా గ్రహించని, చెయ్యనక్కరలేదని భావించిన అలసత్వానికి గుర్తుగా వికటించి బయటపడిన కేన్సర్ అక్బరుద్దీన్ ఒవైసీ. ఇప్పుడు బయటపడినా చికిత్సకి లొంగని చావుకి గుర్తు ఈ 'కేన్సర్'. అయితే అంత దయనీయమైన దశలో ఉన్నదా హిందూదేశం? హిందూమతం?

మన మతానికి విస్తృతి ఎక్కువ. ఔదార్యం ఎక్కువ. జాలి ఎక్కువ. సంయమనం ఎక్కువ. అన్నిటికీ మించి అలసత్వం ఎక్కువ. బట్టల్లేని సీతమ్మనీ, నగ్నంగా నిలిపిన భరతమాతనీ చూసికూడా తన తల్లికి బట్టలు తొడిగిన ఎమ్.ఎఫ్.హుస్సేన్‌గారి కళాస్వేచ్ఛని నెత్తికెత్తుకునే కళాతృష్ణ మనది. 'మతం' గురించి ఎవరు మాట్లాడినా, దేవుడిని వెనకేసుకొచ్చినా 'హిందుత్వ'మని కత్తులు దూసే సెక్యులర్ కవచాలు తొడుక్కున్న ఆత్మవంచన చేసుకునే అవకాశవాద పార్టీలున్న దేశం మనది. మనం నలుగురు ముస్లిం పెద్దల్ని రాష్ట్రపతుల్ని చేసుకున్నాం. ఇద్దరు ముస్లింలను ఉపరాష్ట్రపతుల్ని చేసుకుని గౌరవించుకున్నాం. మరే ముస్లిం దేశంలోనూ ఏ హిందువూ ఏ విధమయిన పదవిలోనూ నిలిచిన దాఖలాలు లేవు. నెదర్లాండులో తమ దేవుడిని వెక్కిరించే కార్టూన్లు వేస్తే ప్రపంచంలో అన్ని దేశాల్లోనూ ఆస్తులూ, ఇళ్లూ తగలెట్టారు. తమ దేవుడిని దూషించిన ముస్లిం రచయితనే చంపాలని మరో దేశపు మతగురువు శాసిస్తే –యిప్పటికీ సాల్మన్ రష్దీ రహస్యపు బతుకు బతుకుతున్నాడు. మనం చిత్రగుప్తుడిని, యముడినీ (రెండు 'యముడికి మొగుడు' సినిమాల్ని చూసి సంతోషించాం) శ్రీకృష్ణుడినీ, నారదుడినీ ఆటపట్టిస్తే ప్రేక్షకులు వందరోజులు చూసి ధన్యులవుతారు. బ్రాహ్మణ్యాన్ని గర్హించి –వాళ్ల చేత పేడ తినిపిస్తే –బ్రాహ్మణ□తరులు కిల కిల నవ్వుకుంటారు. ముస్లింలలో అలాంటి పరాచికాలు ఎప్పుడయినా ఎవరయినా చేసిన దాఖలాలు ఉన్నాయా? చేసి బతికి బట్టకట్టగలరా?

ఈ దేశంలో ముస్లిం సోదరులంతా ఒకటి. ఎక్కడ ఉన్నా ఒకటిగా ఓటు వేస్తారు. అయిదేళ్ల ఆడపిల్లకి బురఖా వేస్తారు. అరవైయ్యేళ్ల ముసలాయనా టోపీ పెడతారు. తమని కాదంటే పదేళ్ల పిల్లనీ కాల్చి చంపుతారు. మతం పట్ల గౌరవం, మరొక పక్క భయం – వారిని సంఘటిత పరుస్తుంది.

మనదేశంలో మనం మహారాష్ట్రులం, తమిళులం, బెంగాలీలం, వెనుకబడిన వారం, ముందుబడినవారం, కులాలవారం, రెడ్లం, కమ్మవారం, కాపులం, బ్రాహ్మణులం, శ్రీవైష్ణవులం, శైవులం, మాలలం, మాదిగలం –మనం సామూహిక ప్రతిపత్తిని ఏనాడూ ప్రకటించుకోము. ఎవరూ ఎవరిమాటా వినరు. ఎవరి ప్రయోజనాలు వారివి. ఎవరయినా ఎప్పుడయినా ముస్లింలకు ప్రాతిపదిక మతం. మనకి? వ్యక్తిగత ప్రయోజనం, స్వలాభం, డబ్బు, పదవి, ఎదుటివాడి పతనం –మరేదో, మరేదో.

హిందూదేశంలో ముస్లింల 'హజ్' యాత్రకి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుంది. ప్రపంచంలోని 52 ముస్లిం దేశాలలో ఏ దేశంలోనూ ఈ ఉపకారం లేదు. శుభం. మరి భారతదేశంలో కాశీ, గయ, కేదార్, బదరీ, వైష్ణోదేవి యాత్రలకు మన ప్రభుత్వం ఆర్థిక సహాయం చెయ్యదేం? అడిగే నాథుడేడీ? వాళ్ల స్వార్థాలకే వ్యవధి చాలకపోయె. మన చిన్న పొట్టకు శ్రీరామరక్ష. మన కులానికి మేలు కలిగితే చాలు. మొన్న

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!






విశాఖపట్నంలో ఓ స్వామీజీని బహిరంగంగా కొట్టారు. కారణమేదయినా ఈ పనిని ఏదీ? ఒక 'ఇమామ్'కి దమ్ముంటే చేయమనండి. మనది భారతదేశం. పరాయి పెద్దని అవమానించమనడం ఉద్దేశం కాదు. మన మర్యాదకి నీడలేదని చెప్పడం ఉద్దేశం.

అక్బరుద్దీన్ చేసిన ప్రసంగం ఏ హిందువయినా చేసి బతికి బట్టకట్టగలడా? ముస్లింలు మాట దేవుడెరుగు. ఔదార్యం కట్టలు తెంచుకునే మన సెక్యులర్ వీరులు 'హిందుత్వం' పేరిట గొంతుచించుకోరా? అక్బరుద్దీన్ అరాచకాన్ని ఉత్తరప్రదేశ్‌లో మరో ముస్లిం నాయకుడు సమర్థించారు! హిందూ దేశంలో ముస్లింల కిచ్చిన ప్రత్యేక స్థానం మరే ముస్లిం దేశంలోనయినా హిందువుల కిచ్చిన దాఖలాలు ఉన్నాయా? ఈ దేశంలో 15 శాతం మైనారిటీ వర్గాన్ని 85 శాతం మెజారిటీ వర్గం నెత్తిన పెట్టుకుంటోంది.

కరుణానిధికి రామాయణం కట్టుకథ. ఆయన మన ముఖ్యమంత్రి. దేవుడిని నమ్మని, నమ్మకం లేదని బల్లగుద్దే ఏ ముస్లిమయినా ఏ ముస్లిం దేశంలో నయినా నాయకుడు కాగలడా?

ఈ విచిత్రాన్ని ఎవరయినా గమనించారా? గాజాలో అరబ్బులు క్షేమంగా లేరు. పాకిస్తాన్‌లో వందలమంది ముస్లింలను వారే చంపుకుంటున్నారు. లిబియాలో, మొరాకోలో, ఆఫ్ఘనిస్థాన్‌లో, సిరియాలో, లెబనాన్‌లో, ఈజిప్టులో, ఇరాక్‌లో, యెమెన్‌లో ముస్లింలు హింసకు బలి అవుతున్నారు. ఆస్ట్రేలియాలో, ఇంగ్లండులో, ఫ్రాన్స్‌లో, ఇటలీలో, జర్మనీలో, స్వీడన్‌లో, అమెరికాలో, నార్వేలో వారు క్షేమంగా, హాయిగా ఉన్నారు. అయినా ఆ దేశాల్లో ముస్లింలు పై దేశాల్లో ముస్లింలుగా ఉండాలనుకుంటున్నారు.

మహారాష్ట్రలో, ఉత్తరప్రదేశ్‌లో, బీహార్‌లో ముస్లింలు మైనారిటీలుగా రాయితీలు పొందుతున్నారు. శుభం, మరి ఈ దేశంలోనే జమ్మూ కాశ్మీర్‌లో, మిజోరంలో, నాగాలాండ్‌లో, అరుణాచల్‌ప్రదేశ్‌లో, మేఘాలయలో మైనారిటీలయిన హిందువులకు ఆ రాయితీలు యివ్వడం లేదేం?

ముస్లిం మత కార్యకలాపాలను, వారి వ్యవహారాలను చూసే వక్ఫ్ బోర్డులున్నాయి. వాటి ఆదాయాన్ని ఈ దేశంలో ఎవరయినా ముట్టుకోగలరా? పదిమంది దర్శించే ప్రతి హిందూ దేవాలయ పరిపాలనా, ఆదాయం –రాజకీయ నాయకుల, వారి ప్రతినిధుల చేతుల్లోకి పోయిందేం?

ఎవరయినా మనల్ని తిట్టినప్పుడు –మనం హిందువులం. ఎవరూ తిట్టనప్పుడు –మనల్ని మనమే తిట్టుకునే స్వదేశీయులం. అదీ మన ప్రతాపం.

'మనవాళ్లు ఉత్త వెధవాయిలోయ్!' అన్నాడు గిరీశం. అక్బరుద్దీన్ వంటి పెద్దలు "వీళ్లంతా ఉత్త వెధవాయిలోయ్!" అని నవ్వుకుని ఉంటారు. అందుకే రొమ్ము విరుచుకుని –ప్రేక్షకులు మురిసిపోయేలాగ –హిందూ దేశంలో హిందువుల్ని తిట్టి –తీరిగ్గా లండన్ వెళ్లి కూర్చున్నారు. ఇక్కడ మన వీరంగం చూసి –అక్కడ పేపర్లలో చదువుకుని నవ్వుకుంటూ ఉండి ఉంటారు.

కులాల పేరిట, వర్గాల పేరిట –కిష్టిగాడు, రాములు వెధవ, సీతి, లచ్చి స్థాయికి మతాన్ని యాడ్చిన గౌరవనీయులైన హిందువులు –మొదట ఇల్లు చక్కబెట్టుకోవలసిన అవసరం ఎంతయినా ఉంది. తమలో ఏ లోపాలున్నా 'మతం'– భేషరతుగా –నయానికో, భయానికో –తమకి గుర్తింపునీ, బలాన్నీ, సామూహిక ప్రతిపత్తినీ యివ్వగల శక్తి అని ముస్లింలు నమ్ముతున్నారు. మనం ఏనాడయినా –ఎవరో మనని దుయ్యబట్టిన యిలాంటి అరుదయిన సందర్భాల్లో ప్రథమ కోపాన్ని చూపడం తప్ప –యిలాంటి సంఘటిత శక్తిని ప్రదర్శించామా?



అక్బరుద్దీన్ తప్పు చేశాడా? ఇప్పుడు క్రైస్తవ మతాన్ని సహాయం తెచ్చుకుంటాను. మీ మతాన్ని, మీ విలువల్ని, మీ విశ్వాసాల్ని, మీ ఆచారాల్ని గౌరవించే మొనగాడెవరయినా ఉంటే మొదటి రాయి వెయ్యండి.

నా ఉద్దేశంలో అక్బరుద్దీన్ ప్రసంగం మేలుకొలుపు. పేద తినే బ్రాహ్మణ్యం, యముడిని వెక్కిరించే సినిమాలూ, స్వజనాన్ని గౌరవించుకోలేని స్వార్థం, వేలంటీన్ వేలం వెర్రికి విర్రవీగే సామూహిక పైత్యం, దేవుడు, దేవాలయాలు 'హిందుత్వం' అని రాజకీయ ప్రయోజనాలకు గొంతు చించుకునే అవకాశవాద పార్టీలూ మతానికి విలువని పెంచవు. అక్బరుద్దీన్ వంటి వారి నోటికి బలి అవుతాయి. అంతకంటే భయంకరమైన విషయం ప్రేక్షకుల ప్రశంస అనే హెచ్చరిక.

( **జనవరి** 7, 2013 )

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బా నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

## (January 14,2013) Burada Kolanulo.. బురదకొలనులో ఒంటరి మొగ్గ

సినీమా పాఠాలు చెప్పకూడదు. ఆ పని సినీమాది కాదు.

సినీమా చంకలు గుద్దే వెర్రి వేషాలు వెయ్యకూడదు. ఆ పనీ సినీమాది కాదు.

సినీమా విస్కీకాదు. తులసి తీర్థం కాదు. మార్ఫియా కాదు పాలగ్లాసూ కాదు. కాని ప్రాచుర్యం దృష్ట్యా, అప్పీలు దృష్ట్యా సినీమాకి ఓ బాధ్యత ఉంది. ఇదీ న్యాయంగా ఉండనక్కరలేదు. కానీ ఉండక తప్పని పరిస్థితి - కేవలం దాని ప్రాచుర్యం కారణంగా. ప్రఖ్యాత ఫ్రెంచి దర్శకుడు గొదార్ద్ (ఇప్పుడాయనకి 82 ఏళ్ళు) ఓ మాట అన్నాడు. "సినీమా సెకనుకి ఇరవై నాలుగు సార్లు నిజాన్ని చెపుతుంది" అని. సినీమా ఫ్రేములు 24 కదిలితే తెరమీద బొమ్మ కదులుతుంది. అయితే అవి ఫ్రేములు కావట. అన్నిసార్లు నిజానికి మద్దత(ట)! మిరియాల కషాయంతో బెల్లం ముక్క ఇస్తుంది అమ్మ. బెల్లం తాయిలం. కషాయం వైద్యం. కేవలం బెల్లాన్నే తినిపిస్తే మరో వైద్యం చెయ్యాలి.

డ్రాయింగు రూముల్లోకి దూసుకువచ్చి - అనితర సాధ్యమైన ప్రభావాన్ని చూపే మాధ్యమం - సినీమా - అంత బలమైన ప్రభావాన్ని చూపుతున్న కారణంగానే - కాస్త బాధ్యతని తీసుకోవాలి. తీసుకోకపోతే? బాధ్యతని వహించని, వహించాలని తెలియని, వహించనక్కరలేదన్న అహంకారం గల వ్యక్తుల చేతుల్లో అది మారణాయుధం అవుతుంది. ఫలితం? నిన్న మొన్నటి ఢిల్లీ సంఘటన కావచ్చు. మరేదయినా కావచ్చు. మేం సినీమాలు రాసే రోజుల్లో - అంటే దాదాపు 50 ఏళ్ళ కిందట - సినీమాకి ఏదో ఆదర్శం, లక్ష్యం, దారం, నీతి, సందేశం - కనీసం అంతర్గతంగానయినా - ఉండాలనుకునేవాళ్ళం. ఉండడాన్ని ప్రేక్షకులూ ఆశించేవారు. ఆ 'ఆశ 'ని వమ్ము చేయకూడదని మడిగట్టుకునేవాళ్ళం. "పూలరంగడు" ఏ వెర్రివేషాలు వేస్తే బాక్సాఫీసు దగ్గర కొల్లగొడుతుందో మేం ఆలోచించలేదు. గుర్రబ్బండీ నడుపుకునే నేలబారు మనిషి - చెల్లెలి కాపురాన్ని నిలబెట్టడానికి తండ్రి నిర్దోషిత్వాన్ని నిరూపించడం కథ. మరో పాతికేళ్ళ తర్వాత - ఈ కథని మళ్ళీ రాశాను - "ఆలయ శిఖరం". మళ్ళీ ప్రేక్షకులు వందరోజులు చూశారు. విపరీతమైన ప్రభావాన్ని చూపే మాధ్యమానికి సంస్కారపు అంచులను నిర్దేశించుకోవడం - సామాజిక బాధ్యత. నైతిక బాధ్యత. అన్నిటికీ మించి మానవత్వపు బాధ్యత. ఏ తల్లీ ఉగ్గు గిన్నెతో బిడ్డకు విస్కీ పట్టదుకదా? అయితే - సినీమాని వినిమయ వస్తువుగా, డబ్బుని కొల్లగొట్టే సాధనంగా మాత్రమే ఆయుధాన్ని చేసిన బాధ్యతారహితమైన నేపథ్యంలో 'మిథునం' బురదకొలనులో ఒంటరి మొగ్గ.

'మిథునం' రెండు నిజాల్ని చెపుతుంది. మంచి అభిరుచికి కాలం చెల్లలేదని. మంచి ఆదర్శం - అదెంత స్థూలమయినదయినా - ఆదరించి ఆహ్వానించే ప్రేక్షకులు - ఇంకా ఇంకా కొనవూపిరితోనయినా ఉన్నారని. నేనీమధ్య ఆరు సినీమాలలో నటించాను. కానీ ప్రతిరోజూ "ఈ మధ్య సినీమాలలో వేయడం లేదా సార్?" అని ఎవరో ఒకరు అడుగుతూనే ఉంటారు. "అదేమిటి? ఈ మధ్య ఆరు సినిమాలలో..." మాట పూర్తికాకుండానే చిన్ననవ్వు - "ఈ మధ్య సినీమాలు చూడడం లేదండీ!" అనడం తరుచుగా వినిపిస్తూంటుంది. మరెవరు చూస్తున్నారు? సినీమాల్ని చూసే అలవాటున్న తరం దూరంగా వెళ్ళిపోయి - ఎందుకు చూడాలో, ఎలా చూడాలో తెలీని కొత్త తరానికి చోటిస్తోందా? చూడాల్సిన, చూడగలిగిన, చూడడానికి కొన్ని గుర్తుల్ని పెట్టుకున్న ఎందరినో సినీమాఎందుకు దూరం చేసుకుంటోంది?



ఆ ప్రశ్నకి సమాధానం – 'మిథునం'.

మిథునంలోనూ లోపాలున్నాయి. ఇంకా బాగుండగలిగిన ఆస్కారం ఉంది. పెద్ద హిట్ కాగలిగిన గొప్ప లక్షణాల ఆవశ్యకత ఉంది. (శంకరాభరణం, మయూరి, ప్రతిఘటన, సీతారామయ్యగారి మనవరాలు, మనుషులు మరాలి.. వగైరా వగైరా). కాని 'మిథునం ' ఈ మధ్య కాలంలో చల్లని చలివేంద్ర. మాధ్యమం విలువని, బలాన్ని ఎరిగి బాధ్యత వహించిన పెద్దమనిషి. గంభీరంగా, గుంభనంగా, నిర్దుష్టంగా, నిర్మలంగా కథ చెప్పిన వ్యాపారికాని దర్శకుడు భరణి. వ్యాపారాన్ని సినీమా చేస్తుంది ఎలాగూ. కాని సినీమాని కేవలం వ్యాపారం మాత్రమే చెయ్యకూడదు. శంకరాభరణంలో బట్టలిప్పుకునే అందమయిన బొంబాయి హిందీ అమ్మాయి డాన్స్ వ్యాపారి భయానికో, ప్రలోభానికో నిదర్శనం.

భరణి అందం మీద దృష్టి పెట్టలేదు. ఆకర్షించాలన్న యావ చూపించలేదు. ఒప్పించాలని తాపత్రయపడలేదు. ఇద్దరు ముసిలి దంపతుల ఏకాంత జీవితాన్ని – డీ గ్లామరైజ్ చేసి – చెయ్యడానికి నానా తంటాలు పడి చూపించాడు. మరి ఏది ఆకర్షించింది ఈ సినీమాలో? దర్శకుడి గొప్ప నిజాయితీ ఆకర్షించింది. కథలో ఉన్న జీవలక్షణం ఆకర్షించింది. ఎక్కడో మన మనస్సుల్లో – ఇలాంటి అనుభూతిని గుర్తుపట్టిన ప్రేక్షకుల స్పందనకి పట్టం కట్టింది. వృద్ధ దంపతులు ఇలా ఉండాలా? మనం ఇలా ఉన్నామా? ఉంటే బాగుంటుందా? ఏమో! ఉండడం బాగుంది. అది చాలు. అదే కళ. అదే సినీమా. అదే ఉత్తమయిన కళ చేసే పని. ఉదాత్తమయిన కళ ప్రయోజనం. ఉత్తమమయిన కళ అనుభూతిని గుర్తుపడుతుంది. కాదు. అపురూపమయిన అనుభూతికి గుర్తుపెడుతుంది. అప్పుడు అది వ్యాపారమూ అవుతుంది.మళ్ళీ ఉదాహరణ: శంకరాభరణం, మయూరి, ప్రతిఘటన, సీతారామయ్యగారి మనుమరాలు, మనుషులు మారాలి.. వగైరా వగైరా. 'మిథునం ' గుండె బలంతో, సంపూర్ణమైన విశ్వాసంతో, ప్రేక్షకుల అభిరుచిమీద అపారమైన నమ్మకంతో నిర్మించిన చిత్రం. ప్రేక్షకులు దర్శకుడు, నిర్మాత ఇచ్చిన గౌరవాన్ని నిలబెట్టుకున్నారు. మంచి అభిరుచిని పంచాలనే సదుద్దేశాన్ని గుర్తుపట్టారు. కృతజ్ఞతతో థియేటర్లో కూర్చున్నారు. ఫ్రిడ్జ్ లాంగ్ అనే గొప్ప దర్శకుడు ఓ గొప్ప మాట అన్నాడు. దర్శకుడికి తనేం చేస్తున్నాడో తెలిస్తే – అతనికి తెలుసునన్న విషయాన్ని ప్రేక్షకులూ గుర్తుపడతారు. అంతేకాదు. గౌరవిస్తారు. ఆ గుర్తింపు పేరే – విజయం.

ఆ 'విజయం' వ్యాపారం కాదు. కానీ నిజమైన 'విజయం' వెనక వ్యాపారీ సంతృప్తి చెందుతాడు. కేవలం – అమ్మి సొమ్ము చేసుకోవాలనుకునే స్థాయికి – కక్కుర్తికి సినీమాని దించకూడదు. దించనక్కరలేదు. ఆ నిజాన్ని చాలా ఆలశ్యంగానయినా, ధైర్యంగా, గుండెబలంతో నిరూపించిన చిత్రం – మిథునం.

మా – అంటే ప్రేక్షకుల – అభిరుచిని గుర్తుపట్టి, గౌరవించి, మమ్మల్ని కేవలం సెక్స్ బజారులో విటులుగా చేయనందుకు – 'మిథునం ' యూనిట్ కి – ప్రేక్షకుల తరపున మా ధన్యవాదాలు.

**(జనవరి 14, 2013)**

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (January 21,2013) Railu Prayanam రైలు ప్రయాణం

మనం చాలాసార్లు రైలు ప్రయాణం చేసి ఉంటాం. చేస్తూనే ఉంటాం. మన కళ్ళ ముందునుంచి స్టేషన్లు వెనక్కు వెళ్ళిపోతూంటాయి. అనకాపల్లి దాటాక ఎలమంచిలి వస్తుంది, తరువాత తుని. తరువాత అన్నవరం వస్తుంది. మరేదో మరేదో. దాటిపోయే స్టేషన్లు మన గమనానికి గుర్తు. కానీ ప్రయాణమంతా మనతో వచ్చే కొన్ని దృశ్యాలుంటాయి. పచ్చని పొలాలూ, అక్కడక్కడ చెరువులూ, కాలవలూ, ఎగిరే పక్షులూ, మీద నీలపుటాకాశం – ఇలాగ. ప్రయాణంలో స్టేషన్ మజిలీ. మనతో కదిలే దృశ్యం ప్రయాణాన్ని అలంకరిస్తుంది – మనకి తెలియకుండానే. చాలామందికి స్టేషన్లు గుర్తుండవు. కానీ అందరికీ ప్రయాణం ఇచ్చిన అనుభూతి గుర్తుంటుంది – తప్పనిసరిగా. ప్రయాణానికి అనుభూతే ప్రాణం. గమ్యం లక్ష్యం.

గమనించండి. మన కాల ప్రయాణంలోనూ చాలా స్టేషన్లు ఉన్నాయి – గాంధీ జయంతి, స్వాతంత్ర్య దినం, సంక్రాంతి, వివేకానంద జయంతి, విజయదశమి, దీపావళి – ఇలాగ. గాంధీ జయంతి రోజంతా దేశంలో ప్రతీ నాయకుడూ గాంధీజీ గురించి ఊదరగొట్టేస్తాడు. ఎక్కడెక్కడి విగ్రహాలమీదా దండలు గుమ్మరించేస్తారు. మన మీడియా పుణ్యమాని పేపర్లన్నీ, టీవీలన్నీ వార్తలతో నిండిపోతాయి. మనం వివేకానందుడి సందేశాన్ని పాటించాలని – అవినీతి కేసులు కోర్టుల్లో మురుగుతున్న నాయకుడు మనకి నీతిని చెప్తాడు – (మాయాబజారులో సీఎస్సార్ అన్నట్టు సిగ్గులేకుండా.) మనం వింటూంటాం. విజయదశమికి విగ్రహాలను రకరకాల కార్పొరేటర్లు, మంత్రులూ, నాయకులూ దండలతో అలంకరిస్తారు. ఈ దేశంలో ఇంత భక్తి వెల్లివిరుస్తోందా అని మనకు గర్వపడాలనిపిస్తుంది. కానీ మరునాడే – ఆ ఆలోచనా, ఆ ఆదర్శం, ఆ సందేశం అటకెక్కిపోతాయి. వివేకానందుడు ఎవరు? అని ఏ నాయకుడినయినా అడగండి. ఆయన కంగారు పడతాడు అడిగింది పెద్దమనిషి అయితే. తన మనిషే అయితే "నీకు బుద్ధుందా లేదా?" అని విసుక్కుంటాడు. ఆయన సందేశం ఆనాటి సభకే ప్రత్యేకం. మర్నాటినుంచీ మానభంగాలూ, సబ్సిడీలూ, పాదయాత్రలూ, అవినీతి కేసులూ, కోర్టుల విచారణల్లూ – మామూలు 'మురికి ' జీవితం.

మజిలీలను మరిచిపోయినా దారి పొడుగునా పచ్చని పొలల పలకరింత ఆనాటి ప్రయాణం. గాంధీ జయంతి దాటిపోయినా ఆయన ఆదర్శం ప్రయాణమంతటా పరుచుకున్న ఆరోగ్యకరమైన దినాలు – ఆనాటివి. పండగలు ప్రతీకలై – ప్రయాణం ఆదర్శమై – రైలు యాత్ర ఆరోగ్యకరమైన ప్రస్థానమయేది.

ఈనాడు ఆదర్శమూ, వివేకానందుడి సందేశమూ 'మజిలీల' స్టేషన్ ల స్థాయిలోనే నిలిచిపోయాయి – మురికి బతుకే ప్రయాణంగా సాగే యాత్ర. ప్రయాణం దృక్పథమూ, దృష్టీ మారిపోయింది. సంప్రదాయం కేవలం ఆచారంగా కొన ఊపిరితో మిగిలి – ఇంకా ఆనవాయితీగానే నిలిచి – అది కూడా క్రమంగా ఒక తతంగంగా మీడియాకు మాత్రమే అమ్ముడు పోయింది. ఆ రోజుల్లో పండగలు, పబ్బాలూ సమాజాన్నీ, వ్యక్తినీ ప్రభావితం చేసే సైన్ పోస్టులు. వాటి ఉద్దేశమూ, నిర్దేశమూ అదే. మనకి ఇప్పుడా స్ఫృష్టే మృగ్యమైపోయింది. డిసెంబరు 31న తాగుడు పార్టీలూ, జనవరి ఒకటిన బసొటా డిన్నర్లు, వాలంటీన్ దేనాడు ఆడామగా విచ్చలవిడి డాన్సులూ, మదర్స్ దేనాడు వృద్ధాశ్రమాలకు స్వీట్ పాకెట్, పూల గుత్తి రవాణాలూ – గాంధీ, వివేకానందుడు, ఆఖరికి గణేశ్ ఉత్సవాలూ రాజకీయమైన 'సింబల్స్ 'గానే రూపుదిద్దుకున్నాయి. ఉదాహరణకి – 364 రోజులు నగర ప్రజానీకం భరించాల్సిన హుస్సేన్ సాగర్ కాలుష్యాన్ని ఒక్క రోజులో చేస్తున్న గణేశ్ నిమజ్జనాన్ని ఎవరయినా జంట నగరాల్లో ఆపగలరా? భగవంతుడి పేరిట అనారోగ్యాన్ని కోరి కోరి, తెలిసి తెలిసి నెత్తిన వేసుకుంటున్న విషయం – ఇంత తెలివైన ప్రజానీకానికి తెలియదా? ప్రతీ వినాయకుడి వెనకా ఓ కార్పొరేటరో, ఓ మంత్రో, ఓ రాజకీయనాయకుడో, ఓ భక్తుడో ఉంటాడు.



సామూహిక మూర్ఖత్వం 'భక్తి'గా చెల్లుబాటయే ప్రజాస్వామిక వ్యవస్థ మనది. తెల్లారి లేస్తే నవరాత్రి ఉత్సవాల వెనుక భక్తి కంటే సాముహిక ప్రవృత్తిని చూపుకునే వ్యాపారమో, వ్యాసంగమో ఎక్కువయిపోయింది. పేపర్లలో ఫోటోలూ, నాయకులు తెలిసీ తెలియని (ఎక్కువగా తెలియవన్న విషయం మనకి స్పష్టంగా తెలిస్తూంటుంది) అమ్మవారి గురించి మనకి చెప్పే ఊదరగొట్టుడు – పత్రికల్నీ, టీవీ తెరల్ని నింపేస్తాయి. ఎలమంచిలి దాటిపోయింది.

పచ్చని పొలాలు, చెరువులూ ఎవడిక్కావాలి? లావాదేవీలు, వ్యాపారాలు, కక్షలూ, రాజకీయాలూ, లాకప్ లూ – మళ్ళీ మరో మజిలీ దాకా ప్రయాణం.

గణేశుడి మీద ఇదివరకు ఇంత భక్తి ఎరగం. ఇన్ని కెమెరాలు లేవు. ఇంతమంది నాయకులు లేరు. ఇన్ని టీవీలు లేవు. అమ్మవారి మీద ఇంత బరితెగించిన భక్తిలేదు. కానీ ఆ రోజులనాటి భక్తిలో ఆధ్యాత్మిక సాంద్రతా, ఔదార్యం, మానవ మనుగడలో గాంభీర్యం ఉండేవి. ఆనాటి ప్రయాణంలో పచ్చని పొలాలది పెద్దవాటా. గాంధీజీ ఇచ్చిన సందేశం జీవితమంతా పరుచుకోవాలనే ఆర్తి.

ఈనాడు గాంధీ ఒక మైలు రాయి. నేరస్తుడైన ఓ ఎమ్మెల్యేగారు – ఆరోజుకి మాత్రం, ఆ సభలోనే, ఆ ఒక్కసారే, ఆ ఒక్క ఫోటోల వరకే మనకి అహింస గురించి, శాంతియుత సహజీవనం గురించీ చెప్తారు. ఆ నిజాన్ని ఆయన నమ్మి ఆచరించడం లేదని మనకి తెలుస్తుంటుంది. ఆయనకీ పాపం – నమ్మకం లేని విషయం మనకీ అర్ధమవుతూ ఉంటుంది. ఈనాటీ ప్రయాణంలో గాంధీలు, వివేకానందులూ, విఘ్నేశ్వరులూ, దుర్గామాతలూ – ఆయా పండుగలకు పెట్టుబడులు. కేవలం వార్షిక మర్యాదలు. ఆ రోజులకే పరిమితమైన వ్యాపారాలు. కొండొకచో తద్దినాలు. ఇప్పటి ప్రయాణంలో ఆ 'మజిలీలు' నిర్దేశించిన ఆదర్శం మచ్చుకైనా లేదు. స్టేషన్ల మధ్య పచ్చని పొలాలు లేవు. బీటలు వారిన బీళ్ళు, అర్ధం పర్ధం లేని దృశ్యాలూ చోటు చేసుకున్నాయి. నిన్నటికి నిన్న – పత్రికల్లో చెలరేగిన సంక్రాంతి హోరుని చూశాక ఈ నిజం కొట్టొచ్చినట్టు కనిపించిచింది. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించిన ఉత్తరాయణ పుణ్యకాలంలో – పంటని ఇంటికి తోలుకొచ్చిన రైతు – తన సంపదని చుట్టూ ఉన్నవారితో – ఏటేటా వచ్చే మాలదాసరితో, గంగిరెద్దుల సామితో, భజన బృందాలతో, పగటి భాగవతులతో, పాలేళ్ళతో పంచుకుని పండగ చేసుకుని – తనకి ఏడాది పొడుగునా బాసటగా నిలిచిన మూగజీవాలు – పశుసంపదకి కనుమ రోజున 'కృతజ్ఞత' చెప్పుకునే సత్సంప్రదాయాన్ని – టీవీల్లో మొరిగే, పత్రికల్లో గొంతు చించుకునే, వృద్ధాశ్రమాలకు తల్లితండ్రుల్ని అప్పచెప్పి విదేశాల్లో మాయమయిన రైతన్న బిడ్డలు ఎందరికి తెలుసు? పండగలూ, పబ్బాలూ జన జీవనాన్ని ప్రభావితం చెయ్యాల్సిన ఒక నిరంతన ప్రభావ శీలానికి సంకేతాలు. ఈనాడు పబ్బం గడుపుకుని, వ్యాపారమో, గూండాయిజమో వృత్తిగా జీవితమంతా కప్పల తక్కెడ చేసుకునే అవ్యవస్థలో కేవలం సైన్ పోస్టులుగా మిగిలిపోయాయి. ఈనాటి రైలు ప్రయాణం దృష్టి పూర్తిగా మారిపోయింది. పొరపాటు. పూర్తిగా దృష్టి మాసిపోయింది.

(**జనవరి** 21, 2013)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

## (January 28,2013) Tanalo Taanu తనలో తాను

ఒక విచిత్రమైన, కాని ఆలోచింపజేసిన, ఆలోచించాల్సిన అరుదైన సందర్భం. దక్షిణామ్నాయ శృంగేరీ శ్రీ శారదా పీఠాధీశ్వరులు జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి విశాఖపట్నం వేంచేశారు. భీమునిపట్నంలో సద్గురు శివానందమూర్తివారి ఆశ్రమానికి –వారి దర్శనార్థం వెళ్లాను. శివానందమూర్తిగారు నన్ను అందరిలోనూ పిలిపించారు. స్వామివారికి స్వయంగా పరిచయం చేశారు. స్వామివారు ముందుకు వంగి ఆసక్తిగా వింటున్నారు. నన్ను ఏమని పరిచయం చేస్తారు? ప్రముఖ రచయితననా? సినీనటుడిననా? రేడియో డైరెక్టరుగా రిటైరయాననా? టీవీల్లో కార్యక్రమాలు నిర్వహిస్తాననా? మంచి వక్తననా? వీటిలో ఏదయినా లేదా అన్నీ చెప్పవచ్చు. కాని రెండే మాటలు చెప్పారు –సద్గురువులు. అవి ఇవి: "ఈయన గొల్లపూడి మారుతీరావు. మంచి సంస్కారం వుంది" అంతే! ఈ విశేషణాలలో ఏవో చెప్తారని ఊహించిన నేను ఈ పరిచయానికి ఆశ్చర్యపోయాను. ఆలోచించగా –కనువిప్పు అయింది.

హిందూ మతానికి 36వ పీఠాధీశ్వరులయిన ఒక మహాస్వామి సమక్షంలో నా గురించిన ఏ పరిచయమూ నిలవదు. ఏదీ వారికి ఆసక్తిని కలిగించదు. లౌకికమయిన ఏ అర్హతా, ఏ విజయమూ పీఠాధీశ్వరుల సమక్షంలో ప్రతిభగా నిలిచేదికాదు. అయితే– ఏభై ఎనిమిది సంవత్సరాలు జీవన సరళినీ, కృషినీ, పరిశ్రమనీ క్రోడీకరించగల ఒక్క గుణం –అంతటి మహానుభావుల 'ఎఱుక'లో రాణించేది ఉన్నదా? ఉన్నది. దానిపేరు –సంస్కారం.

ఓ జీవితకాలం పరిశ్రమలో –ఏ ప్రతిభా, ఏ వ్యుత్పత్తీ, ఏ ప్రాముఖ్యతా, ఏ కీర్తీ, ఏ పదవీ, ఏ సంపదా మనిషి ఔన్నత్యాన్ని మహానుభావులముందు నిలపదు. నిలిచేదిగా రాణించదు. ఒకే ఒక్కటి వీటన్నిటినీ తలదన్నేది ఉంది. ఇంకేమీ లేకపోయినా ఉండవలసింది ఉంది. వీటితో ప్రమేయం లేనిది ఉంది. పొరపాటు. ఎన్ని చేసినా, ఏం సాధించినా –ఆ సాధనకి లక్ష్యంగా, మూలధాతువుగా ఉండాల్సిన ఒకే ఒక్క గుణం ఉంది. దాని పేరు సంస్కారం.

అది ఒక దేశపు సంస్కృతీ, ఉద్ధతీ, సంప్రదాయ వైభవం, ఆలోచనా ధోరణీ, వ్యక్తి శీలత, పెద్దల వారసత్వంగా, అనూచానంగా వచ్చిన సంపదా –యిన్నీకలిస్తే –యిన్నిటిని కలిపి నిలిపేది ఒకటుంది. దానిపేరు సంస్కారం.

దీని వైభవం ఎంతటిదో, దీని విలువ ఎంత గొప్పదో –మన సమాజంలో నాయకత్వం వహించవలసిన నాయకులు, ఐయ్యేయస్సులూ, ఇతర మతాల పెద్దలూ, ఉద్యోగులూ ప్రతిరోజూ జైళ్లలో మాయమవుతూ చెప్పక చెప్తున్నారు. అసదుద్దీన్ ఒవైసీని అరెస్టు చెయ్యగానే –కొన్ని బస్సులు ధ్వంసమయాయి. కొన్ని దుకాణాల అద్దాలు పగిలాయి. ఆయన్ని జీపు ఎక్కించి నినాదాలు చేసే కార్యకర్తల మధ్య నుంచి ఆయన్ని తీసుకెళ్లలేకపోయారు. మనకి గుర్తుండే ఉంటుంది –ఒక తెల్లవారు ఝామున దేశం ఇంకా కళ్లిప్పకుండానే కంచి స్వామిని జైలుకి తరలించారు. కొందరిగుండె కలుక్కుమంది. కొందరు ఏడ్చారు. ఇతర మతాల పెద్దలూ బాధపడ్డారు. కాని ఏ విధ్వంసమూ జరగలేదు. ఎవరి అనుతాపమూ ఆవేశంగా తర్జుమా కాలేదు. అరాచకంగా కార్యరూపం దాల్చలేదు. అసదుద్దీన్ నేరం చేశాడని న్యాయస్థానం నిర్ణయిస్తోంది. శిక్ష వేస్తోంది.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

న్యాయాన్ని కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. కంచిస్వామి అరెస్టుకి కంటతడి పెట్టారు. అది అనివార్యమా? అది న్యాయస్థానం నిర్ణయం. అరాచకమా? అది వ్యవస్థ తేల్చుకోవలసిన విషయం. ఈ విచక్షణ పేరే సంస్కారం.

ఈ కాలమ్ మాట్లాడే విషయం –సంస్కారం. రాజకీయం కాదు. రోడ్డుమీద తన మిత్రుడితో వెళ్తున్న ఆడపిల్లని ఆరుగురు చెరిచి ఆమె చావుకి కారణమయారు. కొన్నిలక్షల కోట్లు దోచుకున్న ఓ నేరస్థుడు తను జైలునుంచి బయటికి రావడానికి ఒక న్యాయాధిపతి నీతికి ధర చెల్లించబోయాడు. ఒక కేంద్ర మంత్రిగారు టెలిఫోన్ శాఖని నిర్వహిస్తూ 320 లైన్ల టెలిఫోన్ ఎక్స్ఛేంజీని తన వ్యక్తిగత ప్రయోజనాలకి –యింట్లోనే ఏర్పాటు చేయించుకున్నాడు. ప్రస్థుతం రెండు రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రులు –పండిత్ సుఖ్‌రాం, ఓం ప్రకాష్ చౌతాలా జైల్లో ఉన్నారు. ఆ మధ్య అరెస్టయిన ఓ వ్యభిచారి –తన ఇంటికి వచ్చిన నాయకులు, ఆఫీసర్ల జాబితాను బయటపెడతానని గర్వంగా బెదిరించింది. ఇంత విస్తృతమైన అవినీతి, కుసంస్కారం నేపథ్యం –58 సంవత్సరాలు శ్రమించిన నా జీవనయాత్రలో అన్ని విజయాల వడపోతగా 'సంస్కారి' అన్న కితాబుని మూటగట్టుకోవడం ఎంత వైభవం?

ఒక పీఠాధిపతి ముందు –ఓ వ్యక్తి జీవిత సాఫల్యానికి యింత సంక్షిప్తమయిన కితాబు లభిస్తే –మరి భగవంతుడి సమక్షంలో నిలిచిన భక్తుడికి –ఆ స్థాయిలో అతని ఉనికి, అతని ఆస్థికత, ఆయన తపస్సు, ఆయన అనిష్టాన వైభవం –ఏవీ నిలవవు. స్వామి సమక్షంలో భక్తుడు పిపీలిక, నిర్వీర్యుడవుతాడు. అప్పటి అతని ఉనికికి వ్యుత్పత్తి లేదు. అర్థం లేదు. గుర్తింపు లేదు. ఆ స్థాయిలో అవసరమూ లేదు.

జీవిత సాఫల్యాన్ని కాచి వడబోస్తే –కళాప్రపూర్ణలూ, కేబినెట్ హోదాలూ, ఐయ్యేయస్సులూ, కోట్ల బ్యాంకు అకౌంట్లూ, ప్రపంచ ప్రఖ్యాతులూ, గానగంధర్వ బిరుదాలూ –అన్నీ అన్నీ అసందర్భాలు. అన్నిటికీ మించి వ్యక్తికి అవసరమైనదీ, నికార్సుగా నిలిచేదీ ఒక్కటి –ఒక్కటే ఒక్కటి ఉంది. వ్యక్తిగత సంస్కారం. దానిలోపం విశ్వరూపం దాల్చడాన్ని మనం ఏ రోజు పేపరు తెరిచినా అర్థమౌతుంది. ఆ ఒక్క సుగుణాన్నే పణంగా పెట్టి మిగతా ప్రపంచాన్ని జయించబోయిన ఎందరో మహనీయుల గోత్రాలు –ప్రతి రోజూ ఆవిష్కృతమౌతున్నాయి.

సంస్కారం ఒక్కటే ఉండి మరేది లేకపోయినా బాధలేదు. అది లేక మరేది ఉన్నా ప్రయోజనం లేదు. సద్గురువులు పీఠాధిపతుల సమక్షంలో నాకిచ్చిన కితాబు –60 సంవత్సరాలు కష్టపడి సంపాదించుకున్నది, మరెవరూ దూరం చేయలేనిదీను. ఒక తెరని సద్గురువులు తొలగించారు.

( **జనవరి** 28, 2013 )

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (February 04,2013) Viswarupam విశ్వరూపం

విశ్వరూపం సమస్య నిజంగా "విశ్వరూపం" సినిమాది కాదు. ప్రాంతీయ, మత ఛాందసుల అభిప్రాయాలను నెత్తికెత్తుకోవడం ద్వారా వోట్లకు కక్కుర్తిపడే రాజకీయ వర్గాల ప్రలోభపు విశ్వరూపమది.

ప్రతి వ్యక్తిలోనూ ఈ ప్రలోభం ఉంటుంది. మా వాళ్లని పొగిడితే నాకు ఆనందం. నన్ను తిడితే కోపం. తన ప్రాంతం, తన భాష, తన మతం, తనవాడు -యిలాగ. అయితే వ్యక్తి ప్రాతినిధ్యం వ్యవస్థ స్థాయికి పెరిగే కొద్దీ వ్యక్తి ప్రయోజనం మరుగున పడి -సామాజిక ప్రయోజనంపై దృష్టి మరలుతుంది.

కాని రోజులు మారిపోయాయి. వ్యక్తి ప్రయోజనాన్ని వ్యవస్థీకరించే నాయకత్వం, తమ స్వలాభాన్ని హక్కుగా వక్కాణించి, పోరాడి సాధించుకునే నాయకత్వం -వీటికి వోట్ల బంగారు ముసుగు రాజ్యమేలుతున్న రోజులు. ఆ వ్యక్తి సముదాయాన్ని వోట్ల బంగీగా ముద్దుపెట్టుకునే నాయకత్వం ప్రస్తుతం వారిని దువ్వుతోంది.

నిన్న కమల్‌హాసన్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ మహాత్మాగాంధీ బతికి ఉంటే ఈపాటికి పాకిస్థాన్‌లో స్థిరపడి ఉండేవారు అన్నారు. ఇది నన్ను మెరుపులాగ ఆకర్షించిన విషయం. వ్యక్తి మీమాంసని తొక్కిపెట్టి 'మానవత్వపు' విలువల్ని విహంగస్థాయిలో నిలిపిన ఓ మహాత్ముని దృక్పథానికి దక్కిన కితాబు ఇది.

"విశ్వరూపం" తాలిబన్ల కథ అని కమల్ చెప్పనే చెప్పారు. కాగా ఇది కేవలం వినోదాత్మక చిత్రం అని కూడా అన్నారు. ఏమీ గజిబిజి లేకుండా నాగరిక ప్రపంచంలో ఏ మర్యాదనూ పాటించకుండా భామియన్ బుద్ధ విగ్రహాలను ధ్వంసం చేయడం దగ్గర్నుంచి, చదువు ముఖ్యమన్న ఓ అమ్మాయిని కాల్చి చంపి గర్వపడే సంప్రదాయం తాలిబన్లది. కాగా ఇది కల్పితగాథ. మనదేశంలో ముస్లిం సోదరులకు, ముస్లిం మతానికి -వారు కళలకు, సంగీతానికి, సమాజానికి చేసిన సేవలను మనలో ఒకరుగా -త్వమేవాహంగా నెత్తిన పెట్టుకుంటున్న దేశం మనది. 'సారే జహాసె అచ్చా హిందుస్థాన్ హమారా' అని ఒక ముస్లిం కవి ఇక్బాల్ గొంతెత్తిన దేశం మనది. దిలీప్ కుమార్, మధుబాల, నౌషాద్, బడే గులాం ఆలీఖాన్, అబిద్ హుస్సేన్, ఆలీ అక్బర్ ఖాన్ వంటి మహనీయులు మనం గర్వపడే వ్యక్తులు.

మరి ఈ అసహనం ఎక్కడిది? అది ఒక పార్శ్వం. అసహనాన్ని ప్రదర్శించే వర్గాలను భూతద్దంలో చూపించే నాయకత్వపు అవకాశవాదం ఈనాటి చర్చనీయాంశం. ఆయా వర్గాలకంటే -వాటికి విలువనిచ్చి నెత్తికెత్తుకునే నాయకత్వం ఇంకా భయంకరమైన కీడుని సమాజానికి చేస్తోంది.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

రాజ్ థాకరే మహారాష్ట్రీయుల కోసం ఎత్తిన ప్రాంతీయ వాదం ఆ రాష్ట్రానికి చెందిన కొందరు పెద్దల్ని రహస్యంగానయినా మనస్సుల్లో ఆనందాన్ని కలిగిస్తూ ఉండవచ్చు. "మనవాడు జెండా ఎగరవేస్తున్నాడు. మంచిదే" అని తలలు అటు తిప్పుకున్న సందర్భాలు మనకు తెలుసు. ఈ ధోరణిని వారు ఎదిరించిన దాఖలాలు లేవు.

ఒక అద్భుతమైన ఉదంతం చెప్పుకుంటే చాలు. ప్రముఖ రాజకీయ నాయకులు, ఒకప్పటి మంత్రివర్యులు శ్రీ భాట్టం శ్రీరామమూర్తి గారు తమ ఆత్మకథ "స్వేచ్ఛా భారతం"లో ఈ ఉదంతాన్ని ఉటంకించారు.

ఈనాటి ఆవశ్యకత ఏమిటి? ఇదీ సమాధానం.

నౌఖాలీలో హిందూ ముస్లింల మధ్య కొట్లాట జరుగుతోంది. రక్తం ఏరులయిపారుతోంది. వారి మధ్య కూర్చుని మహాత్ముడు నిరాహార దీక్షని చేస్తున్నాడు. సోషలిస్టు నాయకుడు డాక్టర్ రామ్ మనోహర్ లోహియా వారిని పరామర్శించడానికి వెళ్లారు. "నేను చెప్పింది చేస్తావా?" అని అడిగారు బాపూ. "అది నాకర్తవ్యం" అన్నాడు లోహియా. "పది ముస్లిం మొహల్లాలకు వెళ్లి ప్రతీ తలుపు తట్టి సమావేశానికి పిలువు. వారితో వారి తప్పిదాల్ని చెప్పు" అన్నారు. ఆవేశాలు ఆకాశానికి అంటే వాతావరణంలో వారిని పిలవడమా? వారి అనుచితాల్ని చెప్పడమా? కొందరు తిట్టారు. కొందరు కసిరారు. కొందరు బెదిరించారు. కొందరు అరిచారు. కాని మీటింగుకి అరడజను మంది హాజరయారు. ఆయన మాట్లాడడం మొదలెట్టగానే తిడుతూ అయిదుగురు లేచిపోయారు. మహాత్ముడిని కలిశారు లోహియా. ఈ ఒక్కడే సభలో మిగిలాడని చూపించారట. అప్పుడు మహాత్ముడు అన్నారట: "ఈ ఒక్కడే ఒక సైన్యం. అలాంటి ఒక్కడినే ఇక్కడ కూర్చున్నాను. అతన్ని విడిచిపెట్టకు. సమాజంలో ఒక్కడు చాలు – సత్యాన్ని నిర్దేశించడానికి". అదీ మహాత్ముడు. వేల రూపాయలు ఖర్చుపెట్టి లక్షలాది జనాన్ని పోగుచేసి ఆకాశం దద్దరిల్లేటట్టు ఉపన్యాసాలు ఇస్తే చప్పట్లు వస్తాయేమో కాని వోట్లు రావు. ఎవరిదారిన వారు పోతారు. అలనాటి తిరుపతిలో చిరంజీవి అవిలాల సభ అందుకు గొప్ప తార్కాణం. మనకి చాలా విశ్వరూపాలున్నాయి. ప్రలోభాల, స్వార్థాల, పదవీ వ్యామోహాల, ఆత్మవంచనల, విశ్వరూపాలు. ఇప్పటి విశ్వరూపాన్ని ఎదిరించే చిన్న చిన్న మత ఛాందసులలో అసహనం ఉంది. అయితే ఆ అసహనాన్ని ప్రదర్శించే ఎంతో కొంత నిజాయితీ ఉంది. కాని వారిని సమర్థించే, వారిని బుజ్జగించే, తమ ప్రయోజనాలకు వాడుకునే, వోట్ల కోసం తాకట్టుపెట్టే ప్రలోభాల విశ్వరూపం ప్రమాదకరమైనది. అదీ ఈనాటి దుర్వ్యవస్థ.

కావలసింది –సహేతుకమైన, సజావయిన, సత్యాన్ని నిర్దేశించగల, ధైర్యంతో నిలిచే ఒకే ఒక గొంతు. నా ఉద్దేశం "విశ్వరూపాన్ని" ఎదిరించే మత శక్తులలో ఉన్న నిజాయితీ, వాటిని ఎదిరించవలసిన నాయకత్వంలో లేదని. ఇది ఆత్మవంచన ఆరోప్రాణం. మన నాయకత్వపు నిజస్వరూపం. ఇందుకు చక్కని ఉదాహరణలు –జయలలిత, మమతా బెనర్జీ.

**(ఫిబ్రవరి** 4,2013)



gollapudimaruthirao.blogspot.com gmrsivani@gmail.com

# (February 11,2013) Battalleni Samasyalu బట్టల్లేని సమస్యలు

చాలా సంవత్సరాల కిందట మా ఆవిడా మా అబ్బాయి వత్తిడి చేయగా చేయగా మాల్ దీవులకు వెళ్లాం. బియాదూ అనే చిన్న ద్వీపంలో ఒక భారతీయ సంస్థ (తాజ్ గ్రూపు అనుకుంటాను) ఒక రిసార్ట్‌ని నిర్వహిస్తోంది. ఆ ద్వీపం కొన్ని ఎకరాల విస్తీర్ణం. ద్వీపం అంతా రిసార్టే. మాలే విమానాశ్రయం నుంచి చిన్న లాంచీలో గంటన్నర ప్రయాణం. మాతోపాటు లాంచీలో ఒక స్విట్జర్లాండు దొరగారూ, ఆయన కంటే వయస్సులో కాస్త పెద్దదయిన ఆయన గర్ల్ ఫ్రెండూ వచ్చారు. చుట్టూ ఉన్న హిందూ మహాసముద్రంలో మెడలోతు నీళ్లలో మునిగి –లక్షలాది రంగు చేపల్ని చూడడం ఒక గొప్ప వినోదం. దీన్ని స్నార్క్‌లింగ్ అంటారు. ఈ స్విట్జర్లాండు జంటే నాచేత ఆ పనిని చేయించారు. ద్వీపంలో దిగగానే నన్ను ఆకర్షించిన మొదటి ప్రకటన: "ఇక్కడ యాత్రికులు విధిగా బట్టలు ధరించి ఉండవలెను" అని. మొదట పొరపాటుగా రాశారేమోననుకున్నాను.

"సరైన బట్టలు ధరించవలెను" అనో "మర్యాదపూర్వకమైన దుస్తులు ధరించవలెను" అనో ఉండాలి కదా? మేనేజరుని అడిగాను. ఆయన నవ్వాడు. వారు రాసిందే కరెక్టట. ఆ ద్వీపానికి ఎక్కువగా విదేశీ యాత్రీకులు వస్తూంటారు. వారు ఆ చిన్న ద్వీపంలో ఈదుతూ, స్నార్క్‌లింగ్ చేస్తూ బట్టల్లేకుండా గడుపుతారట ముఖ్యంగా స్త్రీలు. చెప్పి చెప్పి –ఆఖరికి విసిగి –విధిగా ఒక నిబంధన లాగ ఆ బోర్డు తగిలించారట. "అయినా వారి అలవాటు మానరు సార్" అని వాపోయాడు మేనేజరు. మేమున్న మూడు నాలుగు రోజుల్లో బట్టల్లేని చాలామంది కనిపిస్తూ వచ్చారు. వారి వారి దేశాలలో నగ్నత్వం, ఎండలో బట్టల్లేకుండా తిరగడం ఒక వ్యాపకం కావచ్చు. కాని ఇక్కడది వికారం. కాని పట్టుచీరె కట్టుకుని వొళ్లంతా కప్పుకునే ఒక భారతీయ మహిళతో నేనక్కడికి వెళ్లాను. ఆవిడ నా పక్కన ఉండడం వల్ల ఆ దృశ్యం మరీ ఇబ్బందిగా కనిపించింది. తప్పించుకు తిరిగే ప్రయత్నం చేశాం ఆ నాలుగు రోజులూ.

ఇందులో చిన్న వివరణ అవసరం. అది అభ్యంతరకరం, అనౌచిత్యం అని ఎందుకనిపించింది? మరి ఇటలీలో, గ్రీసులో, ఆస్ట్రేలియాలో వారు ఎందుకలా భావించరు? జాగ్రత్తగా అర్థం చేసుకుంటే మన సంస్కృతికి అలవాటులేని, అసభ్యమనిపించే చర్యని మన 'మర్యాద'ని దృష్టిలో ఉంచుకుని బేరీజు వేస్తాం. ఆస్ట్రేలియా మనిషి ఆ నగ్నత్వాన్ని పట్టించుకోడేమో! నా పక్కన ఉన్న పట్టుచీరె మహిళ ఆ అసభ్యతని మరీ కొట్టొచ్చినట్టు వేలెత్తి చూపుతోంది. ఆమె సంస్కారం ఇక్కడి విశృంఖలత్వానికి కొలబద్ద. మనకి అది వెకిలితనం, వెగటుతనం, అభిరుచి లేమి – ఇంకా చెప్పాలంటే కుసంస్కారం. ఇంకాస్త ముందుకు పోయి చెప్పాలంటే పశుత్వం.

సమాజం సహించలేని అభ్యంతరాన్ని ఆ సమాజం తరతరాలుగా గౌరవించే 'మర్యాద'తో పోల్చి తూకం వేస్తాం. మాల్ దీవుల్లో ఒ క భారతీయ రిసార్ట్‌లో ఇది అభ్యంతరం. అసభ్యం. అమర్యాద. అభిరుచి దారిద్ర్యం. కుసంస్కారం –ఈ కొలబద్ధలన్నీ ఈ దేశానివి, తరతరాల మన సంస్కారానివి.

మహాసాధ్వి సతీ అనసూయని త్రిమూర్తులు –కేవలం పరీక్షించడానికి నగ్నంగా వడ్డన చేయమంటే ఆమె వారిని ముగ్గురు పసివారిని చేసిన కథ మనకి తెలుసు. ఇది ఈ దేశపు సంస్కృతి ఒక గొప్ప 'మర్యాద'కి ఇచ్చిన విలువ. ఈ ఐతిహ్యాలు మన సమాజపు విలువల్ని చిత్రిక పట్టే సాధనాలు. హిమాలయాల్లో తపస్సు చేసుకునే నాగా సాధువుల సముదాయానికి వారి నగ్నత్వం అపభ్రంశం అనిపించదు. కారణం –వారి దృష్టి, దృక్పథం




అటు లేదు కనుక. భగవాన్ రమణ మహర్షిలో మనం నగ్నత్వాన్ని చూడము. ఒక నిరాడంబరతని చూస్తాం. ఒక మహనీయతని చూస్తాం. ఇక్కడ మన 'సామాన్యత' కొలబద్ద. వారి జీవన లక్ష్యం మన దృక్పథాన్ని సంధిస్తుంది. లేదా నిర్ణయిస్తుంది. ఈ మధ్య లాస్ ఏంజలిస్‌లో జరిగిన 55వ గ్రామీ అవార్డుల సమావేశంలో కార్యకర్తలు ఒక హెచ్చరిక చేశారు –పాల్గొనేవారికి. వాక్యం ఇది: "మీరు వేసుకునే బట్టలు మీ మర్మావయవాలను కప్పేటట్టు చూసుకోండి బాబూ! బొత్తిగా శరీరంలో ప్రతీ అవయవం కనిపించే ఉల్లిపొర బట్టలు ధరించకండి" ఇంత చెప్తే చాలు. ఇదేమిటి? అమెరికా ఇంత చెడిపోయిందా? అనిపిస్తుంది. మరేం పరవాలేదు. మనం కూడా విదేశాలతో పోటీ పడే సంస్కారాన్ని గర్వంగా సముద్ధరించుకుంటున్నాం.

మాలేలో బియాదూ ఒక 'అపశృతి' అనేంత గొప్పగా ఈ మధ్య బెంగుళూరులో చిత్రకళా పరిషత్ కళా ప్రదర్శనలో మన దేవుళ్ల, దేవతల నగ్నసౌందర్యాన్ని కళాకారులు చిత్రించి ప్రదర్శించారట. దుర్గావాహిని, విశ్వహిందూపరిషత్, శ్రీరామసేవ వంటి సంస్థలు ఈ ప్రదర్శనని వ్యతిరేకించాయట. ఇలా తిరగబడడం నిజంగా నేరమే. కాని భారతదేశంలో 1.2 బిలియన్ల జనాభాలో 85 శాతం భారతీయులు ఉండగా శతాబ్దాల సాంస్కృతిక చరిత్రని విస్మరించి కళాకారులు మన దేవుళ్లనీ, దేవతల్నీ నగ్నంగా చిత్రించిన నీచపు అభిరుచిని ఎవరయినా వ్యతిరేకించరేం?

ఎక్కడో ఏ దేశంలోనో తమ ప్రవక్త మీద అర్థం లేని కార్టూన్లు వేస్తే ప్రపంచంలోని అన్ని దేశాలలో ముస్లింలు ఆవేశితులయి –తమ క్రోధాన్ని ప్రకటించారు. అది సబబని నేనను. కనీసం వారి దగ్గరనుంచయినా మతానికి ఎంత విలువనివ్వాలో కొన్ని పాఠాలు నేర్చుకోవలసిన ఆవశ్యకత ఉంది. అరాచకాన్ని కల్పించడం నా ఉద్దేశం కాదు అసమ్మతిని ప్రకటించడం. ఈ దేశపు సంస్కృతిని కనీసం అర్థం చేసుకోలేని ఆ కళాకారుల్ని ప్రభుత్వం ఎందుకు అరెస్టు చెయ్యదు? ఈ కళాకారులు మొన్న మన పార్లమెంటు మీద దాడికి కారణమయిన అఫ్జల్ గురు కంటే ప్రమాదకరమైన దౌర్జన్యకారులు. వీరికీ నిన్నకాక మొన్న ఉరితీసిన అజ్మాల్ కసబ్‌కీ పెద్ద తేడాలేదు.

ఒక్క మహిళ నా పక్కన నిలబడిన కారణంగానే ఒక చిన్న ద్వీపంలో నగ్నత్వం నన్ను వణికిస్తే –తరతరాల భారతీయ సంస్కృతీ వైభవాన్ని కనీసం మననం చేసుకోని ఈ కళాకారుల అంధత్వానికి ఎలాంటి శిక్షయినా తక్కువేననిపిస్తుంది. ఇది మతానికి సంబంధించిన విషయం కాదు. వ్యవస్థ సంస్కారానికి, కళయొక్క ఉదాత్తతకీ సంబంధించిన విషయం.

లోగడ ఇలాంటి ఔచిత్య రాహిత్యాన్ని ప్రకటించిన ఓ పద్మవిభూషణుని పట్ల ఈ దేశం తన నైరాశ్యాన్ని ప్రకటించింది. కళాకారుని స్వేచ్ఛకి అంతరాయం కలిగించే హక్కు ఎవరికీ లేదని కొందరు 'సిగ్గులేని' కళాహృదయులు జుత్తు పీక్కొన్నారు కాని –హుస్సేన్ సాహెబ్‌గారు తన తల్లికి వొంటినిండా బట్టలు తొడగడం వారి స్వేచ్ఛకి, అభిరుచికీ కొలబద్ద అయితే "సుజలాం సుఫలాం మలయజ సీతలాం –మాతరం వందేమాతరం" అని మనం అనునిత్యం కొలిచే భారతమాతను భారతదేశంలో పుట్టి పెరిగిన ఓ కళాకారుడు నగ్నంగా చిత్రించడం ఏ స్వేచ్ఛకు నిదర్శనమో ఎవరూ ఉదహరించలేదు. ఈ దేశంలో ప్రభుత్వాల చేతులకి గాజులున్నాయి. మత వర్గాల చేతుల్లో వోట్లున్నాయి. నాయకుల జీవితాల్లో క్షమించరాని నేరాలున్నాయి. వారి మనస్సుల్లో ఈ దేశ వైభవం పట్ల అవగాహన లేదు.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

అందుకనే ఢిల్లీలో, నిన్నకాక మొన్న బెంగుళూరులో భారత దేశంలో యుగాల సంస్కృతిని ప్రతిఫలించే దేవతల, దేవుళ్లకు బట్టలిప్పే నీచపు కళ 'స్వేచ్ఛ' పేరిట విరగబడుతోంది. విశృంఖలంగా ప్రదర్శనలిచ్చుకుంటోంది. ఇది మన సంస్కృతీ మర్యాద కాదని పాలనా యంత్రాంగం నోరు విప్పదేం?

కళకి అభిరుచి, మర్యాద, సభ్యత, సంస్కారం, ప్రతిభ, దక్షత, యుక్తత వంటి పల్చని తెరలెన్నో ఉన్నాయి. ఎంత గొప్ప కళయినా జాతి జీవన సరళినీ, ఆలోచనా సంవిధానాన్ని, సంప్రదాయాల్నీ, విశ్వాశాల్నీ కించపరిచే హక్కులేదు.

పద్మవిభూషణ్ హుస్సేన్‌గారు –బట్టల్లేని హనుమంతుడు చంక ఎక్కిన బట్టల్లేని సీత బొమ్మ తను పుట్టి పెరిగిన, తను అనునిత్యం గమనిస్తున్న ఒక జాతి విశ్వాసాలను వెక్కిరించే నీచపు అభిరుచికి నిదర్శనమని గ్రహించలేని అంధుడా?

కళాస్వేచ్ఛకీ, సంస్కృతీ మర్యాదలకీ గల పల్చని తెరలను చెరిపే హక్కు ఏ దేశంలోనూ ఎవరికీ లేదు. ప్రదర్శనని అడ్డుకున్న వారిని శిక్షించండి. కాని ఇలాంటి దిక్కుమాలిన బొమ్మల్ని కళ పేరిట వేసి జాతిని అవమానించే ఆ కళాకారుల్ని కూడా ఆ జైలులోనే మరో దరిద్రమయిన గదుల్లో బంధించండి.

జాతి విశ్వాసాలను గౌరవించలేని నాయకత్వపు అలసత్వాన్ని ఎన్నడూ ప్రజలు క్షమించరు. క్షమించరు. క్షమించరు.

**(ఫిబ్రవరి** 11,2013)




# (February 18,2013) Maro Kumbhakonam మరో కుంభకోణం

మూలిగే నక్కమీద మరో తాటిపండు ఈ కొత్త కుంభకోణం. ఈ శతాబ్దానికి అటు 13 సంవత్సరాలకు, ఇటు 13 సంవత్సరాలకు ఈ దేశంలో రెండు పెద్ద కుంభకోణాలు జరిగాయి. రెండూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయి. రెండూ రక్షణ శాఖకు సంబంధించినవే. రెండూ అప్పటి రక్షణ మంత్రులూ, అప్పటి ఆయా సైన్యాధిపతులతో ముడిపడినవే. ఒకటి ఇప్పటికీ ముడి విడలేదు. రెండోదానికి –మొదటి అనుభవం దృష్ట్యా ఎప్పటికీ విడుతుందన్న ఆశలేదు. ఎందుకంటే నిజాయితీ, ప్రజాభిప్రాయం కంటే ఏనాడయినా అధికారం నోరు పెద్దది. చేసేది ఎలాగూ ఏమీలేదు కనుక –ఒక చక్కని అపరాధ పరిశోధక కథలాగ ఈ వ్యవహారాన్ని విప్పుకుందాం. చెప్పుకుందాం. నేలబారు మనిషికి తెలియని, వంట బట్టని రంగం ఏమిటి? రక్షణ శాఖ. యుద్ధాల గురించి మనం వింటూంటాం. ఎక్కడో సరిహద్దుల్లో తుపాకులు పేలుతాయి. మనం టీవీల్లో బొమ్మలు చూస్తాం. ఎప్పుడో –రిపబ్లిక్ దినోత్సవం నాడు సరదాగా ఢిల్లీలో ఊరేగే ఆయుధాల, శకటాల వైభవాన్ని చూసి సంతోషిస్తాం. తుపాకులు, బాంబులు, హెలికాప్టర్లు, టాంకులు –వీటి కొనుగోళ్లు గురించి మనకేమీ తెలియదు. తెలుసుకునే అవకాశమూ లేదు. అది రక్షణ శాఖకు సంబంధించిన అభ్యంతరకరమైన సమాచారం కనుక. కొన్నికోట్ల సొమ్ము ఆయా ఆయుధాల మీద ఖర్చవుతుందని మనం వింటూంటాం.

ఎలా ఖర్చవుతోందో మనకు తెలిసే అవకాశం లేదు. కనుక కొల్లగొట్టదలచినవారికి ఈ రంగం నల్లేరుమీద బండి. అడిగే నాధుడు లేడు. మనం నమ్మే నాయకులు, రక్షణ అధికారులు, ఉద్యోగులకు తప్ప ఎవరికీ తెలియవు. మరి కంచే చేనుమేస్తే? అదే 1987 లో తెలిసింది. మళ్లీ ఇప్పుడు 2013 లో బయటికి పొక్కింది. ఇది యాదృచ్ఛికం అనండి, అనుకోకుండా జరిగింది అనండి, అనుకునే చేసింది అనండి –ఆనాటి దోపిడీకి, ఇప్పటి దోపిడీకీ చాలా పోలికలున్నాయి. దొంగలకి కొన్ని చేతివాటాలుంటాయి. పోలీసులు సాధారణంగా ఆ వాటంని గుర్తించే పట్టుకుంటారు. అలాగే అలనాటి బోఫోర్స్ చేతి వాటానికీ, ఇప్పటి హెలికాప్టర్ దోపిడీ వాటానికీ చాలా పోలికలున్నాయి. సరదాగా ముచ్చటిద్దాం.

అప్పుడూ ఇటలీ సామగ్రి కొనుగోలు జరిగింది. ఇప్పుడూ ఇటలీ కొనుగోలులోనే మతలబు జరిగింది. ఇటలీకీ కుంభకోణాలకీ ఏదైనా దగ్గర సంబంధం ఉందా? ఆ రోజుల్లో బోఫోర్స్‌లో చేతులు మారిన సొమ్ము 250 కోట్లన్నారు. రూపాయి విలువ పడిపోయిందో, అవినీతి విలువ పెరిగిందో తెలీదు కాని –ఒక టీవీ ఛానల్ సమాచారం ప్రకారం 5.5 బిలియన్ల సొమ్ము –ఇప్పటికి చేతులు మారిందట! బోఫోర్స్ కుంభకోణానికి కేంద్ర స్థానం స్వీడన్. ఇప్పుడు ఇటలీ. రక్షణ శాఖ అధికారులు సరిహద్దుల్లో పర్వత ప్రాంతంలో తిరగడానికి 18 వేల అడుగుల ఎత్తున ఎగరగల హెలికాప్టర్లను ఫిన్‌మెకానికా అనే ఇటలీ సంస్థ నుంచి కొనుగోలు చెయ్యాలనుకున్నారు. అందులో జరిగిన అవినీతి కారణంగా ఇప్పటికే కమర్షియల్ డైరెక్టర్ పావ్లో పొజిస్సేరీ, చీఫ్ ఆఫీసరు గిస్సెప్పీ ఆర్సీనీ అరెస్టు చేశారు. అలనాడు అనట్రానిక్ కార్పొరేషన్ విన్‌చెద్దా గారికి జరిగిన మర్యాద గుర్తుండే ఉంటుంది.

ఈ డబ్బు ఎవరెవరికి ఎలా చేరింది. అప్పుడూ ఇప్పుడూ రూట్లు ఒక్కటే. మారిషస్‌లో పోర్ట్ లూయీ, స్విట్జర్లాండ్‌లో లుసానే, ఇంగ్లండు, న్యూయార్కుల మీదుగా మళ్లీ ఢిల్లీకి చేరుతుంది. అలనాడు బోఫోర్స్ శతఘ్నులు కూడా సైన్యానికి కావలసిన తరహాలో లేవన్నారు. అయినా రాజీ జరిగింది. ఇప్పుడూ ఫిన్‌మెకానికా హెలికాప్టర్లు 18 వేల అడుగులకి ఎగరలేవన్నారు. కనుక 15 వేలకి రాజీ పడ్డారు. ఎవరు? ప్రపంచంలో 15

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

వేల అడుగుల ఎత్తున ఎగర గలిగిన హెలికాప్టర్లు ఒక్క ఫిన్ మెకానికా కంపెనీయే తయారు చేస్తోంది. వారికిక పోటీలేదు. అది ముఖ్య కారణమా? లేక అదే ముఖ్య కారణమా?

ఇప్పుడు మరో లొసుగు. అప్పటి ఎయిర్ ఛీఫ్ మార్షల్ శశి త్యాగీ. ఈ కుంభకోణానికి కారకులు ముగ్గురు –వారు జూలీ త్యాగీ, డోక్సా త్యాగీ, సందీప్ త్యాగీ. వీరు ముగ్గురు ఎయిర్ మార్షల్ గారి సోదరులు. ఆ మాట వారే ఒప్పుకున్నారు. కాని తనకేమీ తెలియదన్నారు త్యాగీ. తమకూ ఏమీ తెలియదన్నారు సోదరులు. మంట లేనిదే పొగరాదు కదా? అయితే 5 బిలియన్లు అవినీతికి తలాపాపం పంచుకునే పెద్దలు ఎక్కడెక్కడ ఎందరున్నారో! ఇంకో మధ్యవర్తి లండన్‌లో ఉన్నాడు. (అలనాడు బోఫోర్స్‌కి ఏ.ఈ. సర్వీసెస్ లండన్‌లో ఉన్న సంగతి గుర్తుండే ఉంటుంది) ప్రస్థుత లండన్ మధ్యవర్తికీ మన కాంగ్రెస్‌కూ చాలాదగ్గర సంబంధాలున్నాయట. ఈ వ్యవహారమంతా 23 ఏళ్ల కుర్రాడు అభిషేక్ వర్మ నడుపుతున్నాడట. ఇతనికి బొత్తిగా వ్యాపార దక్షత లేదు. మరేముంది? వాళ్లనాన్న శ్రీకాంత వర్మ ఒకప్పుడు కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ. తల్లి మినిమిత వర్మ 24 సంవత్సరాలు పార్లమెంటు సభ్యురాలు. ప్రస్థుతం ఈ అభిషేక్‌గారు మరేవో కారణాలకి తీహార్ జైల్లో ఉన్నారు. వీరు ఇప్పటికే ఎందరో పాత్రికేయులు, ఎడిటర్లు, రాజకీయ నాయకులు, మధ్యవర్తుల మధ్య 5.5 బిలియన్ల సొమ్ముని పంచారట. భేతాళ కథలాగ ఉందికదా? ఇటలీలో ఏ కోర్టు వ్యవహారాలయినా బహిరంగంగా సాగుతాయి. కావాలంటే బహిరంగంగా ఆ కాగితాలను తెప్పించుకోవచ్చు. ఒక్క ట్యునీసియా నుంచి మారిషస్‌కి 510 లక్షల యూరోలు చేతులు మారినట్టు తెలియవస్తోంది. ఇటలీలో ఈ అవినీతి పనులు చేసినవారిని అరెస్టు చేశారు. ఈ కుంభకోణాన్ని సంవత్సరం కిందటే ఒక ఛానల్ బయట పెట్టింది. అయినా భారతదేశం ఇంకా మీనమేషాలు లెక్కపెడుతోందేం? "ఛానల్ కథనాలు మేం వింటాం. కాని మా రుజువులు మాకు కావాలి" అని ఒకానొక నాయకులు టీవీలో వక్కాణించారు. ప్రభుత్వ అలసత్వానికి ఎన్ని సుళువయిన తొడుగులున్నాయో! పాలుతాగే పిల్లులకు ఎన్ని గంతలున్నాయో! మనకి నిజాయితీ పరుడయిన రక్షణ మంత్రిగారున్నారు. అతి నిజాయితీ పరుడయిన ప్రధానమంత్రి గారున్నారు. కాని చుట్టూ ఉన్న వాతావరణం అవినీతిలో కూరుకుపోతూంటే కళ్లు మూసుకునే నిజాయితీ కూడా భయంకరమైన అవినీతే. ఇప్పటికే మనల్ని చూసి ప్రపంచమంతా నవ్వుకుంటోందని అలనాడు బోఫోర్స్ గుట్టు రట్టు చేసిన చిత్రా సుబ్రహ్మణ్యన్ జెనీవా నుంచి చెప్పారు.

ఇంతగా కొంపలు మునుగుతూంటే –ఇలా తేలికగా తీసుకుంటున్నట్టు పాఠకులకు అనిపించవచ్చు. అయ్యా, మనదేశంలో కుంభకోణాలు బయటపడతాయి. అవి బయటే ఉంటాయి. కాకపోతే బోఫోర్స్ కుంభకోణం వల్ల 1989 లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలింది. ఇప్పటి కుంభకోణం వల్ల రేపు 2014 ఎన్నికలలో అదే పరిస్థితి రావచ్చు. అయితే వచ్చేదాకా బుకాయించడం రాజకీయం. కొన్ని నెలల కిందట అప్పటి తన ప్రియురాలుకి ఐపిఎల్ కేరళ కంపెనీలో ప్రమేయం ఉన్నదన్న కారణంగా శశిధరూర్ అనే మంత్రిగారు కేంద్రంలో పదవీ విరమణ చేశారు. తరువాత ఏమీ జరగలేదు. కాలం గడిచింది. మళ్లీ వారు ప్రస్థుతం మంత్రి పదవిలోకి ఎలా వచ్చారు? కొన్ని నెలల క్రితం పదవికి ఎసరుపెట్టిన అవినీతి ఇంతలో ఎలా మాయమయింది? ఎవరు అడుగుతారు? రాజకీయాల్లో కాలం చాలా సుఖవంతమయిన ముసుగు. ప్రజాభిప్రాయం ఎన్నికల దాకా ఎవరికీ బోధపడదు. కాగా ఈ దేశంలో ప్రజాస్వామ్యం పెద్ద గాడిద.

**(ఫిబ్రవరి** 18,2013)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (February 25,2013) Mrutyuvu మృత్యువు

మృత్యువు జీవితాన్ని అడిగిందట: నన్ను చూసి అందరూ అసహ్యించుకుంటారు. భయపడతారు. కాని నిన్ను ప్రేమిస్తారేం? –అని. జీవితం సమాధానం చెప్పింది: "ఎందుకంటే నేను అందమయిన అబద్ధాన్ని. నువ్వు తప్పనిసరయిన, బాధాకరమైన నిజానివి" అని.

నా కాలేజీ రోజుల్లో చదివాను దువ్వూరి రామిరెడ్డి గారి 'పానశాల'. ఆయన మృత్యువు గురించి అంటారు: "అయయో మూలధనమ్ము హస్తగళితమ్మొచుండె నానాటికిన్, వ్యయమై పోయిరి మానవుల్ మరణశయ్యాసుప్తులై...". అయ్యో, చేతిలో ఉన్న మూలధనం ప్రతీదినం జారిపోతోంది. మానవులు మృత్యువుని చేరి ఖర్చయిపోతున్నారు –అని.

మృత్యువు జీవితానికి హఠాత్తుగా ముగింపుని రాసే క్రూరమైన రచయిత. నిన్న ఇద్దరమ్మాయిలు సినిమా చూడడానికి హైదరాబాద్ వచ్చారు. చూశారు. బస్సు స్టాండు దగ్గర బాంబు పేలింది. స్నేహితురాలు చచ్చిపోయింది. 22 ఏళ్ల ఈ అమ్మాయి రజితని బీడీలు చేసుకు బతికే తల్లిదండ్రులు చదివించుకుంటున్నారు. ఆమె కాలు తీసేశారు. ఇంకా ప్రమాదస్థితిలో ఉంది.

ఒకాయన మరో రెండు నెలల్లో కూతురు పెళ్లి చేద్దామనుకుంటున్నాడు. నిన్న దారుణంగా హతుడయాడు. తల్లీ, భార్యా, ముగ్గురు పిల్లలూ గుర్తుపట్టడానికీ సాధ్యంకాని ఆ శవాన్ని చూసి గుండె బాదుకున్నారు.

ప్రఖ్యాత రచయిత్రి డి.కామేశ్వరి గారి భర్త డి.వి.నరసింహంగారు ఒకసారి చెప్పారు. ఆయన బెనారస్‌లో చదువుకునే రోజుల్లో –శలవులకి ఇంటికి బయలు దేరారు. రైల్లో మిత్రులంతా పేకాట వేశారు. ఆనందంగా ప్రయాణం సాగిపోతోంది. ఈయనకి టీ తాగాలనిపించి –ఏదో స్టేషన్లో దిగారు. తీరా టీ తాగుతూండగా రైలు కదిలిపోయింది. అది గ్రహించి –పరుగెత్తారు. తన కంపార్టుమెంటుని అందుకోలేకపోయారు. మరో కంపార్టుమెంటు ఎక్కారు. మరికాస్సేపటిలో ఆక్సిడెంటు. తనకు తప్పిపోయిన కంపార్టుమెంటులో ఉన్న మిత్రులందరూ పోయారు. తప్పిపోయింది రైలు కాదు –మృత్యువు

సికింద్రాబాదులో పేరడైజ్ థియేటర్ కట్టిన రోజుల్లో నేను హైదరాబాద్‌లో ఉన్నాను. దాదాపు 50 ఏళ్ల క్రిందటి సంగతి అనుకుంటాను. ఆ రోజుల్లో ఆ థియేటర్ యజమాని గురించి చెప్పుకునేవారు. ఆయన రైలు ఎక్కడానికి సికింద్రాబాద్ వచ్చారు. రైలు అప్పుడే వెళ్లిపోయింది. ప్రయాణం అవసరం. కారులో రైలుని వెంటదరిమి జనగాంలో అందుకున్నారు. జనగాం దాటుతూనే పెద్ద ఏక్సిడెంటు. ఆయన కన్నుమూశారు. ప్రయత్నించి, శ్రమపడి మృత్యువుని అందుకున్న అరుదైన క్షణమిది. పేరడైజ్ థియేటర్ని ఎప్పుడు చూసినా ఈ విధి వైపరీత్యం గుర్తుకొస్తుంది నాకు.

మృత్యువు కొందరికి శాపం. కొందరికి ఆటవిడుపు. కొందరికి విముక్తి. కొందరికి అవకాశం. కొందరికి కసి. పగ. మృత్యువు సమదర్శి. ప్రముఖ రచయిత, నోబెల్ బహుమతి గ్రహీత జీన్ పాల్ సార్త్రే నాటకం –"నో ఎక్జిట్" చావబోతున్న వ్యక్తిని రక్షించడంతో ప్రారంభమవుతుంది. బతికిన వ్యక్తి రక్షించిన వ్యక్తిమీద కోపం తెచ్చుకుంటాడు –'నన్ను ఎందు కు రక్షించావు?' అని. 'అదేమిటి? చావు ఆటంకం కదా?' అంటాడితను.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

"దేనికి? చావుకన్న బ్రతకడంలో ఏం సుఖం వుందని నీ ధైర్యం? బతకడానికి ఎంత సాహసం?' ఇలా సాగుతుంది. బ్రతకడమే ఓ శిక్ష. ఓ దురవస్థ –అనే ఎక్జిస్టెన్సియాలిజమ్ అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించే రచయితల్లో ప్రముఖుడు సార్త్రే.

చాలామంది మృత్యువుని చూసి భయపడతారు గాని –మృత్యువుకి కూడా లొంగని అమరత్వం ఒకటి ఉన్నదని గ్రహించరు. అది జీవన్ముక్తి. మృత్యువు కూడా నాశనం చెయ్యలేని దశ మానవుడికి –ఆ మాటకివస్తే ఒక్కమానవునికే ఉంది. థామస్ ఆల్వా ఎడిసన్, గ్రాహం బెల్, లూయీ పాశ్చర్, జీసస్, శంకరాచార్య, మహాత్మాగాంధీ, వివేకానంద –ఈ జాబితా అనంతం. విచిత్రమేమిటంటే వీరిలో చాలామంది ముప్పై సంవత్సరాలే జీవించారు! ఎంతకాలమన్నది ముఖ్యం కాదు. ఎంత ఉదాత్తత? ఎంత మానవత్వం. ఎంత సేవాతత్పరత. మతం పేరిట మనుషుల్ని చంపడంలో, పదవుల కోసం డబ్బుని కొల్లగొట్టడంలో, సుఖాల కోసం పక్కవాడిని మోసం చేయడంలో పబ్బం గడుపుకుంటారు ఎందరో. కాని జీవించిన కొద్దికాలాన్ని శతాబ్దాల మానవాళికి చెరిగిపోని వైభవం చేసిపోయిన మహానుభావుల కాలి గుర్తులు –వెదికితే మనచుట్టూ కనిపిస్తాయి.

ఉత్తర ధృవం నుంచి ప్రకృతి వత్తిళ్ల కారణంగా భూభాగం విడిపోయి –ఖండాలు కావడానికి కొన్ని కోట్ల సంవత్సరాలు పట్టింది. కోట్ల సంవత్సరాలు. ఆ విషయం మనం మరిచిపోతామేమోనని పెద్దలు ఆయా భూభాగాలకి ఆ పేర్లే పెట్టారు. ఆసియా ఖండం, ఆఫ్రికా ఖండం –ఇలాగ. కొన్ని కోట్ల సంవత్సరాల వయసున్న ఈ భూమిలో కొన్ని పదులయినా జీవించలేని మానవులు –రెండు రకాలు. కొన్ని శతాబ్దాలు మానవాళిని ప్రభావితం చేసే మహనీయత. సజావుగా బతకగల కొన్ని జీవితాల్ని వ్యర్థంగా సగంలోనే తుంచివేసే పాశవిక ప్రవృత్తి. మానవుడు మహనీయుడు కావడానికి చిన్న వ్యవధి చాలు. మానవుడు పశువు కావడానికి ఒక జీవితకాలం అక్కరలేదు.

అతని పేరు సూరయ్య. చిన్నతనం నుంచీ నాకు తెలుసు. బొత్తిగా చదువుకోలేదు. నోటిలోంచి మాట వస్తే ముందో వెనుకో బూతు ఉండాలి. కాని అతని మాటల్ని వినాలనిపించేది –చిన్నతనం నుంచీ. కారణం –జీవితాన్ని తెగేసే నిజాయితీ, నిక్కచ్చిగా నిజాన్ని గుర్తుపట్టే గుణం, దాన్ని కుండబద్ధలు కొట్టినట్టు చెప్పే స్వభావం –ఇందులో ఏదో కాపట్యం లేని వ్యక్తిత్వం కనిపించేది.

కావలసింది తిని –అక్కరలేనిది అరిచి గీపెట్టినా అందుకోనివాడు. భోజనంలో ఆయన తిన్నంత కారం ఎవరూ తినలేరు. రోజూ పది చుట్టలు కాల్చేవాడు. శ్రీమంతుడు. పిల్లల గురించి అనేవాడు: "ఈ లం....కొడుకులు మనం పుట్టిస్తే పుట్టారయ్యా. మా అయ్య నాకు కొలిమిచ్చి బతకరా నాకొడకా అన్నాడు. బతికాను. ఈళ్లకి నేనిస్తే ఆళ్లని చెడగొట్టినాడవుతాను. బతకడం తెలీని నాకొడుకులకి ఏటిస్తే ఏం లాభం?" అనేవాడు.

పిల్లలు ఆయన్ని తిట్టుకోలేదు. మనసుల్లో ఉన్నది ఏనాడూ దాచుకోలేదు గనుక. దాచుకోడానికి ఏమీ మిగుల్చుకోలేదు గనుక. నేను చదువుకొని ఉద్యోగాలు చేసి తిరుగుతున్న రోజుల్లో ఒక సాయంకాలం ఫోనొచ్చింది. "నేను నారాయుణ్ణండి. మా అయ్య మాట్లాడతాడంట" అన్నాడొకాయన. వెంటనే గుర్తుపట్టలేకపోయాను. అంతలో కంగుమన్న సూరయ్య గొంతు వినిపించింది: నన్ను 'పెద్దముక్కయ్య' అని పిలిచేవాడు. "ముక్కయ్యా –(ఇక్కడ రాయలేని బూతు అని) ఎల్లిపోతున్నాను. నాకు కేన్సరన్నారు ఈ నాకొడుకులు. మరే బయంనేదు. పోతానని తెలిసి ఇప్పుడే రెండు




చుట్టలు పీకాను. ఇవ్వొద్దనుకున్నా డబ్బు మిగిలింది. ఈ లం....కొడుకులకి ఇవ్వక తప్పడంలేదు. నువ్వు గేపకమొచ్చావు. సినీమాల్లో చెండేస్తున్నావ్. ఎయ్ గొప్పేసాలు! ఎల్తా –సెప్దామని.." అంతే. వెళ్లిపోయాడు.

ఏమిటి సూరయ్యలో ప్రత్యేకత? ఏనాడూ మృత్యువు గురించి ఆలోచించలేదు. భయపడలేదు. తన జీవితం ఏమిటో నికార్సుగా ఎరిగినవాడు. తన జీవితం మీదా, జీవనం మీదా, ఆఖరికి పిల్లల మీదా ఏ ఆశా పెట్టుకోనివాడు. ఎప్పుడూ ఎవరి కొంపా ముంచలేదు. నిర్భయంగా జీవించాడు. తల యెత్తుకుని బతికాడు. చెప్పి, ఎరిగి, తన ధోరణిలో జీవితాన్ని అనుభవించి తెలిసి వెళ్లిపోయాడు. మహానుభావుల జీవితాలకీ అర్థం ఇదే.

( **ఫిబ్రవరి** 25,2013)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

## (March 04,2013) Devudu Chegodeelu, దేవుడూ–చేగోడీలూ

మిత్రులూ, ప్రముఖ రచయితా ఇచ్ఛాపురపు జగన్నాథరావుగారు ప్రతీరోజూ ఏదో కథో, జోకో ఇంటర్నెట్‌లో పంపుతూంటారు. అదీ మా బంధుత్వం. ఈ కథ నలుగురూ వినవలసినది.

ఓ కుర్రాడికి దేవుడిని చూడాలనిపించింది. దేవుడున్న చోటుకి వెళ్లాలంటే చాలా దూరం కదా? కనుక అమ్మ ఇచ్చిన చేగోడీల పొట్లాన్నీ, స్కూలుకి తీసుకెళ్లే మంచినీళ్ల సీసానీ పట్టుకుని బయలుదేరాడు.

వీధి చివరికి వచ్చేసరికి –పక్కనే ఉన్న పార్కులో ఓ ముసలాయన పార్కు బెంచీమీద కనిపించాడు ఎగిరే పావురాల్ని చూస్తూ... కుర్రాడు వచ్చి పక్కనే కూచున్నాడు. చేతిలో ఉన్న చేగోడీల్ని తింటూ ముసలాయన్ని చూశాడు. అతనూ ఆకలితో ఉన్నట్టు గుర్తించాడు. ఓ చేగోడీ ఇచ్చాడు. ముసలాయన అందుకుంటూ ఓ చిరునవ్వు నవ్వాడు –మిగిలిన నాలుగు పళ్లతో.

ఆ నవ్వుకి మురిసిపోయాడు కుర్రాడు. మళ్లీ ఆ నవ్వుని చూడాలనిపించింది. మరో చేగోడీ అందించాడు ముసలాయనకి. ఆయన మళ్లీ నవ్వాడు. కుర్రాడు మళ్లీ సంతోషించాడు.

మధ్యాహ్నం దాకా ఇద్దరూ అలాగే కూర్చున్నారు. ఇద్దరూ చేగోడీలు తిన్నారు. ఇద్దరూ నీళ్లు తాగారు. ఇద్దరూ నవ్వుకున్నారు. కాని ఒక్క మాటయినా మాట్లాడుకోలేదు. ఎండ నెత్తికెక్కగానే కుర్రాడి ధ్యాస ఇంటివేపు మళ్లింది. లేచి నాలుగడుగులు వేశాడు. అంతలో వెనక్కి తిరిగి ముసలాయన్ని చూసి దగ్గరికి వచ్చి ఆయన్ని కావలించుకున్నాడు. ముసలాయన చిరునవ్వునవ్వాడు.

ఇంటికి వచ్చాక వీధి తలుపు తీసిన తల్లి ఆనందంతో వెలిగిపోతున్న బిడ్డని చూసి ఆశ్చర్యపడింది. "ఎందుకంత ఆనందంగా వుంది? ఎక్కడికెళ్లావు? ఏం చేశావు?" అని అడిగింది.

"పార్కు బెంచీ మీద దేవుడు కనిపించాడు. దేవుడితో కలిసి చేగోడీలు తిన్నాను. ఆయన ఎంత బాగా నవ్వాడనుకున్నావు?" అన్నాడు కుర్రాడు. "నీకు తెలుసా? దేవుడు బొత్తిగా ముసలాడయిపోయాడు" అన్నాడు.

అక్కడ ముసలాయనా మిట్ట మధ్యాహ్నం యింటికి చేరాడు. ఆయన ముఖమూ ఆనందంతో వెలిగిపోతోంది. చూసి –ముసలాయన కొడుకు ఆశ్చర్యపోయాడు. "ఏమిటి నాన్నా? ఏం జరిగింది? అంత ఆనందంగా వున్నావు? అనడిగాడు.

"నీకు తెలుసా? పార్కుబెంచీ మీద యిందాకటివరకూ దేవుడిచ్చిన చేగోడీలు తిన్నాను" అన్నాడు. విస్తుపోతున్న కొడుకుని చూస్తూ "నీకు తెలుసా? దేవుడు బొత్తిగా పసివాడురా" అన్నాడు ముసలాయన.

ఓ చిరునవ్వు, ఓ మంచిమాట, మౌనంగా పలకరింత, బుజ్జగింపు, దయ –యిలాంటివేవయినా జీవితాన్ని వెలిగిస్తాయి. దేవుడిని తలపిస్తాయి. ఈ దేశంలో కొందరికి దేవుడంటే బూతుమాట. కరుణానిధి గారికి రామసేతు అభూతకల్పన. రాముడు ఆయనలాంటి మానవుడే. ఏ




రామయ్యరో, అలగప్పన్ అని వారి నమ్మకం. కాని వారు 2జి ని నమ్ముతారు. అందులో చేతులు మారిన కోట్ల ధనం వారికి వాస్తవం. వారి ప్రియ పుత్రిక కనిమొళి వున్న తీహార్ జైలు వారికి గుండెలు పిండే వాస్తవం. పండిత సుఖ్‌రాం గారు దేవుడిని నమ్ముతారు. కాని 17 కోట్లు దోపిడీనీ నమ్ముతారు.

పరిమితమయిన హ్రస్వదృష్టి –మేధస్సునే పెట్టుబడిగా, జాతి విశ్వాసాన్ని అటకెక్కించిన నేటితరం జిజ్ఞాసువులు కొందరికి తరతరాల సంప్రదాయ వైభవం ఏవగింపు. వారిని వారి అవిశ్వాసం రక్షించుగాక. కాని చిన్న పలకరింత, మంచిమాట, చూపే కరుణతో దైవత్వం వుంది. మళ్లీ 'దైవత్వం' అన్నమాటలో చిన్న తిరకాసు ఉంది. నమ్మని కరుణానిధి గారి 'అవిశ్వాసం' వుంది. దాన్ని 'అతిమానవత్వం' అందామా? 'అపురూప మానవత్వం' అందామా? పార్కు బెంచీమీద ముసలాయన చిరునవ్వులో, పసివాడు పంచిన చేగోడీల తాయిలంలో –సౌజన్యంలో– వున్న మహనీయత పేరే –'దేవుడు!'. అలనాడు కుచేలుడి అటుకులు, యిప్పటి పసివాడి చేగోడీలు ఆ కథ చెప్తాయి. అయితే దేవుడిని నమ్మనివారికి– 2జిలూ, కోల్‌గేట్లూ, ఆర్మ్ గేట్లూ వంటి ప్రత్యామ్నాయాలు చాలావున్నాయి. నాస్తికులకు ఆత్మవంచన నల్లేరు మీద బండి.

తొలిరోజుల్లో పుట్టపర్తి వెళ్లిన సందర్భం గుర్తుంది. బాబాగారి సోదరులు జానకిరామయ్య గారు నన్ను మొదటిసారిగా పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. బయట చెప్పులు వదలడం మరిచిపోయాను –తెలియక. నా వెనుక ఓ ముసలాయన వచ్చాడు –"మీ చెప్పులు" అంటూ. విషయం తెలిసి బయట చెప్పులు వదలడానికి వెళ్లబోయాను. ఆయనే స్వయంగా నా చెప్పులు తీసుకున్నారు –భరతుడు స్వామి పాదుకలు అందుకున్నట్టు. ఆయన ఏదో వూరిలో పోస్టల్ డిపార్టుమెంటులో పెద్ద ఆఫీసరు. ఏమిటీ సేవ! ఆసుపత్రిలో సౌకర్యాలు ఒక పక్క అలావుండగా –అక్కడ పనిచేస్తున్న వ్యక్తుల కమిట్‌మెంటు నన్ను ఆశ్చర్యపరిచింది. ఆ క్షణంలో బాబా దేవుడా కాదా అన్న ప్రశ్న నాకు కలగలేదు. కాని ఇక్కడి వ్యక్తుల సేవలో దైవత్వం తొణికిసలాడింది. సాటి మనిషికి సేవ చేసే దృక్పధాన్ని అంతమందిలో మేలుకొలపడం దైవత్వమే. 'సేవ'ని ఒక వ్యక్తి లేదా శక్తి ఒక జీవితకాలం ఉద్యమం చేయడం –సందేహం లేదు. దైవత్వమే. ఈ మధ్య పుట్టపర్తి వెళ్లాను. అంతా నిర్మానుష్యంగా వుంది. ఆసుపత్రిలో ఎవరూ లేరు. బాబా సమాధిని దర్శించడానికి వేళలు నిర్ణయించారు. అదేమిటి? రాజ్‌ఘాట్‌లో గాంధీ సమాధిని ఎవరయినా ఎప్పుడయినా దర్శించవచ్చు. స్విట్జర్లాండులో చార్లీ చాప్లిన్ సమాధిని అలాగే చూశాను. బాబాగారి సమాధికి వేళలెందుకు? బాబా జీవించిన అన్ని సందర్భాలలో వారిని దర్శించివచ్చిన నేను, ఆయన లేనప్పుడు వారి సమాధిని చూడలేక తిరిగి వచ్చాను. ఇప్పుడెవరు చూస్తున్నారో ఆ ఏర్పాట్లను. వారికీ విషయం తెలియాలి. గోళ్లు గిల్లుకుంటున్న భాషరాని ఓ కార్యకర్త ఇప్పుడు చూడడానికి వీల్లేదని గోళ్లు గిల్లుకుంటున్నాడు. దురదృష్టం. కలకత్తాలో మదర్ థెరిసా తన దగ్గరికి 12 మంది మతిస్థిమితం లేని బిడ్డల్ని చేర్చుకునే దృశ్యాన్ని టీవీలో చూపించారు. వారు అనాధలు. పైగా కరుణ, ఆదరణకి నోచుకోనివారు. వారిని ఒక్కొక్కరినీ బుగ్గలు పుణికి ఆ తల్లి పలకరిస్తూంటే నాకు భోరున దు:ఖం తోసుకొచ్చింది. ఎప్పుడో 'నిప్పులాంటి మనిషి'లో రాశాను. "కన్నీళ్లకి మతం లేదు ఇన్‌స్పెక్టర్! అవి ఎవరు కార్చినా కష్టానికిగుర్తే!" అని. దేవుడు ఆకాశంలో ఉంటాడేమో తెలియదు. కాని చూడగలిగే మనస్సుంటే దైవత్వం మన చుట్టూ కనిపిస్తుంది. మనలో ఔదార్యం ఉంటే మానవత్వం మనచుట్టూ వెల్లివిరుస్తుంది.

( మార్చి 04.2013)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

## (March 11, 2013) Dosela ..Doshula..!దోశెలా..దోషులా!?

అందుకే వంటొచ్చిన మంత్రుల్ని కేంద్రంలో ఉంచడం చాలా తెలివైన పని అని సోనియా గాంధీగారికి తెలుసు. తెలంగాణా గురించి ఎంతమంది ఎన్నిసార్లు అడిగినా గులాం నబీ అజాద్ కానీ, వీరప్ప మొయిలీ కానీ –సరైన సమాధానం కాదుకదా, తృప్తికరమైన సమాధానం చెప్పలేకపోయారు. కాని ఇప్పటి ఆంధ్రప్రదేశ్ వ్యవహారాల ప్రతినిధి వయలార్ రవిగారు కళ్లకు కట్టినట్లు, నోటికి అందేటట్టు –ఆ సమస్యని వివరించారు. 'తెలంగాణా సమస్య అంటే దోశె వెయ్యడమంత తేలికకాదు' అని శెలవిచ్చారు.

ఈ మాట కొందరికి అర్థమయింది. మరికొందరిని బాధపెట్టింది. అది న్యాయం. ఎందుకంటే ఇంతవరకూ ప్రజలు దోశెల భాష ఎరగరు. నా ఉద్దేశంలో వయలార్ గారు తెలంగాణా పెద్దలకు ముందు దోశెలు వేయడం నేర్పాలి. దోశెలపిండి ఎలా కలపాలి? పచ్చిమిరపకాయలు ఎన్ని తరిగి పెట్టుకోవాలి? తగుమాత్రం జీలకర్ర ఎప్పుడు వెయ్యాలి? ఘాటుపోకుండా ఉల్లిపాయ ముక్కలు ఏ మోతాదులో కలపాలి –యివన్నీ చాలా నేర్పుతో కూడిన పని. కేరళ రాజకీయ నాయకుల శిక్షణలో భాగంగా వయలార్‌గారు దోశెల తయారీ నేర్చుకున్నారని మనకు ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది. వారెప్పుడూ రాజకీయ సమస్యల్ని దోశెలు వేయడంతో పోల్చుకుని అర్థం చేసుకుంటూంటారు. అయితే దోశెల్లో చాలారకాలున్నాయి. ఆయా ప్రాంతాలను బట్టి దోశెల రుచి, నేర్పు మారిపోతుంది, తెలంగాణా సమస్యల్లాగే. హైదరాబాద్ కలిసి ఉండాలా? రాయలసీమలో కొన్ని జిల్లాలు కలవాలా? హైదరాబాద్ కేంద్ర పాలిత ప్రాంతంగా ఉండాలా? కొన్ని సంవత్సరాల పాటు సమష్టి రాజధానిగా ఉండాలా? తెలంగాణాకు ప్రత్యేక ఆర్థిక ప్రతిపత్తి యిస్తే బాగుంటుందా? –యిలాగ.

దోశెల విషయానికొస్తే సాదా దోశెకి కొంచెం పిండి పులుపుగా ఉండాలి. రవ్వదోశెకి పిండి పల్చగా పాళ్లు మారుతాయి. ఒక్కొక్కప్పుడు కొత్తిమెర, జీడిపప్పు కలిసినా రుచి పెరుగుతుంది. వయలార్‌గారి దేశంలో –అంటే కేరళలో దీన్ని 'ఆప్పం' అంటారు. చిదంబరం గారి దేశంలో –అంటే నాటుకోట చెట్టియార్ల ప్రాంతంలో 'నాటు దోశె' బహురుచిగా ఉంటుంది. మన రాష్ట్రంలో –చిత్తూరు, పీలేరు, తలకోన ప్రాంతాల్లో –కన్నడ దేశంలో లాగ దళసరి అట్టుకి ఒక పక్క ఉల్లికారం రాస్తారు. నెల్లూరు సమీపంలో బిట్రగుంట వేంకటేశ్వరస్వామి తిరనాళ్లు, రంగడి తిరునాళ్లలో దోశెలకి ప్రత్యేకమైన రుచి. కనుము పండగనాడు కోడికూర దోశె మరో ప్రత్యేక సృష్టి. కట్టెల పొయ్యిమీద చేసే దోశె యిప్పటికీ పల్లెటూళ్లలో ప్రత్యేకం. పెనం మాడితే కట్టెల్ని వెనక్కి తీసి వేడి తగ్గిస్తారు. మరి దోశె పిండి మురిగిపోతే పచ్చిమిరపకాయలు, ఉల్లిపాయలు సంతరించుకుని ఊతప్పం అవుతుంది –కూరలు తగుమాత్రం లేనప్పుడు అరవదేశంలో 'అవియల్' రూపు దాల్చినట్టు.

అయ్యా! పిండి కొద్దీ దోశె. అలనాడు చిదంబరం గారు నాటుకోట చెట్టియార్ సంప్రదాయంలో 'వెర్త కొళంబు'తో నాటు దోశె వడ్డిస్తున్నామని చెప్పి, నోరూరించి వెయ్యకుండా తప్పించుకున్నారు కదా? మరి ఈ వయలార్ గారి 'ఆప్పం' ఎంతవరకూ తయారవుతుందో చూడాలి.

తీరా దోశెకి సైడ్ డిష్‌గా చెనిక్కాయ పచ్చడి చేస్తున్నారా? సాంబారు తయారవుతోందా? ఉల్లి చెట్నీ సిద్ధమవుతోందా? లేక సోనియాగారు –వారి దేశపు –అంటే ఇటలీ 'పీజ్జా' ధోరణిలో ఏదైనా కొత్తరకం దోశెలు తయారుచేస్తున్నారా? కేంద్రం అన్ని ప్రాంతాల దోశెల సమాహారంగా ఉండడం మన అదృష్టం. మన మంత్రులు రాజకీయాలు కూడా దోశెల భాషలో మాట్లాడుతారని మనం గ్రహించాలి. ఎంత మంత్రికి అంత దోశె!




అయితే గియితే –బాబూ! యిప్పటికి ఎన్నిసార్లు దోశెలు వేసే ప్రయత్నాలు జరిగాయి? అసలు పెనం మీద పిండి పడిందా? ఒక పక్క కాలిందా? అట్టు తిప్పారా? ఇవన్నీ వయలార్‌గారు తమ దోశెల భాషలో మనకి తెలియజెయ్యాలని నా మనవి. తెలంగాణా దోశె వెయ్యడమంత సుళువుకాదని మంత్రివర్యులు వక్కాణించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడాలా వద్దా అన్న విషయం మీద ఉపసంఘం మాట అటుంచి –దోశె వెయ్యడంలో మెలకువలు, కష్టనష్టాలు, రుచిబేధాలు, రూపాంతరాలు దేశానికి తెలియజెప్పాలని –ఈ బోధనలో గులాం నబీ అజాద్‌గారు కాశ్మీర్ దోశెల మర్మమేదయినా చెప్పగలరా? వీరప్ప మొయిలీగారు కూర్గ్ రుచులేమయినా నేర్పుతారా? మనకు తెలియజెయ్యాలి. రాష్ట్రాలు అడిగే మనకి ఆఖరికి దోశెల్ని మాత్రం మిగిల్చే ఈ నాయకుల దగ్గర కనీసం వంటయినా వంటబడితే అదయినా మన అదృష్టం అని భావించే స్థితికి మనల్ని తీసుకువచ్చారు.

నోరూరించి, ప్లేట్లు వేయించి, వడ్డనకి సిద్ధంగా కూర్చోపెట్టి, పెనాన్ని చూపించి, అనుపానాన్ని సిద్ధం చేసుకోమని అట్టు ఇంకా తిరగబడలేదని నాయకత్వం ఇప్పటికే చాలాసార్లు ఆశ పెట్టింది. అసలు వంటగదిలో ఏం జరుగుతోందో, ఏ రకమయిన దోశెకు ప్రయత్నాలు జరుగుతున్నాయో, తీరా అది వంటగదో స్నానాల గదో అనే అనుమానం కలిగే స్థితి వచ్చింది.ఏమయినా హోటళ్లవారూ, మహిళలూ నిన్న వయలార్‌గారి మాటలకు నిరసన తెలపాలని నా మతం. తెలంగాణా సమస్యకంటే దోశెలు వేయడం సుళువయిన పనిగా ఈ దేశపు పాకకళని చిన్నచూపు చూడడం కేంద్ర మంత్రికి భావ్యంకాదు. పీతకష్టాలు పీతవి. దోశె వెయ్యడంలో కష్టాలు దానికీ ఉన్నాయి.అయ్యా వయలార్ మహాశయా! తెలంగాణా దోశె వెయ్యడమంత సుళువు కాదని సెలవిచ్చి మాకు కొత్త విషయాన్ని బోధించినందుకు ధన్యవాదాలు. కాని కేంద్రాన్ని తమవంటి పెద్దలు 'దోశె'కు కూడా నోచుకోని దురదృష్టపు 'పూటకూళ్లమ్మ' సత్రంగా తయారు చేశారు. తమ చేతులమీదుగా 'పొంగరం' వంటి దోశె తయారవుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. అటుపక్క పెనం వేడెక్కి ఎర్రబడింది. అనుపానాలు చప్పబడుతున్నాయి. తినేవాడి ఆకలి పోయి కోపం పెల్లుబుకుతోంది. వాస్తవం కంటే ఆశ ఎక్కువ హింసిస్తుంది. సమస్యల్ని వంటగదికి ఈడ్చుకొచ్చే చాకచక్యం తమకి ఉన్నది కాని భోజనం గదులు అప్పుడే వీధిన పడిన వాస్తవం తమరు పట్టించుకున్నట్టు లేదు. లోగడ రకరకాల దోశెల ఎరచూపించారు. ఈసారయినా ఆకలితీరే అసలైన దోశె వేస్తారో వెయ్యరో తేల్చి చెప్పమని మనవి.

ఆఖరికి మాకు దక్కేది ఆప్పమా? పాపమా? దోశెలా? దోషులా?

(**మార్చి** 11.2013)



# (March 18, 2013) Avyavasthaku Avaligattu అవ్యవస్థకు ఆవలిగట్టు

ఇలాంటి సమస్యలు మరే దేశంలోనూ వచ్చి వుండవు. ఒక మంత్రి పోలీసు ఆఫీసర్ని హత్య చేయించాడు. ముఖ్యమంత్రి ముఖం చాటుచేసుకున్నాడు. ఆ మంత్రి పేరు రాజాభయ్యా. ఉత్తరప్రదేశ్‌లో పేరు మోసిన గూండా.

ఒక పోలీసాఫీసరు గారి తనయుడు ఒక జర్మన్ మహిళని రేప్ చేశాడు. కోర్టు అతనికి ఏడేళ్లు శిక్షని విధించింది. అతని బాబు ఒరిస్సాలో డైరెక్టరు జనరల్ ఆఫ్ పోలీసు. కుర్రాడు అమ్మని చూడడానికి బెయిల్ కోరాడు. కోర్టు ఆరు నెలల తర్వాత ఇచ్చింది. ఆ తర్వాత మాయమయాడు. ఎన్నేళ్లు? ఏడు సంవత్సరాలు. కొడుకు ఎక్కడ ఉన్నాడో నాకు తెలియదన్నాడు డైరెక్టర్ జనరల్ కెమెరాల ముందు. "వాడిని మరిచిపోయాను" అన్నాడు.

నేరం రాజస్థాన్‌లో జరిగింది. తండ్రి ఒరిస్సాలో ఉన్నాడు. కొడుకు పుట్టపర్తి అనే పుణ్యక్షేత్రం చేరాడు. బాబాగారు ఉన్న రోజులవి. రోజూ లక్షల మంది వచ్చిపోయే క్షేత్రం. తప్పించుకున్న ఖైదీ అంత గుండెలు తీసినట్టు పుట్టపర్తిలో ఎలా వున్నాడు? ఆయన పుట్టపర్తి నివాసి అని డాక్టర్ కృష్ణయ్య అనే గజిటెడ్ ఆఫీసరు సర్టిఫికెట్ ఇచ్చారు. ఒక ఐయ్యేయస్ ఆఫీసరుగారు ఆయన్ని ఉద్యోగానికి సిఫార్సు చేశారు. ఓ హెడ్ మాస్టర్‌గారు ఉద్యోగం ఇచ్చారు. ఆయన చదువు సర్టిఫికెట్లు? నివాసం ఉన్న సాక్ష్యాలు? స్థానికంగా కేంద్ర ఎన్నికల కమిషన్ గుర్తింపు కార్డు పుచ్చుకున్నాడు ఈ ప్రబుద్ధుడు. వాళ్ల నాన్న తరుచు అక్కడికి వచ్చిపోతూండేవాడు. ఆయన తన 'అంకుల్' అని పరిచయం చేశాడు. ఫలానా తండ్రి– అంటే పోలీసాఫీసరు గారి గుర్తింపు కార్డు తనయుడి గదిలో ఉంది. రకరకాల విశ్వవిద్యాలయాల దొంగసర్టిఫికేట్లు, దొంగ గుర్తింపు కార్డులు, కంప్యూటర్ –ఇవన్నీ ఈ మానభంగం చేసిన నేరస్థుడి గదిలో దొరికాయి. అక్కడినుంచి ఈ ప్రబుద్ధుడు కేరళ వెళ్లాడు. బ్యాంకు పరీక్షలు రాశాడు. ఉద్యోగం సంపాదించాడు. బ్యాంకుల్లో అకౌంట్లు పెట్టుకున్నాడు. భారత దేశంలో నాలుగు రాష్ట్రాలలో విచ్చలవిడిగా దొంగ సర్టిఫికేట్లతో బతికే ఓ నేరస్థుడి వెనుక ఎంత మోసం, ఎంతమంది అండదండలు ఉన్నాయో ఊహించలేము. ఈ మోసం ఇలా కొనసాగేదే కాని ఎవరో ఓర్వలేని వారు బ్యాంకుకి ఆకాశరామన్న ఉత్తరం రాశారు –ఫలానా ఉద్యోగి ఫలానా నేరస్థుడని. అప్పుడు మిన్నువిరిగి మీద పడింది. ఒక పోలీసు డైరెక్టర్ జనరల్, ఒక ఐయ్యేయస్ ఆఫీసరు, ఒక గజిటెడ్ ఆఫీసరు, ఒక హెడ్మాష్టరు, ఒక బ్యాంక్ –ఇంతమంది మద్దతుతో, ఇన్ని రాష్ట్రాలలో కన్నుమూయగల ఒక నేరస్థుడు రేపు మరో రాజాభయ్యా అవడానికి అన్ని అర్హతలూ సంపాదించుకుంటున్నాడు. అరెస్టు చేయవలసింది –ఈ దౌర్భాగ్యుడిని మాత్రమే కాదు. అతని వెనుక నిలిచిన పోలీసు ఆఫీసర్ని, మిగతా ప్రమధ గణాలని.

ఇదొక కథ. గత ఫిబ్రవరిలో ఒక ఇటలీ నావలో పనిచేస్తున్న రక్షణదళ అధికారులు –భారత దేశపు సముద్ర ప్రాంతాలకు వచ్చారు. వారు మాస్సిమిలియన్ లతోరే, సాలతోర్ గిరోన్. సముద్ర జలాలలో తిరుగుతున్న ఒక బోటులో ఉన్న ఇద్దరు కేరళ జాలర్లను –సముద్రపు దొంగలనుకొని కాల్చి చంపారు. వారిని ప్రభుత్వం అరెస్టు చేసింది. కోర్టులో లజ్జుగుజ్జులు జరుగుతున్నాయి. నేరాన్ని మా దేశంలో విచారిస్తామని ఇటలీ అన్నది. భారతదేశం ఒప్పుకోలేదు. ఈలోగా ఇటలీ ఎన్నికలలో పాల్గొనడానికి ఈ నేరస్థులు, వారి ప్రభుత్వం కోర్టుని ఆశ్రయించింది. నేరస్థుల ఓటు హక్కుని మన న్యాయస్థానం గుర్తించి –ఓటువేసి మళ్లీ మన దేశంలో జైలుకి రావడానికి అంగీకరించింది. వస్తారని ఇటలీ




రాయబారి వ్రాతపూర్వకంగా కోర్టుకి హామీని ఇచ్చారు. హంతకులు వెళ్లారు. వారి దేశంలో ప్రధానమంత్రితో సహా అంతా వారికి ఘనస్వాగతం పలికారు. కథ అక్కడితో సరి. వారు రాలేదు. రాయబారిని దేశం వదిలి వెళ్లవద్దని మన న్యాయస్థానం ఆదేశించింది. "హాయిగా ఇక్కడే ఉంటాను" అని రాయబారి శెలవిచ్చారు. గమనించాలి. తప్పుని ఒప్పుకోవడం గాని, నేరస్థుల్ని రప్పిస్తామని గాని చెప్పలేదు.

మన దేశంలో నేరాలూ, చట్టాలూ, న్యాయస్థానాలూ, మన పట్ల విదేశాల చిన్నచూపూ –యివన్నీ ఆటలో అరిటిపండుగా మారిపోతాయి. జపాన్ లో, ఇటలీలో (అవును, వారి దేశంలోనే) దేశ నాయకుల్ని అవినీతికి చట్టం నిలదీసిన కథలు మనం చదివాం. కాని మనదేశంలో బొగ్గు గనుల కుంభకోణం, టూజీ కుంభకోణం, హెలికాప్టర్ల కుంభకోణం, కామన్వెల్తు క్రీడల కుంభకోణం, ఆదర్శ అపార్టుమెంట్ల కుంభకోణం, వాన్ పిక్ కుంభకోణం, తీహార్ వంటి జైళ్లలో ఆత్మహత్యలు, మానభంగాలు –యివన్నీ దైనందిన కార్యక్రమాలయిపోయాయి. ఇంట గెలవలేనివాడు ఎలాగూ రచ్చగెలవలేడు. మనదేశపు పార్లమెంటు మీద దాడిచేసి, దేశంలో అత్యుత్తమ న్యాయస్థానం శిక్ష విధించి, రాష్ట్రపతి సమర్థించిన నేరస్థుడిని ఎందుకు ఉరితీయకూడదో పక్కదేశపు పార్లమెంటు మనకి చెప్తోంది. జైల్లో –ఏ కారణానికయినా ఉరిపోసుకున్న రాంసింగ్ అనే రాక్షసుడి అర్థాంతరం చావుకి అతని తల్లిదండ్రుల ఏడుపుని పత్రికలు నెత్తికెత్తుకుంటున్నాయి. తలనీ, మొండాన్నీ వేరుచేసి వీధిన పారేసిన పోలీసు శవాన్ని చాలామంది మరిచిపోయారు. మానవతా హక్కుల సంఘాలు అలాంటి సంఘటనల్ని గుర్తించవు.

9/11 తర్వాత –ఒకటి –ఒక్కటంటే ఒక్క సంఘటన అమెరికాలో జరగకుండా ఆ దేశం జాగ్రత్తపడింది. ఊరూ పేరూ విచక్షణ లేకుండా మన హీరో షారూక్ ఖాన్నీ, మన రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ గారిని నిలదీసింది. మొన్న ఢిల్లీలో జరిగిన అనర్థానికి దేశమంతా నిరసన తెలిపింది. తర్వాత ఢిల్లీలోనే మానభంగాలు జరిగాయి. డజన్ల మానభంగాల కథలు రోజూ పత్రికల్లో కనిపిస్తున్నాయి.

నన్ను ఆ మధ్య ఎవరో అడిగారు –అయ్యా, ఎప్పుడూ అవినీతి, అన్యాయం, అక్రమాలంటూ గొడవ పడతారు. మంచి మీకు కనిపించదా? అని. మంచి ప్రశ్న. గత 32 సంవత్సరాలలో సంవత్సరానికి తేలికగా 30 వారాలు ఈ కథలే రాయడానికి కావలసినంత విషయం ఈ దేశపు అవినీతి కల్పిస్తోంది. మంచిని భూతద్దంతో వెదికి రాయాలని తంటాలు పడుతున్నాను. అప్పుడప్పుడు రాశాను కూడా.

మన దేశంలో అవినీతికి సిగ్గుపడే రోజులు పోయి –నా అవినీతితో మీ అవినీతిని పోల్చి నేను గర్వపడే రోజులు వచ్చాయి. "అయ్యా, మీరు బొగ్గు కుంభకోణంలో 250 కోట్లు ఫలహారం చేశారు కదా?' అని అడగండి. ఆ నాయకుడు సిగ్గుపడడు. ఒప్పుకోడు. తల దించుకోడు. "ఫలానా సంవత్సరంలో తమరు తిన్న రగ్గుల కుంభకోణం మాటేమిటి?" అంటాడు. నిన్న కాశ్మీరులో దుండగులు నలుగురు జవాన్లను చంపేశారు. ఎవరో టీవీలో అడుగుతున్నారు: "జవాన్లు చావడం సరే. ఒక జవాను ఫలానా చోట ఒకడిని చంపాడు. దీనికి మీ సమాధానం ఏమిటి?" అని.

మొండివాడు రాజుకంటే బలవంతుడని సామెత. అవినీతికి సిగ్గుపడడమో తలవొంచడమో మరిచిపోయి –పెద్ద అవినీతికంటే చిన్న అవినీతి 'నిజాయితీ'గా బుకాయించే నాయకులు పాలిస్తున్న దేశం మనది. మానభంగాలు ఆనవాయితీ అయిన దేశం మనది. గూండాలు అధికారుల్ని



చంపి "ఇది ప్రత్యర్థులు నామీద పన్నిన కుట్ర" అని బుకాయించే రోజులివి.ఈ నేపథ్యంలో మరో పై దేశం –తమ వాటా అవినీతిని జతచేసి "ఏం చేస్తారో చేసుకోండి" అనడం ఆశ్చర్యం కాదు. ఇదీ ఇటలీ కథ మనకి చెప్పేనీతి.

అమెరికా మీద నాకు మక్కువలేదు. కాని తమకు జరిగిన అన్యాయానికి ఓ దేశాన్ని (ఆఫ్గనిస్థాన్‌ని) నేలమట్టం చేసి, తమ శత్రువుని పొరుగు దేశంలో (పాకిస్థాన్‌లో) వాళ్లకి చెప్పకుండా జొరబడి, చంపి, తప్పించుకుని –వారి నోరు మూయించిన బుకాయింపు ప్రపంచానికి అర్థం కాకుండా పోదు. ఈ దేశపు అత్యున్నత న్యాయస్థానానికి దొంగ హామీ యిచ్చి హంతకుల్ని ఎగరేసుకుపోయిన మరో దేశాన్ని చూసి ఎన్నిదేశాలు నవ్వుకుంటున్నాయో, మన దేశపు చేతకానితనాన్ని ఎంత ముచ్చటగా చెప్పుకుని నవ్వుకుంటున్నాయో ఎవరికి ఎరుక?

(**మార్చి** 18.2013)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (March 25, 2013) Sanjay Vishada Yogam సంజయ విషాద యోగం

భారత దేశం జాలిగుండె గల దేశం. దయకీ, కరుణకీ, ఆర్ద్రతకీ, జాలికీ పెట్టింది పేరు. నిన్నకాక మొన్న తీహార్‌లో ఆత్మహత్య చేసుకున్న –ఢిల్లీ అమ్మాయిని ఘోరంగా మానభంగం చేసి చంపిన ఘనులలో ఒకడయిన రాంసింగ్ బతికి –17 సంవత్సరాల తర్వాత ఉరిశిక్ష విధిస్తే –అతని పట్ల 2030లో జాలి చూపే గుండె, కన్నీళ్లు పెట్టుకునే దయార్ద్ర హృదయులు ఉంటారు. రాజీవ్ గాంధీతో పాటు ఏమీ నేరం చెయ్యని 18 మంది చచ్చిపోయినా –నళిని మీద సానుభూతి చూపే సోనియా కూతుళ్లూ, హంతకుల్ని ఉరితీయకూడదని ఒక రాష్ట్ర శాసనసభ తీర్మానం ఇందుకు సాక్ష్యం. మనది ఖర్మభూమి.

సునీల్ దత్ మానవత్వం మూర్తీభవించిన మహనీయుడు. నర్గీస్ కొన్ని దశాబ్దాలు ఈ దేశానికి ఆనందాన్ని పంచిన నటీమణి. సునీల్ దత్ మా గొల్లపూడి శ్రీనివాస్ ఫౌండేషన్ ప్రారంభ సమావేశంలో మొట్టమొదటి స్మారక ఉపన్యాసం ఇచ్చారు. నేను ముంబై వెళ్లి ఆయన్ని కలిశాను. ఆయన గదిలో ఆయన కుర్చీ వెనుక గోడమీద తల్లి ఫొటో. టేబిలు మీద భార్యతో చిన్న ఫొటో. నాతో గుమ్మందాకా నడిచి వచ్చి సాగనంపాడు. చివరిరోజుల వరకూ మా కుటుంబంతో సాన్నిహిత్యంగా ఉన్నారు. ఇంత చెప్పడానికి కారణం ఆయన సంస్కారాన్ని, ఆ కుటుంబం ఔన్నత్యాన్ని గుర్తుచేయడానికి.

తన కొడుకుని మాదకద్రవ్యాల నుంచి కాపాడడానికి సునీల్ దత్ ఎంత యాతన పడ్డారో ఒకసారి వివరించారు. వ్యసనం బలహీనత. కుసంస్కారం కాదు. అయితే సంజయ్ దత్ ఈ మారణాయుధాల ఇరకాటంలో పడేనాటికి 33 సంవత్సరాలు. అది పసితనం కాదు. పోలీసులకు కూడా అందుబాటులో లేని ఏకె –56 రైఫిల్స్, 9 ఎం.ఎం.పిస్టల్స్, హాండ్ గ్రెనేడ్స్, మందుగుండు సామగ్రి –యింత పెద్దమొత్తాన్ని తన దగ్గర దాచి ఉంచాడు. దుబాయ్ వెళ్లి –ఈ దేశద్రోహిగా ముద్రపడిన దావూద్ ఇబ్రహీంని కలిశాడు. ఆయన తన తమ్ముడు అనీస్ ఇబ్రహీంని, అబూ సలేంని, ఛోటా రాజన్‌నీ ఇతర మాఫియా కార్యకర్తల్ని పరిచయం చేశాడు. మారణాయుధాలను దాచడానికి పరువైన సంజయ్‌దత్ కుటుంబం ఉన్న ఇంటికంటే భద్రమైన స్థలం ఏముంటుంది? ఇది ఒక యెత్తు. తీరా 1993 ముంబై పేలుళ్లు జరిగాక, ప్రపంచం దిగ్భ్రాంతమయాక –272 మంది చనిపోయి, 700 మంది గాయపడ్డాక –సంజయ్ దత్ కిమ్మనలేదు. తీరా రహస్యం బయటపడ్డాక –ఆయుధాల్ని మాయం చెయ్యాలని ప్రయత్నించాడు. ప్రయత్నించలేదని కోర్టులో అబద్ధం చెప్పాడు. 'టెర్రరిస్టు' నేరం కింద అరెస్టయాక, తన కొడుకుమీద 'టెర్రరిస్టు' ముద్ర పడినందుకు సునీల్ దత్ ఎంత క్రుంగిపోయారో వర్ణనాతీతం. ఆయన పార్లమెంటు సభ్యులు. అయినా తన బిడ్డని జైలు నుంచి విడిపించుకోవాలని ఆయన చేయని ప్రయత్నం లేదు. కలుసుకోని నాయ కుడు లేడు. ఎవరూ అక్కరకు రాలేదు. నిజానికి రాలేని నేరమది. ఆఖరికి బాల్ థాకరే సహకరించారు. కొడుకు బయటికి వచ్చాడు –18 నెలల తర్వాత.

సంజయ్ దత్ కుటుంబ మర్యాద గొప్పది. రక్తంలో ఉన్న సంస్కారం గొప్పది. చట్టాన్ని గౌరవిస్తూ 17 సంవత్సరాలు గడిపాడు. ఈలోగా ఎన్నో చిత్రాలు. మున్నాభాయ్ పెద్ద హిట్ అయింది. నాకేమో మున్నాభాయ్ సినిమాలో కొడుకు అభివృద్ధిని చూసి పొంగిపోయిన సునీల్ దత్ పాత్ర




నన్ను వణికించింది. అది 'నటన' కాదు. ఆయన కళ్లలో కన్నీళ్లు గ్లిసరీన్ కాదు. విలువైనవి. నిజమైనవి. నేను ఉత్తరం రాశాను. మున్నాభాయ్ కేవలం ఈనాటి సమాజం మీద సరదాగా చేసిన సమీక్ష. వాస్తవాల్ని ఎరగని ఓ రౌడీ –కేవలం గమ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవస్థని తలవొంచే ఓ పారిహాసిక. సబబైన ఏ ఆలోచనకూ లొంగని కథ. నేలబారు ప్రేక్షకులను కితకితలు పెట్టే అల్లిక. దానికి చాలారకాల మసిపూసి మారేడుకాయని చేశారు. ఒక విధంగా నికార్సయిన న్యాయానికి నిలబడని సంజయ్ ప్రవర్తనలోంచే మున్నాభాయ్ ఉద్భవించాడేమో! ఏమైనా మున్నాభాయ్ హాస్యం చెల్లింది. తన మోసానికి మున్నాభాయ్ చెప్పిన కారణాలకంటే సమాజపు నిర్లక్ష్యాన్ని ప్రేక్షకులు గుర్తుపట్టారు. ఇలాంటి కుక్కకి ఈ చెప్పుదెబ్బ సరైనదేనని చంకలు గుద్దుకున్నారు. అది ఒక అందమైన బుకాయింపు. ఇప్పుడు సంజయ్ దత్‌కి శిక్ష పడింది. ఈ శిక్ష కొత్తకాదు. ఇలాంటి నేరానికే లోగడ జేబున్నిసా ఖాజీ అనే మహిళకు కనీసపు శిక్ష –అయిదేళ్లను కోర్టు విధించింది. చాలామంది నేరస్థులు చేసిన నేరాలకు శిక్షలు అనుభవిస్తున్నారు. మనం మనూశర్మ శిక్షకి ఇంతగా చలించలేదు. పండిత్ సుఖ్‌రాం శిక్షని పట్టించుకోలేదు. చంపరాని జంతువుల్ని చంపిన సల్లూభాయ్ (మన ప్రియతమ సల్మాన్ ఖాన్‌గారు) ఒక రాత్రి జైల్లో ఉంటారా లేదా అని బెంగపెట్టుకున్నాం.

సంజయ్ విషాదాన్ని సినీరంగంలో చాలామంది పంచుకుంటున్నారు. ఆయన ఇంతవరకూ అనుభవించిన యాతన పడిన మనోవేదన, శిక్ష చాలునని రామ్ జెత్మలానీ, మాజిద్ మెమూన్, మహేష్ భట్, ముఖేష్ భట్, జయా బచ్చన్, అజయ్ దేవ్‌గన్ వంటి వారెందరో అంటున్నారు. చాలామంది మంత్రులూ, ప్రభుత్వాలూ శిక్షని తగ్గించడమో, రద్దు చేయడమూ జరపడానికి ప్రయత్నాలు చేస్తున్నాయని వింటున్నాం. వీరందరూ ఒప్పుకునే నిజం ఒకటుంది. సంజయ్ దత్ చేయకూడని నేరం చేశాడన్నది. వీరంతా సమర్థించే దొక్కటి ఉన్నది. సంజయ్ దత్ ఇప్పటిదాకా అనుభవించిన శిక్ష చాలునని. వారు కూడా అంగీకరించిన నేరం రుజువైనదే అయితే, లోగడ ఇలాంటి నేరాలకి పడిన శిక్ష ఒరవడిని గుర్తిస్తే – వారు అంగీకరించవలసింది శిక్షని నిర్ణయించాల్సింది వారి సానుభూతి కాదనీ, న్యాయస్థానమని.

ఫోకస్‌లో ఉన్న రంగంలో నేరం చేసినవారి నేరం మరింత ఫోకస్ లో కనిపిస్తుంది. అలాంటి నేరం నేలబారు మనిషి చేసిన నేరం కన్న వెయ్యిరెట్లు ఘోరమయినది. కారణం –రేపు ఆ ప్రముఖుడి నేరాన్ని –అతని పట్ల చూపిన ఔదార్యాన్ని కాదు –సామాన్యుడు ఆదర్శం చేసుకుంటాడు. మనకి నమ్మకాలు పోయాయి కాని –ఈ విషయాన్నే అలనాడు గీతాకారుడు చెప్పాడు: యద్యదాచరతి శ్రేష్ఠ: –అంటూ. సమాజంలో పెద్దరికం సానుభూతిని రాబట్టుకోడానికి కాదు –ఆదర్శం కావడానికి ఉపయోగపడాలి. రోడ్డుమీద పోలీసుని చంపించే మంత్రిగారు, మరణాయుధాల్ని నేరస్థులతో కుమ్మక్కయి దాచిన సినిమా హీరోగారు –సానుభూతిని నొల్లుకోవాలనుకోవడం –మరో మున్నాభా యి చేసిన సాహసం వంటిదే అవుతుంది.

**(మార్చి 25.2013)**




# (April 1, 2013) 'Penta' Raajakeeyalu 'పెంట' రాజకీయాలు

మేముండే అపార్టుమెంటులో 12 కుటుంబాలున్నాయి. ఆరు కుటుంబాలు ఒకవేపు, మరో ఆరు మరొకవే పు. మా ఇంటి పక్కనే మరో అపార్టుమెంటు. ఈ కుటుంబాలు –ఎవరో తెలీదుకాని –వారిలో ఒకరు తమ చెత్తని పక్క అపార్టుమెంటు గోడదగ్గర వేస్తారు. కొన్నాళ్లకి వారి కాలువల్లో నీరు నిలిచిపోతుంది. వారు తగాదాకి వస్తారు. వేసేది ఎవరు? ఈ ఆరుగురిలో ఎవరయినా కావచ్చు. ఎవరూ ఒప్పుకోరు. పక్క అపార్టుమెంటు కాలువ పూడుకుపోతూనే ఉంటుంది. తగాదా జరుగుతూనే ఉంటుంది. కాని సమస్య ఎన్నడూ పరిష్కారం కాదు. ఇక్కడో సౌకర్యం ఉంది –కనీసం ఆ వేపున ఉన్న ఆరుగురికి. ఎవరో చెత్త వేస్తున్నారు. చెత్తని దూరంగా పారేసే శ్రమ తప్పింది. నేరం ఎవరిమీదా రుజువు కాలేదు. కనుక తగాదా కారణంగా ఇవాళ ఒకాయన చెత్త వేయడం మానుకుంటే –మరో అయిదుగురికి ఆ అవకాశం ఉంది. ఎందుకంటే నేరం ఆరుగురి మధ్య నిలిచిన విషయం. కనుక చెత్త పడుతూనే ఉంటుంది. వేసేవారు మారుతారు. కాని కాలువల్లో దరిద్రం కొనసాగుతూనే ఉంటుంది. స్థూలంగా ఇదీ ప్రస్థుతం మన పాలక వ్యవస్థ పరిస్థితి.

పెంట ఎవరిదన్న ప్రసక్తి కాదు. నేరం ఎవరిదన్న బాధా లేదు. మొత్తంమీద నష్టపోయేది పక్క ఇంటివాడు. తర్జన భర్జనలు జరుగుతూనే ఉంటాయి. నేరారోపణ జరుగుతూనే ఉంటుంది. కాని చెత్త అలాగే ఉంటుంది. చెత్త రాజకీయాలు సాగుతూనే ఉంటాయి. మన రాజకీయ పరిస్థితిని చూద్దాం. కాంగ్రెస్‌కి రాకూడనన్ని రోగాలు వచ్చిపడ్డాయి. రకరకాల కుంభకోణాలు. అవినీతులు. మానభంగాలు. వగైరా వగైరా. మన ప్రధానికి ప్రస్థుతం 81 సంవత్సరాలు. మొదటినుంచీ ఆయన ఆపద్ధర్మ నాయకుడు. తీరా రేపు ప్రధాని అవుతాడని మనకు చెప్తున్న యువ కిశోరం –రాహుల్ గాంధీ తనకు ప్రధాని అయే ఆలోచన లేదని కుండబద్దలు కొట్టేశాడు. ఇక తప్పనిసరిగా మన్మోహన్ సింగుగారే కొనసాగుతారా? లేదా –ఏతావాతా పదవి చేతికి దక్కితే అంత నోరులేని మనిషి, కళ్లు మూసుకొనే సౌకర్యాన్ని ఇవ్వగల మనిషి సోనియా గారికి దొరుకుతాడా? మనకి అర్థంకాని విషయం.

అసలే చావు తప్పి కన్నులొట్టపోయిన డియెంకె –తమ మంత్రి జైలుకి వెళ్లినా, తమ కూతురు జైల్లో ఉన్నా తట్టుకుని –గతిలేక –భరించింది. ఇప్పుడు రాష్ట్రంలో కనీసం వ్యతిరేక పక్షంగానయినా నిలిచే యోగ్యత లేదు. చావూ తప్పలేదు. కన్నూ లొట్టబోయింది. కనుక ఎలాగో నాలుగు మార్కులయినా సంపాదించుకోవాలంటే ప్రభుత్వ పక్షం చెయ్యని ఏదో సాహసం చెయ్యాలి. 12 నెలల ముందు యూపీఏ నుంచి బయటకి వచ్చి సాధించిందీ లేదు. ఓట్లని కూడబెట్టిందీ లేదు. ఏతావాతా ఢిల్లీలో కాంగ్రెస్‌కి అది మూతి బద్దలయే దెబ్బ. ఏమాటకి ఆ మాటే చెప్పుకోవాలి –గత 18 నెలలుగా ఢిల్లీ సంకీర్ణ ప్రభుత్వం రోజువారీ లెక్కల మీదే బతుకు సాగిస్తోంది. రోజుల్లెక్కన పొరుగింటి చెత్తమీద పడుతోంది. డిఎంకె తప్పుకోగానే మరో ఇద్దరికి 'పెంట' వేసే అవకాశం దొరికింది. ఎవరి పెంట వారికి సిద్ధంగా ఉంది. ఎవరికీ 2014 దాకా –అంటే మరో సంవత్సరం దాకా ఎన్నికలు లాయకీ కాదు. ఈలోగా కాంగ్రెస్ అదుక్కునే స్థితికి వచ్చింది. ఆ జోలెలో ఎవరు ఏం వేసినా, వెయ్యకపోయినా పుట్టె మునుగుతుంది. ఇద్దరిముందు –ప్రస్థుతం –ఆ జోలె వుంది. మాయావతి, ములాయం సింగ్. ఇద్దరికీ కాంగ్రెస్ మీద పెద్ద మోజు లేదు. ఆ పార్టీ పిలక తమ చేతిలో ఉందని ఇద్దరికీ తెలుసు. ఎవరు ముందు పెంట వేసినా కాలువ పూడిపోతుంది. వెయ్యకుండా ఆపడానికి కాంగ్రెస్ దగ్గర ఉన్న అస్త్రం సీబీఐ. వెనకటికి ఓ సినిమా మనిషి నాతో అన్నాడు –'నాకు రాజకీయాల మీద మోజు లేదు. కాని నా ఆస్థిని కాపాడుకోవాలంటే రాజకీయ జెండా అవసరమ'ని. ములాయంగారు కాంగ్రెస్‌ని కూలదోయనని అంటూనే నవంబరులో ఎన్నికలు తప్పవన్నారు. అదేమిటి? వారు దన్నుగా నిలబడితే 2014 దాకా ప్రభుత్వం సాగవచ్చు కదా? మరి ఈ సందిగ్ధం ఎందుకని? ఈ గవర్నమెంటు నిలవడానికి వారొక్కరూ చాలుకదా? పొమ్మనలేక పొగ పెట్టినట్టు –వారి మార్కు పొగని వారు సిద్ధం చేసుకుంటున్నారా? లేదా పొరుగింటి చెత్తని




వారప్పుడే గుర్తుపట్టారా? మాయావతిగారు కిమ్మనడం లేదు. వారి జాబితాలో మరికొన్ని కొత్త విగ్రహాలు ఏమైనా ఉన్నాయా? ఏ రోజైనా, ఏ ఒక్కరైనా –ఏ క్షణాన్నయినా 'ఊ' అనకపోతే కూలిపోయే స్థితిలో ప్రస్థుతం ప్రభుత్వం ఊగిసలాడుతోంది. ఈ పద్నాలుగు నెలల్లో ఎవరి ఇళ్లు వారు చక్కబెట్టుకోడానికి ఏ ఇల్లూ అడ్రసులేని ఈ దిక్కుమాలిన ప్రభుత్వాన్ని నిర్దాక్షిణ్యంగా వాడుకుంటారా? 'మా అవసరం లేనప్పుడు మా మీదికి సీబీఐని ఈ ప్రభుత్వం పురికొల్పుతుంది' అంటూనే కాంగ్రెస్‌ని ప్రస్థుతం కూల్చే ఆలోచన లేదని ములాయం వాక్రుచ్చారు. వారి మాటల్లో కాంగ్రెస్ పట్ల ప్రేమ కంటే –వారి అవకాశవాదం గుర్తింపూ, తమ అవసరానికి మదింపూ తెలుస్తోంది.

పద్నాలుగు నెలల తర్వాత తనని ఉంచితే ఉండాలన్న తపన మన్మోహన్‌సింగ్ మాటల్లో తెలుస్తోంది. ఆయనకొచ్చిన నష్టం ఏమిటి? ఆయన –పాపం, కొండకి కట్టిన వెంట్రుక. ఉంటే ఉపయోగమూ లేదు. పోతే ఊడిందీ లేదు. కాని ప్రతిదినం, ప్రతీ సందర్భంలోనూ –ఈ బలహీనపు ప్రభుత్వాన్ని నిలపడానికి ఎన్నిరకాల తాయిలాలు చేతులు మారుతున్నాయో, ఎన్ని విధాలుగా బుజ్జగింపులు తప్పనిసరవుతున్నాయో తలుచుకుంటేనే –ఈ మెజారిటీ వ్యవస్థమీద ఏహ్యాభావం కలుగుతోంది. ఎవరయినా, ఎప్పుడయినా తమ స్వేచ్ఛ మేరకి మనమీద 'పెంట'ని వేసే అవకాశం ఉంది. వారి పక్షాన ఆలోచిస్తే –ఏ విధమైన ప్రేమలూ, బంధుత్వాలూ లేని ఈ ప్రభుత్వం మీద ఎవరయినా రాయి వేసే హక్కు ఉంది. ఏతా వాతా నష్టపోయేది ఈ వ్యవస్థ. పూడిపోయేది మన జీవనం. తన కొడుకు పాలనని విమర్శించి, ఎల్.కె.అద్వానీ గారిని ప్రశంసించి, కాంగ్రెస్ వెన్నుపోటు మనస్తత్వాన్ని ఎత్తిచూపి –మూడో ఫ్రంటుకి వత్తాసు పలికిన ములాయం అనే గుంటనక్క– తన ప్రణాళికా రచనను –ప్రధాని కావాలనే ఆలోచనకు –కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నారని మనకి స్పష్టంగా అర్ధమవుతూనే ఉంది. ఒక్కటి మాత్రం నిజం. మన జీవన విధానంలో 'పెంట' తప్పదు. గత 18 నెలలలోనూ ఎవరయినా సమాజ శ్రేయస్సు అనే బూతుమాట మాట్లాడారా? మన ఆవరణలో 'పెంట' గురించి ఆందోళన వ్యక్తం చేశారా? ప్రస్థుతం ఢిల్లీలో జరుగుతున్న వైకుంఠపాళీలో మనం కేవలం పావులం. అక్కడ నాయకులు పరిచిన పరమపద సోపాన పఠంలో మనం కేవలం గుర్తింపుకి కూడా నోచుకోని నిర్భాగ్యులం. రేపు ఢిల్లీ గద్దెని ములాయం ఎక్కినా, మాయావతి ఎక్కినా మనకి ఒరిగేదేమీలేదు. మన ఆవరణలో 'పెంట' పడుతూనే ఉం టుంది. వేసేవారు మారతా రు. వెయ్యడంలో అనువుని అర్ధం చేసుకున్న మరో ప్రముఖులు వస్తారు. మనం చెయ్యవలసినదల్లా మన వాటా 'పెం ట'కు సిద్ధపడి ఢిల్లీ నాటకాన్ని చూసి ఆనందించి, తరించాలి. మనవి 'పెంట' జీవితాలు అని అర్ధం చేసుకోవాలి.

( **ఏప్రిల్** 1, 2013)









## (April 8, 2013) Vinta Manishi Konta Navvu వింతమనిషి – కొంత నవ్వూ

అమెరికాలో ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయం కులపతికి అర్ధరాత్రి ఫోన్ వచ్చింది. అటునుంచి ఓ వ్యక్తి ఆతృతగా అడుగుతున్నాడు: "112 మెర్సన్ స్ట్రీట్‌కి ఎటువెళ్లాలో చెప్పగలరా?" అని. ఆ ప్రశ్నని వినగానే ఈ కులపతి దిగ్గునలేచి కూర్చున్నాడు. "బాబూ, మీరెవరో తెలీదు కాని –ఇంత అర్ధరాత్రి అంత పెద్దాయన్ని ఎందుకు డిస్టర్బ్ చేస్తారు?" అన్నాడు. కారణం –ఆ అడ్రసు ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రకారుడు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌ది. కాని అటువేపు నుంచి నిస్సహాయంగా సమాధానం వచ్చింది:"నేను ఐన్‌స్టీన్‌నే మాట్లాడుతున్నాను. నా ఇంటికి దారి తెలియడం లేదు". కులపతికి పూర్తిగా మెలకువ వచ్చేసింది. కంగారు పడిపోయాడు. "సార్! మీరెక్కడ ఉన్నారు?" అని దిగ్గున లేచి కూర్చున్నాడు. అటు పక్కనుంచి నిస్సహాయంగా సమాధానం వచ్చింది: "అదే అర్థం కావడంలేదు. ఎదురుగా ఎర్రటి భవనం కనిపిస్తోంది. దానిమీద ఫలానా టీవీ బొమ్మ ఉంది..." అని ఏవో గుర్తులు చెప్పబోయాడు. కులపతి కారుతాళాలు తీసుకుని కారులో దూకాడు. ఆయనకి ఆ గుర్తులు అర్థం అవుతున్నాయి. మరో అరగంటకి నిస్సహాయంగా రోడ్డుమీద నిలబడిన ఐన్‌స్టీన్ ముందు కారాగింది. కులపతి సగౌరవంగా ఆయన్ని కారులో ఎక్కించుకుని ఇంటి దగ్గర దింపి వచ్చాడు. ఐన్‌స్టీన్ ఇంటి అడ్రసు ప్రపంచ ప్రఖ్యాతమయినది: 112, మెర్సన్ స్ట్రీట్, ప్రిన్స్టన్ యూనివర్సిటీ, న్యూజెర్సీ.

మేధావులలో గొప్పతనం వారికే ప్రత్యేకం. అయితే అదెప్పుడూ ఏకపక్షంగానే ఉంటుంది. మనకి అతి సామాన్యంగా కనిపించే తేలికయిన విషయాలు వారి తలలో నిలవవు. ఈ ఉదాహరణకి ప్రత్యేకమయిన నిదర్శనం ప్రపంచంలో కల్లా గత శతాబ్దపు గొప్ప మేధావి ఐన్‌స్టీన్. ఇందుకు మనలాంటి వారిని కితకితలు పెట్టే ఎన్నో సందర్భాలున్నాయి. ఆయన ఒకసారి రైల్లో ప్రయాణం చేస్తున్నారు ఒంటరిగా. టికెట్టు తనిఖీచేసే ఉద్యోగి వచ్చాడు. ఆయన ఐన్‌స్టీన్‌ని వెంటనే గుర్తుపట్టాడు. నమస్కారం చేశారు. ఆనవాయితీగా, సగౌరవంగానే టిక్కెట్టు అడిగాడు. ఐన్‌స్టీన్ టిక్కెట్టు కోసం జేబులన్నీ వెదుకుతున్నాడు –కంగారు పడుతూ. టిక్కెట్టు ఎంతకీ కనిపించడంలేదు. ఆయన కంగారు ఎక్కువయింది. అంతటి మహానుభావుడు టిక్కెట్టు లేకుండా ఎందుకు ప్రయాణం చేస్తాడు? మరిచిపోవడం సహజం. "మరేం పరవాలేదు సార్!" అని చెప్పి ముందుకు సాగిపోయాడు ఉద్యోగి. మరో నలభై నిముషాల తర్వాత ఉద్యోగి అటువెళ్తూ ఐన్‌స్టీన్ వేపు చూశాడు. ఆయన ఇంకా కంగారుగా టిక్కెట్టు వెదుకుతున్నాడు. రైలు నడుస్తూనే ఉంది. ఉద్యోగికి సానుభూతి కలిగింది. దగ్గరికి వెళ్లాడు. "టిక్కెట్టు చూపించకపోయినా పరవాలేదు సార్. దానికోసం వెదకకండి" అన్నాడు. ఐన్‌స్టీన్ నిస్సహాయంగా అన్నాడు: "నేను వెదికేది నీకోసం కాదు బాబూ. నాకోసం నేను ఏ స్టేషన్‌లో దిగాలో మరచిపోయాను" అన్నారట. ఆయన్ని ఎవరో అడిగారట. "అయ్యా, మీ పరిశోధన జగత్ ప్రసిద్ధం. కాని 'సాపేక్ష సిద్ధాంతం' (థియరీ ఆఫ్ రెలిటివిటీ) నా కర్థమయేలాగ చెప్పగలరా?" అని. ఆయన చెప్పారు. "ఒకేచిన్న ఉదాహరణ. నిన్ను ఎర్రగా కాలిన పెనం మీద కూర్చోపెట్టారనుకోండి. క్షణమొక యుగంలాగ కనిపిస్తుంది. అదే ఓ అందమయిన అమ్మాయి సమక్షంలో ఉన్నారనుకోండి –ఒక యుగం క్షణంలాగ జరిగిపోతుంది. అదే థియరీ ఆఫ్ రిలెటివిటీ –స్థూలంగా" అని వివరించారట. ఆయన ఒకసారి బూట్లు కొనుక్కోడానికి షాపుకి వెళ్లారట. వెళ్లేముందు –ఆయన సెక్రటరీ –ఈయన ఇబ్బందులు ఎరిగిన వ్యక్తి కనుక –పాదం సైజు, తనకి ఏ నంబరు బూటు కావాలో చెప్పలేదని –కాలి ఆదెని ఒక కాగితం మీద గీసి ఆయన జేబులో పెట్టింది. తీరా ఆయన షాపులోకి వెళ్లి –తన సెక్రటరీ ఇచ్చిన కాగితాన్ని వెదుక్కున్నాడు. యధాప్రకారంగా కనిపించలేదు. షాపు యజమాని నమస్కారం పెట్టి ఆహ్వానించాడు. ఈయన వెదికి వెదికి వేసారి –లేచి



బయలుదేరిపోయాడు. "ఏం సార్! వచ్చి వెళ్లిపోతున్నారు?" అని అడిగాడు యజమాని. "ఏం లేదయ్యా. నా సెక్రటరీ నా కాలి సైజుని కాగితం మీద రాసి ఇచ్చింది. అదెక్కడో పారేసుకున్నాను. మళ్లీ వస్తాలే" అని షాపులోంచి బయటకు వచ్చారట!

ఆయనకి మహా తెలివైన డ్రైవరు ఉండేవాడు. అతని దినచర్య –తన యజమాని అద్భుతంగా చేసే ఉపన్యాసాలు రోజూ వినడం. ఎంత అలవాటయిపోయిందంటే –తు.చ. తప్పకుండా తనే చెప్పగలిగే స్థితికి వచ్చాడు. ఐన్‌స్టీన్‌ని వ్యక్తిగతంగా తెలియని సభకి ఇద్దరూ వచ్చారు. డ్రైవరుకి ఓ సరదా కలిగింది. "సార్! ఈసారి మీరు చెప్పేదంతా నేను చెప్పేస్తాను" అన్నాడట. మేధావులు పసిపిల్లల వంటివారు. ఐన్‌స్టీన్ నవ్వుకున్నాడు. "ఏదీ. చెప్పుచూదాం" అని సభలో వెనక కూర్చున్నాడు. డ్రైవరు అనర్గళంగా రోజూ వినే తన యజమాని ఉపన్యాసాన్ని అదరగొట్టేశాడు. అంతా అయాక –ఒక జిజ్ఞాసి లేచి –ఒక క్లిష్టమయిన ప్రశ్న వేశాడు. అంతే. డ్రైవరు నీళ్లు నమలడం ప్రారంభించాడు. వెనకన కూర్చున్న ఐన్‌స్టీన్ లేచి నిలబడ్డాడు. "దీనికి సమాధానం మా బాసుదాకా ఎందుకు? వారి డ్రైవరుని –నేను సమాధానం చెప్పగలను" –అని గడగడా చెప్పేశాడట. ఆయన లేబరేటరీలో ఎప్పుడూ పిల్లుల బెడద ఉండేది. ముఖ్యంగా రెండు పిల్లులు– ఒకటి పెద్దది, మరొకటి బొత్తిగా చిన్నదీ వస్తూండేవి. ఈయన పనిలో ఉన్నప్పుడు బయటికి వెళ్లడానికి, లోనికి రావడానికి గొడవ చేస్తూండేవి. ఐన్‌స్టీన్ బాగా ఆలోచించి మంచి ఆలోచన చేశాడు. ఆ విషయాన్ని తన స్నేహితునికి గర్వంగా వివరించాడు. "నా గదిలోకి రెండు పిల్లులు వచ్చి గొడవ చేస్తూంటాయి. వాటి రాకపోకలకి అడ్డులేకుండా మంచిమార్గాన్ని ఆలోచించాను" అన్నాడు.

"ఏం చేశారు సార్!" అన్నాడా స్నేహితుడు. "గోడకి రెండు కన్నాలు చేయించాను. పెద్ద పిల్లికి పెద్ద కన్నం. చిన్న పిల్లికి చిన్న కన్నం" అని వివరించాడు –థియరీ ఆఫ్ రిలెటివిటీని కనుగొన్న ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు!

ఒకసారి ఏదో సభలో రావలసిన వాద్యగాడు రాలేదట. ఏం చెయ్యాలో తెలీక సభా నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు. ఎవరో వారితో చెప్పారట. "మీకు తెలుసో తెలియదో –ఐన్‌స్టీన్ ఫిడేలు వాయిస్తారు" అని చెవిలో గొణిగారు. భయపడుతూనే, అడగలేక అడగలేక ఐన్‌స్టీన్‌ని అడిగారట. ఆయన వెంటనే అంగీకరించారు. మేధావికి తన పనికంటే చిన్న వినోదం మీద రుచి ఎక్కువ ఉంటుంది. ఆయనకి సాధ్యమయినట్టు వయొలిన్ వాయించి, వేదిక దిగి తన స్నేహితుడితో అన్నారట. "చూశావా? చాలామందికి తెలియని విషయం ఏమిటంటే –ఈ ఐన్‌స్టీన్ మామూలు 'ఫిడ్లర్' అని" అని పగలబడి నవ్వారట. ఇంగ్లీషులో ఫిడ్లర్ అంటే 'మోసగాడు' అనే అర్థం కూడా ఉంది! మహానుభావుల మామూలు విషయాలు కూడా వినముచ్చటగా ఉంటాయి. గత శతాబ్దం గర్వించదగ్గ మహా శాస్త్రవేత్తలలో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ఒకరు. ఆయనెంత గుర్తుంటారో ఆయన అన్న మరొకమాట అంత గుర్తుంటుంది. అది మహాత్మాగాంధీని గురించి. ఒకాయన నోబెల్ బహుమతిని పుచ్చుకొన్నారు. మరొకరికి ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఇబ్బంది కలిగిస్తుందని భయపడి నోబెల్ బహుమతి (గాంధీకి) యివ్వలేదు. మహాత్ముడు కన్నుమూసినప్పుడు ఐన్‌స్టీన్ అన్నమాటలివి: "రాబోయే తరాలు ఈ భూమిమీద ఇలాంటి వ్యక్తి ఒకరు రక్తమాంసాలతో సంచరించారా అని నమ్మలేకపోతా రు". ఈ మాటని రిచర్డ్ అటెన్బరో గత శతాబ్దపు గొప్ప చిత్రాన్ని "గాంధీ"ని నిర్మిస్తూ –మొదటి సీనులోనే ఉటంకించారు.

**(ఏప్రిల్ 8, 2013)**

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (April 15, 2013) Oka Alochana – Oka Meemamsa ఒక ఆలోచన – ఒక మీమాంస

గొప్పగా మాట్లాడేవారంతా గొప్ప వక్తలు కారు. అలాగే గొప్ప వక్తలంతా గొప్ప విషయాలను మాట్లా డనక్కరలేదు. రెండో నిజానికి గొప్ప ఉదాహరణ –మన రాజకీయ నాయకులు. మరో అనర్థమైన ఉదాహరణ హిట్లర్. జాతిని ఊపి ఉగ్రూతలూగించి –తన దౌష్ట్యాన్ని అంత గొప్పగా సబబనిపించేలాగ మాట్లాడే వక్త బహు శా మానవ చరిత్రలో మరొకరు లేరేమో. మరి గొప్ప విషయాలను బొత్తిగా నేలబారుగా మాట్లాడే గొప్ప వ్య క్తులు? మూడు ఉదాహరణలు చాలు. మహాత్మా గాంధీ, శ్రీశ్రీ, రామకృష్ణ పరమహంస. గొప్ప విష యం చెప్తూ, గొప్ప వక్తగానూ చెల్లుబాటయే గొప్పతనం చరిత్రలో అరుదు. అలాంటి గొప్పతనం కొట్టొచ్చినట్టు చరిత్ర చేసిన వ్యక్తి –కాదు వ్యవస్థ –స్వామి వివేకానంద. చెప్పిన విషయంలో, చెప్పడంలో ప్రపంచ దేశాలను దిగ్భ్రాంతుల్ని చేసిన ఘనత వివేకానందుడిది. సద్గురు శివానంద మూర్తిగారి సమక్షంలో కూర్చో వడం గొప్ప అనుభవం. వారు అప్పుడప్పుడు ఇచ్చిన అపురూపమయిన ప్రసంగా లన్నీ –పుస్తక రూపంలో వారి శిష్యులు తీసుకువచ్చారు. కాగా, ఆయన గొప్ప వక్తకారు. అంటే మైకు బద్దలుకొట్టే ప్రసంగాలు చేయరు. ఆ మాటకి వస్తే గొప్ప వ్యక్తులెవరూ చేయరు. వారి మాటల్ని జాగ్రత్తగా విని మనం విజ్ఞానాన్ని ఏరుకోవాలి. సినీ ప్రపంచంలో ఇలా అతి సాధారణమైన స్థాయిలో మాట ని నిలిపి (అండర్ ప్లే) అతి అసాధారణమైన పాత్రీకరణను సృష్టించిన సందర్భం ది గాడ్ ఫాదర్. పాత్రను నటిం చిన మహానటుడు –మార్లిన్ బ్రాండో. దర్శకుడు ఫ్రాన్సిస్ ఫోర్డ్ కొప్పోలా. ఎంతో కొంత ఈ సృష్టి నామ నస్సులో చెరగని ముద్ర వేసింది. సంవత్సరాల తర్వా త –నేను జీవితంలో మొదటిసారిగా ఒక విలన్' పాత్ర వెయ్యవలసి వచ్చినప్పుడు –ఫ్రాన్సిస్ ఫోర్డ్ కొప్పోలా, మార్లిన్ బ్రాండో నా మనస్సులో ఉన్నారు. వారి ప్రభావమే ఇంట్లో రామయ్య –వీధిలో కృష్ణయ్య లోనా సుబ్బారావు పాత్ర. దుర్మార్గాన్ని అతినేలబారు స్థాయిలో సంస్కారానికి దీటుగా నిలిపిన పాత్రీకరణ. తర్వాత అది ఒక దుర్మార్గానికి నమూనాగా, నా జీవితకాలమంతా ఎన్నో పాత్రలు చేశాను. దుర్మార్గాన్ని అండర్ ప్లే చెయ్యడం ఆ దుర్మార్గానికి మరింత దుర్మార్గాన్ని జత చేస్తుంది. ఇంట్లో రామయ్య పాత్రలో సంధించిన కొత్త, వింత కోణమిదే. సరే. ఇది విషయాం తరం. మళ్లీ సద్గురువుల దగ్గరికి వస్తే మొన్న వారి సమక్షంలో గడిపిన క్షణాలు అమూల్యమైనవీ, అపురూప మైనవీను. వారు బిగ్గరగా మాట్లాడ లేని స్థితి. నిజానికి అది వారి స్వభా వం. కాని చెప్పే విషయం అతి లోతైన ది. నాలాంటి వారు గొంతు చించుకుని నలభైసార్లు చెప్పవలసినదీను. వర్తమాన సామాజిక అవ్యవస్థ గురించి మాట్లాడుతూ శివానంద మూర్తిగారు నేటి సమాజ ధోరణిని ఒక్కమాటలో క్రోడీకరించారు. నేడు మనిషి కేవలం సుఖం కోసం కష్టపడు తున్నాడుఅని. ఇదొక్కటి చాలు మన వ్యవస్థలో వికారాల న్నింటినీ వివరించడానికి. నాకు మంచి కారు కావాలి. సుఖం. 50 వారాలు శ్రమ పడి వాయిదాలు చెల్లించాలి. నాకు కోటి రూపాయిలు కావాలి. ఎందుకు? మనిషి బతకడానికి అంత అవసరం లేదుకదా? కాదు. నేను సుఖంగా బతకాలి. నా సుఖా నికి నేను పెట్టుకున్న గుర్తు –కోటి. మరి ఏ. రాజా పెట్టుకున్న గుర్తు? కనిమొళి పెట్టుకున్న గుర్తు? వాన్‌పిక్ పెద్దలు పెట్టుకున్న గుర్తు? జగన్ పెట్టుకున్న గుర్తు? యెద్యూరప్ప పెట్టుకున్న గుర్తు? ఇలా ఎన్ని ప్రశ్నల యినా ఉన్నాయి. మరొక గొప్పమాట. ఈ దేశంలో –మన ధర్మంలో –వైరాగ్యం ఆఖరి దశ. ఎవరికయినా. రాజుకయినా. రైతుకయినా. మనిషన్నవాడికి. కాని –అది చాలాముఖ్యం –వైరాగ్యం విరక్తి ద్వారా రాకూడదు. కేవలం తృప్తి ద్వారా రావాలి. నేరాలు చేసి, జైళ్లకి వెళ్లి, అలసిపోయి, అపకీర్తి పాలయి, విసిగిపోయి –అవసాన దశలో –విరక్తితో వచ్చేది వైరాగ్యం కాదు. అది నిలవదు."నాకిది చాలు అనుకొన్న ది, అనిపించిన జీవితం వైరాగ్యం. ఆ పని మన వ్యవస్థలో రాజులూ చేశారు. మామూలు మను షులూ చేశారు. అందుకనే ఆరోగ్యకర మైన కాలధర్మం ఇంతకాలం సాగింది. అయితే తృప్తి ఎలా వస్తుంది? న్యాయస

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

మృతమైన జీవితంతో వస్తుంది. అన్యా య జీవనం వల్ల భయం వస్తుంది. సంకటం వస్తుంది. కీడు వస్తుంది. ఆపద వస్తుంది. మనం శివుడిని దరిద్రుడని కీర్తిస్తాం. సినీమా భాషలో ఒక్క గుర్తుని సూచిస్తే చాలు. "ఆది భిక్షువు వాడినేమికోరేది? బూడిదిచ్చేవాడినేమి యడిగేది?" అన్నాడు సిరివెన్నెల. శివుడి దరిద్రం వైభవం. అసలు దరిద్రం అంటే ఏమిటి? ఏది అవసరమో అది లేకపోవడం దరిద్రం. మరి శివుడి దరిద్రం? ఏదీ అవసరం లేకపోవడం ఆయన దరిద్రం.

ఈ వ్యవస్థలో "ఇక చాలు' అనుకోవడం ఆర్ష సంప్రదాయం. ఇది సుఖానికీ, సంపాదనకీ, జీవికకీ, జీవన విధానానికీ –అన్నిటికీ వర్తిస్తుంది. ఈనాటి వ్యవస్థలో రాజూభయ్యాలు, మనూశర్మలూ, నిన్న మొన్నటి రేప్ వీరుడు రాంసింగులూ ఈ సంప్రదాయ విపర్యయానికి ఎంత గొప్ప ఉదాహరణలు? అలాగని అందరూ ఆశ్రమాలకి వెళ్లి జీవించనక్కరలేదు. రఘు మహారాజు, జనక మహారాజూ రాజ్యాల్ని పాలిస్తూనే సంప్రదాయ'వైభవానికి అద్దం పట్టారు. ఒక పుచ్చలపల్లి సుందరయ్య, ఓ అన్నా హజారే తమ జీవికతో ఆ నిజాన్ని నిరూపించారు. లేకపోతే అన్నా హజారే గొంతుని ఈ దేశం ఎందుకు వినాలి? జీవించే జీవ నం కూడా "ఇక చాలు' అనుకొని శరీరం లోంచి నిష్క్రమించడం ఈ జాతి వైభవం. శరీరం అన్న మాటకే నశించేది అని అర్థం. శరీరంలోంచి జీవం పోయాక చచ్చిపోవడం నిజమైన చావు కాదు. అది చాలామంది చచ్చే చావు. మనం రోజూ వింటున్న చావు. ఇవాళ మనకి చావంటే అర్థం అదే. కాని శరీరంలో జీవలక్షణం ఉండగానే దాన్ని ఐచ్చికంగా వదిలిపెట్టడం ఒకనాటి సంస్కారం. ప్రాణాన్ని వదలాలనుకున్న దశలో శరీరంలోప్రాణం ఉండాలి. అదీ వైభవం. ఇదంతా పుక్కిటి పురాణంలాగ అనిపిస్తుంది మనతరానికి. జైలునుంచి విడుదలయాక –దక్షిణాఫ్రికా గవర్నరు దగ్గరే ఒక డాలరు అప్పు అడిగిన గాంధీ, ఔషదానికి లొంగని శరీరాన్ని విడిచిపెట్టి –దాని నిస్సహాయతను గౌరవించాలని భావించిన వినోభా భావే ఈనాటి కథలు. ప్రజాధనానికి జవాబుదారీగా మాత్రమే పాలకుని బాధ్యత అని భావించి, ఆ నీతికి నిలిచిన పాలకులున్న ఈ దేశంలో ప్రజాధనాన్ని దోచుకుంటున్న నాయకులు –జైళ్లల్లోకి మాయమవుతున్న ఈ తరంలో –ప్రజాధనాన్ని –కోట్లకి కోట్లు దోచుకుంటున్న ప్రబుద్ధులకి "ఇక చాలు' అనిపించే తృప్తి ఈ వ్యవస్థ సంస్కారమని ఎలా చెప్పి ఒప్పించగలం! సద్గురువులతో ఒక్క సాయంకాలం ఇంత ఆలోచింపజేస్తే ఈ దేశ ఆలోచనా స్రవంతికి ఎంత లోతయిన మూలాలున్నాయి? పాటించడం అదృష్టం. కనీసం తెలుసుకోవడం –అవకాశం. అవసరం. మనం ప్రతిరోజూ ఏం పోగొట్టుకుంటున్నామో తెలియని దురదృష్టపు జీవితాలను గడుపుతున్నాం.

( **ఏప్రిల్** 15, 2013)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

## (April 22, 2013) Maro Telugu Peethadhipati మరో తెలుగు పీఠాధిపత

భారతీయ జ్ఞానపీఠ పురస్కారం మన దేశస్థాయిలో నోబెల్ బహుమతి లాంటిది. జాతీయస్థాయిలో అన్ని భారతీయ భాషలలోనూ ఉత్తమ రచయితగా నిలిచి జ్ఞానపీఠాన్ని అధిరోహించడం –తెలుగు దేశానికి, తెలుగు రచయితకి ఇది మూడవసారి. 1970లో కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణకు 'రామాయణ కల్పవృక్షం' రచనకు బహుమతి లభించింది. 1988లో పద్మభూషణ్ సి.నారాయణ రెడ్డిగారికి "విశ్వంభర" రచనకిగాను జ్ఞానపీఠ పురస్కారం దక్కింది. ఇప్పుడు రావూరి భరద్వాజకు –వారు రచించిన "పాకుడురాళ్లు" నవలకి.

నిజానికి మొదటి సంవత్సరమే విశ్వనాథకు బహుమతిని ఇవ్వాలనుకున్నారని ఒక్క వోటులో దక్కలేదని చెప్పుకున్నారు. "అది మంచికే జరిగింది. గుర్తింపు పొందాల్సిన కృషికి దక్కిందని తర్వాత విశ్వనాథ అన్నారట. బహుమతిని అం దుకున్నాక ఒక పాత్రికేయుడు ఆయన్ని అడిగారు. అయ్యా, ఇంత డబ్బుతో ఏం చేస్తారు? అని. "డబ్బు నా జేబులోకి పోతుంది. కాని జేబు కి చాలా కన్నాలున్నాయి" అన్నారు విశ్వనాథ.

ముగ్గురూ మూడు తరాలకు, మూడు ధోరణులకు, మూడు దృక్పథాలకు ప్రతినిధులు. అనాదిగా వస్తున్న ఆర్ష సంప్రదాయ 'ధర్మాన్ని' ప్రతిపాదించే అపూర్వ రచన కల్పవృక్షం. ఆధునిక కవితాత్మకు అద్దం పట్టే రచన విశ్వంభర. ఇ క రావూరి భరద్వాజ అట్టడుగు జీవితాలకు అద్దంపట్టే ఉద్యమాన్ని తన రచనల్లో 70 సంవత్సరాలపాటు అనవరతంగా సాగించిన రచయిత. చదువుకున్నవాడు కాదు. తన పదమూడవయేట –ఏడో తరగతి చదువుతూండగా –కేవలం లేమి కారణంగా చిరిగిన బట్టలతో బడికి వె ళ్లిన అతన్ని ఉపాధ్యాయుడు పిలిచి –పదిమంది ముందూ చావగొట్టాడు. దైన్యత పడగవిప్పింది. బాధతో, నిస్సహాయతతో రెచ్చిపోయి –పుస్తకాలు అక్కడే పారేసి –క్లాసు రూంలోంచి పారిపోయాడు. ఆ తర్వాత బడికి వెళ్ళలేదు. కాని తన రచనలు కొన్నితరాల పిల్లలు క్లాసు రూ ముల్లో చదువుకొనే రచనలు –కేవలం పరిశ్రమతో, కృషితో సాధించుకున్నాడు. ఆ మధ్య హెచ్.ఎం.టి.వీ.కి చేస్తున్న 'వందేళ్ల కథకు వందనాలు' కార్యక్రమానికి ఇంటర్వ్యూ చేస్తూ "మీ రచనా వ్యాసంగానికి స్ఫూర్తి ఏమిటి? అని అడిగాను. సమాధానం సూటిగా, నిర్ద్వందంగా గుండెలోతుల్లోంచి వచ్చింది. "అవిద్య, అవసరం, ఆకలి" –అన్నారు. ఇది ఒక జీవితకాలం రచయితని వెన్నాడిన జీవుని వేదన. 86వ యేట కూడా దాన్ని మరిచిపోలేదు.

బహుమతి వార్త వింటూనే అలనాడు ఆయనతో ఆకలిని పంచుకున్న మిత్రుడిని –ఆలూరి భుజంగరావుని –పలకరించాను. ఆయనిప్పుడు గుంటూరులో ఉంటున్నారు. దాదాపు డెబ్బై ఏళ్ల కిందట –భరద్వాజ, ఆలూరి భజంగరావు (ఆయన వయస్సు ఇప్పుడు 85), మరో గొప్ప రచయిత నటరాజన్ (కలం పేరు 'శారద') మిత్రులు. ఆకలినీ, అవసరాన్నీ, అవిద్యనీ పంచుకుంటూ తెనాలిలో జీవించారు. భుజంగరావు భరద్వాజకు వండిపెట్టేవాడట. నటరాజన్ తమిళుడు. కేవలం కూటికోసం పొట్ట పట్టుకుని మద్రాసు నుంచి తెనాలిలో దిగాడు. రోజుకి 18 గంటలు హోటల్ కార్మికుడిగా పనిచేస్తూ రచనలు చేశాడు. ఆ రోజుల్లో తెనాలి పత్రికా ప్రచురణకు కూదలి. భరద్వాజ వ్యవసాయ కూలీగా పనిచేశాడు, నలంద ప్రెస్‌లో ప్రూఫ్ రీడర్‌గా పనిచేశాడు. ఆనాటి పత్రికలు యువ, జ్యోతి, రేరా ణి, అభిసారిక వంటి పత్రికలకు రాశాడు. సెక్సు కథలు రాశాడు. ఉపాధి లక్ష్యం. ఆకలిని తరిమికొట్టడం ఆదర్శం. అప్పటికే ఇజాలకు, సిద్ధాంతాలకు ముడిపడలేదు. నవలలు, కథలు, వ్యాసా లు, బాల సాహిత్యం, నాటికలు –ఒకటేమిటి? అన్నిటిలోనూ తనదయిన ప్రతిభనీ, ఉపజ్ఞనీ చాటాడు. 185 పుస్తకాలు ప్రచురితమయాయి.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

కొన్నాళ్లు 'జమీన్ రైతు'లో పనిచేశాడు. కొన్నాళ్లు 'దీనబంధు' అనే పత్రికను నడిపారు. 1959లో అసలైన ఉద్యోగం దొరికింది. ఆలిండియా రేడియోలో గ్రామస్థుల కార్యక్రమంలో స్క్రిప్టు రచయితగా చేరాడు. ఆ రోజుల్లోనే 1963 నుంచి 8 సంవత్సరాల పాటు మేమిద్దరం కలిసి పనిచేశాం. ఏ విషయం మీదయినా అలవోకగా రాసే పనివాడితనాన్నీ, పసనీ సాధించారు. ఇద్దరం సభల్లో కలిసేవాళ్లం. రేడియో మా కూడలి. 1968లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. 1983లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. నాగార్జున, ఆంధ్రా, జవహర్‌లాల్ సాంకేతిక విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేటులతో ఆయన్ని సత్కరించాయి. ఇక పురస్కారాలు వెల్లువెత్తాయి. యువ సాహితీ, సోవియట్ భూమి నెహ్రూ పురస్కారం, రాజలక్ష్మీ పురస్కారం, లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారం మొదలైనవెన్నో అందుకున్నారు. తన నలభైయ్యవ యేటనే ప్రస్థుత భారతీయ జ్ఞానపీఠ్ పురస్కారానికి కారణమైన 'పాకుడు రాళ్లు' నవలను రాశారు. ఈ నవల ఒక చరిత్ర. సినీరంగంలో మెరుపుల జీవితాల వెనుక బయట ప్రపంచానికి తెలియని సుడిగుండాలను ఎత్తిచూపే రచన పాకుడురాళ్లు. అలాంటి ఇతివృత్తాలు ఆంగ్లభాషలో చాలానే వచ్చాయి. సిడ్నీ షెల్డన్ 'ది అదర్ సైడ్ ఆఫ్ మిడ్నైట్' ఇటువంటి రచన. అయితే ఈ అర్ధ శతాబ్దిలో ఇలాంటి ఇతివృత్తం, ఇంత విశ్లేషణాత్మక రచన రాలేదు. మొదట ఈ నవలకి "మాయ జలతారు" అని పేరు పెట్టుకున్నారట. ఆయన మిత్రులు శీలావీర్రాజు "పాకుడు రాళ్లు" పేరుని సూచించారు. తర్వాత కృష్ణాపత్రికలో మూడు సంవత్సరాల పాటు పాఠకలోకాన్ని ఊపి ఉర్రూతలూగించింది. ఇప్పుడది చరిత్ర.

అనితర సాధ్యమైన మరొక కృషి ఆయన వ్రాసిన స్మృతి కావ్యాలు. తన జీవన సహధర్మచారిణి కాలం చేసినప్పుడు –హృదయం చెదిరి, తన వేదనకి అక్షరరూపం ఇచ్చి –ఒకటికాదు –అయిదు పుస్తకాలు రాశారు. 'నాలోని నీవు', 'అంతరంగిణి', 'ఐతరేయం', 'అయినా ఒక ఏకాంతం', 'ఒకింత వేకువకోసం'. ఇవి అపూర్వమైన స్మృతి రచనలు. విచిత్రమేమంటే –అంతకుముందు –అలాంటి రచన చేసింది –మరో జ్ఞానపీఠ బహుమతి గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ. తన శ్రీమతి వెళ్లిపోయాక 'వరలక్ష్మీ త్రిశతి' వ్రాశారు. 48 సంవత్సరాల సుదీర్ఘ జ్ఞానపీఠ చరిత్రలో రావూరి భరద్వాజ –ఒక సరికొత్త అధ్యాయానికి ప్రతీక. చదువుతో ప్రమేయం లేకుండా తన రచనలకు జీవితాన్నే పెట్టుబడిగా చేసుకుని అట్టడుగు వర్గాల దయనీయ జీవితాలకు అద్దంపట్టే సాహిత్యాన్ని జాతీయ స్థాయిలో నిలిపిన ఘనత రావూరి భరద్వాజకు దక్కుతుంది. సాహితీ చరిత్రలో ఒక గణనీయమైన మలుపుకీ, ప్రజాస్వామికమైన ధోరణికీ, నికార్సయి న జీవుని వేదనకీ –అభిజ్ఞగా నిలిచిన ఉద్యమకారుడు, కాళ్లు నేలమీద నిలుపుతూనే సృ జనను ఆకాశాన నిలిపిన గొప్ప స్ఫూర్తిదాయకుడు రావూరి భరద్వాజ.

( **ఏప్రిల్** 22, 2013)



# (April 29, 2013) Medhavi Astamayam మేధావి అస్తమయం

గొప్ప గాయకుడు, కవి, రచయిత, మిత్రుడు –యివన్నీ నేలబారు విశ్లేషణలు. ప్రతివాది భయంకర శ్రీనివాసాచార్యులు (పి.బి.శ్రీనివాస్)కి యివేవీ సరిపోవు. ఇవన్నీ ఎవరయినా సాధించగలిగినవి. సాధిస్తున్నవీను. ఆయన బ్రతుకు రహస్యం తెలిసిన మనిషి. ఆద్యంతమూ జీవించిన మనిషి. ఆ మధ్య చాలా జబ్బుపడి కోలుకున్నారు. నేను నా నలభైయ్యేళ్ల పరిచయంలో ఏనాడూ ఆయన నిస్పృహతో, నిరాశతో, నిస్సత్తువతో, దైన్యతతో ఉండగా చూడలేదు. ఎప్పుడూ ఆనందంగా –ఎదుటివాడిలో మంచిని గుర్తిస్తూ, కీర్తిస్తూ జీవించిన యోగి. అదీ ఆయన ఆరోగ్య రహస్యం.

ఎప్పుడూ కొత్తదనానికీ, కొత్త ఆలోచనకీ, కొత్త పదానికీ పెద్ద పీట వేసేవారు. గొప్ప స్నేహితుడు. జేబునిండా కలాలు. చేతినిండా పుస్తకాలు. మెదడునిండా ఆలోచనలు. మనసునిండా ఆర్ధ్రత. కారునిండా పుస్తకాల కవిలి కట్టలు. పన్నెండు భాషల్లో ప్రతిభా పాటవాలు. ఆయన గొంతు శ్రుతిబద్ధంగా పలికే రోజుల్లో –ఆయన గొంతు పలకగలిగినంత సుస్వరం, గమకం అనితర సాధ్యం. ఆ రోజుల్లో ఏ కొత్త గజల్ రాసినా –రాత్రి ఎంత ఆలస్యమయినా యింటికి వచ్చి పాడి –ఆ రాగంలో స్వారశ్యాన్ని, ఆ భావంలో గడుసుదనాన్నీ వివరించి చెప్పి మరీ యింటికి వెళ్లేవారు. ఆ సందర్భాలలో నేను తరచు అనే మాటని ఆయన చెప్పి చెప్పి మరీ కితకితలు పెట్టినట్టు నవ్వుకొనేవారు. కొత్త పలుకుబడి ఆయనకి ప్రాణం. "అయ్యా! మీరో కొత్త గజల్ గజలీకరించి నన్ను ఆనందాగ్నిలో కాల్చి వేయండి" అనేవాడిని. సాధారణంగా రాత్రి పదిన్నర దాటాక –ఆయన యిల్లు చేరాక –యిద్దరం పద్యాల్లో, పాటల్లో పలకరించుకునేవాళ్లం. ఆ పాటలన్నీ నాదగ్గర ఉన్నాయి. కక్కుర్తి, అర్జంటు కవితలు. ఒకసారి నీలాంబరిలో నాకు జోలపాట పాడారు. మరో పదిహేనేళ్ల తర్వాత ఆ పాటని నాకు అదే రాగంలో పాడి వినిపించారు! అదీ ఆయన ధారణ.

పాట: (నీలాంబరి)

పల్లవి|| నిదురపో యిక మారుతీ

నీకు చేసెద నే 'నతి' (నమస్కారం)

అనుపల్లవి|| కలలలో శ్రీరామచంద్రుని

కనుచు మరియగ నీ మది ||నిదుర||

రామ రూపము కనని నిముసము

నీ మదికి కలిగించు విరసము

స్వప్న మందిరమందు రాముని

ప్రభలు కురియును కౌముది ||నిదుర||




ఇందుకు సమాధానంగా నా షష్ట్యంతం వినదగ్గది:

షష్ట్యంతము:

ప్రతివాది భయంకరునకు అ

ప్రతిహత నిర్భీకర ప్రతిభావంతునకు

మితిలేని మిత్రవరునకు స

న్మతి శ్రీనివాస కుల శ్రేష్టునకున్

నామీద 'శ్రీనివాస మారుతీ వృత్తం' అనే కొత్త ఛందస్సుని సృష్టించి –రెండు పేజీల పద్యాన్ని రాసి నాకు బహూకరించారు. అదిప్పటికీ నా దగ్గర ఉంది.

ఏదో సన్మానంలో బహూకరించిన టోపీ, ఒక దుశ్శాలువా, చివరి రోజుల్లో వరస తప్పిన అడుగులతో ప్రతీ సాహితీ సమావేశానికీ వచ్చేవారు. ఇప్పుడు జరుగుతున్న నా "వందేళ్ల కథకి వందనాలు" ధారావాహికకి తన స్పందనని ఆనందంగా రికార్డు చేశారు. నేను టైమ్స్ ఆఫ్ ఇండియా 'సురభి' పత్రిక సంపాదకుడిగా ఉన్నప్పుడు –ఆయనమీద ఒక పరిచయ వ్యాసాన్ని రాశాను. ఎప్పుడూ ఆయన కొలువు ఉడ్‌లాండ్స్ హొటల్. డ్రైవ్ ఇన్ మూత పడినప్పుడు న్యూ ఉడ్‌లాండ్స్‌కి మారారు. నలభై అయిదు సంవత్సరాల కిందట హొటల్‌కి దుక్కిపాటివారితో వచ్చినప్పుడూ అక్కడే కనిపించేవారు. ఓసారి ఆలిండియా రేడియోలో తెలుగు సెక్షనుకి వచ్చారు. నేను కనిపించలేదు. ఒక పద్యాన్ని నా టేబిలు మీద ఉంచి వెళ్లిపోయారు.

అనుష్టుప్పు: (అమృతవాహిని)

మీ సీటు నేడు శూన్యంబై

ఓ గొల్లపూడి మారుతీ!

మీకై ప్రతీక్ష సల్పేనే!

వేవేగ రండు ధీనిధీ

పి.బీ.శ్రీ. 10–7–1977

ఆయన ఖాళీ చేసి వెళ్లిన ఈ ప్రపంచంలో ఎంతమంది మిత్రులు ఎన్ని అనుష్టుప్పులు చెప్తే తనివి తీరుతుంది?

అలరించే సీరియల్స్ ఆకట్టుకునే కథలు ప్రతినెలా ప్రత్యేక కథనాలు పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు.. ప్రతి పేజీలో కొత్తదనం.. ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

నన్ను మెహదీ హసన్‌కీ, గులాం ఆలీకీ –వెరసి ఉర్దూ కవితకీ, గజల్‌కీ పరిచయం చేసిన ఘనత శ్రీనివాస్ గారిదే. నా పక్కన కూర్చుని –ఆనాటి మద్రాసు యూనివర్సిటీ సెంటినరీ ఆడిటోరియంలో జరిగిన మెహదీ హసన్ కచ్చేరీలో –మెల్ల మెల్లగా గజల్ మాధుర్యాన్ని నా నరాల్లోకి సంధించిన రసజ్ఞుడు పీబీయస్. కొత్త గమకానికి 'అహా!' అంటే –దాన్ని గుర్తించే నా రసజ్ఞతకి 'ఓహో!'అంటూ రుగ్మతని వెయ్యి రెట్లు పెంచగల వైద్యుడు పీబీయస్. ఇది సర్వులూ కోరుకునే రోగం. అలాంటి వైద్యుడు అందరికీ దొరకడు. అది నా అదృష్టం. ఆత్మతృప్తి, ఆనందం, మౌలిక కృషి పట్ల తీరని తృష్ణ, స్నేహశీలత –యివి పెట్టుబడులుగా ఆరోగ్యాన్నీ, జీవితాన్ని జయించిన గొప్ప మిత్రుడు, హితుడూ, శ్రే యాభిలాషి –ఇప్పుడు చెప్పక తప్పదు –గొప్ప గాయకుడు, కవి, బహుభాషా కోవిదుడూ పీబీయస్ అనే జీనియస్.

(**ఏప్రిల్** 29, 2013)







gollapudimaruthirao.blogspot.com gmrsivani@gmail.com

# (May 6, 2013) Varaala Velluva వరాల వెల్లువ

వరం అర్హతతో వచ్చేదికాదు. సాధించుకుంటే దక్కేది కాదు. అప్పనంగా కొట్టేసేది. అది దేవుడయినా, యజమాని అయినా, నాయకుడయినా – ఆయన ఇష్టప్రకారం ఇచ్చేది. దాని పరిమితి ఎదుటివాడి దయా దాక్షిణ్యం. హిరణ్యకశిపుడు చావులేని వరం అడిగాడు. "అది కుదరదు. ఎలా చావకూడదనుకున్నావో చెప్పు" అన్నాడు బ్రహ్మదేవుడు. మన నాయకులూ అంతే. మనకేం కావాలో ఊహించుకుని, ఏది యిస్తే రాణిస్తుందో పసిగట్టి, యివ్వడం వల్ల తమకొచ్చే లాభాన్ని ముందుగా మీకు చెప్పి, మీ ముక్కుపిండి –అప్పుడు యిస్తామంటారు. మీకు కావాల్సింది కాదు.

వారికి ఇవ్వడానికి అనువుగా ఉన్నదీ, ఇవ్వడం వల్ల వారికి కలిసివచ్చేదీను. ఉదాహరణకి: తమిళనాడులో పేదలు ప్రతీ ఇంటికీ కలర్ టీవీ అడగలేదు. కాని గవర్నమెంటు ఇస్తానంది. పేదవాడికి గంజికావాలి. అందరూ తినగలిగిన వనరులు కావాలి. కాని రెండు రూపాయలకి బియ్యం యిస్తానంది. మరి పప్పు? వంటచెరుకు? ఉప్పు? చింతపండు? గవర్నమెంటు జాబితాలో చింతపండులేదు. అన్నిటికీ మించి రెక్కలు ముక్కలయేటట్టు పనిచేసి వచ్చిన పేదవాడికి 200 మిల్లీల 'సరుకు' కావాలి. ప్రభుత్వం ఇవ్వదుకదా? కనుక –ప్రభుత్వం ఇచ్చే మేలురకం బియ్యాన్నీ, టీవీలనీ అమ్మి –తనకి కావలసింది కొనుక్కున్నాడు తమిళనాడులో. ప్రభుత్వం పంచిన వారం రోజుల్లో ఏ గుడిసెలో నూ కలర్ టీవీ పాటలు పాడలేదు. మేలురకం బియ్యం లారీలు ఆంధ్రా, కర్ణాటక సరిహద్దుల్లో పట్టుబడ్డాయి. ప్రభుత్వం ఒకందుకు ఇచ్చింది. నేలబారు మనిషి మరొకందుకు వాడుకున్నాడు.

అన్నిటికన్నా ముఖ్యమయినది –గవర్నమెంటు బలహీనత –వరాలతో వోట్లు రాబట్టాలనే యావ, వరాలతో పదవుల్లోకి రావాలనే తాపత్రయం వోటరుకి పెట్టుబడి. వోటర్లకి –కులాలను బట్టి, మతాలను బట్టి, వాడలను బట్టి, పేటలనుబట్టి ఒక్కో మేస్త్రీ ఉన్నాడు. అతను రేపు ఎమ్మెల్యే అవుతాడు. ప్రభుత్వం నుంచి ఏం రాబట్టాలో ఎంత రాబట్టాలో అతనికి తెలుసు. లంచం అలవాటుగా మారిపోయిన నేటి వ్యవస్థలో వోటుకి బహిరంగంగా లంచం యిచ్చే నాయకులను బ్లాక్‌మెయిల్ చెయ్యడం ఏం కష్టం? ఈ లావాదేవీల రామాయణం పేరు మనదేశంలో ఒకటుం ది – దానిపేరు 'ప్రజాస్వామ్యం'.

సరదాగా మన రాష్ట్రంలో వరాలను పరిశీలిద్దాం...

మొన్న పాదయాత్ర ముగిశాక ప్రతిపక్ష నాయకులు కురిపించిన నమూనా వరాల వెల్లువ:

అన్ని వ్యవసాయ రుణాల మాఫీ, బెల్టు దుకాణాల బాధితులయిన స్త్రీలకు మేళ్లు, స్త్రీల పట్ల అత్యాచారాలపై త్వరగా విచారణ జరిపే కోర్టులు, బీసీలకు చట్ట సభల్లో నూరుసీట్లు, పదివేల కోట్ల ఉపకార పథకం, కాపులకు రిజర్వేషన్లు, బ్రాహ్మణులకు 500 కోట్ల ఉపకారాలు, డ్వాక్రా మహిళలకు వడ్డీల మాఫీ, ఇది కాక పుట్టిన ప్రతీ ఆడపిల్లకీ ఆర్థిక సహాయం, ప్రభుత్వ ఉద్యోగులకు ఉచితంగా ఇళ్లు, పేదలకు ఇళ్లు, ముస్లిం యువతులకు ఏభైవేల రుణాలు, దేశం లో ప్రతి మసీదులో పనిచేసే ఇమామ్, ముజ్జిన్‌లకి మూడువేలు, ఐదు వేల నెలసరి జీతాలు, చదువుకున్న నిరుద్యోగ యువతకు నెలసరి మంజూర్లు –ఇవి స్థాలీపులాక న్యాయంగా కొన్ని మాత్రమే.



ఇక ప్రభుత్వ వరాల నమూనా: విద్యార్థులకు ఆర్థిక సహాయం, విదేశాలలో చదువుకునే వెనుకబడిన కులాల విద్యార్థులకు 5 లక్షల నుంచి 10 లక్షల ఆర్థిక సహాయం, పొలాలు కొనుక్కునే వెనుకబడిన కులాల రైతులకి ఎకరాకు లక్ష నుంచి 5 లక్షల ఆర్థిక సహాయం, దళిత కుటుంబాలకు –అంటే నెలకు 50 యూనిట్ల కన్నా తక్కువ వినియోగించుకునే కుటుంబాలకు ఉచిత విద్యుత్ (ప్రస్థుతం రోజుకి 8 గంటలు గ్రామాల్లో విద్యుత్ లేదు –అది వేరే విషయం), దారిద్ర్య రేఖకి కింద ఉన్న కుటుంబాలకు ప్రతీనెలా 185 రూపాయలు కిమ్మత్తు చేసే 9 అత్యవసర వస్తువుల పంపిణీ –అంటే కిలో పామ్ నూనె, కందిపప్పు, గోధుమలు, గోధుమ పిండి, ఉప్పు, అర కిలో చింతపండు, పావుకిలో కారప్పొడి, నూరు గ్రాముల పసుపు, తొమ్మిది, పది క్లాసుల కుర్రాళ్లకి స్కాలర్‌షిప్పులు, బయట ఉండి చదువుకునేవారికి నెలకి 2224 రూపాయలు, హాస్టళ్లలో ఉన్నవారికి 4500, పుస్తకాలు కొనుక్కోడానికి 750 రూపాయలు, కడుపుతో ఉన్న మహిళలకు సహాయం చెయ్యడానికి నూరుకోట్ల మం జూరు, ఇవి కాక గ్రామాల్లో ఉండే గ్రామీణులకు సహాయానికి గాను 884 కోట్ల మంజూరు. ఇవి కేవలం నమూనావరాలు.

అయితే ఎవరికి ఏం కావాలో నాయకత్వం ఎలా నిర్ణయించగలదు? ఈ దేశంలో ఉన్న 121 కోట్ల ప్రజల అవసరాలను ఎవరు జనరలైజ్ చెయ్యగలరు? నా కొడుక్కి ప్రభుత్వం సైకిలిచ్చింది. కాని నాకు పెద్దకూతురు పురిటికి వచ్చిన ఖర్చు ముఖ్యం. తమిళనాడులో ఏ కుర్రాడికిచ్చిన సైకిలూ ఆ కుర్రాడు తొక్కగా చూడలేదు నేను. ప్రత్యేకంగా తమిళనాడు గురించే రాయడానికి కారణం నేను గడుసువాడిని కనుక. తమిళనాడులో మామిడిచెట్టుకి కొబ్బరికాయలు కాయించాలని చేసిన ప్రయత్నం లాంటిదే ఇక్కడా జరుగుతోంది కనుక. రాష్ట్రంలో అందరి సామూహిక అవసరానికి రాజకీయ నాయకులు కొన్ని గుర్తులు పెట్టుకున్నారు. తుంటి మీద కొడితే పళ్లు రాలతాయని నిర్ణయించారు. ఎక్కడయినా కొడితే చాలునని ప్రజలు ఎదురు చూస్తున్నారు. పుస్తకాలకిచ్చిన డబ్బుతో విద్యార్థి "అసలిలా మొదలయ్యింది" సినిమా చూస్తాడేమో ఎవడు చూడొచ్చాడు?

నిజానికి ప్రభుత్వం చెయ్యాల్సిన పని –వ్యక్తి స్తోమతుని పెంచడం. అతని ఆర్థిక స్థాయిని మెరుగు పరచడం. ఇది ఒక ఎన్నిక వ్యవధిలో జరిగే పనికాదు. మరుసటి ఎన్నికకి మనం ఉంటామో ఊడుతామో! ప్రస్థుత ఎన్నికకు పబ్బం గడుపుకోవడమే పార్టీల లక్ష్యం. ఆ విషయం స్పష్టంగా జనానికి అర్థమౌతోంది. వారికి అర్థమౌతోందన్న నిజం పార్టీలకీ అర్థమౌతోంది. ఇది వోటరూ, వా రి వారి ప్రతినిధులూ తెలుసుకుని బెల్లిస్తున్న బ్లాక్‌మెయిల్. ఎవరి ఊరింపు గొప్పదో వారిది గెలుపు. బాచాబూచుల లోపల బాచన్నే పెద్ద బూచి!

( మే 6, 2013)









# (May 13, 2013) Vandella Cinema వందేళ్ళ సినిమాకు వందనాలు

సినిమా తెరకెక్కి వందేళ్లయింది. నేను సినిమాకెక్కి ఏభై యేళ్లయింది. 1913లో దాదా సాహెబ్ ఫాల్కే 'రాజ హరిశ్చంద్ర' మొదటి చిత్రం.

1963లో 'డాక్టర్ చక్రవర్తి' నా మొదటి చిత్రం. సినిమాతో నా బంధుత్వాన్ని చెప్పడాని కే, చెప్పడం వరకే ఈ విషయం.

నేను సినిమాలో తొలిపాఠాలు నేర్చుకున్న రోజుల్లో –సినిమా బాగా ఆడడానికి ఏయే హంగులు ఉండాలో ఎవరూ ప్రసక్తంగానయి నా మాట్లాడిన గుర్తులేదు. వ్యాపారపరంగా ఏ సినిమా డబ్బు చేసుకుంటుందో కూడా చెప్పిన గుర్తు లేదు. సమాజంలో నైతిక విలువలో, మానవీయమైన ఇతివృత్తమో, హృద్యమైన పాత్రలో, ఆర్ద్రమైన సంఘటనలో –వీటి గురించే నెలల తరబడి మాట్లాడుకున్న గుర్తు. ఇవన్నీ సినిమా రాణించడానికి, ప్రేక్షకుల ఆదరణ పొందడానికి ప్రాథమికమైన అవసరాలని మాత్రమే చర్చలు జరిగేవి.

ఒక జట్కావాడు. చెల్లెలు. తండ్రి ఏ కారణానికో అతని చిన్నతనంలోనే జైలుకి వెళ్లాడు. చెల్లెలికి పెళ్లి చేశాడు. తీరా బావ తండ్రినే తన తండ్రి హత్య చేశాడని తెలిసింది. చెల్లెలి కాపురం చెడింది. ఆమె జీవితాన్ని చక్క దిద్దడానికి తండ్రి నిరపరాధి అని నిరూపించా డు. ఇదీ కథ. బాధ్యత గల అన్న, కాపరాన్ని చక్కదిద్దుకున్న చెల్లెలు, నిర్దోషి అయిన తండ్రి –ఇది రాణించే కథ. సినిమా రజతోత్సవం చేసుకుంది. పేరు 'పూలరంగడు'. మరో పాతికేళ్ల తర్వాత మళ్లీ అదే కథ రాశాను. ఈసారి చిరంజీవితో. మళ్లీ వందరోజులు పోయింది. పేరు 'ఆలయ శిఖరం'. విలువల్ని నమ్ముకున్న సినిమాలవి. డబ్బుకోసం అమ్ముకుంటున్న సినిమాలు ఇప్ప టివి. ఒక్క తెలుగు చిత్రాలనే తీసుకుంటే –ఆనాటి లవకుశ, మల్లీశ్వరి, మాయాబజారు, మనుషులు మారాలి, ప్రతిఘటన, సీతారామయ్యగారి మనుమరాలు –మచ్చుకి ఇవన్నీ ప్రేక్షకుల్ని ఊరించే దృష్టితో తీసినవికావు. అలరించే దృష్టితో తీసినవి. వాటికి రాణింపూ, ఆదరణా, చరిత్రలో భాగమయే గౌరవం –మూడూ దక్కాయి. ఏదీ? ఈ మధ్య కోట్లు సంపాదించిన చిత్రాల్ని –గుర్తుంచుకు –నలుగుర్ని కనీసం నాలుగు పేర్లు చెప్పమనండి.

దేశ స్థాయిలో మదర్ ఇండియా, వక్త్, మొఘల్ ఏ ఆజం, అంకుర్, జాగ్తే రహో –యిలా ఎన్నయినా చెప్పవచ్చు. ఇవన్నీ విలువల్ని ఎత్తిచూపే పనిచేశాయి. డబ్బు చేసుకున్నాయి. "ఈ సినీమాలు చూడండి బాబోయ్!" అని గోలపెట్టలేదు. పెద్దమనిషి అరవడు. కొంటె కుర్రాడు కేకలేస్తాడు.విలువల పతనానికి ఒకే ఒక కారణం –డబ్బు, సినిమాకీ, డబ్బుకీ మొద టినుంచీ లంకె ఉంది. అయితే పెళ్లాం నగలు తాకట్టుపెట్టి రాజా హరిశ్చంద్రని తీసిన ఒక జిజ్ఞాసి స్థాయినుంచి –సినిమానీ, విలువల్నీ తాకట్టుపెట్టి బాంకు అకౌంట్లు పెంచుకునే స్థాయికి సినిమా 'రాజీ' పడిపోయింది. ఇదీ స్థూలంగా సినిమా చరిత్ర పరిణామం –ఒక్కమాటలో. ఇవాళ సాంకేతిక విలువల్లో కాని, సామర్థ్యంలో కాని ఏ భాషకీ, ఏ దేశానికీ తీసిపోని స్థాయిలో మన తెలుగు పరిశ్రమ ఉంది. 'ఈగ' వంటి చిత్రం భారతీయులుగా మనల్ని ప్రపంచ పఠంలో నిలపగల స్థాయి. కాని హృదయం లోపించింది. విచిత్రమేమిటం టే –విలువలు లేకపోయినా 'సరుకు' అమ్ముడుపో తోంది. విలువలు ఎవరో నిర్దేశించేది కాదు. నిర్మాత, దర్శకుని సంస్కారానికీ, సామాజిక బాధ్యతకి సంబంధించింది. ఇది లేకపోతే ఎవరూ ఉరితీయరు. ఒక గొప్ప మాద్యమానికి ఉన్న, ఉండగల 'నీతి' బలి అయిపోతోంది. అమ్మని 'అమ్మా' అని పిలవడం సంస్కారం. దాన్ని ఎవరూ నేర్పరు. అది జన్మత: వచ్చే విలువ. వ్యాపార కోణంతో



సంధించే ఒక గొప్ప మాధ్యమంలో స్వచ్ఛందంగా నిలుపుకోవలసి న ఈ గొప్ప అంశాన్ని క్రమక్రమంగా సినిమా కోల్పోవడమే నూరేళ్లలో పరిణామానికి పెద్ద నిదర్శనం.

ఈ పరిణామం అన్ని దేశాలలో, అన్ని సిని రంగాలలోనూ జరుగుతోంది. సినిమా కంటే అతి చురుకైన, డ్రాయింగు రూముల్లోకి దూసుకువచ్చిన మాధ్యమాన్ని (టీవీ) సంధించే ఈ ప్రక్రియకి ఇదివరకెన్నడూ లేని కోరలు వచ్చాయి. తెరమీద ఆకర్షించే గుణం ప్రతీ నట్టింట్లో తుపాకీ లాగ పేలుతోంది. అమితాబ్ బచ్చన్ పాపులారిటీకీ అలనాటి శివాజీ గణేశన్ పాపులారిటీకీ బొత్తిగా పోలికలేదు. ప్రతిభలో కాదు. ప్రచారం లో.కారణం మాధ్యమం విస్తృతి. ఈ విస్తృతి బలమైతే? ఈ విస్తృతి ఒక ఆరోగ్యకరమైన సందేశాన్ని కూడా చిత్రానికి సంధించగలిగితే? నేలబారు జీవితాలను అలరించే పోకిరీతనాన్ని, తిరుగుబాటునీ (సహేతుకమైన దికాదు), బాధ్యతా రాహిత్యాన్ని సినీమా అలంకరిస్తే మొన్న ఢిల్లీలో ఏడుగురు ప్రబుద్ధుల పైశాచిక ప్రవృత్తికి మనం వారసులమౌతాం. సెకెనుకి 24 ఫ్రేములు కదిలే సినిమా 'సెకెనుకి 24 సార్లు నిజాన్ని లేదా అబద్ధాన్ని లేదా పోకిరీత నాన్ని బూతద్దంలో చూపిస్తుంది. నష్టపోయే సమాజంలో ఈ సినిమా ప్రపంచమూ ఉంది. నా కొడుకూ ఉన్నాడు. మీ చెల్లెలూ ఉంది. సినిమా భగవద్గీత చెప్పనక్కరలేదు. ఆ పని సినీమాదికాదు.

నిన్నకాక మొన్న అలరించిన మణిరత్నం "నాయకన్" సినిమాని ఉదహరిస్తాను. తన కారణాలకి సమాజం మీద తిరగబడిన ఒక మాఫియా నాయకుని కథ. భయంకరమైన అవినీతి పెట్టుబడిగా పెరిగి, నిలదొక్కుకుని, నిర్దుష్టమైన ఉపకారిగా మారడం రెండో పార్శ్వం. అయితే ఏది ఆకర్షిస్తుంది. దుర్మార్గమే. తిరుగుబాటే. చివరలో కుక్కచావు చచ్చే అతణ్ణి మూడోతరం ప్రశ్నిస్తుంది –అతని మనుమరాలు. "నువ్వు మంచివాడివా? చెడ్డవాడివా?" అని. ప్రాణం వదలబోయే ముందు ఒక్క క్షణం ఆలోచించి, నిస్సహాయంగా "తెలీదు" అంటాడు నాయగన్. ఆ సన్నివేశం మహాకావ్యం. ఒక దుర్మార్గుడి ఆకర్షణమీయమైన కథకి –బాధ్యతగల నిర్మాత, దర్శకుడి ముక్తాయింపు.

సినిమాని ఆకాశంలో నిలపగల నేర్పుని కూడదీసుకున్న ఈ తరం –విలువల్ని నిలిపే చిత్రాలు డబ్బుతో పాటు, పేరునీ, వాటి ఆయుర్దాయాన్ని పెంచుకుంటాయని నమ్ము తూ సినీమాలు తీయగలిగితే (మొన్న మొన్నటి 'ది వెడ్నెస్ డే', 'తారే జమీన్ పర్',నిన్నటి 'మిధునం') మరో నూరేళ్ల తర్వాత విలువలూ, వికాసమూ కలిసి వచ్చే మరో కొత్త శతాబ్దానికి నాందీ పలకగలదని నాకనిపిస్తుంది.

(మే 13, 2013)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

(May 20, 2013) V49 O

నిన్నకాక మొన్న జరిగిన కర్ణాటక ఎన్నికలు ఎన్నో కొత్త విషయాల్ని చెప్పక చెప్తున్నాయి. ఇప్పటికే రాజకీయ నాయకులకీ, దేశానికీ అర్థమయ్యే విషయం –చదువుకున్న వాడి దగ్గర్నుంచి, మామూలు మనిషి వరకూ రాజకీయ పార్టీల నైచ్యాన్నీ, నమ్మకద్రోహాన్నీ, అవినీతినీ, బుకాయింపునీ, నిరంకుశత్వాన్నీ, గూండాయిజాన్నీ, దోపిడీని, రంకుతనాన్ని గమనిస్తున్నారని, అసహ్యించు కుంటున్నారని. అవకాశం వచ్చినప్పుడల్లా స్పష్టంగా తమ అసహ్యాన్నీ, అసహనాన్నీ ప్రకటిస్తున్నారని. అయితే ఇందులో –'ప్రజాస్వామ్యం పేరిట మరో పెద్ద లొసుగు ఉంది. దాన్ని చర్చించే ముందు కొన్ని నిజాలు. 1985 తర్వాత పదవిలో ఉన్న ఏ పార్టీనీ కర్ణాటకలో ప్రజలు ఎన్నుకోలేదు. ఈ మధ్యకాలంలో అదేపనిని తమిళనాడు ఓటరూ నిష్కర్షగా చేస్తున్నాడు. ఈసారి కరుణానిధి పార్టీ పదవిలోకి వస్తే రేపు జయలలిత పార్టీ వస్తుంది. పదవిలో ఉన్నప్పుడు ఆయా పార్టీల అవినీతినీ, అరాచకాన్నీ ఎప్పటికప్పుడు తిరస్కరిస్తూనే ఉన్నాడు. అయితే అయిదేళ్ల తర్వాత మళ్లీ వారినే ఎందుకు ఎన్నుకుంటు న్నాడు? మరో గతిలేక. ప్రతీసారీ పదవిలో ఉన్న పార్టీ పట్ల విముఖత –ఎదుటి పార్టీ పట్ల సుముఖతగా చలామణీ అవుతోంది. పదవిలోకి వచ్చిన పార్టీ కొన్నాళ్లు నీతికథలు చెప్తుంది. మళ్లీ తన భాగోతం మొదలెడుతుంది. ఎంతవరకు? మళ్లీ చీదరించుకుని, నిష్కర్షగా, నిర్దుష్టంగా వోటరు పొమ్మనే వరకూ.

ప్రస్థుతం కర్ణాటక భాగోతమే తీసుకుం దాం. బిజెపి అవినీతి, అరాచకం, వీధినపడి పార్టీలు చీల్చుకోవడం, అన్నీ వోటరు చూస్తూనే ఉన్నాడు. గాలి భాగోతం దేశం కళ్లారా చూసిం ది. కాని తన విసుగుదల, కోపం ప్రదర్శించ డానికి అయిదు సంవత్సరాలు ఆగక తప్పదు. ఈలోగా మనచుట్టూ జగన్‌లు ఉంటారు. వాన్‌పిక్ ప్రసాదులుంటారు. గాలి సోదరులుం టారు. వారు నీతిగురించి మాట్లాడుతూనే ఉంటారు.

కర్ణాటకలో బిజెపిని గద్దె దించి కాంగ్రెస్‌ని ఎక్కించడానికి కాంగ్రెస్ మీద ముద్దొచ్చికాదు. వారి భాగోతాలు కోకొల్లలు. ఎన్నికల విజయం చవిచూస్తూండ గానే మరో రైలు గేటు, మరో సిబిఐ అధికార దుర్వినియో గం –ఇద్దరు మంత్రు ల బర్తరఫ్ జరిగింది. మరెందుకు ఎన్నుకొన్న ట్టు? మరో గతిలేక. (అందుకే 'అవినీతి నాయకుల్ని గద్దెదింపే చట్టం రావాలని అన్నా హజారే మొత్తుకుంటున్నది). ఎదుట ఉన్న దరిద్రుడూ, దానవు డూ మధ్య ఎవరినో ఎన్ను కు చావాలి కనుక. ప్రజాస్వా మ్యంలో ఈ అనర్థం తప్పదా? ఒకరు పోతే మరొకరిని తెలిసీ చంక ఎక్కించుకునే దరిద్రానికి ప్రత్యామ్నా యం ఏదయినా ఉందా?

ఉంది బాబూ! ఉంది. ఇలాంటి ఆలోచన ఉంది. ఇది మన దేశంలో ప్రతీ వోటరుకీ తెలియజెప్పాల్సిన రోజొచ్చింది. దాని పేరు 49 ఓ. 2001 లోనే వోటరు తన అభీష్టం మేరకి అందరు అభ్యర్థులనూ తిరస్కరించే అవకాశం కల్పించాలనే ప్రతిపాదన వచ్చింది. 2004లో అప్పటి ఎన్నికల కమిషనర్ టి.ఎస్.కృష్ణమూర్తి గారు (ఆయన తెలుగువారు. సాహితీ ప్రియు లు. నాకు మిత్రులు) ప్రధానమంత్రికి ఒక ప్రతిపాదనని చేశారు.

ఎన్నికకి నిలబడే ఏ అభ్యర్థీ వోటరుకి నచ్చకపోతే? ఇప్పటి బాలెట్ కాగితంలో అభ్యర్థుల జాబితా మాత్రమే ఉంటుంది. అంటే వోటరుకి ఎవరికో ఒకరికి వోటు వేసే అవకాశమే ఉంటుంది. కనుక, బాలెట్ కాగితంలో ఆయా అభ్యర్థుల పేర్లతో పాటు –"వీళ్లెవరినీ ఎన్నుకోను" అని వోటరు




చెప్పగలిగే ఒక కాలమ్ ఉండాలని ప్రతిపాదిం చారు. రష్యాలో ఈ నెగిటివ్ వోటుకి ఆస్కారం ఉంది. ఈ దేశంలో ఇప్పటి నాయకుల నిర్వాకం దృష్ట్యా, నానాటికీ పెరుగుతున్న వోటరు నైరాశ్యం దృష్ట్యా అందరినీ తిరస్కరించే హక్కు వోటరుకి ఉండాలి. ఈ మాటే అన్నా హజారే చెప్తున్నారు.

ఎవరికీ వోటు చేయని హక్కు తన విసుగుదలని అందరిపట్లా –లేదా ఈ నాయకుల ఆత్మవం చన పట్ల ప్రదర్శించే హక్కు ఉండాలని. అయితే ఈ ప్రతిపాదన మీద ఒక విమర్శ కుడా ఉంది. దేశంలో ప్రతీ వోటరూ తన అభిప్రాయాన్ని ప్రకటించే అవకాశం ఎన్నిక. కోట్లు ఖర్చు చేసే ఈ ప్రక్రియ 'ఎవరూ నచ్చలేదు' అనే మెజారిటీ అభిప్రాయంతో ముగిస్తే? అయితే అవినీతిపరుడిని గద్దె ఎక్కించి –అయిదేళ్లు అతని దోపిడీని, అరాచకాన్ని (ఇప్పుడు సుప్రీం కోర్టు దాకా వెళ్లిన అవినీతి భాగోతాలని చూస్తున్నా ము కదా?) భరించే ఖర్చుకన్న –మెజారిటీ ప్రజానీకం నైరాశ్యాన్ని, నిర్దుష్టమైన విసుగుదల ని తెలిసేటట్టు చేయడం కొందరికయినా కనువిప్పు కాదా అని ఆశ. ఈ రెండు నష్టాల్లో ఏది ఎక్కువ నష్టమో చూద్దాం. మన దేశంలో ఎన్నిక నిర్వహించడా నికి పది వేల కోట్లు ఖర్చవుతుం ది. సరే. ఒక అవినీతిపరుడిని నాయకుడిగా అయిదేళ్లు భరిస్తే?

ఒక్క రాజావారి 2జి కుంభకోణంలోనే లక్షా డెబ్బైయ్యారు వేల మూడువందల డెబ్బై తొమ్మిది కోట్లు తిన్నారు. బొగ్గు కుంభకోణంలో 1855.91 బిలియన్లు స్వాహా చేశారు. ఇలాంటివి –ఒక్క యూపీఏ 2లోనే పది కుంభకోణాలున్నాయి. స్పెక్ట్రమ్ కుంభకోణం, కామన్వెల్త్ క్రీడల కుంభకోణం, తెల్గీ కుంభకోణం, సత్యం కుంభకోణం, బోఫోర్స్ కుంభకోణం, బీహారు గడ్డి కుంభకోణం, ఆదర్శ అపార్ట్‌మెంట్ల కుంభకోణం, హవాలా కుంభకోణం (18 వేల కోట్లు చేతులు మారాయి!), ఐపీఎల్ కుంభకోణం, హర్షద్ మెహతా, కేతన్ పారీఖ్ కుంభకోణం, చివరగా జగన్ వ్యవహారంలో ఇంకా లెక్కలు తేలలేదు. ఇవి చాలనుకుంటాను –49 ఓ కారణంగా –అవినీతి పరుడిని అందలం ఎక్కించేకన్నా పదివేల కోట్లని వోటరు గర్వంగా, నిష్కర్షగా, కుండబద్దలుకొట్టి –నాకీ దరిద్రులు ఎవరూ వద్దని చెప్పడానికి, జీవితంలో మళ్లీ వాళ్ల మొహం చూపకుండా చేయడానికి.

ఒకవేళ ఎన్నికయిన అభ్యర్థికి వచ్చిన వోట్ల కన్నా –వోటరు తిరస్కరించిన వోట్ల సంఖ్య ఎక్కువయితే? ఆ అభ్యర్థిని శాశ్వతంగా ఎన్నికలలో నిలవకుండా బర్తరఫ్ చేయవచ్చుననే ఆలోచన ఉన్నది. అయితే అలాంటి నిర్ణయం తీసుకోలేదని ఎన్నికల సంఘం ప్రకటించింది. కాని ఇలాంటి అవకాశమే యిస్తే ఈ దేశంలో ఎంతమంది నాయకుల నుంచి సమాజాన్ని కాపాడవచ్చును?

ఈ దేశంలో మహిళల రిజర్వేషన్ లాగా, దేశస్థాయిలో లోకాయుక్త లాగ, 49 ఓ ని శాసనం చేసే అవకాశం –పిల్లి మెడలో మరో పిల్లి గంట కట్టడం లాంటిది. సీబీఐ ని జేబులో పెట్టుకుని పార్టీల్ని బ్లాక్ మెయిల్ చేస్తూ, తమ అవినీతికి తామే నీతిసూత్రాల్ని నిర్దేశించే ఈనాటి నాయకత్వం 49 ఓ కి స్వాగతం పలుకుతుందనుకోవడం కొంతదురాశే. అందుకు 'లీడర్'లో నా పాత్రే సాక్ష్యం. తమని బర్తరఫ్ చేసే చట్టాన్ని తెలిసి తెలిసి వారే ఎందుకు చేస్తారయ్యా పిచ్చివాడా! అని ముఖ్యమంత్రిని నిలదీస్తుంది నా పాత్ర. ప్రభుత్వం చెయ్యలేని, చెయ్యని పనిని తలవొంచి చేయించే న్యాయస్థానం ఉండడం నేలబారు మనిషికి కొంత ఊరట. ఏనాటికయి నా ఈ దౌర్భాగ్యులనుంచి విముక్తి కలగదా అని ఒక ఆశ.

(మే 20, 2013)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (May 27,2013) Mudu Cheppula Kathalu మూడు 'చెప్పుల' కథలు

ఎన్.టి.రామారావు గారు 'దాన వీర శూర కర్ణ' మొదలైన చిత్రాలు చేసే రోజుల్లో చాలా బిజీ. నేనూ చాలా చిత్రాలకు రాసే రోజులు. రామారావుగారితో ఎప్పుడు చర్చలు జరపాలన్నా, కథ చెప్పాలన్నా, జరుగుతున్న కథకి సవరణలు వినిపించాలన్నా ఉదయం మూడు గంటలకు ఆయన దగ్గరకు వెళ్లాలి. బహుశా ఏ రెండుకో రెండున్నరకో లేచి, కాలకృత్యాలు తీర్చుకుని పట్టుపంచె కట్టుకుని ముందుగదిలో కూర్చునేవారు. చక్కని అగరొత్తుల పరిమళం ఆయన గదిలో గుప్పుమనేది. మేం వచ్చేసరికి శ్రీమతి బసవతారకం గారితో కూర్చుని పెద్ద గ్లాసులో టీ తాగేవారిద్దరూ. మేం వచ్చాక ఆవిడ వెళ్లిపోయేవారు లోనికి. బహుశా ఇద్దరూ కలిసిమాట్లాడుకునే అరుదైన క్షణాలు అవేనేమో. తర్వాత అయిదున్నర, ఆరయేసరికి మా చర్చలు పూర్తయేవి. మేకప్‌మాన్ పీతాంబరం వచ్చేవాడు. ఈలోగా వంటవాడు వచ్చి భోజనానికి ఏం చెయ్యాలో అడిగేవాడు. మేకప్ అయేసరికి తిరుపతి బస్సులు వచ్చేవి. వారందరినీ పలకరించి ఏ ఏడుగంటలకో లోనికి వెళ్లి సుష్టుగా భోజనం చేసి –ఓ గంట నిద్రతీసేవారనుకుంటాను. దాదా పు ఇదీ దినచర్య. అంతక్రమశిక్షణ, కర్తవ్యదీక్ష నభూతో నభవిష్యతి.

ఇప్పుడు చెప్పుల కథ. ఆనాటి చర్చలు పూర్తయాయి. ఇద్దరమే ఉన్నాం. ఇద్దరం లేచాం. ఆయన పౌరాణిక గెటప్‌తో సిద్ధంకావాలి. పీతాంబరం పక్క గదిలో సిద్ధంగా ఉన్నాడు. ఇద్దరం బయటికి వచ్చాం. నేనింక బయలుదేర వచ్చునని ఆయన సూచన. కాని నేను కదలను. వెళ్తే లోపలికి – మేకప్‌కి వెళ్లాలని ఆయన ఉద్దేశం. నేను కదలడం లేదు. కాలయాపనకి ఏవో చిల్లర కబుర్లు జరుగుతున్నాయి. ఇక ఉండబట్టలేక "పదండి. టైమవుతోంది మీకు" అన్నారు. అప్పుడిక నాకు చెప్పక తప్పలేదు. "మీరు నా చెప్పులు తొడుక్కున్నారు" అన్నాను. అప్పుడాయన చూసుకుని నవ్వుకున్నారు. విప్పి నాకిచ్చారు. బయలుదేరాను. ఆయనకీ ఎంత లేదన్నా నిద్రమత్తు ఏ కాస్తో మిగిలే సమయమది. ఈ సంఘటన గుర్తొచ్చినప్పుడల్లా నవ్వొస్తుంది.

రెండో కథ. చెన్నైలో మొన్ననే జరిగింది. సంగీత కచ్చేరీకి వెళ్లాను. కొన్ని సభలవారు చెప్పులతో లోనికి రాకూడదంటారు. మైలాపూర్‌లో ఈ సభ అలాంటిది. చెప్పులు బయట వదిలివెళ్లాను. తీరా కచ్చేరీ అయాక బయటికి వస్తే నా చెప్పులు లేవు. ఎవరో తొడుక్కుని వెళ్లిపోయారు. పొరపాటా? దొంగతనమా? ఏదైనా ఇబ్బందే. చెప్పులు లేకుండా కారెక్కాను. తెల్లారితే అమెరికా ప్రయాణం. కొత్త చెప్పులు ఉదయమే కొనుక్కున్నాను. మరునాడూ అక్కడే కచ్చేరీ. నా విమానం రాత్రి మూడింటికి. కచ్చేరీకి వెళ్లాను. బయట వదిలిన చెప్పుల్లో నా చెప్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆనందంగా తొడుక్కుని కారెక్కాను. మరి ఈనాడు కొనుక్కున్న చెప్పులు ఎక్కడున్నాయి? కొత్త చెప్పులు నిన్నటిలాగే పోతాయని కారులో వదిలేశాను. కనుక నా చెప్పులు తొడుక్కోవడం నాకు అనువైంది. ఇక్కడో మీమాంస. నిన్న నా చెప్పులు తొడుక్కుపోయిన పెద్దమనిషి పొరపాటు చేశాడా? తను తొడుక్కున్న చెప్పులు గుర్తు పట్టలేకపోవడం నమ్మశక్యం కాని విషయం. కావాలనే దొంగతనం చేస్తే –ఇవాళ్టి కచ్చేరీ మళ్లీ అతన్ని ఇక్కడికి తీసుకొచ్చింది. 24 గంటలు నా చెప్పులు నాకు దూరమయాయి. ఒక్కటి మాత్రం నిజం. నిన్న నా చెప్పులు వేసుకెళ్లిన కారణంగా తన చెప్పులు బయట వదిలేసి పోయుంటాడు. ఆయన చేసింది దొంగతనమే అయితే ఇప్పుడు ఈ చెప్పులూ పోయాయి. తనవి నష్టపోవడం శిక్ష. పొరపాటయితే (కాస్త నమ్మశక్యం కాకపోయినా) పొరపాటుకీ ఇదే శిక్ష. తనవి పోగొట్టుకోవడం. ఏమయినా దొంగని కూడా సంగీతం మీద అభిరుచి మళ్లీ ఇక్కడికే తీసుకొచ్చింది.ఇది చెప్తున్నప్పుడు నాకెప్పుడూ గుర్తొచ్చే గొప్ప కథ ఒకటుంది. సర్కసులో కళ్లకు గంతలు కట్టుకుని




ఎదురుగా అమ్మాయిని నిలబెట్టి –ఆమె చుట్టూ కత్తులు –ఆమెకు తగలకుండా విసిరే గొప్ప ఫీట్ చేసే ఒక గారడీవాడున్నాడు. ఎదురుగ్గా బల్ల దగ్గర నిలబడేది తన భార్య. ఏనాడూ అతని విద్య గురితప్పలేదు. దరిమిలాను అతని భార్య మరెవరితోనో సంబంధం పెట్టుకుందని విన్నాడు. కోపంతో, పగతో విలవిలలాడిపోయాడు. ఆమెని చంపాలనుకున్నాడు. ఆ పని అతనికి సులువు. ఒకరోజు ఒక్క కత్తి గురితప్పితే చచ్చిపోతుంది. గారడీలో పొరపాటుని ఎవరయినా అర్థం చేసుకోగలరు. కాని పది సంవత్సరాలపాటు మనస్సులో అగ్ని వున్నా, పగ వున్నా ఆ పని చెయ్యలేకపోయాడు. కారణం –అతను గొప్ప కళాకారుడు. మనస్సులో పగకూడా అతని కళలో అపశృతిని కల్పించలేకపోయింది. మనస్సులో స్పర్ధ ఉంది కాని,ప్రయత్నించినా తన కళలో కళంకాన్ని తెచ్చుకోలేకపోయాడు.చెప్పులు ఎత్తుకుపోయిన దొంగ నిజంగా దొంగయితే కర్ణాటక సంగీతాన్ని విడిచిపెట్టలేని వాడు. కారణం –తను పొరపాటు చేసినా అభిరుచి మళ్లీ అతన్ని అక్కడికి తీసుకొచ్చింది. కనుక చెప్పులు నష్టపోయాడు.

మూడో కథ. అద్భుతమైన వేదాంతాన్ని, జీవన దృక్పథాన్ని చెప్పుల ప్రసక్తిలో ముడిపెట్టిన కవి పద్యం. కవికోకిల దువ్వూరి రామిరెడ్డిగారు

"పానశాల" అనే పేరిట –ఉమర్ ఖయ్యాం రుబాయీలను తెనుగు చేశారు. ఒక పద్యం–

మునుపు మసీదు వాకిటను
ముచ్చెలు దొంగిలిపోతి, పాతవై
చినిగెను, నేడునున్ మఱల
చెప్పులకోసమే వచ్చినాడ నె
మ్మనము సెడంగ నియ్యెడ
నమాజొనరింపగ రాను నీవు చ
చ్చినయెడ వీడిపోయెదవు
చెప్పులవోలె నమాజు సైతమున్.

నా ఎస్సెల్సీలో (అంటే 59 సంవ త్సరాల కిందట) చదువుకున్న పద్యమిది!

**(మే 27, 2013)**

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (June 3, 2013) Chattaniki Kallu Levu చట్టానికి కళ్లు లేవు

మన దేశంలో చట్టానికి కళ్లు లేవు. కాని కాళ్లున్నాయి. కళ్ల ముందు జరిగిన సంఘటన ఆయినా ఎవరూ నోరెత్తరు. రాజధాని నగరం నడిబొడ్డులో ఒకాయన యిద్దర్ని రోడ్డు మధ్య నిలబెట్టి కారు ఆపి, తన మనుషుల్ని పిలిపించి చావగొట్టించడాన్ని– ఎంత లేదన్నా వందమంది చూసి వుండాలి. కాని మన పోలీసులకి ఫిర్యాదు కావాలి. దాని గురించి రిపోర్టు కావాలి. ఆ తర్వాత చర్య. ఈ ఆకృత్యాన్నిజరిపింది ఓ సినీ కథానాయకుడు. ఆయన మరో సినీ కథానాయకుడి కొడుకు. కాక– అయన కేంద్ర మంత్రి. ఆధికారం చట్టానికి గాజులు తొడుగుతుంది. తప్పు అధికారానిది కాదు. చట్టానిది. ఒకవేళ– ఓ నిస్సహాయుడూ, నిజాయితీపరుడూ ఆయిన పోలీసాఫీసరు చర్య తీసుకున్నాడనుకుందాం. ఏం చర్య తీసుకుంటాడు? మంత్రిగారి కొడుకయిన కథానాయకుడిమీద కేసుపెడతాడు, నడిరోడ్డు మీద మనుషుల్ని పెట్టికొట్టించాడని. రాష్ట్రంలో ఆయన పార్టీ మనుషులు "అన్యాయ'మంటారు. ఆఫీసరుకి పై అధికారులనుంచి ఫోన్లు వస్తాయి. ఇవన్నీ అతని నిజాయితీకి దన్నుగా నిలబడని పరిణామాలు. మరో వారం రోజుల్లో–వీలయితే ఇంకా త్వరగా–ఆతనికి బదిలీ అవుతుంది. అతని గురించి ఎవరూ పట్టించుకోరు. కొడుకు చదువు మధ్యలో ఆగిపోతుంది. పెళ్లానికి జరుగుతున్న వైద్యం నిలిచిపోతుంది. అంతకు మించి హైదరాబాదులో ఉండడం వల్ల కలిసి వచ్చే "కిట్టుబాట్లు' నిలిచిపోతాయి. నిజాయితీ ఎవడిక్కావాలి? ఈ దేశంలో ఎవరు అడగొచ్చారు? ఏ చట్టం– నిజాయితీపరుడయిన (ఒకవేళ అయితే!)పోలీసు వెనక నిలుస్తుంది? ఇవన్నీ సినీనటుడి కొడుక్కి తెలుసు. తెలియకపోయినా– తెలిసే వాతావరణంలో పెరుగుతున్నాడు. నడిరోడ్డు మీద తన విశృంఖలత్వాన్ని చెల్లుబాటు చేసుకునే యువకుడు ఏమవుతాడు? ఆ మధ్య రాజస్థాన్ లో జర్మన్ మహిళను రేప్ చేసి– రెండేళ్లు దక్షిణాదిన స్వేచ్ఛా జీవనం గడిపే ఏ మహంతిగారి కొడుకో అవుతాడు.

చట్టం కళ్లు ఏం చూడాలో, ఎలా చూడాలో, ఎంతవరకూ కళ్లు మూసుకోవాలో, ఈ దేశంలో అధికారం నిర్ణయించే 'జులుం'ఎటువంటి పరిణామాలకు దారితీస్తుందో, ప్రతి రోజూ మనం చూస్తున్నాం.

కోట్లు పెట్టుబడితో సాగే క్రికెట్ వినోదంలో లక్షలు ఆదాయాన్ని ఆవినీతితో సంపాదించే క్రీడాకారులూ, వాళ్లకి సినీ నటీమణుల్నిపరిచయం చేసే పెద్దమనుషులూ– యివన్నీ ఈ విష సంస్కృతిలో భాగం.

ఇప్పుడు మొన్ననే ఆమెరికాలో జరిగిన కథ. మేం కారులో విహార యాత్రకి వెళ్తున్నాం. ఉన్నట్టుండి కారాపాడు మామిత్రుడు. "పోలీసు. మీరెవరూ సీట్లో కదలకండి" అన్నాడు. ఆయన చేతులు స్టీరింగు మీద పెట్టుకుని కూర్చున్నాడు. అతి మృదువుగా మాట్లాడే పోలీసు కిటికీ తలుపు కొట్టాడు. "87 మైళ్ల వేగంతో కారు వెళ్తోంది సార్!" అన్నాడు. "సార్!" మరిచిపోవద్దు.

భారతదేశంలో మంత్రిగారబ్బాయి ఏమంటాడు? "నీ కళ్లు నెత్తికెక్కాయా? ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా?" అని కదా? ఈ మిత్రుడు కిక్కురుమనలేదు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ అడిగాడు. తన కారుదగ్గరికి వెళ్లి ఒక చీటీ రాసిచ్చి "జాగ్రత్తగా వెళ్లండి సార్! కారులో పసిబిడ్డ కూడా ఉంది" అన్నాడు పోలీసు. తప్పుకి జరిమానా వేశాడు. జరిమానాను మా మిత్రుడు అంగీకరించాడు. ఎవరికీ ఎవరిపట్లా అమర్యాద లేదు. మాటల్లేవు. శిక్షపడింది. నేరస్థుడు తలవొంచాడు. బస్. మా కారు కదిలిపోయింది.




"ఆయనతో మీ మాట చెప్పరేం?" అన్నాను.

"చెప్పి లాభం లేదు. ఏం చెప్పినా కోర్టులో చెప్పుకోవాలి– అంత సమయం ఉంటే. ఎవరికీ కోర్టుకెళ్లే తీరిక ఉండదు. జరిమానా కట్టేస్తాం" అన్నాడు.

"మరి మమ్మల్ని కదలొద్దన్నారేం?" అడిగాను.

"మనం కదిలినా, కారు దిగే ప్రయత్నం చేసినా పోలీసు రివాల్వర్ తీస్తాడు. మన కారులో ఏం వుందో, మనమెవరమో అతనికి తెలీదుకదా?" అన్నాడు.

మరి హైదరాబాదులో సినీనటుడి కొడుకుని దేశానికంతటికీ తెలుసుకదా? ఇద్దర్నీ చావగొట్టడం అందరూ చూసిన సాక్ష్యం ఉందికదా? వాళ్ల చేతుల్లోనూ చట్టం, అయుధాలూ ఉన్నాయికదా? అయితే మనది భారతదేశం కదా! అంతే తేడా.

ఓసారి అమెరికాలో ఒక కారుని అపాడట పోలీసు. అది బుష్షు దొరగారి కూతురుకారు. పాపం, ఆ అమ్మాయి– అక్కడికీ తెలుగు సంస్కృతితోనే "నేనెవరో తెలుసా?" అందిట.

"అది తర్వాత చెప్దువుగాని– ముందు లైసెన్సూ, ఇన్స్యూరెన్సూ చూపించు" అన్నాడట పోలీసు.

అన్నీ చూసి "ఇప్పుడు చెప్పు నువ్వెవరివో" అన్నాడు.

"నేను అమెరికా ప్రెసిడెంటుగారి కూతుర్ని " అంది ఆ అమ్మాయి.

పోలీసు చెక్కుచెదరలేదు. "అయితే చట్టాన్ని గౌరవించే బాధ్యత నాకన్నా నీకే ఎక్కువ వుంది. సాధారణంగా ఇటువంటి నేరాలకి 200 డాలర్ల జరిమానా. నువ్వు ప్రత్యేకమైన వ్యక్తివికనుక నీకుమరో 50 డాలర్లు వడ్డిస్తున్నాను" అన్నాడట.

ఇలాంటి మాట మన దేశంలో ఎవరికయినా అనే దమ్ముందా? అనే ప్రయత్నమయినా చేస్తారా? అని నెగ్గుకురాగలరా? అమెరికాలో పోలీసు వ్యవస్థకీ, అధికార యంత్రాంగానికీ సంబంధం లేదు. పోలీసు ఎవరికీ భయపడడు. అవినీతికీ, నిర్భయత్వానికీ మాత్రమే సంబంధం. అమెరికాలో పత్రికలన్నీ ఈ పోలీసుని నెత్తిన పెట్టుకుని ఊరేగాయి. అతని ఫొటోల్ని విరివిగా ప్రచురించాయి. మన దేశంలో దవాలా బంట్రోతు దగ్గర్నుంచి, గవర్నమెంటు ఆఫీసులో గుమాస్తా దగ్గర్నుంచి, సోనియా గాంధీ వరకూ ఒకే మాటమీద నిలబడతారు– అవినీతి.

గీతాకారుడి వాక్యం ఒకటుంది. ""సమాజంలో పెద్దవాడు ఏ పనిచేస్తే చిన్నవాడూ ఆయన్నిఅనుకరిస్తాడు" అని. మన దేశంలో మంత్రిగారి సినీహీరో కొడుకు చాలు– అవినీతిని ఆయుధం చేసుకోడానికి.

(జూన్ 3, 2013)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (June10,2013) Vidya Vyaparam – 1 విద్యా వ్యాపారం – 1

విద్యా వ్యాపారం ఒక విషవృక్షం. దీనికి మూలాలు ఎక్కడో ఎప్పుడో పడ్డాయి. ఈ తరంలో ఉపాధికీ, మంచి జీవనానికీ, సంపాదనకీ, కులాల వికాసానికీ, భాష సర్వ నాశనం కావడానికీ, అన్నిటికీ మించి చదువులు కార్పొరేట్ వ్యాపారం కావడానికీ –అన్నిటికీ పునాదులు ఏర్పడి తేలికగా నూటపాతిక సంవత్సరాలయింది. "అన్నీ మన వేదాల్లోనే ఉన్నాయిష!" అని అనుకోవలసిన రోజులు. నాకు తెలిసింది, తెలిసినంత మట్టుకు విన్నవిస్తాను.

సాహిత్యం చరిత్రకు రుజువులు సిద్ధపరుస్తుంది. చరిత్ర గోత్రాలు సాహిత్యంలో దొరుకుతాయి. 1897లో ప్రచురితమయిన గురజాడ 'కన్యాశుల్కం' –ఈనాటి పరిణా మాలకు ప్రారంభ సూచికలని అందజేస్తుంది. గిరీశం వెంకటేశంతో కలిసి వాళ్ల ఊరు వచ్చినప్పుడు అగ్నిహోత్రా వధాన్లు భార్య వెంకమ్మ "బాబూ –యేదీ, మా అబ్బాయీ మీరొక్క పర్యాయం ఇంగిలీషు మాట్లాడండి బాబూ" అని అడుగుతుంది. పర్యవసానం 'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్..' అంటూ చేసిన మోసం. ఇంగిలీషు మోజు అప్పటికే ప్రారంభమయిపోయిన రోజులు. వీళ్లని నోరెళ్లబెట్టి చూస్తున్న మరో కుర్రాడు –కరటక శాస్త్రి శిష్యుడు –"మృగా ప్రియాళు దృమమంజరీణాం" ఎవడిక్కావాలి –యీ చదువిక్కడితో చాలించి గిరీశం గారి దగ్గర నాలుగు ఇంగిలీషు ముక్కలు నేర్చుకుంటాను –అని ఉవ్విళ్లూరిపోతాడు.

ఎందుకు ఇంగ్లీషు మీద మోజు? కొత్త ఒక వింత అని మాత్రమే కాదు. కుంపిణీ వారు (ఇస్టిండియా కంపెనీ) మన దేశంలో కాలుమోపి అప్పటికే 130 సంవత్సరాల యింది. నిలదొక్కుకుని –వారి పాలన, వారి విధానాలు, వాటి ప్రభావం పల్లె పల్లెకీ ప్రాకడానికి చాలా సమయం పట్టింది. అంతకు ముందున్న వృత్తులు మారిపోయాయి. ఉద్యోగాలు మనవారికి తెలియవు. గ్రామం ఒక సమిష్టి జీవన కుటుంబంగానే ఉండేది –వాటిలో లోటుపాట్లు ఎలా వున్నా. చదువులు, ఉద్యోగాలు, బోనస్‌లూ, జీతాలూ, ప్రమోషన్లు –యిలాంటివి కొత్త. మించి –జన జీవనాన్ని ప్రభావితం చేసే ఎన్నో మార్పులు –దొరల పద్ధతులు వచ్చా యి. (అవి ఎన్నో మేళ్లనూ చేశాయి. మనం చర్చించేది మార్పు కనుక ఆ విషయాన్ని కాసేపు పక్కన పెడదాం) మారిపోతున్న సామాజిక, ఆర్థిక వ్యవస్థలో తెలుగు, సంస్కృతం చదువులు వెనకబడి ఇంగ్లీషు చదువు అవసరం, తత్కారణంగా దానిపట్ల మోజు గ్రామాలలో స్థిరపడుతున్న –తొలిరోజులవి. ఇంగ్లీషు వచ్చిన కారణం గానే అగ్నిహోత్రావధాన్లు గిరీశాన్ని తన ఇంట్లో ఉండనిచ్చాడు. కారణం? "డబ్బు కానీ ఖర్చులేకుండా వీడిచేత కాగితం ముక్కలన్నీ తర్జుమా చేయించేస్తాను" అనుకున్నాడు స్పష్టంగా. ఏమిటా కాగితం ముక్కలు? కోర్టు కాగితాలు. అప్పటికే కోర్టు వ్యవహారాల్లో ఇంగ్లీషు అవసరమూ, తప్పనిసరికావడమూ మొదలయింది. అంత కుముందు చదువులంటే –మళ్లీ అగ్నిహోత్రావధాన్లు మాటల్లోనే 'కానీ ఖర్చు లేకుండా గురువుగారి ముఖత: వే దం నేర్చుకో వడం'. దానివల్ల ఉపయోగం? ఇది ముఖ్యం –చదువు ఉపయోగానికి, వినియోగానికి, ఉద్యోగానికి, సంపాదనకి, జీవనాన్ని మరింత సుఖమయం చేసుకోడా నికి, ఆస్తులు పెంచుకోడానికి కానేకాదు. ఆ రోజుల్లో చదువుకీ, వీటికీ ఏమీ సంబంధం లేదు. విద్య ఉపాధికి కాదు. విజ్ఞానం అమ్ముకోడానికి కాదు. వికాసానికి. ధర్మాన్ని నిలుపుకో డానికి. సరే.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

ఇంగ్లీషు పరిపాలనలో కోర్టు వ్యవహారాలన్నీ ఇంగ్లీషులో నడవడం ప్రారంభమయి చాలా రోజులయిం ది అప్పటికే. కోర్టు వ్యాజ్యాలకి ఆస్తులు తగలెట్టుకోవడం, వాటి పద్ధతులు తెలియని –ఇంగ్లీషు రాని వాళ్లని –ఏ కాస్తో ఇంగ్లీషు వచ్చినవారు నంచుకు తినడం ప్రారంభమయి పోయింది. 'కన్యాశుల్కం' నాటకమం తా వెధ్వల్ (కోర్టులు), ప్లీడర్లు, కోర్టు కేసులు, సాక్షులు, దావాలు –యిదే వ్యవహారం.

"నాకు ఇంగ్లీషు తెలియకపోవడం చాలా చిక్కొచ్చింది" అని వాపోతాడు అగ్నిహోత్రావధాన్లు.

"మీకే ఇంగ్లీషు వొస్తే భాష్యం అయ్యంగార్లా అయిపో రా?" అంటాడు గిరీశం.

ఎవరా భాష్యం అయ్యంగారు? అప్పటికి పేరు మోసిన న్యాయవాది –సంయుక్త మద్రాసు రాష్ట్రంలో.

జనజీవనాన్ని 'ప్రయోజనం' పెట్టుబడిగా, ఆవశ్యకత మూలకారణంగా –ఉపాధికోసం, ఉద్యోగాల కోసం కొత్త చదువుల అవసరం, గిరాకీ, మోజు, నేర్చుకో వాలన్న ఆర్తీ పెరిగింది –మరో అడుగు ముందుకువేసి అర్థం చేసుకుంటే –నేర్చుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. కన్యాశుల్కం నాటికి చదువు బాగా సాధించానని గిరీశం బుకాయించినా, పద్ధతిగా చదువుకున్న సౌజన్యారావు పంతులదే పైచెయ్యి.అంటే –మనకి తెలిసి –116 సంవత్సరాల కిందట ఆనాటి జనజీవనానికి ఇంగ్లీషు పునాది అవుతున్న రోజులు. నిస్సహాయంగా ప్రతీవాడూ తనకి తెలియని భాష వేపు తను ఆశించే జీవనానికి అర్రులు చాస్తున్న రోజులు.

116 సంవత్సరాల తర్వాత –2013లో ఇంగ్లీషు చదువులు చదువుకుని, గొప్ప ఉద్యోగాలు చేసి, కోరి అమెరికాలోనే పిల్లల్ని కని, పిల్లలకి అమెరికా పౌరసత్వాన్ని పుట్టుకతోనే సంపాదించిపెట్టినందుకు గర్వపడి ఆనందించే తరాన్ని మనం ఇప్పుడు చూస్తున్నాం. పదేళ్లు గా అమెరికాలో ఉంటున్న తన కూతురు కొడుకు (మనుమడు) తెలుగులో మాట్లాడడం అస్సలు రాకపోతే –ఆ పసివాడితో మాట్లాడడానికి నా తమ్ముడి భార్య ఇప్పుడి ప్పుడు ఇంగ్లీషు పాఠాలు నేర్చుకుంటోంది –ఇంగ్లీషురాని బ్రాహ్మణా గ్రహారం –గంగలకుర్రు అమ్మాయి. ఆనాటి వెంకమ్మకి కుర్రాడు ఇంగ్లీషు మాట్లాడితే మోజు. ఈనాటి సూరమ్మకి మనుమడు తెలుగు మాట్లాడితే అపురూపం! విచిత్రం! శ్రీపాదవారి కాలంలో తెలుగు చదువుకోవ డం నిషిద్ధం. ఆయనకి మనుచరిత్ర చదువు కోవాలని ఉంటే ఉపాధ్యా యుడు పాఠం చెప్పడానికి నిరాకరించాడు. మనుచరిత్ర చదువుకుని చెడిపోతాడని తండ్రి బాధపడ్డాడు. ఆ రోజుల్లో సంస్కృతం చదువు కోవడం సంప్రదా యం. తరువాత కొంతకా లం –తెలుగు. అటు తర్వాత ఇంగ్లీషు చదువు అవసరం. ఆనాటి సంస్కృతం చదువు కేవలం ధర్మనిష్టకి. ఇంగ్లీషు చదువు కేవలం –ఉపాధికి.

మార్పు అవసరాన్ని ఒరుసుకుని జీవనాన్ని పెనవేసుకుంది. ఉపాధి దాని మూలకారణం. మంచి జీవితం లక్ష్యం. కొందరికి –ఆ రోజుల్లో మనగలగడం లక్ష్యం. ఆనాడు ఇంగ్లీషు నేర్చుకోడానికి తాపత్రయపడే దశ ఇప్పుడు తల్లి భాషని బతికించుకోవాలనే యావ. ఏ కాస్త మాట్లాడినా అదృష్టం. కనీసం మనవలతో ఏ కాస్త వాళ్ల కొచ్చిన భాషలో ముచ్చటించగలిగినా ఆమెకి ఆనందం.

ఒక శతాబ్దం కిందట –పాలక వ్యవస్థ మనకిచ్చిపోయిన పాశ్చాత్య జీవన విధానంలో వొదగడానికి అతలాకుతల మయి –తమకు తెలియకుండానే –లేదా ఏ కాస్తో, ఏ కొద్దిమందికో తెలిసినా (కరటక శాస్త్రి శిష్యుడిలాగ) భాషని అటకెక్కించి –అవసరాన్ని అటక దించడంలో –

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

పూర్తి పరాకాష్టని సాధించిన దశ ఈనాటిది. ఇప్పుడు మన యావ తెలుగుని ఉద్ధరించడం. అది బలహీనపు యావ అనుకుం దాం. ఉపాధి కారణంగా అమెరికాలో మాయమయి –శాశ్వతంగా కుటుంబం నుంచి నిర్ధాక్షిణ్యంగా తెగిపోతున్న రెండోతరాన్ని నిస్సహాయంగా మరిచిపోతున్న పరిస్థితి. మా బంధువు –ఒకాయన ఇద్దరు పిల్లలూ నల్లబ్బాయిల్ని పెళ్లి చేసుకున్నారు. అమెరికాలో పెరిగే ఏ పిల్లలూ తెలుగు మాట్లాడరు. ఆ కారణంగా తెలుగువారితో కలవరు. వాళ్లకి తెలుగుదేశం తెలీదు. తెలియాల్సిన అవసరం తెలీదు. నిన్ననే! –కేవలం నిన్ననే –మా తమ్ముడి మనుమడు –నన్ను ఇంగ్లీషులో అడుగుతు న్నాడు –"మా అమ్మని (అంటే నా తమ్ముడి కూతుర్ని) నీకెలా తెలుసు?" అని!! వీడు తన కుటుంబానికి దూరమవడం ప్రారంభించి అయిదేళ్లయింది. వాడి వయస్సు అయి దు. ఉగ్గుపాలతో ఈ భ్రష్టత ప్రోదవుతోంది.

(ఇది 'విద్యా వ్యాపారం' శీర్షికలో కేవలం మొదటి భాగం.)

(జూన్ 10, 2013)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (June17,2013) Vidya Vyaparam – 2 విద్యా వ్యాపారం – 2

వ్యక్తిగతమైన, కేవలం కులం ప్రాతిపదికగా గల వృత్తుల నుంచి ఉద్యోగ వ్యవస్థవేపు క్రమంగా భారతదేశపు సమాజం పరిణామం చెందింది. ఉద్యోగం ద్వారా సంపాదించుకునే ఆదాయం, తద్వారా కుటుంబ నిర్వహ ణ, భవిష్యత్తులో కుటుంబ భద్రత –ఈ దిశగా ప్రయాణం చేసింది. ఇది దాదాపు శతాబ్దం పైగా సాగిన మార్పు. తరతరాలుగా అగ్రవర్ణాల పెద్దరికం కింద, అజమాయిషీ కింద, అణచివేత కింద నలిగిపోయిన వెనుకబడిన వర్గాలు –ఏనాడూ తమ స్థాయినుంచి విముక్తి గురించి ఆలోచిం చనయినా ఆలోచించలేని దశలో అలాంటి ఆశయాలకు, ఆలోచనలకు తావిచ్చిన మార్పు ఇది. ఎదుగూ బొదుగూ లేని గ్రామీణ జీవనం, చేతికీ నోటికీ దారి వెదుక్కుంటూ జీవించే గంగిరెద్దు జీవితం వీటినుంచి బయటకి చూసే వెసులుని ఈ వ్యవస్థ కల్పించింది. ఇది పెద్ద గుహ చివర కనిపించిన చిన్న వెలుగు. మార్పుకి సంకేతం. కాగా గత 65 సంవత్సరాలలో వెనుకబడిన వర్గాలకు కల్పించిన వెసులుబాట్లు ఈ సంకెళ్లను పూర్తిగా తెంచేశాయి.

తరతరాలుగా అభివృద్ధి నెరగని బడుగు కుటుంబాలు ఒక్కసారి వొళ్లు విరుచుకున్నాయి. గ్రామం లో ఆస్తుల్ని అమ్ముకుని అయినా, తల తాకట్టు పెట్టి అయినా –ఒక్క వ్యక్తికయినా ఉద్యోగాన్ని కల్పించే మార్గంగా ప్రయాణం చేశాయి. కుటుంబ వికాసానికి హఠాత్తుగా ఏర్పడిన అవకాశాన్ని అందుకోడానికి అడ్డదారిన హుటాహుటిగా ప్రయాణం చేసిన సందర్భమది. ఆదినుంచి ఆకాశాన్ని అందుకునే ప్రయత్నమది. ఆశ్చర్యమూ లేదు. ఆక్షేపణా లేదు. చదువురాని ఇంటిపెద్ద కేవలం మంచి జీవితం వేపు మోర సారించిన తరుణమది. తరాలుగా మ్రగ్గినవర్గాలు ఒక్కసారిగా వొళ్లు విరుచుకున్న సందర్భ ఁమది. ఆతృతగా, ఆశగా లక్ష్యం వేపే వాళ్ల దృష్టి. వాళ్ల పిల్లలు ఏం కావాలో వాళ్ల మనస్సుల్లో లక్ష్యాలున్నాయి. మంచి ఉద్యోగం, మంచి ఆదాయాన్నిచ్చే, తమ కుటుంబ సరళిని మార్చేసే విముక్తి. దానికి ఒకటేదారి. ఇంగ్లీషు చదువు. సాంకేతిక, శాస్త్రీయ వ్యాపార రంగాల్లో ఇప్పటికీ ఒక్క ఇంగ్లీషు చదువే అవకాశాల్ని కల్పించే కల్పతరువు. (భాష, దేశభక్తి –యివన్నీ చదువులేని ఆ తల్లిదండ్రులకు తెలియని విషయాలు). పిల్లలకి ఇంగ్లీషు చదువులు చెప్పించాలి. తమ లక్ష్యాల దిశగా పిల్లల్ని నడిపారు. ఎందరో మెట్లన్నీ ఎక్కి అంతర్జాతీయంగా తమ సత్తాని చాటారు. భారతీయ శాస్త్రరంగంలో అంతర్జాతీయ స్థాయికి చేరిన యలమర్తి నాయుడమ్మ ఒక మామూలు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి. సామాజిక ప్రగతికి తన వృత్తిని అంకితం చేసిన డాక్టర్ సదాశివరావు వంటివారు ఎందరో ఉన్నారు. ఇవన్నీ కొన్ని ఉదాహరణలు. మరో గొప్ప ఉదాహరణ. రెండున్నర ఎకరాల కుటుంబం నుంచి వచ్చి నిమ్మకూరు నుంచి సైకిలు మీద పాలు విజయవాడకి తెచ్చి ఇళ్లకీ, హోటళ్లకీ పోసి చదువుకున్న మరొక ఆసామీ ఉన్నారు. ఆయన పేరు నందమూరి తారక రామారావు.

సంకెళ్లు తెగిపోయాయి. వేదాన్ని నమ్ముకున్న కుటుంబాలూ ఉద్యోగాలవేపు పిల్లల్ని మళ్లించాయి. మొన్నటికి మొన్న ఒక వేదపండితుడు –తన జీవనం వేపు తన బిడ్డల్ని నిలపడం ఇష్టం లేక కుటుంబ నియంత్రణ చేయించుకున్నానని నాతో చెప్పారు. పేరు అనవసరం. న్యూ ఆర్లీన్సులో –దాదాపు 23 సంవత్సరాల కిందట –ప్రదర్శనలు ఇచ్చి నేనూ, జె.వి.సోమయాజులు, పద్మనాభం, తులసి ఎయిర్‌పోర్టుకి ఒక డాక్టరుగారి కారులో వస్తున్నాం. ఆయన ఘంటశాల పాటలు పెట్టారు. ఉన్నట్టుండి "నేను మా నాన్నని క్షమించలేను మారుతీ రావుగారు!" అన్నారు. ఈయన పేరుమోసిన డాక్టరు. భార్యా ఆయనా అక్కడ మంచి క్లినిక్ నడుపుతున్నారు.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

ఆయన చెప్పుకొచ్చారు. "మావూళ్లో –కుటుంబాల్లో పిల్లల్ని తలో, పొలమో తాకట్టుపెట్టి అమెరికా పంపించా లన్న ముమ్మరంలో మా నాన్నా నన్ను ఇక్కడికి తరిమా డు. ఇక్కడ ఆర్థికంగా నిలదొక్కుకున్నాను. కాని నా మనస్సుని మన దేశంలో పారేసుకున్నాను" –అన్నారు.

అవును. తరతరాల బడుగు జీవితాల నుంచి విడివడే ముమ్మరంలో ఎవ్వరూ ఏ బిడ్డ ఆలోచనలకీ తావివ్వలేదు. ఆనాడు ఆర్థిక వికాసానికే ప్రాధాన్యం. అవకాశం ఉంటే కళారంగంలోనో, మరో రంగంలోనో రాణించగల ఎందరో విదేశీ తెలుగువారిని తెలుసు నాకు. డిట్రాయెట్‌లో డాక్టర్ వామరాజు మూర్తి, కెంట్ (ఇంగ్లండు)లో డాక్టర్ వ్యాకరణం రామారావు, డాక్టర్ నాగభైరు అప్పారావు, విగాన్‌లో డాక్టర్ కె.వివేకానంద మూర్తి, అబూదాబీలో డాక్టర్ కోడి రామారావు –యిలా. మీరు క్షమిస్తే యిప్పుడూ అదే పరిస్థితి. పిల్లల్ని మంచి జీవితం వేపు తరిమే పెద్దల –చదువుల కొనుగోళ్లు. అందుకే –చదువుల్లో సరదాలు పోయాయి. పోటీలు, డిప్రెషన్లు, ఆత్మహత్యలూ –ఇదో కొత్త దశ. అయితే యిదొక ఉద్యమం. ఆ కుటుంబాల పరంగా చూసినప్పుడు సంకెళ్లు తెంచుకున్న ఆవేశంలో దారితప్పిన కొన్ని ఉదాహరణలు. అదొక వెల్లువ. ఇందులో –ఈ తరం కుటుంబాలు చెల్లించిన మూల్యం –భాష, తెలుగుదనం. సమాజం చెల్లించిన మూల్యం –బ్రెయిన్ డ్రెయిన్. చదువులు మన దేశంలో, ఫలితం మరొక దేశంలో.

ఇప్పుడిప్పుడు –ఇది పరిణామం కాదు. అప్పుడు వందల డాక్టర్లు వెళ్లారు. ఇప్పుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. అప్పుడది మార్పు. ఇప్పుడు? మంచి జీవితానికి అర్రులు. తన కొడుకు బాగుపడాలి. అంటే ఏం కావాలి? ఫస్టుక్లాసు రావాలి. 98 శాతం మార్కులు రావాలి. అమెరికా ఉద్యో గం రావాలి. లక్షలు సంపాదించాలి. మరొక ముఖ్య కారణం –నానాటికీ చెదలు పట్టి, అవినీతితో కుళ్లిపోతున్న ఈ వ్యవస్థ నుంచి విముక్తి. ఈ మాట నాతో ఎందరో అన్నారు. ఇక్కడ ఉండాలని ప్రయత్నించి, ఈ అవినీతికి షాక్ అయి అమెరికా పారిపోయిన నా ఆనర్స్ సహచరుడు, శాస్త్రవేత్త –కృష్ణమాచారి. కేవలం జీవన సాయంకాలం గడపడానికి మళ్లీ అమెరికాకి మళ్లిపోయాడు.

అతినేలబారు జీవితం గడిపిన ఓ రైతు కొడుకు –లేదా ఓ మామూలు కులవృత్తి చేసుకుంటున్న వ్యక్తి కొడుకు –అమెరికాలో అనూహ్యమైన కొత్త జీవన ప్రణాళికని ఏర్పరుచుకుంటాడు. కారు, తన యిల్లు, పరిశుభ్రమయిన జీవితం, కంపుకొట్టే నీచపు రాజకీయాలు లేని వ్యవస్థ. సంపాదించే ప్రతీ డాలరూ ఇక్కడ 50 రెట్లు ఫలితాన్నిస్తుంది. చేసిన కృషి –ఏనాడూ ఎరగని తన తల్లిదండ్రులకి సుఖాన్ని కొనిపెడుతుంది. అతను భాష తగలడిపోతోందని గింజుకునే తెలుగువాడు కాదు. తరాల దాస్యం నుంచి ఈ తరంలోనే బయటపడి వెలుగు చూస్తున్న వాస్తవాన్ని ఎరిగిన మనిషి. తన తమ్ముడికి చదువు చెప్పిస్తున్నాడు. చెల్లెలికి పెళ్లి చేస్తున్నాడు. తల్లి జబ్బుకి వైద్యం చేయిస్తున్నాడు. ఆ దేశపు చట్టానికి వొదిగి –ఎవరి ప్రమేయం లేకుండా హాయిగా బతుకుతున్నాడు. ఇక్కడ ఆధార్ కార్డుకి లంచం. పన్ను కట్టడానికి లంచం. కట్టకుండా ఎగవేసే లంచం. కొడుకుని స్కూల్లో చేర్చాలంటే లంచం. బదిలీ కాగితం చేతికి రావాలంటే లంచం. ఆసుపత్రికి గుండె తణిఖీకి వెళ్లాలంటే లంచం. ఎందుకీ దరిద్రపు, కుక్కబతుకు? ఇవి నా మాటలు కావు. అక్షరాలా నేను విన్న మాటలు. నామిత్రుడు –ఓ అతి మామూ లు గుమాస్తా కొడుకు. వీడూ గుమాస్తాయే. వీడి కొడుకు అమెరికా వెళ్లాడు. ప్రతి మూడేళ్లకీ 20 రోజులు వస్తాడు. ప్రతివారం గంట మాట్లాడుతాడు. వాడి కొడుకుకి తెలుగురాదు. నేను అడిగాను. నా మిత్రుడి సమాధానం: "నాతరంలో వాడు అనుభవించేవేవీ నేను చూడలేదు. అక్కడ వాడయినా సుఖంగా ఉంటాడు". ఇది గొప్ప నిస్త్రాణ. ఆ సౌకర్యాలు ఇవ్వలేని ఈ దేశంలో పరిస్థితులు ఎరిగిన ఒక తండ్రి తెగింపు.




ఈ దశగానే ఇప్పుడిప్పుడు కుటుంబాలన్నీ ప్రయాణం చేస్తున్నాయి. మంచి జీవితానికి మార్గం మంచి ఉద్యోగం. మంచి ఉద్యోగానికి పెట్టుబడి – మంచి చదువు. మంచి చదువంటే? బాలశిక్ష, మనుచరిత్రకాదు. ఇంగ్లీషు చదువు. సాంకేతికంగా, వ్యాపార రంగంలో ప్రగతికి మన బాష ఏ కొద్దిగానయినా పనికిరాదు. అవసరమైన ఒకే ఒక భాష –ఇంగ్లీషు.

పాలస్థినా, కొరియా వంటి చిన్నదేశాలు –ప్రపంచంలోని అన్ని సాంకేతిక విలువలనూ తమ బాషలోకి తెచ్చుకున్నారు. కొరియా ఇవాళ అణ్వస్త్రాలు తయారు చేస్తోంది. కొరియా మనుషులు అమెరికా ఉద్యోగాల్లో కనిపించరు. మన తల్లి భాష? గుమాస్తాగా మురుగుతున్న నౌకరీ చేసుకొనేవాడికి ఎందుకు? తన కొడుకు బాగుపడాలి. బాగు అంటే? మంచి ఆదాయం. డబ్బు. సుఖం. అంతే. మన విద్యా వ్యవస్థలో –ఎవరు ఆపినా ఆగని –ఆపలేని పెనుతుపాను –ఇంగ్లీషు చదువు. అప్పుడది విముక్తి. ఇప్పుడిది అవకాశం. మంచి జీవితానికి దగ్గర తోవ. కష్టపడి బిడ్డని చదివిస్తే, వాడు అమెరికా వెళ్లి మంచి ఉద్యోగం చేస్తే –లక్షలు గడిస్తే –ఇదే మామూలు సగటు మనిషి కల. మా పనిమనిషి రెక్కలు ముక్కలు చేసుకుని తన కూతురిని బీటెక్ చదివిస్తోంది. ఆవిడ పాచిపోయిన అన్నం తినదు. కూతురు తల్లికి సహాయం చెయ్యడానికి రాదు. అచిరకాలంలో ఆమెకూడా నా స్థాయిలోనే హాయిగా, డిగ్నిటీతో బతకగలదు. వ్యవస్థలో దృష్టి మారిపోతోంది.

ఇదిగో –ఈ నేపథ్యంలో చదువుల బజారుకి పునాదులు ఏర్పడ్డాయి. దాన్ని అవినీతి అందామా? పోటీ అందామా? మీ ఆశలకు మధ్యవర్తులు నిర్ణయించిన మూల్యం అందామా? వ్యాపారం నిలదొక్కుకుని –మీ ఆశలకు ఇప్పుడే ఖరీదుల్ని నిర్ణయించే సంస్థలు తలయెత్తాయి.

(ఇది విద్యావ్యాపారంలో రెండో భాగం మాత్రమే)

(జూన్ 17, 2013)




# (June 24,2013) Vidya Vyaparam – 3 విద్యా వ్యాపారం – 3

ఉద్యోగాలకోసం చదువులుసాగి, డిగ్రీలకు ఉద్యోగాలిచ్చే వ్యాపారం బ్రిటిష్ వారి ధర్మమాఅని ఆ రోజుల్లోనే మన దేశంలో ప్రారంభమయింది.. మనవాళ్లు మేధావులు. ఇప్పుడు చదువుల్నే వ్యాపారం చేసే బజార్లని విరివిగా, విశృంఖలంగా కొనసాగిస్తున్నారు.

దేశంలో వ్యాపారాల్లోకల్లా లాభసాటి వ్యాపారం– రాజకీయం. ఒక్క సారి పదవిలో ఉంటే ఎంత నొల్లుకోవచ్చో ఈ మధ్య చాలామంది నిరూపించారు. మంచి లాయకీ ఉన్న పెట్టుబడి పదవి. దానికి పెద్ద చదువులు అక్కరలేదు. వేలిముద్ర వేసే నిశానీకూడా మనకి మంత్రికాగలదు. మన మంత్రుల్లో ప్రస్థుతం జైలుకి వెళ్లినవారు, వెళ్తున్నవారు, వెళ్లవలసినవారూ చాలామంది ఉన్నారు. పార్లమెంటు సభ్యులు చాలామంది వారికోసం జైళ్లలో ఎదురుచూస్తున్నారు.

మన దేశంలో రాజకీయనాయకులు పదవిలోకి రాగానే చేసే మొదటిపని కాలేజీలు తెరవడం. రాజకీయం తరువాత వారికి అచ్చొచ్చే మరోవ్యాపారం–చదువు. మన దేశంలో కాలేజీలు లేని రాజకీయ నాయకులు దాదాపు లేరు. తాము ఏ కొద్దిగానో చదువుకున్నా– సంపాదనకి చదువులతో ప్రమేయం లేదని వారి జీవితాలే నిరూపిస్తున్నా– చదువుల మీద వీరికి ఇంత ప్రేమ ఎందుకు పుట్టుకొచ్చింది? రెండు కారణాలు. చదువుల వ్యాపారం లాయకీ అని వీరు గ్రహించడంవల్ల. నిజంగా చదువుల వల్ల తమ జీవితాలు, బిడ్డల జీవితాలూ బాగుపడతాయని, తద్వారా తమ కుంటుంబానికి మంచి రోజులు వస్తాయని నిజమైన అర్తితో ఉన్న తల్లిదండ్రులు ఈ సమాజంలో ఉన్నారని వీరికి తెలియడం వల్ల. వీరికి చదువుల బజారు చల్లని చలివేంద్రం.

ఇది చాలా లాభసాటి అయిన వ్యాపారం. డాక్టరు చదవడం వల్ల ఏం లాభం? రేపు ప్రాక్టీసు పెడితే లక్షలు గడించవచ్చు. మరి లక్షలు గడించే డిగ్రీకి ముందుగానే కొన్ని లక్షలు తమవాటాగా తీసుకునే టోకు వ్యాపారం ఈ చదువుల బజారు. కొన్ని కుటుంబాలలో డాక్టరు చదువుకున్న కుర్రాడికి లక్షలు కట్నం పలుకుతుంది. ఆ కట్నండబ్బు బజారులో పెట్టుబడి పెడితే– తర్వాత ప్రాక్టీసు అంతా కిట్టుబాటే కద? ఈ సూత్రాలు ఇలాంటి బజార్లలో సూచిస్తారు.

మన దేశంలో ఒక దిక్కుమాలిన నానుడి ప్రచారంలో ఉంది. వైద్యో నారయణో హరిః అని. వైద్యుడు దేవుడులాంటివాడు అనలేదు మన సంస్కృతి. సాక్షాత్తూ దేవుడే అంది. సుమతీశతకకారుడు కూడా "అప్పిచ్చువాడు, వైద్యుడు.." ఉన్న చోట ఉండమన్నాడు. ఏదీ? ఏ కార్పొరేట్ ఆసుపత్రిలో ఏ డాక్టరు తనకు తెలిసిన ఇద్దరు పేషెంట్ల పేర్లు చెప్పమనండి చూద్దాం. అదీ ప్రస్థుతం మన దేవుళ్ల కథలు. డిగ్రీకే లక్షలు పోసిన ఈ నిస్సహాయమయిన వైద్యుడు ఎందరి గొంతులు కోస్తే అ పైకం కిట్టుబాటవుతుంది?

చావుబతుకుల్లో ఉన్న 88 ఏళ్ల మా పినతల్లిని చూడడానికి ఇంటికి రావడానికి డాక్టరుగారు నిరాకరించారు. ఆమె లేచి నడవలేని పరిస్థితి ఆవిడది. వైద్యుడు ఏ దిక్కుమాలిన సమాజానికి దేవుడు? ఈ దేవుళ్లకి మానసికమైన కమిట్ మెంటు యిచ్చే చదువులు ఎవరయినా నేర్పితేకద!

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

తమిళనాడులో – ఆంధ్రదేశం గురించి రాసి నేను అల్లరిపాలు కావడానికి ఇష్టం లెదుకనుక– డాక్టరు చదువుకి కేవలం 75 లక్షలు యాజమాన్యానికి ముడుపు కట్టాలి. ఇక ఆ పై చదువులకి కోటీ పాతిక లేదా కోటిన్నర చెల్లించాలి. ఇంజనీరు చదువుకయితే 20 లక్షలు. మన రాష్ట్రంలో ఇంజనీర్లు తామర తంపరగా తయారవుతున్నారు ఏటేటా. కారణం ప్రతీ రాజకీయనాయకుడికీ ఒక్కో కాలేజీ ఉండడమే. అవసరానికి మించి డిగ్రీలు ఉత్పత్తి అవుతున్నాయి–గమనించండి– ఇంజనీర్లుకాదు.

ఇక చిన్న చదువుల్లో వేలకి వేలు దోచుకునే రకరకాల చదువుల బజార్లు తయారయాయి. అలనాడు మా పిల్లల చదువులకి నెలకి రూపాయి చెల్లించాను సెంట్రల్ స్కూళ్లలో. రాష్ట్రానికంతటికీ మొదటిస్థానంలో నిలిచిన వారి ఫొటోలు లోగడ పేపర్లలో వేసెవారు. ఇప్పుడు 2000 బజార్లు. ప్రతీ కాలేజీలోనూ మొదటి స్థానాల్లో నిలిచిన 3500 బొమ్మలు. చదువుకున్న వయస్సులోనే పిల్లలకి కీర్తి దురదని ఎక్కించే ప్రయత్నం కాదిది. తల్లిదండ్రులకి మత్తు. ఈ పరుగులో తమ కొడుకూ ఉంటే ఎంత బాగుంటుంది అని. ఇలాంటి పని ఒకప్పుడు సినీమా రంగానికే లాయకీ. ఇప్పుడు ఈ స్కూళ్ల కుర్రాళ్ల ఫోటోలు కోకొల్లలు. తమ వ్యాపారానికి పెట్టుబడి.

రోజుకి 16 గంటల చదువులట. మా చిన్నతనంలో డిప్రెషన్, ఆత్మహత్యలు– ఇలాంటి మాటలకి అర్థం తెలీదు. చెడుగుడు, తొక్కుడు బిళ్ల, గుడు గుడు కుంచంలాంటి ఆటలు ఉన్నాయని ఈ కాలం కుర్రాళ్లకి తెలీదు. లోకజ్ఞానం లేని రూళ్ల కర్ర చదువులు లక్షలతో అమ్మే బజారులివి. తల్లిదండ్రులకి పిల్లల చదువులు తమ మంచి జీవితాలకి పెట్టుబడి. కార్పొరేట్ విద్యాసంస్థలకి చదువు వ్యాపారం. మొన్ననే ఓ మాజీ నిర్మాత– తన కొడుక్కి ఒక స్కూలులో తెలుగులో పాఠం చెప్తున్నారని భయపడి లక్షలు కట్టి ఇంగ్లీషు స్కూలుకి మార్చేశానని గర్వంగా చెప్పుకున్నాడు నాతో.

మన ప్రభుత్వానికి ఈ పరిణామం లో వాటా ఏమిటి? తెలుగునాట తెలుగు స్కూళ్లలో తెలుగు నేర్పనక్కరలేదని తేల్చింది. ఇదీ ప్రభుత్వం చేసిన ఘనకార్యం. బడులు నడిపేవారికీ, విద్యాశాఖ పెద్దలకీ– పోలీసు శాఖలాగే మాసికాలు, ముడుపులూ ఉంటాయట. ఈ మధ్య ఎవరో అంటున్నారు– మా రోజుల్లో ఇన్ని మార్కులు ఎరగమని. ఇప్పుడు 98 శాతం, 99.5 శాతం రావడం ఆశ్చర్యంకాదు. ఇందులో బజార్లకీ, పరీక్షాధికారులకీ, తర్వాత సీట్లు ఇచ్చే పై చదువుల సంస్థలకీ మధ్య ఒప్పందాలుంటాయట. ఆ రోజుల్లో ఒక్క లెక్కల్లో తప్ప ఎవరికీ ఏ సబ్జెక్టులోనూ 70 శాతం దాటి వచ్చే అవకాశం ఉండేదికాదు. ఇప్పుడు తెలివిమీరింది విద్యార్థులు కారు. విద్యని అమ్మే బజార్లు, కొనుగోలు చేసే నిస్సహాయులైన తల్లిదండ్రులు. మధ్యలో మార్కులు పంచి డబ్బుచెసుకునే దళారులూ.

ప్రతి రోజూ బట్టీపట్టే కుర్రాడు రెండూ రెండూ కలిపితే ఎంతో చెప్పగలడు. ఎందుకు కలపాలో తెలీదు. చదువుయొక్క పరిణతి వారికి లొంగదు. మార్కులొచ్చే యంత్రాలు, డబ్బు చేసుకుని పెట్టుబడిని భర్తీ చెసుకునే వ్యాపార దృష్టితో డిగ్రీలు పుచ్చుకుని వీళ్లు వీధిన పడతారు. ఈ దిక్కుమాలిన సమాజాన్ని మరింత దిక్కులేనిదిగా తమవంతు సహాయం చెస్తారు.వీళ్లు తమ వంతు బజారు తెరిచినా అశ్చర్యం లేదు.

పద్నాలుగోయేట కథలు రాసే వినోదంనుంచి నన్ను కట్టడిచేస్తే నేను గుమాస్తా అయేవాడిని. మా నాన్న– ఓ మామూలు గుమాస్తా నాకు ఈ బజారు చదువులు చెప్పించలేకపోయేవాడు. గేదెలు కాసుకునే ఓ రైతుబిడ్డ ఓ పద్మభూషణ్ అయేవారుకాదు.




'ఏపిల్' కంప్యూటర్ తయారుచేసిన స్టీవ్ జాబ్స్ హైస్కూలుకి వెళ్లలేదు. యోగివేమన డిగ్రీ పుచ్చుకోలేదు.పోతన హలం పట్టి పొలం దున్నాడు. ఒకాయన సైకిలుకి పాల బిందెలు కట్టుకుని విజయవాడలో పాలు అమ్మి కాలేజీకి వెళ్లి చదువుకున్నాడు. అయన పేరు నందమూరి తారక రామారావు.

చదువుల బజారు మంచి బతుక్కి కలలుగనే తల్లిదండ్రుల్ని కొల్లగొట్టే భయంకరమైన దోపిడీ. ఇందులో ప్రభుత్వానికీ, చదువుల వ్యాపారులకీ, మధ్యవర్తులకీ అందరికీ సరసమయిన వాటాలున్నాయి. ఈ దేశాన్ని ప్రభావితం చేయగల మేధస్సుని కాక, ఆచరణకు లొంగని కొన్ని వేల యంత్రాలు అన్యాయంగా ఈ బజార్లలో తయారవుతున్నాయి. వీటి నుంచి విముక్తి లేకపోవడం, ఉండాలన్న ఆలోచన మన పరిపాలకులకి లేకపోవడం మన దరిద్రం.

ఉదాత్తత పదవులతో రాదు. ఉపజ్ఞ బజార్లలో అమ్మకానికి దొరకదు. ఉద్యమం చిత్తశుద్ధి లేని వ్యాపారుల కర్మాగారాల్లో కార్యరూపం దాల్చదు.

**(జూన్** 17, 2013)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పొల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (July 1, 2013) Mudo Kannu మూడో కన్ను

పర్యావరణం తల్లిలాంటిది. మనజీవితంలో ప్రతీ విషయానికీ పర్యావరణానికీ అతి దగ్గరి సంబంధం వుంది. హాయి అనిపించే చెట్టుగాలి దగ్గర్నుంచి, ఆహారం, పళ్లు, పుష్పాలు, కలప, ఔషదాలు- ఏదయినా, ఏమయినా మనిషి తన ధర్మానికి కట్టుబడి ప్రవర్తిస్తే ప్రకృతి అతనికి బాసట అవుతుంది, తోడయి నిలుస్తుంది.

పర్యావరణం ఓర్పుతో నిలిచే ధరిత్రి. మనిషి తన స్వార్ధంతో, అహంకారంతో, దుర్మార్గపు చింతనతో ప్రకృతిని ఎంత దుర్వినియోగం చేస్తున్నా ఓర్పుతో, నిశ్శబ్దంగా తలవొంచుతుంది. అతని ఆలోచనారాహిత్యానికి, అవకాశవాదానికి తలవొంచుకు బలి అవుతుంది.

పర్యావరణం మహంకాళి, ఒక పరిమితి దాటి, మానవ స్వార్ధం కట్టలు తెంచుకుంటే ప్రకృతి నిర్ధాక్షిణ్యంగా మూడోకన్ను విప్పుతుంది. సృష్టిని నేలమట్టం చేస్తుంది. మనిషి స్వార్ధాన్ని పునాదులు లేకుండా పూడ్చిపెడుతుంది.

చాలాసంవత్సరాల కిందట జంటనగరాలలో కనీవినీ ఎరగని వర్షాలు పడ్డాయి. పల్లపు ప్రాంతాలలో ఉన్న కాలనీలు, యిళ్లు వారాల తరబడి నీళ్లలో మునిగి ఉండిపోయాయి. ప్రజలు నానా కష్టాలు పడ్డారు. మైకులు మరిగిన మనుషులు ప్రభుత్వం ఏం చేస్తోందని, యంత్రాంగం తమ గోడు వినిపించుకోవడం లేదని మూలిగారు. సంవత్సరాల పాటు పల్లపు ప్రాంతాలలో నీరు దారులు వెదుక్కొనే స్థలాల్ని ఆక్రమించుకుని, అధికారులూ కుమ్మక్కయి, లంచాలు పుచ్చుకుని అమ్మకాలు జరిపిన కాలనీలు ఇవన్నీ. తెలిసీ కళ్లు మూసుకున్న అధికారులు, డబ్బుతో కళ్లు మూసిన పెట్టుబడిదారులు- ఆనాడు వీరి చేతుల్లో మైకులు లేవు, డబ్బు సంచులే ఉన్నాయి. సమాజ శ్రేయస్సుని ఖాతరు చెయ్యకుండా మన పొట్టనింపుకుంటే ఏమవుతుంది? ఆనాటి అనర్ధం అవుతుంది. చెప్పినా వినేనాధుడు లేడు. ప్రకృతి ఓర్పుగల ధరిత్రి. ప్రకృతి ధర్మాన్ని మంటగలిపితే మానవుడి స్వార్ధానికి అనాటి విలయం సమాధానం.

హిమాలయాలు భౌగోళికంగా తక్కువ వయస్సున్న(geological age) పర్వత శ్రేణి. అంటే భూకంపాలకీ, సహజ వాతావరణ పరిణామాలకీ ఎక్కువగా స్పందించే పర్వత శ్రేణి.మంచుకరిగి కొన్ని వందల అడుగులు కిందకి దూకే మంచునీరు ఉధృతంగా ప్రవహిస్తూ ప్రకృతి ప్రాథమిక శక్తిని ప్రతిబింబిస్తుంది. కేదార్ ఒకప్పుడు అతి చిన్న పల్లెటూరు. కొన్ని డజన్ల సాధువులు, రుషులూ, ఏ కొందరో భక్తులు వచ్చి దర్శించుకునే క్షేత్రం. 2010 నాటికి సాలీనా 3.11 కోట్లమంది దర్శిస్తున్నారట. గత ఏడేళ్లలో ఇక్కడికొచ్చే వాహనాల రద్దీ మూడింతలు పెరిగింది. 11 వేల ఎత్తున ఉన్న ఈ ప్రాంతంలో ఏమాత్రమూ అనుభవంలేని జనసమూహం ఉండడానికి ఏయే ఏర్పాట్లు జరిగాయి? వారికి వసతులు కల్పించే పనేమయినా ఆ రాష్ట్రప్రభుత్వం చేస్తోందా? ఏం చెయ్యాలి? ఒక్కసారి తిరుపతిని దర్శిస్తే అర్ధమవుతుంది. సశాస్త్రీయమైన ఎంత infra-structure కావాలి? వీరంతా రంబాదా మార్గం ద్వారానే రావాలి. అసలు ఇలా ఇక్కడికి వచ్చేవారు ఎవరు? వాళ్ల పేర్లేమిటి? అడ్రసులేమిటి? అక్కడ వీరి అలుసు కనుక్కునే ఏర్పాటేదయినా ఉందా? అంటే ఇలాంటి అనర్ధం జరిగితే- వారు బయల్దేరిన కుటుంబాలు మొరబెడితే తప్ప ఎవరు ఎవరో తెలియని అవ్యవస్థ.2013లో ఇంకా మనం ఇంత ప్రాథమికమయిన స్థితిలో ఉన్నామా? సమాధానం వుంది. ఆలోచించే నాధుడు లేడు.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

టాంజానియాలో మేం అడవుల్ని చూడడానికి లోనికి వెళ్లేటప్పుడు ప్రవేశద్వారం దగ్గర మా వివరాలు, కార్ల నంబరూ, గైడ్ పేరూ ఇవ్వాలి. అడవిలోకి వెళ్లినవారంతా క్షేమంగా తిరిగి వచ్చారోలేదో వారు గమనిస్తూంటారు. ఇది చాలా ముఖ్యమయిన ఏర్పాటు. క్రూరమృగాల బారిన ఎవరయినా పడితే సహాయమో, సమాచారమో అందే, అందాల్సిన ఏర్పాటు. ఇది ఒక పార్శ్యం.

మందాకిని, అలక్ నందా నదుల మీద జలవిద్యుత్ కేంద్రాలను– దాదాపు 70 ప్రాజెక్టులు చేపట్టారు.(300 డామ్ లు నిర్మించాలని ప్రణాళిక) వాటి నిర్మాణాన్ని– ఒక్కసారి ముక్కుమీద వేలు వేసుకోండి– పాన్ మసాలా అమ్మేవారికీ, సైకిళ్లు, బిస్కత్తుల తయారీవారికి మంజూరు చేశారు! ఇది 2010 కాగ్ రిపోర్టు సారాంశం. పర్యావరణంలోని సాధకబాధకాలేమిటి? భూకంపనలకు ఆటపట్టయిన ఈ ప్రాంతంలో నిర్మాణాలు ఏ విధంగా జరగాలి? ఇలాంటివి పరిశీలించే బాధ్యతగల సంస్థల ప్రమేయం లేదు–గమనించాలి. మనం ఏ రాతియుగంలో ఉన్నాం! ఏమిటీ అవినీతి? ఎంత దారుణం?

రంబాదా ఒకప్పుడు నడిచే యాత్రికులకు కాస్త సేద తీర్చుకునే చిన్న స్థలం. చిన్న కూడలి. అక్కడ ఇప్పుడు కొన్ని వందల వ్యాపారాలు, కొన్ని వేలమంది ఉంటున్నారు. ఇక కేదార్ లో అక్రమంగా, సరియైన ప్లానింగ్ లేక లేచిన కట్టడాలే దాదాపు అన్నీ. దుకాణాలు, హొటళ్లూ, చిన్న చిన్న వసతిగృహాలు– ఎవరికి వారే ప్రజల విశ్వాసాన్ని పెట్టుబడిగా డబ్బు సంపాదించే అలవాటు మరిగినవారు. యివన్నీ.సంవత్సరాల తరబడి పేరుకుపోయిన అక్రమాలు, అవినీతి– లక్షల మంది విశ్వాసం పెట్టుబడిగా వ్యాపారాలు చేస్తున్న పాపాత్ముల స్వార్థం పర్యావరణాన్ని ప్రతీ క్షణం కలుషితం చేస్తోంది.

పర్యావరణం లాలించే తల్లి. భరించే ధరిత్రి. కాని ఆ కట్టదాటితే? అదే మొన్న జరిగింది. కేదార్ లో ప్రస్తుతం యిళ్లు లేవు. అక్రమంగా కట్టిన దుకాణాలు లేవు, నడిపిన మనుషులు లేరు, గుర్రాలులేవు,వాటిని నడిపే సైసులు లేరు. వెళ్లిన భక్తులు లేరు, వాళ్లని దోచుకునే పాపాత్ముల జాడలేదు.

ఎప్పుడో ఒకప్పుడు అనర్థం తప్పదని, తప్పని పనిని తాము చేస్తున్నామని చేసేవారికి తెలుసు. ఇది భయంకరమైన దోపిడీ. అయితే మిన్ను విరిగి ఎప్పుడు మీద పడుతుంది? ఎన్ని లక్షల మంది ఇన్ని సంవత్సరాలుగా ఈ సింహం నోటిలో తలని అనునిత్యం దూరుస్తున్నారని తెలియకుండానే వెళ్లివస్తున్నారు? ఆ సంగతి ఈ దుర్మార్గులకి తెలుసు. ఈ విలయంలో భక్తుల విశ్వాసాలను దుర్వినియోగం చేస్తున్న, చేసిన పాపాత్ముల వాటా పెద్దది.

ఇక మరో దరిద్రం. ఏదో ఛానల్ లో ఈ భీభత్సాన్ని చూపుతూ జేసుదాస్ “ఆటకదా శివా” అనే పాటని వేస్తున్నారు. పాట విని పరుగున టీవీ దగ్గరికి వస్తే దృశ్యమిది. ఇది బొత్తిగా అవగాహనలేని, బాధ్యతారహితమైన, డబ్బు చేసుకునే ఛానళ్ల “మెలోడ్రామా”. ఇంతకన్న ఛానళ్లు గొప్ప పరిశోధన చేసి వెలగబెడతారని మనం ఆశించడం– ముఖ్యంగా వ్యాపారస్థుల నుంచి–వృధా. బొత్తిగా అవగాహన లేని, అనుభవం చాలని, అధికారాన్ని ప్రలోభపెట్టి కాంట్రాక్టులు దక్కించుకున్న ప్రబుద్ధులు– నదుల, వరదల, ప్రవాహాల దారుల్ని పూర్తిగా అడ్డగించిన కారణాన– జరిగిన భయంకరమైన అనర్థమిది –అని ఛానళ్లు సోదాహరణంగా వివరించాలి. ప్రసారమాధ్యమాల కనీస బాధ్యత ఇది. “ఆట కదరా శివా!” అని




సొల్లు కబుర్లతో, భయంకర దృశ్యాలతో ప్రేక్షకుల్ని రెచ్చగొట్టడం కాదు. కాగా, అత్యవర పరిస్థితులలో రక్షణ చర్యలకు ఎక్కువ ప్రచారం ఇవ్వాలి. రెచ్చగోట్టే ప్రకృతి వైపరీత్యానికి కాదు .ప్రజల్లో భయోత్పాతం కల్పించకూడదు. వీలయినంత నమ్మకం కలిగించాలి. కష్టంలో ఆత్మీయుడి సానుభూతిలాంటిదిది. ఇది ప్రసార మాధ్యమాల కనీస సామాజిక బాధ్యత. అయితే మన మాధ్యమాలు కుక్కగొడుగులు. నెలసరి జీతాలతో పొట్టగడుపుకునే గుమాస్తాలనుంచి ఇంత కర్తవ్య దీక్షని ఆశించడం అన్యాయం. ఆమాటకి వస్తే చానళ్లను నడిపే అధిపతులలో గొప్ప అవగాహనని ఆశించడం కూడా మట్టిలోంచి నూనెని పిండడం లాంటిది.

సంవత్సరాల తరబడి ప్రజల భక్తి విశ్వాసాలను వినియోగించుకుంటున్నదౌర్భాగ్యుల నిర్వాకాన్ని దమ్ముంటే పరిశీలించి చచ్చినవారు పోగా, బతికున్న ప్రబుద్ధుల్ని ఫొటోలతో సహా ప్రజల ముందు నిలబెట్టే పని నిజానికి ఛానళ్లు చెయ్యాలి– చచ్చిన వారి కన్నీటిని వాడుకోవడం కాదు. కన్నీటితో ఆదుకోవడం కాదు. ఈ విషాదం ఇవాళ మరొకరికి జరిగింది కాని, నిన్న మీకు జరిగి ఉండవచ్చు. రేపు నాకు జరగవచ్చు.

బాబూ ఇది శివుని ఆటకాదు, శివుడినీ– తరతరాల ఈ జాతి విశ్వాసాల్ని మదుపుగా శివుడి మీద భక్తిని వాడుకుంటున్న అవకాశవాదుల ఆట అని చెప్పాలి మహప్రభో!

విలయానికి విచక్షణ ఉండదు. నిప్పు కాలుస్తుంది. అందులో ఎండు కట్టెలూ కాలుతాయి. చెయ్యి పెడితే చెయ్యీ కాలుతుంది. అది ప్రకృతి ధర్మం.

అయితే "ధర్మం" అనే బూతుమాటని మనం మరిచిపోయి ఎన్నాళ్లయింది?

**(జూలై 1, 2013)**

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (July 8, 2013) Vruddhapyaniki Aahvanam వృద్ధాప్యానికి ఆహ్వానం

చమకం యజుర్వేదంలోని శ్రీరుద్రంలో ఒక భాగం. చమకం అంటే నాకెప్పుడూ చిన్న చూపే. కారణం కన్యాశుల్కం నాటకంలో గిరీశం. గిరీశం వెంకటేశంతో అంటాడు: "మీ నాన్న ప్రతీ రోజూ దేవుడి ముందు కూర్చుని ఏం చేస్తాడనుకున్నావ్? ఓయి దేవుడా! నాకు సుఖమియ్యి. నా కోర్టు కేసు గెలిపించు. అల్లవాడి కొంపముంచు" అంటూ దేవుడిని దేబిరిస్తాడు. 'చమే'అంటే 'నాకియ్యవయ్యా' అని అర్థం. నువ్వు కూడా నీక్కావలసినవన్నీ అడగొచ్చు. 'గేదె పెరుగూ చమే, చేగోడీ చమే' అని హితోపదేశం చేస్తాడు.

తీరా భగవంతుడంటూ కనిపిస్తే బొత్తిగా ఈ జాబితా చదవడం ఏమిటి? ఇన్ని కోరడమేమిటి? ఈ జీవితాన్ని పట్టుకు యింతగా దేబిరించే వీడికి స్వర్గం, మోక్షం ఎందుకని దేవుడు అనుకోడా? –యివన్నీ నా సందేహాలు. అయితే చమకంలో ఒకచోట –ఈ ఆలోచనలన్నింటికీ అడ్డకట్ట కట్టే విచిత్రమైన కోరిక ఉంది. "వృద్ధిం చమే, వృద్ధం చమే" అని. ఇదేమిటి? నాకు వృద్ధినియ్యి అన్నంతవరకూ బాగానే వుంది. నాకు వృద్ధాప్యాన్ని యివ్వమని అడుగుతాడేమిటి? అని ఆశ్చర్యం. కోరికలనుంచీ, ఈ జీవితంలో సుఖాల నుంచీ బయటపడలేని జీవుడు –అలా బయటపడేసే మానసిక స్థితిని, ఆ దశని ప్రసాదించు స్వామీ –అంటూ ఆ కోరికల వెల్లువలోనే ఒక విచిత్రమైన కోరికని జతచేశాడు. అన్ని కోరికలనుంచీ విముక్తం చేసే –లేదా విరక్తిని కలిగించే వృద్ధాప్యాన్ని ప్రసాదించు –అని వేడుకోవడం బహుశా ఏ మతంలోనూ ఏ భక్తుడూ ఏ దేవుడినీ యింత పరిణతితో, యింత గంభీరమైన కోరిక కోరలేదేమో!

"ఈ మనస్సు కోతి స్వామీ! దానికి ఉన్న చాపల్యాలుల అన్నీ తీర్చు. తప్పదు. చేసేదీ లేదు. కాని ఏదో ఒకనాడు ఈ చాపల్యాలన్నింటినీ వదులుకొనే దశనీ, స్థాయినీ, వయస్సునీ –వృద్ధాప్యాన్ని ప్రసాదించు" అంటున్నాడు జీవుడు.

వృద్ధాప్యం ఒక మజిలీ. ప్రతీ వ్యక్తీ కోరుకు న్నా కోరుకోక పోయినా తప్పనిసరిగా చేరుకునే మజిలీ. వయస్సులోని కోరికలన్నింటికీ సెలవిచ్చి, అలసిపోయిన అనుభవాలనీ, ఆరిపోయిన అనుభూతులనూ నెమరువేసుకునే చలివేంద్రం. వృద్ధాప్యం ఒక అవకాశం. వెనక్కి తిరిగి చూసుకుని చేసిన తప్పిదాలకు నవ్వుకుని, దాటిన అడ్డంకులను పరామర్శించి, ఇక దాటనక్కరలేని స్థితికి వచ్చినందుకు ప్రశాంతంగా నిట్టూర్చే ఆటవిడుపు. ముసిలితనం కొడుకు కంటె ఒక అడుగు వెనక నడిపిస్తుంది. మనవరాలి భుజాన్ని ఆసరా చేసుకుంటుంది. జీవితమంతా కొరుకుడుపడని నిజాలతో ఆనందంగా రాజీపడేటట్టు చేస్తుంది. పిల్లలు "నీకేం తెలీదు నాన్నా!" అంటే కోపం రాదు. ఒక జీవితకాలాన్ని తెలీనితనానికి తాకట్టు పెట్టిన కొడుకుని చూసి నవ్వుకుంటుంది. తనకి తెలీదని పక్కకి తప్పించే తరాన్ని చూసి గర్వపడుతుంది. అవలీలగా అర్థం చేసుకుంటుంది. "వాడికి తోచినట్టే చెయ్యనివ్వండి" అనే భార్య హితవుకి గంభీరంగా తలవొంచుతుంది. ఏ విమర్శా అవమానం అనిపించదు. ఏ నిందకీ కోపం రాదు.

వృద్ధాప్యాన్ని అందరూ గౌరవిస్తారు. నీ జీవితకాలంలో సాధనల్ని పక్కనపెట్టి కేవలం వయస్సు కారణంగానే పెద్దరికాన్ని అంగీకరిస్తారు. అదొక అంతస్థు. అతని హితవుని నలుగురూ వింటారు. నీ ఆలోచనని గౌరవిస్తారు. దాన్ని పాటించరని అర్థమవుతున్నా కోపం రాదు. వయస్సు అర్థం చేసుకునే సంయమనాన్ని నేర్పుతుంది.


అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

"మా రోజుల్లో..." అని చెప్పుకోవడంలో చిన్న 'సాకు'ని వృద్ధాప్యం మప్పుతుంది. "ఈ కాలం కుర్రాళ్లు..." అన్న వెక్కిరింతకి అర్హతని సంపాదించి పెడుతుంది. తన గురించి తన పెద్దలూ అలనాడు –అలాగే అనుకొని ఉంటారని అప్పుడు జ్ఞాపకం వస్తుంది.

వేసిన ప్రతీ అడుగూ తెలిసి వేసే నమ్మకాన్నిస్తుంది. చేసే ప్రతీ పనీ యిబ్బంది లేని, శ్రమ అనిపించని మార్గం వేపే ప్రయాణం చేయిస్తుంది. తన 'రేపు' క్రమక్రమంగా కురుచనయిపోతోందని అర్ధమవుతూంటుంది. దక్కిన చిన్న తప్పుల్ని వృద్ధాప్యం భద్రంగా అలంకరించుకుంటుంది. "మనకి చేతకాదు" అని చెప్పడం పెద్ద అర్హతగా కనిపిస్తుంది. అసాధ్యానికి 'అనవసరం' అంటూ గడుసుదనం చిన్న ముసుగు వేస్తుంది. దానికి ఊతం వృద్ధాప్యం. జీవితంలో చాలా ప్రశ్నలకు సమాధానాలు అర్థమవుతూంటాయి. ఇప్పుడా సమాధానాలకూ వేళ మించిపోయిందని అర్థమవుతుంది. ఈ సమాజంలో అవినీతి అనే కుళ్లు ఎప్పుడు తొలగుతుంది? ప్రతీక్షణం దోపిడీకి గురవుతున్న ఈ పర్యావరణం ఒక్కసారి ఎదురు తిరిగితే ఏమవుతుంది? ఏమయినా తనకేం బాధలేదు. ఆ సమయంలో తను ఉండడు. ఈ జీవిత నుంచి శలవు తీసుకోవడమే తనకి ఉపశమనం. దేవుడు ఎక్కడ ఉంటాడు? ఎలా వుంటాడు? మృత్యువు తరువాత ఏమవుతుంది? సమాధానాలు అర్థమయే క్షణాలు దగ్గరవుతున్నాయి. చుట్టూవున్న జీవితాన్ని క్రమంగా ఖాళీ చేసుకుంటుంది వృద్ధాప్యం. చిన్నకేక తుళ్లిపడేటట్టు చేస్తుంది. చిన్న నిశ్శబ్దం ప్రశాంతంగా ఉంటుంది. ఎప్పటిలాగే తెల్లారి, వృద్ధులతో కలిసి నడిచి, రెండుముద్దల అన్నం తిని, అరగంట సేదతీరి, వేడి టీ తాగి, సాయంకాలం పార్కు బెంచీ దగ్గర "ఈ దేశం తగలడిపోతోంద'ని తిట్టుకుని, శాంతపడి –కీళ్ల నొప్పులకు మాత్రలు మింగి, రాని నిద్రనీ, నిన్నటి జ్ఞాపకాలనీ నెమరు వేసుకోవడం –వృద్ధాప్యం వ్యసనం.

ఇప్పుడు విచారం దగ్గరకు రాదు. వెళ్లిపోయిన హితులూ, సన్నిహితులూ దిగులుగా జ్ఞాపకం వస్తారు. ముగింపు భయపెట్టదు. ఎందుకంటే భయపడినా రాకతప్పదు కనుక. అన్నిటినుంచీ, అందరినుంచీ తనని కుదించుకుని –మెల్లగా అంతర్ముఖుడు కావడం వృద్ధాప్యం. ఇప్పుడు అన్ని దురదృష్టాలకూ కారణాలు అర్దమౌతాయి. చేసిన తప్పిదాలు, మాటతప్పిన కప్పదాట్లూ, మనసు నొప్పించిన చిన్న చిన్న జ్ఞాపకాల ముళ్లూ –అవన్నీ ఓ జీవితకాలం ఆలస్యంగా కళ్లముందు కదుల్తాయి. ఈ అనుభవాల్ని హెచ్చరికలు చెయ్యబోతే పిల్లలు వినరు. వినినట్టు నటిస్తారు. నటిస్తున్నారని తనకీ తెలుసు. విన్న తృప్తిని తానూ నటిస్తాడు. వారికీ వృద్ధాప్యం ఒకనాడు పాఠాలు చెప్తుందని తెలుసు. కాని వృద్ధాప్యం ఒక వరమని ఇప్పుడు చెప్పి ఒప్పించలేడు. వారు ఒప్పుకునే వేళకి తను ఉండడు. జీవితం ఎంత విచిత్రం! నవ్వుకుంటాడు. ఆ నవ్వు ఖరీదు ఒక జీవితం.'చమకం' ఏ రుషి, ఏ మహానుభావుడు ఎప్పుడు సృష్టించారో –ఎంత ముందుచూపు, ఎంత వినయసంపద, జీవుని నిస్సహాయత, నిర్వేదం –అందులో నిక్షిప్తమయివుందో –ఆనాటి కోరిక సంపూర్ణమయిన స్వరూపంతో కళ్లముందు దర్శనమిచ్చేనాటికి –తాను జీవితమంతా కోరుకున్న 'వృద్ధాప్యం' తనని ఆవరించుకుని ఉంటుంది.ఈ దేశపు వేద సంపద, సాంస్కృతిక వైభవం, జాతి దర్శనం అపూర్వం, అనన్యసామాన్యం. చమకంలో 'వృద్ధం చమే' అనే ఒక్క కోరికా ఈ జాతినీ, మతాన్నీ, ఆలోచనా స్రోతస్సునీ అత్యద్భుతంగా ఆవిష్కరించే అభిజ్ఞ. వరం. భగవంతుడిని కోరడంలోనే భగవంతుడు ప్రసాదించిన తన ఆలోచనా పరిణతిని అలంకరించే భగవద్దత్తమైన ఆశీర్వాదం. అదీ వృద్ధాప్యం.

( **జూలై** 8, 2013)




# (July 15, 2013) Nookala Znapakalu నూకల జ్ఞాపకాలు

నూకల చిన సత్యనారాయణగారితో నాకు తేలికగా ఏభై సంవత్సరాల పరిచయం. అందుకు ముఖ్యకారణం ఆలిండియా రేడియో. ఆయన పాండిత్యానికీ, ప్రతిభకీ నాకూ పరోక్షమయిన బంధుత్వం ఉన్నదని తెలిశాక మా దగ్గరతనం మరింత పెరిగింది. ఆయన మా పినమామగారు – శ్రీపాద పినాకపాణిగారి శిష్యులు. నన్ను ఆప్యాయంగా 'అల్లుడు గారూ!' అని పిలిచిన కొద్దిమందిలో ఒకరు. గురువుని మించిన శిష్యుడనిపించుకున్న అదృష్టవంతులు. గురువుగారిలాగే పద్మభూషణులయారు. కాని గురువుగారు నడిచిన దారినే తొందరపడి పదేళ్లు ముందుగా సాగిపోయారు.

మొదట వయొలిన్‌ని తన సంతకం చేసుకున్న ద్వారం వెంకటస్వామి నాయుడుగారి దగ్గర విజయనగరంలో వయొలిన్ నేర్చుకోడానికి చేరారు నూకల. నాయుడుగారే ఆయన గాత్ర వైదుష్యాన్ని గుర్తుపట్టి డాక్టర్ పినాకపాణి గారికి పరిచయం చేశారు. మనోధర్మ సంగీతానికి జీవితమంతా సాధికారికమైన ప్రతినిధిగా నిలిచారు నూకల. పాండిత్యం ఆయన సంగీతయాత్రలో ఒక పార్శ్వం. సంగీత గురువుగా, సంగీత వైభవాన్ని –250 సంచారి రాగాల సమీకరణ, విశ్లేషణ గ్రంథాన్ని 'రాగ లక్షణ వైభవా'న్ని రచించారు. దీక్షితార్ నవగ్రహ, కమలాంబ నవావర్ణకృతులమీద చక్కని పరిశోధనా గ్రంథాన్ని వెలువరించారు. అలాగే మరెన్నో. మహామహోపాధ్యాయులయారు. ప్రపంచంలో ఎన్నో విశ్వవిద్యాలయాలలో సంగీతం మీద సోదాహరణ ప్రసంగాలు చేశారు.

కొన్ని సంవత్సరాల క్రితం అమెరికా వెళ్లినప్పుడు తప్పనిసరిగా కెనడా వెళ్లి అటునుంచి నయాగరా చూడాలని మా అబ్బాయి పట్టుబట్టాడు. అతని స్నేహితుడి అన్నగారు –ఓ పంజాబీ మిత్రుడు అక్కడ ఉన్నారు. వారికి నా గురించి చెప్పారు. ఆ దంపతులు నన్నూ, నా భార్యనీ నయాగరా తీసుకువెళ్లారు. వారి ఇంటి పక్కనే ఒక తెలుగు కుటుంబం ఉంది. ఆ మాటా యీమాటా చెప్తూ ఇండియా నుంచి ఎవరో 'గొల్లాపూడ్ మార్తీ' అంటూ వచ్చీరాని పేరు చెప్పాడట. ఆ కెనడా తెలుగు దంపతులు విజయ, శాస్త్రిగారూ తుళ్లిపడ్డారట. 'బాబోయ్! గొల్లపూడి మారుతీరావా?' అన్నారట. తెల్లవారితే మేం బోస్టన్‌కి ప్రయాణం చెయ్యాలి. వారు మా గదిలోకి దూకేశారు. ఆ సాయంకాలం అప్పటికప్పుడు మమ్మల్ని ఒప్పించి –చిన్నవిందు ఏర్పాటు చేశారు. ఆ సాయంకాలం మాకు గుర్తున్న అంశం –ఒకావిడ ఉన్నపాటునే కుర్చీలోంచి దిగి నేలమీద కూర్చుని 'గం గణపతే నమో నమో' అనే హరికేశనల్లూర్ ముత్తయ్య భాగవతార్ కీర్తన పాడారు. ఎక్కడ కెనడా? ఎక్కడ హంసధ్వని? ఎక్కడ ముత్తయ్య భాగవతార్? 'ఎవరు నేర్పారమ్మా?' అని అడిగాను. "నూకల చిన సత్యనారాయణగారు మా గురువుగారు" అన్నదావిడ గర్వంగా. కళ –పాండిత్యం –రెండు సందర్భాలలో పరిమళిస్తుంది. ఒకటి అభ్యసించినప్పుడు. మరొకటి –ప్రదర్శించినప్పుడు. కెనడాలో నూకల పరోక్షంగా పలకరించిన అరుదయిన సందర్భమది.

ఎప్పుడు కలిపినా "మీరు మా ఇంటి అల్లుడుగారు. భోజనానికి రండి" అని సాదరంగా ఆహ్వానించేవారు. ఒకసారి దంపతులం వెళ్లాం. చక్కని సంగీతంతో, శ్రీమతిగారి చక్కని వంటలతో ఉభయులూ విందుచేశారు. కొత్తబట్టలు పెట్టి, ఆయన కేసెట్లూ, సీడీలూ ఇచ్చారు. నూకల ఆర్ద్రమయిన హృదయంగల వ్యక్తి. ఉదారులు. ఉదాత్తులు. గురువుగారిని ఏ క్షణం తలచుకున్నా గౌరవ ప్రపత్తులతో ఆయన గొంతు



ఆర్ద్రమవుతుంది. జీవితంలో గురువుగారికి దక్కిన బంగారు పతకాలని కరిగించి భద్రాచల దేవేరికి వడ్డాణం చేయించారని చెప్పినప్పుడు ఆయన గొంతు గాద్గదికమవడం నాకు జ్ఞాపకం.

నూకల చాలా అందమయిన సంగీతజ్ఞులు. అంతటి అందం, టీవీ మరొకరిలో మాత్రమే గుర్తుపట్టాను నేను. జి.ఎన్.బాలసుబ్రహ్మణ్యం. ఆయన ముఖంలో వ్యక్తిత్వంలో పాండిత్యపు తేజస్సు వెల్లివిరుస్తూంటుంది. ఆయన్ని ఆ మధ్య చాలా శ్రమతో చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ఏదో కార్యక్రమానికి తీసుకొచ్చారు వారబ్బాయి. అది కేవలం శరీరానికి ఏర్పడిన రుగ్మత. ప్రేక్షకుల్లో నన్ను చూడగానే ఆనందంతో మురిసిపోయారు. విశాఖపట్నంలో గురజాడ కళాక్షేత్రంలో ఏదో కార్యక్రమానికి ఆయన వచ్చారు. నన్నూ కార్యకర్తలు వేదిక ఎక్కించారు. తర్వాత ఆయన కచ్చేరీ. నేనెక్కడికో వెళ్లాలి. "మీ కీర్తన ఒక్కటి విని వెళ్తాను" అంటూ 'బృహదీశ్వర మహాదేవ!' పాడమని కోరాను. అది మంగళంపల్లి బాలమురళీకృష్ణ రచన అనుకుంటాను. నాకు నూకల గారి గొంతులోనే మనస్సులో మిగిలిపోయింది. "అయ్యో, గుర్తులేదే!" అన్నారు. "సాహిత్యాన్ని నేను గుర్తు చేస్తాను" అంటూ చెప్పాను. 'మమత పాశముల తాళను శమనవైరి దయలేకను' ఆయన గొంతులో వింటే నాకు తన్మయత్వం. పాడారు. కేవలం నాకోసం. అదీ ఆయన ఔదార్యం. స్నేహశీలత.

గురువుగారు శ్రీపాద పినాకపాణిగారి నూరేళ్ల పండగకి వెళ్లలేనందుకు ఎంతగా బాధపడివుంటారో నేనూహించగలను. హైదరాబాద్‌లో రోజంతా జరిగిన ఉత్సవంలో శ్రమతో వచ్చారు. ఉదయం ఇద్దరం మొదటివరసలో కూర్చున్నాం. సాయంకాలం రవీంద్రభారతిలో జరిగిన సభలో ఇద్దరం వేదికమీద ఉన్నాం. ఆనాటి ఆయన ఉపన్యాసమంతా గురువుగారికి అశ్రుతర్పణమే. 11వ తేదీ రాత్రి 11 గంటలకి ఆయన ప్రోగ్రాం చూస్తున్నాను. కింద కీ.శే. నూకల చిన సత్యనారాయణ అని స్క్రోల్ నడుస్తోంది. తుళ్లిపడ్డాను. వెంటనే ఛానల్‌కి ఫోన్ చేశాను. ఆ ఉదయమే కన్నుమూశారన్నారు. ఉదయమే మా ఆవిడకి చెప్తే ఆమె కళ్లు ధారాపాతాలయాయి. ఆయన శ్రీమతి శేషుగారిని జ్ఞాపకం చేసుకుంది.

ఇంటికి ఫోన్ చేస్తే మనుమడు తీశాడు. "తాతగారు దేనికీ రాజీపడరు. తలవొంచరు. నాలుగు రోజుల కిందట –'ఇంక మేడమీదకు వెళ్లలేనురా. కిందనే ఉంటాను' అన్నారట. మనస్సుని శరీరం జయిస్తున్న అరుదయిన క్షణం అది. నిన్న ఉదయం డాక్టరు దగ్గరకి వెళ్లాలి. అబ్బాయి అన్నాజీరావు పూజ చేసుకుంటున్నారట. పంచెకట్టుకుని బాత్‌రూమ్‌కి వెళ్లివచ్చి మంచంమీద ఒరిగారు. అంతే. ప్రశాంతంగా వెళ్లిపోయారు. అనాయాస మరణం అపూర్వమయిన యోగం. ఒక వ్యక్తి మహనీయత ఆయన నిష్క్రమణం చెప్తుంది. దాదాపు 80 సంవత్సరాలు సంగీత ప్రపంచాన్ని ఆనందపరిచి –తన క్లేశాన్ని తనకే మిగుల్చుకుని –నిశ్శబ్దంగా, నిర్మలంగా, నిరాసక్తంగా శలవు తీసుకున్న నూకల యోగి. ఓ పరిపూర్ణమయిన జీవితానికి అరుదయిన, అపురూపమయిన ముగింపు అది. ఓ చరిత్ర ముగింపులో హుందాతనం, యో గం, వ్యక్తిత్వ శబలతనూ సమీకరించిన గొప్ప మానవతావాది –నూకల.

**(జూలై 15, 2013)**



# (July 22, 2013) Oka Mugimpu ఒక ముగింపు

ఇప్పటికీ నా ఫైళ్లలో రెండు పాతబడిన టెలిగ్రాంలు ఉన్నాయి. అవి మాసి, మూలలంట నలిగి ఉన్నాయి కాని అవి రెండూ నా జీవితంలో ఆకుపచ్చని జ్ఞాపకాలు. ఇప్పటికీ రెండు పెద్ద మలుపులకు అభిజ్ఞలవి. ఒకటి 54 సంవత్సరాల కిందట వచ్చినది. నాకు అంతర్విశ్వవిద్యాలయ నాటక రచనా పోటీల్లో నా "అనంతం" నాటికకు మొదటి బహుమతి వచ్చినట్లు ఢిల్లీ ఆకాశవాణి నుంచి వచ్చిన టెలిగ్రాం. రెండవది 51 సంవత్సరాల కిందట మా మామగారు పంపింది –నా పెద్ద కొడుకు పుట్టాడంటూ. మొన్న ఆఖరి టెలిగ్రాం సికింద్రాబాద్‌లో పారడైజ్ దగ్గర టెలిగ్రాం ఆఫీసునుంచి ఒకాయన పంపాడు. బహుశా భారతదేశంలో ఆఖరి టెలిగ్రామేమో అది. "బాస్ టెలిగ్రాం చచ్చిపోయింది స్టాప్ వయస్సు 169 స్టాప్ రేపే అంత్యక్రియలు స్టాప్." నాకు తెలిసి 'సేవకుడు' అన్నమాట ఒక్క టెలిగ్రాం యిచ్చే మనిషికే వాడిన గుర్తు. టెలిగ్రాం బంట్రోతు అనేవాళ్లం. న్యాయంగా టెలిఫోన్ ఆఫీసరుగారినీ 'టెలిఫోన్ బంట్రో □తు' అనాలి –ఆయనా గవర్నమెంటు సర్వెంటు కనుక. కాని వారెప్పుడూ సేవకులుగా భావించిన దాఖలాలు లేవు. వాళ్లు 'గవర్నమెంటు మొగుళ్లు'గానే నిన్నమొన్నటి దాకా అధికారాల్ని చెలాయించారు.

తపాలా బంట్రోతు మీద బాలగంగాధర తిలక్ కవిత ఎలా మరిచిపోగలం?

ఉత్తరం యిచ్చి నిర్లిప్తుడిలాగ వెళ్లిపోయే నిన్ను చూసినప్పుడు

తీరం వదిలి సముద్రంలోకి పోతున్న ఏకాకి నౌక చప్పుడు

ఎప్పుడో మోర్స్ కోడ్ సంజ్ఞలతో బ్రిటిష్ వారి పుణ్యమాంటూ ప్రారంభమయిన సంప్రదాయం టెలెక్స్, టెలిప్రింటర్ దశలలో హంగులు మార్చుకుని –మొబైల్స్, ఎస్ఎమ్ఎస్‌లూ, ఇంటర్నెట్‌ల కాలంలో పూర్తిగా తన అవసరాన్ని మినహాయించుకుంది. మొన్న మొన్నటివరకూ కోర్టు కాగితాలకూ, గవర్నమెంటు ఉత్తరాలకూ పరిమితమయిన టెలిగ్రాం ఇప్పుడిక ఆ వునికినీ కోల్పోయింది. ఒక పాత సంప్రదాయపు అవసరం తీరిపోయింది. చరిత్రలో భాగమయిపోయింది. అది కాలధర్మం.

ముసలమ్మ నిష్క్రమిస్తుంది. ముసిలితనం వచ్చేదాకా పడుచుదనం పలకరిస్తుంది. నిన్న చరిత్ర. నేడు చైతన్యం. రేపు నిరీక్షణ. అచిరకాలంలో టెలిఫోన్‌కీ అదేగతి పట్టబోతోంది. అయితే టెలిఫోన్ గురించి ఎవరూ అంతగా బెంగపెట్టుకోరేమో! టెలిఫోన్ దరిద్రం ఎప్పుడయినా వదిలిపోతుందా అని దేశం ఎదురుచూసిన సందర్భాలు బోలెడు. ఇరవై సంవత్సరాల కిందటిమాట. ఈ దేశంలో పద్మశ్రీ, డాక్టరేట్ రావడం అసాధ్యం కాదు. కాని టెలిఫోన్ కనెక్షన్ రావడం దుర్లభం అనే స్థాయికి డిపార్టుమెంటు అవినీతితో రాజ్యమేలింది. అది భయంకరమైన బ్లాక్‌మెయిల్. డాక్టర్ సర్టిఫికేట్, ఇంటి ఆస్తి దస్తావేజులు, అడ్రసుని సమర్థించే పత్రాలు, నువ్వు ఫలానా నువ్వేనని సమర్థించే పత్రం, రికమెండేషన్ల ఉత్తరాలు –వాళ్లం ఇష్టం. కష్టమర్లతో చెడుగుడు ఆడారు. ఆఖరున ఆఫీసరుగారి చేతులు తడపాలి. తీరా టెలిఫోన్ ఇంట్లో ఉంచడానికి వచ్చే మరో 'బంట్రోతు' (కసిగానే ఈ మాట వాడుతున్నాను) ఆకాశంలోంచి దిగివచ్చిన గంధర్వుడిలాగ నిలబడతాడు –తన వాటా లంచానికి. చాలా ఏళ్ల కిందట మద్రాసులో మూడు నక్షత్రాల హొటల్ ప్రారంభించాడు మా అబ్బాయి మిత్రుడు. అన్నీ జరిగినా టెలిఫోన్లు రాలేదు. బాస్‌కి తెలిసింది. ఆయన నవ్వుకున్నాడు. ఓ పెద్ద కరెన్సీ కట్ట పట్టుకుని డిపార్టుమెంటుకి బయలుదేరాడు. సాయంకాలానికి ఆరు లైన్ల

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
మీ మనస్సుకు సాహితీ వెన్నెల
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

కనెక్షన్లు తెచ్చాడు. అన్నిటికీ అవినీతి సమాధానం. అంతెందుకు? ఈ దేశంలో టెలిఫోన్ మంత్రిగారు మద్రాసులో తన ఇంట్లోనే 200 లైన్ల టెలిఫోన్ ఎక్స్చేంజ్‌ని పెట్టించుకున్నాడు! బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు కొందరయినా ఈ కాలమ్ చదువుతారనుకుంటాను. వీలయితే ఈ కాలమ్‌ని ఫఠం కట్టించి డిపార్టుమెంటులో వేలాడదీయాలి.

ఈ కాలమ్ రాస్తూ శాన్‌ఫ్రాన్సిస్కోలో మా మిత్రుడికి ఫోన్ చేశాను. ఆయన చెప్పిన విషయాలివి. ఆయన 1980లో ఇండియాలో ఉన్న రోజుల్లో టెలిఫోన్‌కి దరఖాస్తు పెట్టాడట. కేవలం 15 సంవత్సరాల తర్వాత 1995లో వచ్చిందట. 1992లో మా నాన్నగారు విశాఖలో చావుబతుకుల్లో ఉన్నారు. నేను మద్రాసులో. ఎంత ప్రయత్నించినా టెలిఫోన్ తెచ్చుకోలేకపోయాను. మా ఇంటి ఎదురుగా ప్రముఖ రచయిత అనిశెట్టి సుబ్బారావుగారుండేవారు. ఓ రాత్రి 11-30 కి మా నాన్నగారికి గుండెపోటు వచ్చిందని వారింటికి ఫోన్ వచ్చింది. ఈ దేశంలో ఇంతకంటే టెలిఫోన్ అవసరం ఉంటుందని ఎవరిని ఒప్పించాలో తెలియని దుర్భరమయిన పరిస్థితి అది. అమెరికాలో టెలిఫోన్‌ని రెండు లేక మూడు రోజుల్లో యిస్తారని ఆ మిత్రుడే చెప్పాడు. సింగపూర్‌లో మూడేమూడు రోజులు. అప్పటికి ఇవ్వకపోతే నాలుగో రోజున డిపార్టుమెంటల్ విచారణ జరుగుతుంది. అయిదో రోజున ఉద్యోగాలు పోతాయి. కృతఘ్నతకి ఈ దేశం పెట్టింది పేరు కనుక మనం తలుచుకోంగాని ఈ దేశానికి పీవీ నరసింహారావుగారు 'లిబరలైజేషన్' ద్వారా చేసిన మేలు నిరుపమానం. రెండు దరిద్రమయిన వ్యవస్థల నుంచి ఈ దేశాన్ని కాపాడారు. టెలిఫోన్, విమానయానం. ఇవాళ కసిగా -మరో దిక్కులేక బిఎస్ఎన్ఎల్ కస్టమర్ల కోసం దేబిరిస్తున్నా -ఎవరూ అటు చూడనయినా చూడడం లేదు. ఒక్క టెలిగ్రాం విషయానికొస్తే ఈ దేశంలో ఒకప్పుడు 45,000 టెలిగ్రాం ఆఫీసులు ఉండేవి. ఇప్పుడు 75 కి వచ్చేశాయి. ప్రస్థుతం టెలిఫోన్ వ్యవస్థ గతీ అంతే. ఇవాళ ముష్టివాడి చేతిలో కూడా మొబైల్ ఫోన్ ఉంటుంది -పక్కవీధి ముష్టివాడితో మాట్లాడడానికి. ఎయిర్ ఇండియా కూడా ఒకప్పుడు అవినీతితో రాజ్యం ఏలింది. ఒకే ఒక్క ఉదాహరణ. 1990లో మా పెద్దబ్బాయి పెళ్లి -విశాఖలో. నేను మద్రాసు ఎయిర్ పోర్టులో ఉన్నాను. నా చేతిలో మంగళసూత్రం దగ్గర్నుంచి, అన్ని ప్రధాన అంశాలూ ఉన్నాయి. తెల్లవారితే పెళ్లి. విమానం ఎక్కడానికి బోర్డింగు కార్డు కూడా ఇచ్చి, రెండు గంటలు కూర్చోపెట్టి విమానాన్ని రద్దుచేశామన్నారు. ఎందుకు? చెప్పే నాధుడు లేడు. ప్రతి ఉద్యోగి ఒక నవాబు. నాకు మతిపోయింది. 800 మైళ్లు ఎలా వెళ్లాలి? నాతో ఎయిర్‌పోర్టులో విజయలక్ష్మి డిస్ట్రిబ్యూటర్ రాజుగారు, శృంగవరపుకోట అప్పారావుగారు ఉన్నారు. నన్ను పట్టుకుని, ధైర్యం చెప్పి -రెండు రైళ్లు మార్పించి విశాఖపట్నం తీసుకొచ్చారు. ఆనాటి పెళ్లి విశాఖపట్నంలో చరిత్ర. ఇవాళ ఎయిర్ ఇండియా ఎలా అడుక్కుతింటోందో మనం వింటున్నాం.

'గవర్నమెంటు సర్వెంట్' అన్నమాట బ్రిటిష్ వారి పుణ్యం. ఆ తరంలో సి.పి.బ్రౌన్, ఆర్దర్ కాటన్, జె.పి.ఎల్.గ్విన్, మెకెంజీ వంటి వారు నిజంగానే ప్రజలకు నౌఖరులుగా పనిచేశారు. ఇప్పటికి బ్రౌన్ సృష్టించిన నిఘంటువుకి మించినది మరొకటి లేదు. మొన్ననే మెకెంజీ కైఫీయత్‌లు అయిదు సంపుటాలు కడపలో బ్రౌన్ గ్రంథాలయం లో ఇచ్చారు. అది వారు మనకి చేసిపోయిన ఉపకారం. ఇప్పుడు? మనవాళ్లే మనల్ని దోచుకుతింటున్న ఖాతరు. ఏ కొందరినో మినహాయిస్తే -అంతా దొరలు! అందుకే 65 ఏళ్ల తర్వాత పార్లమెంటులో, రాష్ట్ర శాసనసభల్లో దొంగలు, ఖూనీకోర్లు, మాఫియా లీడర్లు, రేపిస్టులు ఉండకూడదని ఇప్పుడిప్పుడు చట్టాలు చేసుకుంటున్నాం.

( జూలై 22, 2013 )

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (July 29, 2013) Kukkapilla Katha కుక్కపిల్ల కథ

అమెరికా నుంచి మా మిత్రుడొకాయన ఒక కార్టూన్ పంపించాడు. కార్టూన్ అంటే తెలియనివారికి –దృశ్యరూపమయిన వెక్కిరింత. దాని శీర్షిక 'ఇండియా రాజకీయాలు –మాధ్యమాల అద్భుత ప్రదర్శన'. ఒక పాత్రికేయుడు భారతీయ జనతా పార్టీ నాయకులు మోడీగారిని అడుగుతున్నాడు: ''అయ్యా, మీకే పండు ఇష్టం?'' అని. మోడీ క్లుప్తంగా 'ఆపిల్' అన్నారు. వెంటనే పెద్ద అక్షరాలతో టీవీ తెరనిండా ''తాజా వార్త!'' అనే అక్షరాలు. ఏమని? ''మోడీ మామిడిపళ్లని అసహ్యించుకుంటున్నారు!'' అని. వెంటనే కాంగ్రెస్ ప్రతినిధి ఒకాయన ఆవేశంగా కళ్లు పెద్దవి చేసి చెప్తున్నారు: ''ఇప్పటికైనా నా మాట నిజమని నమ్ముతారా? ఏపిల్ రంగునిబట్టి మీకేం అర్థమౌతోంది? మోడీకి రక్తదాహం! అందుకనే ఎర్రటి పండు ద్వారా ఆయన అసలు రంగు బయటపడింది!''

ఇది నికార్సయిన నీచ రాజకీయం. నూటి కి నూరుపాళ్లూ కోడి గుడ్డుకి వెంట్రుకలు పీకడం. ఇంకా చెప్పాలంటే గొంగళిలో బొచ్చు ఏరడం.

ప్రస్తుతం మోడీగారు ఏం మాట్లాడినా అందులోంచి రకరకాల అర్థాలు పీకగల అద్భుతమైన పాత్రికేయులు –వాటిని నెత్తికెత్తుకుని మోడీని కేవలం గబ్బు పట్టించడమే పరమావధిగాగల రాజకీయ దురంధరులు ఈ దేశంలో బోలెడుమంది ఉన్నారు. వీళ్లందరికీ రకరకాల కళ్లద్దాలున్నాయి. కొందరి కళ్లకి పూర్తిగా కామెర్లు ఉన్నాయి. కొందరయితే కళ్లతో చూడడమే మానుకున్నారు!

నేను భారతీయ జనతాపార్టీ సభ్యుడిని కాను. ఆ మాటకి వస్తే ఏ రాజకీయ పార్టీకీ సంబంధించినవాడిని కాను. కాని అన్ని రాజకీయాల కంపునూ, అవినీతినీ నిస్సహాయంగా భరిస్తూన్న దురదృష్టవంతుడయిన భారతీయుడిని. ఈ క్రింది పేరాలకు ఈ ఉపోద్ఘాతం అవసరమనిపించి ఈ నాలుగు వాక్యాలూ రాస్తున్నాను.

మోడీగారిని ఫలానా మారణకాండ గురించి మీరు బాధపడడం లేదా? అని ఓ పాత్రికేయుడు అడిగాడు. ఇంత జరిగినా –ఆ మారణకాండకు ఆయన ప్రత్యక్షంగా కారణం కాకపోయినా (మనం వింటున్న దాన్నిబట్టి) –ఆయన ఈ సంఘటన పట్ల పశ్చాత్తాపమో, క్షమాపణో చెప్పాలని కొన్ని పార్టీల, ఎందరో పాత్రికేయుల మనోగతం. మోడీగారికి చెవిలో పువ్వులేదు. ఆపిల్ పండు గురించి చెప్తే రక్తం మరిగాడని అర్థాలు తీసి కోడి గుడ్డుమీద వెంట్రుకలను రాజకీయ దురంధరులు పీకుతారని వారికి తెలుసు. ఒకవేళ నిజంగా పశ్చాత్తాపం ఉన్నా ఆ విషయాన్ని తన మాటగా చెప్తే ఆ ఒక్కమాటనీ పీకి ''తనకి అందులో ప్రమేయం లేకపోతే క్షమాపణ ఎందుకు చెప్పాల్సి వచ్చింది? పరోక్షంగా ఆ మారణకాండలో వారి ప్రమేయం ఉన్నదనడానికి ఇంతకన్న రుజువు ఏంకావాలి?'' అని కత్తులు దూసేవారు. అది మోడీకి తెలియని విషయం కాదు. మోడీకి తెలుసన్న విషయం ఈ దురంధరులకి (ఇందులో పాత్రికేయులూ ఉన్నారు) తెలియంది కాదు.

కాని గడుసయిన పాత్రికేయుడు మోడీని ఇరుకున పెట్టాలనే కాలుదువ్వాడు. అంటే నేరస్థుడని తాను నమ్మే వ్యక్తిచేత నేరాన్ని అంగీకరించే 'మాట'ని రాబట్టాలని ఈ దురంధరిడి యావ. కాని మోడీ 'కొండల్ని మింగే' అఖండుడు. కాక పరిచిన ముఖమల్ తివాచీ కింద ఎన్ని అగాధాలకు ముసుగులు కప్పారో ఆయనకి తెలియకపోలేదు.




ఆయన సమాధానం –ఎదుటివాడి ఆనుపానులు ఎరిగిన, కొమ్ములు తిరిగిన, తెలివైన, నిజమే అయితే అందులో ప్రమేయం లేని, రాజకీయ నాయకుడు మాత్రమే చెప్పగలిగిన అద్భుతమయిన సమాధానాన్ని చెప్పారు. నిజానికి –ఈ సమయస్ఫూర్తినీ, ఈ గడుసుదనాన్నీ, ఈ చమత్కారాన్నీ, ఈ తెలివితేటలనీ –ఎప్పటికప్పుడు –నేను నేర్చుకోడానికే ఈనాటి రాజకీయ నాయకుల కార్యక్రమాల్ని 'పాఠశాల'గా వింటూంటాను. దేవుడిని అనునిత్యం ఆరాధించే ప్రహ్లాదుడు మనకే పాఠం చెప్పడు –చేతనయితే ఆ విశ్వాసాన్ని పుణికి పుచ్చుకోమనడం తప్ప. ఎప్పటికప్పుడు కొత్త తిట్లు, కొత్త కారణాలు వెదికే హిరణ్యకశిపుడిది నిరంతర పరిశ్రమ. గొప్ప మౌలికమయిన కృషి. ఞాూ ు–సశ– ా శ ాషె ెప| ి ుశి అన్నాడు సోమర్సెట్ మామ్.

ఈ ప్రశ్నకి ఏం సమాధానం వస్తుంది? ఇక్కడ ఈ ప్రోగ్రాంని నిలిపి –అయిదు నిముషాలు నిశ్శబ్దాన్ని ప్రసారం చేస్తే –నేను టీవీని విడువకుండా కూర్చునేవాడిని. ఇది గడుసయిన పదిరకాల సమాధానాలకు సిద్ధపడిన, నికార్సయిన 'రాజకీయపు' పాత్రికేయుని ప్రశ్న. మరి సమాధానం? ఇక్కడ ఆరు నమూనాలు.

"మీరెందుకు ఈ ప్రశ్న అడుగుతున్నారో మీకూ తెలుసు నాకూ తెలుసు" అని మోడీ చిరునవ్వు నవ్వి ఊరుకోవచ్చు.

"ఇలాంటి ప్రశ్నకి ఇప్పటికి లక్షసార్లు సమాధానం చెప్పాను" –మరో నమూనా.

"నేను ఏం చెప్పినా మీరు ఏం కెలుకుతారో నేను ఊహించగలను"

"సమాధానం లేదు"

కేవలం చిరునవ్వు.

"ఈ విషయమై విచారణ జరుగుతోంది. నా అభిప్రాయం ఇపుడు చెప్పడం సబబుకాదు"

"నేనేమనుకొని ఉంటానో మీరే ఊహించండి"

–ఇలా ఏదయినా కావచ్చు.

కాని –ఏమీ కంగారు పడకుండా (నేనూ పాత్రికేయుడినని మరిచిపోవద్దు) నిష్కల్మషంగా, ఏమీ నటనలేకుండా, అతి ఆర్ద్రంగా ఓ మాట అన్నారు.

"కారు వెనక సీట్లో కూర్చున్నా –ఓ చిన్న కుక్కపిల్ల కారుకిందపడినా మనసు కలుక్కుమంటుంది" –ఇవీ మాటలు.

ఇది ప్రత్యర్థులకి భగవద్గీత. కుహనా పాత్రికేయులకి, మనసులో మత విద్వేషణ పెట్టుబడిగా ఉన్నవారికి మృష్టాన్న భోజనం.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

ఇందులోంచి ఎవరూ ఊహించని విధంగా పుట్టుకొచ్చిన ఆలోచనా స్రవంతి మనవారి మౌలిక ప్రతిభకు కరదీపిక. వెనక సీట్లో అంటే మారణ హోమానికి ప్రత్యక్షంగా ప్రమేయం లేదు అనే సూచన కదా! అంటే పరోక్షంగా ఉన్నదనేగా అర్థం? కారుకింద కుక్కపిల్ల పడింది. కారులో నువ్వు ఉన్నావు. మరి దాని హింసకి నీ పాత్రలేదని ఎలా అనగలవు? పోతే, హింసాకాండలో హింసించబడినవారంతా 'కుక్క'లా? అంత నీచమయిన ఆలోచనా? ఎంత అహంకారం? ఎంత బాధ్యతారహితం? ఎంత దుర్మార్గం?

అప్పటికప్పుడు చెప్పారుకనుక –పోనీ, మరోమూడు నమూనా సమాధానాలను మోడీగారు చెప్పగలిగారనుకుందాం.

"ఒక పిల్లి కారుకిందపడితే...."

పిల్లి కాస్త మెరుగయిన ఉదాహరణగా ఉండేదా?

"ఒక పావురం పడితే..."

అప్పుడు ఈ దురంధరులు ఆ 'పావురం' మతం ఏమిటి? అని వెంట్రుకలు పీకేవారేమో.

"ఎలక్ట్రిక్ తీగెల మీద వాలిన పక్షిషాక్‌కి కిందపడి మరణిస్తే...."

మోడీ తాను 'విద్యుత్తు' ననుకుంటున్నాడేమో! అనో "మారణహోమంలో చచ్చిపోయినవాళ్లంతా దిక్కుమాలిన పక్షుల్లాగ రాలిపోయారు అని ఈసడిస్తున్నారు" అని దుయ్యబట్టేవారేమో!

ఏతావాతా –ఇన్ని అర్థాలు అప్పటికప్పుడు చెప్పిన ఆయన మాటల్లోంచి పుట్టుకు రావచ్చునని ఆరోగ్యంగా ఆలోచించగల ఎవరికీ తట్టదు. అయితే మన ఆలోచనల్లో ఆరోగ్యం చెడి ఎన్నాళ్లయింది? ఎదుటి వ్యక్తి యధాలాభంగా మాట్లాడిన మాటల్లో కూడా కుత్సితం ఉన్నదని అన్వయాలు చేసే పాత్రికేయుల, రాజకీయ దురంధరుల 'కంపు' నేటి వాతావరణం. ఊహించలేని సందర్భాలలో అర్థాలు కుక్కడం పాత్రికేయ వృత్తికి సొగసుని, హుందానీ ఇవ్వదు. నేను మోడీగారిని వెనకేసుకు రావడంలేదు. ఆపని నాదికాదు. కాని ఒక మామూలు వాక్యంలోంచి పెడర్థాలు తీయడం నాలాంటివారికి ఆశ్చర్యచకితుల్ని చేసిందని చెప్పడమే నా ఉద్దేశం. ఇంతకూ ఈ కసరత్తుని చూసేవారికి ఒకటి అర్థమౌతుంది. మోడీని దుయ్యపట్టాలనే తాపత్రయం పరోక్షంగా ఆయన ప్రాచుర్యాన్ని, ఉనికినీ, పరపతినీ పెంచుతుంది. నీడని చూసి భయపడేవాడు బలహీనుడు. కత్తిదూసేవాడు దుర్మార్గుడు –ఆ ఆలోచనలోనే దురుద్దేశం ఉంది కనుక.

ఏమైనా ఈ దేశం రాజకీయాలకి చక్కగా అద్దం పట్టిన కార్టూన్‌ని అమెరికాలో వండిన మా మిత్రుని కి ధన్యవాదాలు. ఈ వికారానికి ఇంతకంటే అద్భుతమయిన స్పందన మరొకటి ఉండదు.

(**జూలై** 29, 2013)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (August 05, 2013) Goonda Rajyam గూండారాజ్యం

ఈ దేశంలో నిజాయితీ బొత్తిగా చెల్లని సరుకు. ముఖ్యంగా ఆఫీసర్ల నిజాయితీ పక్కలో బల్లెం. ఆ విషయం ఎరిగిన చాలామంది ఐయ్యేయస్ ఆఫీసర్లు దీపముండగానే యిల్లు చక్కబెట్టుకుంటున్నారు. పాపం, శ్రీలక్ష్మి, రాజగోపాల్ వంటివారు వీధినపడి, కొందరు జైళ్ళలో పడినా మొత్తానికి నిజాయితీని అటకెక్కించడం బాగా కిట్టుబాటవుతున్న సందర్భాలే కనిపిస్తున్నాయి.

కొందరు ఐయ్యేయస్‌లూ, ఐపీయస్‌లూ బహిరంగ సభల్లో నాయకుల కాళ్లమీద పడి తమ విశ్వాసాన్ని తెలియజేస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. మరికొందరు ఆఫీసర్లు –ముఖ్యమంత్రి చెప్పుల్ని మెరుగుపెట్టి తమ నిజాయితీని చాటుకుంటున్నారు. వీరందరి మధ్యా –బొత్తిగా అనుభవం లేని, బొత్తిగా నేలబారు నిజాయితీపరులు –తొందరపడి వీధిన పడుతున్నారు. ఉత్తరదేశంలోనయితే నాయకుల అడుగుజాడల్లో నడవకపోతే జైళ్లకు వెళ్లే వరకూ శాల్తీలు మిగలవు. అక్కడి నాయకుల ముందు శషభిషలు పనికిరావు. దక్షిణ దేశంలోనయినా –ఏ నాయకులయినా –యింత కుండలు బద్దలుకొట్టినట్టు అవినీతిని సమర్థించారా చూడండి. ప్రస్థుత ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి చిన్నాయన –ఆయనా ఒక మంత్రి సత్తములు –ఐయ్యేయస్ ఆఫీసర్లకు బాబూ కష్టపడి పనిచేస్తే కాస్త దోచుకున్నా పరవాలేదు అని హితవు చెప్పారు.

ఆజం ఖాన్ అనే మరో సమాజ్‌వాది పార్టీ నాయకులు అన్నారు :"శ్రీరాముడి పేరిట కాస్త దోచుకోవచ్చు. ఈ దేశంలో ప్రకృతి వనరులు అందరి సొత్తు''

ఇలాంటి విజ్ఞానాన్ని –బరితెగించిన అవినీతిని మనవారికి వంటబట్టడానికి ఇంకా చాలా అనుభవం కావాలి. మరి తమ నీతిని పాటించని అమాయకుల గతి ఏమిటి? 1994లో బీహార్‌లో గోపాల్‌గంజ్ మెజిస్ట్రేటు జి.కృష్ణయ్య. ఓ సాదాసీదా తెలుగు పేద రైతు కుటుంబానికి చెందిన నిజాయితీపరుడు. ఆయన ఈ నాయకుల అడుగుజాడల్లో నడవలేదు. 1994లో ఒక రాత్రి తన విధిని నిర్వర్తించి తిరిగి వస్తూండగా జనతాదళ్ –యునైటెడ్ నాయకులు ఆనంద్ మోహన్‌సింగ్, ఆయన సతీమణి లవ్లీ ఆనంద్, మరికొంతమంది సాయుధ గూండాలు ఆయన జీప్‌ని ఆపి –ఆయన్ని రోడ్డుమీదికి ఈడ్చారు. సూటిగా తుపాకీని పేల్చారు. రక్తసిక్తమయిన శరీరంతో కిందపడి ఇంకా ప్రాణం వున్న కృష్ణయ్యని రాళ్లతో కొట్టి చంపారు. ఆ మధ్యనే డిఎస్‌పి మహమ్మద్ జియా ఉల్ హక్ మరో ఇద్దరిని ఉత్తరప్రదేశ్ మాజీ మంత్రి, కుందా ఎమ్మెల్యే రాజా భయ్యా, అతని అనుయాయులు దారుణంగా హత్య చేశారు.

రాజస్థాన్ అశోక్ ఖేమ్కా అనే ఆఫీసరుగారు సోనియా గాంధీ, రాబర్ట్ వదోద్రా స్థలాలు నియమ బద్ధంగా లేవని నిలదీశారు. ఆయన గుండెలు దీసిన సాహసం దేశమంతా చెప్పుకుంది. కనుక ఆయన్ని ఏమీ చెయ్యలేకపోయారు. కాని సర్వీసులో ఆయన సీనియారిటీని అయిదు స్థానాలు కిందకి లాగారు. ఆయన పాపం, నిజాయితీపరుడు. బొత్తిగా బతకనేర్వనివాడు. ఆయన్ని 21 సంవత్సరాలలో కేవలం 43 సార్లు మాత్రమే బదిలీ చేశారు. అంటే ప్రతీ ఆరు నెలలకీ ఆయనకి బదిలీ జరిగింది. మరొక అమాయకుడైన ఆఫీసరుగారున్నారు. ఆయన సి.ఉమాశంకర్. ఆయన నలభైయ్యో పడిలో ఉన్నారు. ఆయనకి కేవలం 19 సార్లు మాత్రమే బదిలీలు జరిగాయి. ఇంకా విచిత్రం ఏమిటంటే 108 రోజుల్లో రెండుసార్లు బదిలీ జరిగింది!

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

ఉత్తరప్రదేశ్‌లో మాయావతి హయాం లో డిడి మిశ్రా అనే డిప్యూటీ ఇనస్పెక్టర్ జనరల్‌గారు ఓ పొరపాటు చేశారు. మాయావతి గారిది అవినీతిపాలన అని ప్రకటించారు. మేడమ్ వారిని ఉద్యోగం నుంచి తొలగించి సరాసరి పిచ్చి ఆసుపత్రికి పంపించారు. పిచ్చి ఆసుపత్రికి వెళ్లడం మంచిదా? మన రాష్ట్ర ఆఫీసర్లలాగ జైళ్లకు వెళ్లడం మంచిదా? ఈ దేశంలో ఒకనాడు పాలక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలిచిన సివిల్ సర్వీస్ పరిస్థితి ఇది. నిజాయితీని గౌరవించే నాధుడు లేడు. కాగా, అవినీతికి కలిసివచ్చే కిట్టుబాట్లు ఉన్నాయి. ఉదాహరణకి –పాదమ్ సింగ్ అనే ఐపియస్ ఆఫీసరుగారు బహిరంగసభలో మాయావతి చెప్పులమీద ధూళిని భక్తితో తుడిచాడు. ఆయనకి వెంటనే రెండేళ్లు సర్వీసుని మేడమ్ పొడిగించారు! మొన్నటికి మొన్న దుర్గా శక్తి నాగ్‌పాల్ అనే 28 ఏళ్ల అమ్మాయి –ఆలిండియా సివిల్ సర్వీసు నియామకాల్లో 20 స్థానంలో నిలిచింది. గ్రేటర్ నోయిడాలో గౌతమబుద్ధ నగర్‌లో సబ్ డివిజనల్ మెజిస్ట్రేటుగా నియమితురాలయింది. వచ్చిన కొద్ది నెలలలోనే ఇసుకని దొంగ రవాణా చేస్తున్నవారి మీద కత్తి ఝుళిపించింది. రెండు నెలల్లో 297 లారీలను స్వాధీనం చేయించింది. ఎందరిమీదో కేసులు బనాయించింది. 80 లక్షల జరిమా నా వసూలు చేసింది.

ఈ ఇసుక మాఫియాని నిర్వహిస్తున్నది నరేంద్ర భాటీ అనే సమాజ్‌వాదీ పార్టీ నాయకులు. ఎంత సాహసం! ఎంత ధైర్యం! ఈ అమ్మాయికి బొత్తిగా అనుభవం లేదని భాటీగారు భావించారు. దెబ్బతీసే అవకాశం కోసం వేచి ఉన్నారు. మొన్న కాదల్‌పూర్ గ్రామంలో ఒక మతపరమైన కట్టడానికి ప్రభుత్వ స్థలంలో గ్రామీణులు గోడ కడుతున్నారని తెలిసి మెజిస్ట్రేటుగారు పరిస్థితిని చక్కబెట్టమని దుర్గాశక్తి నాగ్‌పాల్‌ని పంపారు. గ్రామీణులకి ఆమె హితవు చెప్పింది. బాబూ! ప్రభుత్వం అనుమతిని తీసుకుని గోడ కట్టండి. లేదా మీ అంతట మీరే ఆ పని మానుకోండి అని. గ్రామీణులు ఆమె మాట చెవినిపెట్టారు. గోడ నిర్మాణం మానుకున్నారు. సమస్య సదలిపోయింది. కాని గవర్నమెంటు ఊరుకోలేదు. మత వైషమ్యాలకు దారితీసే చర్య తీసుకున్నదని –అర్ధరాత్రి 1 –27 నిముషాలకు ఆమెని సస్పెండు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. ఇంకా గుండెలు తీసిన విషయమేమిటంటే ఈ నరేంద్ర భాటీ గర్వంగా మొన్న బహిరంగసభలో ఈ ఐయ్యేయస్ ఆఫీసరుని అర్ధరాత్రి కేవలం 41 నిముషాలలో సస్పెండు చేయించానని గర్వంగా రొమ్ము విరుచుకున్నారు. మనం ఏ కాలంలో ఉన్నాం? ఏ విధంగా మనం సోమాలియా, కాంగో వంటి దేశాలకంటే గొప్పవారం! ఒక గూండా బహిరంగంగా తన నేరాన్ని సభలో చెప్పి మరీ రొమ్ము విరుచుకునే స్థితిలో ఈ దేశ వ్యవస్థ ఉన్నదా!

ఇదీ నిజాయితీకి ఈ దేశంలో దక్కే బహుమతి. సమాజ్‌వాదీ పార్టీ మద్దతు కేంద్రానికి ప్రస్థుతం ఎంతయినా అవసరం. ఈ చదరంగంలో జీవితంలో అడుగుపెడుతున్న ఓ నిజాయితీతో, కార్యదక్షత గల ఆఫీసరు కెరీర్ బలి అయిపోయినా పెద్ద నష్టం లేదు. ప్రస్థుతం జైళ్లకు వెళ్లిన మన ఐయ్యేయస్‌లు ఇలాం టి భయంకరమైన చదరంగంలో తప్పనిసరయిన పావులయారేమో! మనకు తెలీదు. నిజాయితీపరులను రోడ్డుమీదకి ఈడ్చి మారణహోమం చేసే అభివృద్ధి దక్షిణాది ఇంకా సాధించలేదు. అయి తే మనకీ మంజూనాథ్ వంటి కథలున్నా యి. ఎంత చెట్టుకి అంతగాలి. పదవిలో ఉన్న మంత్రులే "అవినీతి' తప్పులేద ని కుండబద్దలు కొట్టేస్థాయి కి మన అవినీతి ఇంకా రాలేదని మనం గర్వపడవచ్చు. ఎప్పుడయి నా దొరికితేనే దొంగలు. లేకపోతే మంత్రులు!

(**ఆగస్టు** 5, 2013)



# (August 12, 2013) Tomotolu Ullipaayalu టొమాటోలు– ఉల్లిపాయలు

ఒక్కొక్కప్పుడు ఉద్యమాల వల్ల సాధించేవాటికన్నా ఉద్యమాల కారణంగా కలిసివచ్చే మేళ్లు –కొండొకచో రుచికరంగానూ, కడుపునింపేవిగానూ ఉంటాయి. అలాంటి సందర్భం –ఈ మధ్య చెన్నైలో కనిపించింది. అవేమిటి? టొమాటోలూ, ఉల్లిపాయలూ, అల్లం. ఎలాగో చెప్తాను. ఈ మధ్య ఉధృతంగా తెలుగుదేశంలో ఉద్యమం సాగుతోంది. ఎటునుంచీ లారీలూ, వాహనాలూ కదలడం లేదు.

ఉత్తరదేశం నుంచి ఆంధ్రప్రదేశ్‌కి బయలుదేరిన లారీలు మదనపల్లి దాటి రాలేకపోయాయి. వెనక్కి వెళ్తే సరుకు మురిగిపోతుంది. కనుక తమిళనాడు చేరుకున్నాయి. తమిళనాడులో –ఒక్క చెన్నైకే ప్రతిరోజూ 40 నుంచి 50 లారీలు వస్తాయి. కాని ఈసారి మరో 15 లారీలు ఎక్కువ వచ్చాయి. అప్పుడేమయింది? కూరగాయల ధరలు పడిపోయాయి. టొమాటోలు అంతవరకూ కేజీ 32 రూపాయలకి అమ్ముతున్నారు. ప్రస్థుతం 18 రూపాయలకే దొరుకుతున్నాయి. అ లాగే అల్లం కేజీ 175 రూపాయలుండేది. ఇప్పుడు 80 రూపాయలకి దిగిపోయింది. అయినావరంలో కేవలం కేజీ 40 రూపాయలకే ఉల్లిపాయలు దొరుతున్నాయి. ఉద్యమాల వల్ల ఉపయోగం లేదని ఎవరనగలరు! ఇంకా పొరుగు రాష్ట్రాలకు ఉపయోగపడే పనులను ఆయా ప్రభుత్వాల నాయకులు చేస్తున్న ఎన్నో మేళ్లు ఉన్నాయి. ఉదాహరణకి –మేలురకం సన్నబియ్యం. ఆ మధ్య తమిళనాడులో డిఎంకె నాయకులు కరుణానిధిగారు కిలో రెండు రూపాయలకే పేద ప్రజలకి బియ్యం ఇచ్చారు. ఆ బియ్యం కూడా మేలురకం బియ్యాన్ని కొనుగోలుచేసి మరీ ఇచ్చారు. ఆ బియ్యం ఏమయింది? పొరుగు రాష్ట్రాలయిన ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్రలకు లారీలకు లారీలే తరలిపోయాయి. సన్నబియ్యాన్ని తమిళ ప్రజలు సరసమయిన ధరలకు అమ్ముకుని –తమకి కావలసిన కాపుసారా, రొట్టెలు, మరేవో కొనుక్కుని సుఖపడ్డారు. అలాగే పేద విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు ఇచ్చారు. ఒక్క సైకిలుని –ఒక్క విద్యార్థి ఉపయోగించగా నేను చూడలేదు. సరసమైన ధరలకు చిన్న చిన్న ఉద్యోగులు కొనుక్కుని వాడుకున్నారు. అలాగే రంగు టీవీలను పేదలకు పంచారు. ఒకపక్క తాటాకు కప్పునుంచి వర్షం నీరు కురుస్తూండగా, బయట మురికి కాలువ కంపు దూసుకు వస్తూండగా పేదలు రంగు టీవీలలో సినిమాలు చూసి ఆనందించారా? వారంత తెలివితక్కువవారుకారు. సరసమయిన ధరలకు వాటిని అమ్ముకున్నారు. అదిన్నీ పక్క రాష్ట్రాలవారికి అమ్మారు. కారణం? స్థానికంగా అమ్మితే ప్రభుత్వం దృష్టికి వెళ్తుందని. ఇది గొప్ప రాజకీయ ఉద్యమం. తద్వారా పొరుగు రాష్ట్రాలకి జరిగిన మేళ్లు.

ఈ కాలమ్‌కి రాజకీయమైన రుద్దుడు ఏమీలేదు. టొమాటోలూ, ఉల్లిపాయలూ ఆంధ్రా వంట గదుల్లోనయినా, తమిళుల వంట గదుల్లోనయినా అవే ప్రయోజనాన్ని యిస్తాయని శెలవివ్వడమే ఉద్దేశం. ఓ ప్రాంతపు ఉద్యమం మరొక ప్రాంతపు వంటగదిదాకా ప్రయాణం చేసిందని తెలిసి ఆనందించడమే ఉద్దేశం. పేదవాడి గోడునీ, అతని కనీస దినసరి అవసరాల్ని కేంద్రం ఎలాగూ పట్టించుకోలేకపోతోంది. ప్రభుత్వం పెట్టిన ఆహార బిల్లు –ఇసుక తొక్కిడిగా గల్లాపెట్టెలు నింపుకుంటున్న రాజకీయ మాఫియాల పుణ్యమా అని అటకెక్కబోతోం ది. ఆ మధ్య చెన్నైలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో మా మనుమరాలిని చేర్చడానికి మా అబ్బాయితో కలిసి వెళ్లాను. నన్ను చూసి దూరం నుంచి ఇద్దరు కుర్రాళ్లు నవ్వారు. చెన్నైలో నన్ను పలకరించే కుర్రాళ్లు తెలుగువారే అయివుంటారని దగ్గరికి పిలిచాను. వారిద్దరిదీ హనుమకొండ. ఓ కుర్రాడి పేరు రాం భూపాల్‌రెడ్డి. సుబేదారి, హంటర్ రోడ్డు అడ్రసు. మా అబ్బాయి అక్కడ పుట్టాడు. "వెల్‌కం సోదరా" అని ఆనందంగా పలకరించాడు మా అబ్బాయి.




హనుమకొండలో కుర్రాడు చెన్నైలో ఎందుకు చదువుతున్నాడు? ఆంధ్రా ఉల్లిపాయ లు చెన్నై ఎందుకొచ్చాయి? అందుకే. అక్కడ గత మూడేళ్లుగా కుర్రాడి చదువు సాగడం లేదేమో. ఒక కుర్రాడి జీవితంలో మూడేళ్లు ఎంత విలువయినవో తండ్రికి తెలుసు. బహు శా ఆ తండ్రి హనుమకొండలో ఏ చిన్న ఉద్యోగం చేసుకుంటున్నాడో. ఇక్కడ బిడ్డని చదివించడానికి కనీసం మూడు రెట్లు ఎక్కువ ఖర్చు అవుతుంది. అతనికాస్థోమతు ఉందా? లేకపోయినా కొడుకు జీవితాన్ని ఓ దారి పట్టించడానికి వేరేమార్గం ఉందా? నిస్సహాయంగా ఆ తల్లిదండ్రులు రెక్కలు ముక్కలు చేసుకుని కొడు కు చదువుకోసం కష్టపడుతున్నారేమో. ఎన్నో ఆలోచనలు. ఒక ఉద్యమ ప్రభావం ఉల్లిపాయలో కనిపిస్తుందా? పక్క రాష్ట్రానికి పోవలసిన కుర్రాడి చదువులో ప్రతిఫలిస్తుందా? పొరు గు రాష్ట్రానికి చేరే మేలురకం బియ్యంలో కనిపిస్తుం దా? మూడు ఉదాహరణలు. మూడు మీ మాంసలు. మూడు లక్ష్యాలు. మూడు పర్యవసానాలు. మూడు ప్రభావాలు. మూడు వేర్వేరు కారణాలు. మూడు వత్తిడులు. ఉద్యమం ఒక ఆదర్శం. ఉల్లిపాయ ఒ క చిన్న ప్రభావం. ఇది ఉద్యమాన్ని ప్రశ్నించదు. కాని ఒక ప్రాం తపు ఆవేశం మరొక ప్రాంతపు కంచాన్ని, అవసరాన్ని తీర్చడం, ఒక ప్రాంతపు జీవిత లక్ష్యానికి మరొక ప్రాంతం ఆసరాకావడం అసంకల్పితమైన, యాదృచ్ఛికమైన సందర్భం. అంత మట్టుకే ఈ కాలమ్ పరిమితి.

(**ఆగస్టు** 12, 2013)




# (August 19, 2013) Malli Ulli మళ్ళీ ఉల్లి

పేదవాడి జీవనాధారం ఉల్లిపాయ. మా చిన్నతనంలో మా అమ్మమ్మ పులుసిన చద్దన్నంలో కాస్త నూనె వేసి చేతికి చిన్న ఉల్లిపాయని ఇచ్చేది. ఇప్పటికీ తలుచుకున్నా మత్తెక్కించే ఆహారం అది. తెలంగాణాలలో ఇప్పటికీ బడుగుజీవులకు ముఖ్య ఆహారం గొడ్డుకారం. పచ్చి ఉల్లిపాయ, ఎండు మిరపకాయలు, ఉప్పు. ఇంతే. అన్నంలో ఏది కలిసినా కలవకపోయినా –యిన్ని నీళ్లు పోసుకుని ఉల్లిపాయ కొరుక్కుని తిన్నవారిని నాకు తెలుసు. పేదవాడి భోజనానికి 'రుచి'ని ఇచ్చేది అదే. అతనికి ఆర్ధిక వ్యవస్థ తెలీదు. రాజకీయం తెలీదు. ధరల పెరుగుదలలెందుకు వస్తాయో తెలీదు. అతని దైనందిన జీవితంలో ఆ కాస్త అధరువు మాయమయితే ఎంతగా ఉపాధి కొరవడుతుందో తెలుసు. అందుకనే ఈ దేశంలో ఒక్క ఉల్లిపాయే ఢిల్లీలో ప్రభుత్వాలను గద్దె దించింది. రాజకీయ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. పేదవాడి గుండెకి లేని బలం అతని కడుపుకి ఉంది. అది అతని ఉపాధి కనుక. కనీస గ్రాసం కనుక.

ప్రస్థుతం ఉల్లిపాయ ఖరీదు కిలో 80 రూపాయలు. లోగడ కొన్ని సరుకులు కొన్నవారికి చిన్న వస్తువులు ఉచితంగా యిచ్చే వ్యాపారసూత్రం యిప్పటికీ ఉంది. అలా యివ్వడం వారిని ఊరించడానికి. ఒక కిలో కాఫీపొడి కొంటే ఒక చెంచా. ఒక పాకెట్ బిస్కట్లు కొంటే ఒక చిన్న స్టీలు గిన్నె. నాలుగు సబ్బులు కొంటే ఒక టంబ్లర్. నిన్న జంషెడ్‌పూర్‌లో సత్నాం సింగ్ గంభీర్ అనే ఆయన –టైర్ల కంపెనీ నడుపుతున్నాడు. మీరు కారుకో, లారీకో టైర్లు కొంటే 5 కిలోల ఉల్లిపాయలు ఉచితంగా యిస్తున్నట్టు ప్రకటించారు. ఈ కరువుని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చే మార్గం యిదొక్కటేనని అన్నారు. మా పనిమనిషి –ఉల్లిపాయ లేకుండా వంట చేసుకోలేని పేద వర్గానికి చెందిన వ్యక్తి. "అమ్మో, బంగారం తాకట్టుపెట్టి ఉల్లిపాయలు కొనుక్కొనే రోజులొచ్చాయి" అని వాపోయింది.

పాపం, మన పార్లమెంటు సభ్యులకి ఏ రూట్లోంచి తమ కంచాల్లోకి ఉల్లిపాయ వస్తోందో తెలియడంలేదు. కాని వారికి తెలిసేటట్టు చేసి –వారిని గద్దె దింపిన సందర్భాలు మన దేశ చరిత్రలో బోలెడున్నాయి. అలనాడు ఇందిరాగాంధీని జనతా ప్రభుత్వం గద్దె దింపడం చరిత్ర అయితే –కేవలం ఉల్లి ధరల కారణంగా జనతా ప్రభుత్వం కూలిపోవడం చరిత్ర. అయితే దరిమిలాను ఉల్లిపాయ ఆమెకీ కళ్లనీళ్లు తెప్పించింది. అప్పట్లో ఉల్లి ధర కేజీ ఆరు రూపాయలయింది. ఆరుకీ ప్రస్థుతం ఎనభైకీ మధ్య రూపాయి విలువ క్రుంగిపోవడమే ముఖ్యకారణం. రూపాయి ధర తరిగింది. ఉల్లి ధర పెరిగింది.

ఇప్పుడిప్పుడు తిట్టుకోవడంలో, కొట్టుకోవడంలో, అరుచుకోవడంలో, కరుచుకోవడంలో పార్లమెంటు సభ్యులు బరితెగించారు గాని ఆ రోజుల్లో సభ్యతతో కూడిన హాస్యానికి, చమత్కారానికి పార్లమెంటు కూడలిగా ఉండేది. ఇందిరాగాంధీ ప్రభుత్వం ఉల్లి ధరని అదుపులో పెట్టలేనందుకు నిరసనగా ఆనాటి లోక్‌దళ్ సభ్యులు రామేశ్వర సింగుగారు రాజ్యసభలోకి ఉల్లిపాయల దండ వేసుకుని వచ్చారు. అప్పటి రాజ్యసభ చైర్మన్, అప్పటి ఉపరాష్ట్రపతి హిదయతుల్లాగారు. ఆయన చమత్కారానికి, సున్నితమైన హాస్యానికి పెట్టింది పేరు. సింగు గారిని చూస్తూ "ధరలు పెరిగింది ఉల్లిపాయ కావడం వల్ల బతికిపోయాం. అదే ఏ కారు టైర్లో, చెప్పులో అయితే గౌరవసభ్యులు యిబ్బందిలో పడేవారు పాపం" అన్నారు. ఈ రామేశ్వర సింగుగారే రాజ్యసభ చైర్మన్ బల్లమీద 1300 రూపాయలు పెట్టి చవక ధరలకు ఉల్లిపాయలు తెప్పించండి అన్నారు. వెంటనే కాంగ్రెస్ సభ్య లు హరిసింగ్ నల్వాగారు ఆ డబ్బుని అందుకుని జేబులో వేసుకుని 'అలాగే' అన్నారు. ఒక సమస్యకి ఆరోగ్యకరమైన నిరసన,




దానికి చమత్కారాన్ని జతచేసిన సందర్భం, 33 సంవత్సరాల తర్వాత కూడా గుర్తు చేసుకొనే ఔచిత్యం –యిన్నిటికి ఆటపట్టు ఆనాటి పార్లమెంటు.

అయితే కేవలం ఉల్లి ధరల పెరుగుదల కారణంగా ఆనాడు (1998) ఢిల్లీ, రాజస్థాన్ ప్రభుత్వాలు కూలిపోయాయి. 2000 లో నాసిక్‌లో జరిగిన ఎన్నికల సభలో బిజెపి నాయకులు ప్రమోద్ మహాజన్ మీద ఉల్లిపాయల వర్షాన్ని సభికులు కురిపించారు. ఇవాళ ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ చైర్మన్ గారికి చెప్పాల్సిన రోజులొచ్చాయి. "అయ్యా, ఈ దేశంలో ప్రజల పేదరికానికి కొలబద్ద వారి దినసరి ఆదాయం కాదు. ఉల్లిపాయని తిని ఎన్నిరోజులయిందో వాకబు చేయించండి" అని. ఉల్లిపాయల మీద ఇంటర్నెట్లో రకరకాల ట్విట్టర్‌లు చిటపటమంటున్నాయి. "అయ్యా, బాంకుల మేనేజర్లూ! ఉల్లిపాయలు తాకట్టు పెడితే అప్పులిస్తారా?" అని ఒకాయన రాశారు. మరొకావిడ "కట్నం మాట దేవుడెరుగు. ఓ కారునిండా ఉల్లిపాయలతో వచ్చినాయన్ని పెళ్లి చేసుకుంటాను" అన్నారు. మరొకాయన "బప్పీ లహరిగారు ఈ మధ్య ఫేషన్ మార్చారు. పూలదండలకి బదులు అందంగానూ, ఖరీదుగానూ ఉంటాయని ఉల్లిపాయల దండలను ధరిస్తున్నారు" అన్నారు.

ప్రస్థుతం ఇరాన్, ఈజిప్టు, చైనా, పాకిస్థాన్‌ల నుంచి దిగుమతికి నాయకులు ఆలోచనలు చేస్తున్నారని తెలుస్తోంది. ఉల్లిపాయలు సమృద్ధిగా పండించే రాష్ట్రాలు –మహారాష్ట్ర, కర్ణాటకలలో ఆ మధ్య కరవు, ఈ మధ్య అధిక వర్షాలు కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. అయితే అక్టోబరులో మరో పంట మార్కెట్లోకి వచ్చేలోగా వర్తకులు సరుకుని దొంగ నిలవలు చేసి –కృత్రిమమైన కరవుని సృష్టిస్తున్నారని వాణిజ్య వర్గాలు చెప్తున్నాయి. ఉల్లి చేసిన మేలు తల్లికూడా చెయ్యదని సామెత. కాని ఉల్లిని అశ్రద్ధ చేస్తే ఉల్లిచేసే కీడు ఏ తల్లీ, ఏ నాయకుడూ తట్టుకోలేనిదని భారత 'ఉల్లిపాయ' నిరూపించడం ఈ దేశంలో చరిత్ర. పేదవాడి హృదయం కంటే పేదవాడి కడుపు రగిలితే రాజకీయ నాయకులు కుర్చీలు దిగవలసి వస్తుందని ఈ దేశంలో పదే పదే నిరూపణ జరిగింది. నాకు రాజకీయాలలోకి వచ్చే ఆలోచన ఏనాడూ లేదు. ఏతావాతా రావడం సంభవిస్తే యిప్పుడే రిజర్వు చేసుకుంటున్నాను –నా ఎన్నికల చిహ్నం –ఉల్లిపాయ.

(**ఆగస్టు** 19, 2013)




# (August 19, 2013) MalathiChandur ZnapakAlu మాలతీచందూర్ జ్ఞాపకాలు

నేను పుట్టిన పదేళ్ళకి ఆవిడ మొదటి కథ పుట్టింది. పేరు 'రవ్వల దుద్దులు '. ఏలూరులో ఆవిడ చిన్నతనం గడిచింది. తెలుగు భాషని డ్రాయింగు రూముల్లోకి తెచ్చిన కొవ్వలి లక్ష్మీ నరసింహారావుగారు, బంగారు మామని పరిచయం చేసిన కొనకళ్ళ వెంకట రత్నంగారు, ఎంకి – నాయుడు బావ సృష్టి కర్త నండూరు సుబ్బారావుగారు, 'బాలబంధు ' బి.వి.నరసింహారావుగారు మొదలైన వారు ఇంటికి తరచు వచ్చిపోతూండేవారు. వీరు కాక 'ఆనందవాణి ' పత్రిక చిన్నతనం నుంచే ఆవిడకి వ్యసనం. కాగా ఎన్.ఆర్.చందూర్ గారు సొంత మామయ్య. మాలతిగారు చిన్నప్పుడు అల్లరిచేస్తూ 'టాం బాయ్'లాగ ఉండేవారు ఆమె మాటల్లోనే . మామయ్య ఆమెని కోరి పెళ్ళి చేసుకున్నారు. వారిద్దరూ ఆనాటి మద్రాసులో రైలు దిగి – ఆ రోజుల్లో టాక్సీలు, ఆటోలు లేవు – ఒంటెద్దు బండి కట్టించుకుని జార్జి టౌనులో ఒక లాడ్జిలో దిగారట. అదీ వారి మద్రాసు నగర ప్రవేశం. అప్పట్లోనే వారి గదికి ఒకాయన వచ్చిపోతూండేవారు – ఆచంట జానకిరాం. మరొకాయన – ఎస్.ఎన్.మూర్తిగారు. ఇంతమంది సాహితీపరుల మధ్య – చిగురుకొమ్మయినా వికసించే వాతావరణం. ఆమెని రేడియోకి తీసుకెళ్ళారు చందూర్ గారు. ఆమె లొడలొడ మాట్లాడుతున్నారు – ఆమెకి తెలియకుండానే టెస్టు జరిగిపోయింది. అంతే. మొదటి రేడియో ప్రసంగం రాశారు. ఆమె ఏం రాసినా చందూర్ గారి పర్యవేక్షణ ఉండేది. రాతలో మధ్య మధ్య అక్షరాలు ఎగిరిపోయేవి. వాటిని చందూర్ గారు సరిచేసేవారు. ఈ పని తేలికగా 60 సంవత్సరాలు పైగా ఆయన చేశారు. చందూర్ గారు ఆమెకి స్నేహితుడు, మార్గదర్శి, పర్యవేక్షకులు, హితైషి, మేనేజరు – ఆ తర్వాతే భర్త అని ఆవిడ నాతోనే "వందేళ్ళ కథకు వందనాలు" ఇంటర్వ్యూలో చెప్పారు.

52 సంవత్సరాలు ఆగకుండా పాఠకలోకాన్ని తన 'ప్రమదావనం' అనే శీర్షికతో అలరించిన ఘనత మరే రాష్ట్రంలోనూ, ఏ భాషలోనూ ఎవ్వరూ సాధించలేదు. మొదట కొన్ని రచనలకు పాఠకుల స్పందన అంతగా రాలేదట. ఆలోచించి ఒక పుస్తకం ప్రచురించారు. తెలుగు శాఖాహార వంటల గురించి "వంటలూ – పిండి వంటలూ" అనే పుస్తకం. ఇది తెలుగుదేశంలో ఒక విప్లవం. ఇది లేని ఇళ్ళు, చదవని ఇల్లాలు, వంటగదిలో జొరబడి ఆమె సహాయంతో వంట చేయని సందర్భమూ లేదు. తదాదిగా పెళ్ళిళ్ళలో ఇప్పటికీ దంపతులకిచ్చే బహుమతుల్లో "వంటలూ – పిండి వంటలు"దే అగ్రస్థానం. ఇప్పటికీ ఈ పుస్తకం 29 సార్లు పునర్ముద్రణ అయింది. అన్ని పునర్ముద్రణలకు నోచుకున్న గ్రంథం తెలుగులో మరొక్కటే ఉంది. అది విశ్వనాథ "వేయిపడగలు".

మాలతీ చందూర్ ఏ స్కూలుకీ వెళ్ళి చదువుకోలేదు. సంప్రదాయ యుక్తమైన బడి చదువులు సాగలేదు. అయితే ఇంటిలోనే ఆమెకో పెద్ద మాష్టారు ఉన్నారు. చందూరుగారు. అన్నిటికీ మించి – మనసులో పెద్దబడబానలం ఉంది. చదవాలని. ప్రపంచ సాహిత్యంలో అన్ని గొప్ప నవలలూ చదివారు. అక్కడితో ఆగలేదు. దాదాపు 300 నవలలను తెలుగులో అనువదించి ప్రచురించారు. జేన్ ఆస్టిన్, డాఫ్నే దూ మారియర్, పెరల్ బుక్ దగ్గర్నుంచి వాసుదేవన్ నాయర్, తస్లీమా నస్రీన్ 'లజ్జ ', అరుంధతీ రాయ్ వరకూ ఎందరినో తెలుగు పాఠకులకు పరిచయం చేశారు. ఈ నవలలన్నీ పది సంపుటాలుగా ప్రచురితమయాయి. ఇవి కాక 'శతాబ్ది సూరీడు ', 'శిశిర వసంతం ', 'భూమి పుత్రి ', 'హృదయనేత్రి ', 'ఆలోచించు ', 'కలల వెలుగు ', 'మనసులోని మనసు ', 'కొత్త కెరటాలు ' మొదలైన నవలలు రాశారు.









ఇక మద్రాసు వస్తే వారింటికి రాని, వారి ఆతిధ్యం తీసుకోని సాహితీ ప్రముఖులు భారతదేశంలో ఉండేవారు కాదు. అది ఒక విధంగా ఎన్.ఆర్.చందూర్ గారి పుణ్యం. చలం, కొడవటిగంటి కుటుంబరావు, బెజవాడ గోపాలరెడ్డి, వాసుదేవన్ నాయర్ – ఎవరైనా. కచ్చేరీ రోడ్డులో వారి ఇల్లు – మద్రాసు వచ్చేవారికి ఒక సందర్శనా స్థలం.

మా గొల్లపూడి శ్రీనివాస్ ఫౌండేషన్ కార్యక్రమాలకి వారిద్దరూ తప్పనిసరిగా వచ్చే అతిథులు. ముందు రోజు వేసే పూర్తి సినిమా ప్రొజెక్షన్ కి తప్పక వచ్చేవారు. "మీరిద్దరూ దంపతులు. కానీ ఎవరికి వారే ప్రముఖులు. మీకు వేర్వేరు ఆహ్వానాలు పంపుతాను" అనేవాడిని. మా అవార్డు, మేం చేసే కృషికి ఆమె పొంగిపోయేవారు.రెండవ సంవత్సరం బహుమతి ప్రధాన సభ అయాక ఫోన్ చేశారు. "నిన్న పెళ్ళివారిని పంపించే హడావుడిలో ఉంటారని చెయ్యలేదు. ఇవాళ చేశాను. కిందటి సంవత్సరం శ్రీనివాస్ పారాడాడు. ఇవాళ అడుగులు వేస్తున్నాడు. సభ చాలా గొప్పగా ఉంది. నిన్న ఓ వాక్యం చదివాను. అది మీకు వర్తిస్తుందని చెప్పాలనుకున్నాను. వెలుగులో ఉన్నవాడు చీకటి వస్తుందని భయపడతాడు. చీకటిలో ఉన్నవాడు – ఏ చిన్న వెలుగు కనిపించినా దాని వెనుక నడిచిపోతాడు. మీరీపని చేస్తున్నారు.అది సామాన్యమైన విషయం కాదు" – ఇవీ ఆవిడ మాటలు.

నగరంలో ఏ సాహితీ సభ జరిగినా చందూర్ దంపతులు లేకపోతే వెలితిగానే ఉండేది. ఎన్.ఆర్. చందూర్ గారు పోయాక రాశాను. 'ఓ గొప్ప చిత్రపటంలో సగం బొమ్మ చెరిగిపోయిందని. ఇప్పుడు బొమ్మ పూర్తిగానే మాయమయింది. ఆమె పొట్టి శ్రీరాములు కేంద్రం అధ్యక్షురాలు. రమ్మని పిలిచేవారు కాదు. రావాలని శాసించేవారు. నా చేత ఆంధ్ర రాష్ట్రావతరణ దినాన పొట్టి శ్రీరాములుగారి విగ్రహానికిపూలదండ వేయించారు. ఇవన్నీ మధుర స్మృతులు. ఆమె బాపు, రమణల అభిమాని. వారిద్దరూ ఆమె అభిమానులు. ఒకసారి బాపూగారి చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేసి, నన్ను ఉపన్యాసకునిగా పిలిచారు. నా ఆత్మకథ మీద ఒక పత్రికలో తేలికగా ఆరు పేజీల సమీక్ష రాశారు. కోరి తెప్పించుకుని చదివి మరీ.

చందూర్ గారు ఆమెని ఎటువంటి అభిప్రాయబేధాలు, వివాదాల జోలికి పోనిచ్చేవారు కాదు. ఆయన ఆమె సాహితీ జీవితానికి పెద్ద గొడుగు. ఆమె కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి, రాష్ట్ర సాహిత్య అకాడమీ బహుమతి, పద్మావతీ విశ్వవిద్యాలయం డాక్టరేట్, గృహలక్ష్మి కంకణం, లోక్ నాయక్ ఫౌండేషన్ పురస్కారం – ఇలాగ అందుకోని గౌరవం లేదు. రెండేళ్ళ కిందట తన 94 వ ఏట చందూర్ గారు నిష్క్రమించారు. అది మాలతీ చందూర్ జీవితంలో పెద్ద విషాదం. ఈ రెండేళ్ళూ ఆమె మనస్సుని నిలదొక్కుకోలేకపోయారు. ఈ వయసులో పెద్ద అండని, స్నేహితుడినీ దూరం చేసుకున్న విషాదమది. "ఆయన మీకెలా జ్ఞాపకం ఉంటారు?" అని ఒక అర్థం లేని ప్రశ్న వేశాను – వందేళ్ళ కథ రికార్డింగులో. "ఆయన్ని మరిచిపోయిందెప్పుడు?" అన్నారు విషాదంగా. మొన్న ఆమె శలవు తీసుకునే నాటికి జ్ఞాపకాలతో కుచించుకుపోయిన 40 కేజీల శరీరంలోంచి హంస లేచిపోయింది. తను పోయాక కూడా సమాజానికి ఉపయోగపడే కృషి చేసిన ధన్యురాలామె. తన భౌతిక దేహాన్ని రామచంద్ర మెడికల్ కాలేజ్ కి అప్పగించిపోయారు.

**(ఆగస్టు** 26, 2013)



# (September 02, 2013) Sangeethaniki Ellalunnayi సంగీతానికి ఎల్లలున్నాయి

ఇద్దర్నీ దర్శించుకోడానికే నేనూ, మా ఆవిడా చాలా సంవత్సరాల క్రితం వారణాశి వెళ్లాం. కాశీవిశ్వేశ్వరుడిని, భారత రత్న ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ ని. ఇద్దరిముందూ సాష్టాంగపడి నమస్కారాలు చేశాం. బిస్మిల్లాఖాన్ కి అత్యంత శ్రద్ధాభక్తులతో శాలువా కప్పాను. లలిత కళలకీ ముస్లింలకీ అవినాభావ సంబంధం. చిత్రకళ, కవిత్వం, సంగీతం, అభిరుచి, అందం –అన్నింటిలోనూ వారికి ప్రథమ తాంబూలం. అది వారి గొప్ప అదృష్టం. సమాజంలో అందరికీ గొప్ప అవకాశం.

కాగా, ముస్లిం ఛాందసుల దృష్టిలో మతంలో వీటిలో వేటికీ స్థానం లేదంటారు. ఇది ఆశ్చర్యకరం. అనూహ్యం. కె.అసిఫ్ "మొగల్ –ఏ–ఆజమ్", యూసఫ్ఖాన్ (దిలీప్‌కుమార్) సలీం, నౌషాద్ సంగీతం, బడే గులాం ఆలీఖాన్ తుమ్రీ –వీటన్నింటిలోనూ దేవుడు లేకపోతే –ఆయన ఎక్కడ దాగొన్నట్టు!

మహ్మద్ రఫీ గొంతులో లేకుండా ఈ దేవుడు ఎలా తప్పించుకుంటాడు? తలత్ మహమ్మద్ గజల్‌లో, మీర్జాగాలిబ్ సాహిత్యంలో, ఉమర్ ఖయ్యాం సూఫీ తత్వంలో, మెహదీ హసన్ పాటలో, గులాం ఆలీ గొంతులో, బేగం అఖ్తర్ ఖయాల్‌లో, అల్లావుద్దీన్ ఖాన్ దాద్రాలో, నర్గీస్ సౌందర్యపు ఠీవిలో –వీటన్నిటిలో కనిపించని దేవుడు ఏం చేస్తున్నట్టు? బిస్మిల్లా ఖాన్‌కి నేనెవరో తెలీదు. తెలిసే అవకాశం లేదు. తెలియాల్సిన అవసరమూ లేదు. నేను పద్మభూషణ్ పినాకపాణిగారి అన్నగారి అల్లుడినని –ఆయనకి అర్థమయే గొప్పతనాన్ని ఎరువు తెచ్చుకుంటే ఆయన తెల్లమొహం వేశారు. బహుశా ఆయన పినాకపాణి పేరు కూడా వినలేదేమో! ఇంకా విశేషమేమిటంటే గంట తర్వాత నేను శలవు తీసుకోడానికి లేస్తే –కాస్త సిగ్గుపడుతూ 'మీ పేరేమిట'ని అడిగారు! లౌకికమయిన గుర్తులు ఆయన మనస్సు పరిధివరకూ కూడా పోలేదు!

వారింటినుంచి కాశీవిశ్వనాథుడి ఆలయం కూతవేటుదూరం. స్వామిని ఎప్పుడయినా దర్శించుకుంటారా? అని అడిగాను. "ప్రతిరోజూ పలకరిస్తాను" అన్నారు. 'ఎలా?' అని నా ప్రశ్న. వెంటనే ఆ వృద్ధాప్యంలోనే ఆలాపన ప్రారంభించారు. 'ఏ రాగం?' అన్నాను. బిలావల్ అన్నారు. అంటే కర్ణాటక సంగీతంలో శంకరాభరణం! ఆ మధ్య మా గొల్లపూడి శ్రీనివాస్ జాతీయ బహుమతి పురస్కార సభకి ప్రపంచ ప్రఖ్యాత సరోద్ విద్వాంసులు పద్మ విభూషణ్ ఉస్తాద్ అంజాద్ ఆలీ ఖాన్‌ని ఆహ్వానించాం. అలాంటి మహానుభావుల సమక్షంలో నిలిచినందుకే ఒళ్లు పులకరిస్తుంది. ఇంకా మరిచిపోలేని సంఘటన ఏమిటంటే –ఆనాడు ఆయన కారు దిగగానే వెళ్లి పాదాభివందనం చెయ్యబోయాను. అంతే. వెంటనే ఆయన వొంగి నాకు పాదాభివందనం చేశారు. (ఫొటో చూడండి).






***పాండిత్యం అఖండమయిన తేజస్సు. వినయం దాని మొదటి లక్షణం. ఆర్ధ్రత దాని స్వరూపం.*** నాకు కళ్లనీళ్లు తిరిగాయి. ఆయనకీ తిరిగాయి. ఎక్కడిదీ మత మౌఢ్యం? ఇంత సంపదని భగవంతుడు వారికిస్తే దాన్ని రాజకీయ కారణాలకి అటకెక్కించి మూర్ఖత్వం ఎంత దయనీయం? రేపు కాశ్మీరులో మొట్టమొదటిసారిగా జర్మన్ రాయబార కార్యాలయం నేతృత్వంలో ప్రపంచ ప్రఖ్యాత సంగీత విద్వాంసుడు రూబిన్ మెహతా నిర్వహిస్తున్న బెర్లిన్ ఫిల్‌హార్మోనిక్ వాద్యసమ్మేళనాన్ని కాశ్మీర్ వేర్పాటువాదులు వ్యతిరేకిస్తున్నారు. ఈ సంగీతోత్సవం జరగడానికి వీల్లేదని అడ్డుపడుతున్నారట. కేవలం రాజకీయాల కారణంగా తమ మతంలో సంగీతానికి తావులేదని వీరి వాదన. ''బాబూ! ఈ సృష్టిలో ముస్లింలు లేకపోతే సంగీతంలో ఓ సింహభాగం లేనట్టే'' అని ఈ రాజకీయవాదులకి చెప్పాలని నాకనిపిస్తుంది. నామట్టుకు –వీలయితే జుబిన్ మెహతా ప్రదర్శనకి పరాయి దేశానికయినా వెళ్లి హాజరుకావాలని అనిపిస్తుంది. రేపు సెప్టెంబరు 5న కేవలం నసీరుద్దిన్ షా నాటకం 'డియర్ లయర్' చూడడానికి బెంగుళూరు వెళ్తున్నాను –20 వేలు ఖర్చుపెట్టి. అది నాకు ఆనందం. కొన్ని సంవత్సరాలపాటు కేవలం నాటకాలు చూడడానికే లండన్ వెళ్లివచ్చేవాడిని. అది నా అదృష్టం. నేను జర్మనీలో కొలోన్ అనే పట్టణానికి వెళ్లాను. న్యాయంగా కొలోన్‌ని ఎవరూ గుర్తుంచుకోనక్కరలేదు. విశాఖ జిల్లాలో ఎలమంచిలి ఎవరిక్కావాలి? –న్యాయంగా. కాని కావాలి బాబూ! కావాలి. కారణం –150 ఏళ్ల కిందట అక్కడ గురజాడ అప్పారావుగారు పుట్టారు. అలాగే కొలోన్‌లో ఒక చిన్న వీధిలో ప్రపంచానికి కొత్త గానానికి మార్గదర్శకుడైన ఒక




మహానుభావులు తన జీవితమంతా గడిపాడు. ఆయన బిథోవెన్. నేను ఆ చిన్న ఇంటికి వెళ్లి మేడమీద గదిలో ఆయన ప్రపంచాన్ని మత్తెక్కించిన సింఫొనీలను సృష్టించిన పియానో ముందు నిలబడి పులకించాను. జీవితంలో విధివైపరీత్యమేమిటంటే –ఆయన సింఫొనీలను ప్రపంచమంతా విని తన్మయులయేనాటికి ఆయన ఏమీ వినలేని చెవిటివాడయాడు! తలుచుకుంటే కళ్లలో నీళ్లు తిరుగుతాయి.

రేపు కాశ్మీర్‌లో దాల్ సరస్సు సమీపంలో జబర్వాన్‌లో జుబిన్ మెహతా వాద్యాలతో బిథోవెన్ ఐదవ సింఫొనీ, బ్రక్నన్ ఎనిమిదవ సింఫొనీని వాయిస్తూ కాశ్మీర్ లోయలో సంగీత వైభవాన్ని సృష్టిస్తున్నప్పుడు –దశాబ్దాలుగా స్పర్ధలతో, వైషమ్యాలతో, హత్యలతో, కావేషాలతో అతలాకుతలమయిన కాశ్మీర్ సేదతీరదా అని అస్మదాదుల ఆలోచన. ***రాజకీయం మనస్సుల్లో, పరిసరాల్లో, జిల్లాల్లో, ఇళ్లల్లో క్రూరంగా ఎల్లలను నిర్దేశిస్తుంది. కళ వాటితో ప్రమేయం లేని కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తుంది***. అయితే జుబిన్ మెహతా సంగీత ప్రదర్శనని తిరస్కరించిన మరొక సందర్భం ఉంది. అది 1981లో ఇజ్రేల్‌లో జరిగింది. ఇజ్రేల్ రాజధాని తెల్ అవివ్‌లో రిచర్డ్ వాగ్నర్ 19వ శతాబ్దపు సంగీత సృష్టిని ఆవిష్కరిస్తున్నప్పుడు –ఒకప్పుడు నాజీలు ఆ సంగీతాన్ని ఆహ్వానించిన కారణంగా, యాంటీ సెమిటిజమ్ పేరిట యూదులు వ్యతిరేకించారు. ఇది రెండవసారి.

రాజకీయాలు కారణంగా కాశ్మీర్ అస్తవ్యస్థమయే తరుణంలో –ప్రయత్నిస్తే మరో స్థాయిలో ఒక కళ –సంగీతం అద్భుతమైన సామరస్యానికి తలుపులు తెరవగలదని జుబిన్ మెహతా –ఒక సాయంకాలం నిరూపించే సదవకాశాన్ని ముస్లిం ఛాందసులు దుర్వినియోగం చేసుకోరని ఆశిద్దాం. రాజకీయాలూ, స్పర్ధలూ సంబంధాలను ప్రయోజనాలకు ముడిపెడతాయి. కాని ***కళలూ, సంగీతమూ ప్రయోజనాలను మరిపించి సంబంధాలను మరింత సుసంపన్నం చేస్తాయి. ఆలోచన మనుషుల మధ్య అసహ్యకరమైన గీతలు గీస్తుంది. కళ మనసు స్థాయిలో ఆ గీతల్ని చెరిపేసి –అలౌకికమైన స్థాయిలో నూతన ప్రపంచాన్ని ఆవిష్కరించి అద్భుతమైన సామరస్యానికి తలుపులు తెరుస్తుంది.***

( **సెప్టెంబర్** 02, 2013 )




# (September 09, 2013) Jaillalo Chillara Devullu జైళ్లల్లో 'చిల్లర' దేవుళ్లు!

మా చిన్నతనంలో ఎవరినయినా పరిచయం చేస్తూ "ఈయన స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలుకి వెళ్లారు" అంటే దేవుళ్లని చూసినట్టు చూసేవాళ్లం. ఆనాడు అది అరుదైన త్యాగం. అప్పటి మహానాయకులంతా జైళ్లకి వెళ్లి వచ్చినవారే. తిలక్ జైల్లో 'భగవద్గీత' వ్యాఖ్యానం రాశారు. రాజాజీ మహాభారతం, భాగవతం, రామాయణం వంటి పురాణాలను అతి సరళమయిన భాషలో జైల్లోనే రాశారు. నెహ్రూ 'ది డిస్కవరీ ఆఫ్ ఇండియా' రాశారు. మరో కారణానికి జైలుకి వెళ్లిన ప్రముఖ రచయిత ఆస్కార్ వైల్డ్ 'డి ప్రొఫండిస్' అనే స్మృతి కావ్యం రాశారు. ఆ రోజుల్లో పరాయి ప్రభుత్వం గొప్ప గొప్ప నాయకుల్ని జైళ్లలో పెట్టింది. ప్రస్తుతం మన నాయకులు నేరాలు చేసి జైలు పాలవుతున్నారు. కొందరు జైళ్లనుంచే పార్లమెంటుకీ, రాష్ట్ర శాసనసభలకీ ఎన్నికవుతున్నారు. పైగా అలా ఎన్నికకావడం –సిగ్గుగానో, నామోషీగానో కాక తమ హక్కుగా భావించే నిస్సిగ్గు దశకి రాజకీయ నాయకత్వం వచ్చింది. ఇది ఒక పార్శ్వం.

పార్లమెంటులో ఏ విషయంలోనూ అన్ని రాజకీయ పార్టీలూ ఏకాభిప్రాయానికి రాని చరిత్ర ఉండగా –ప్రతిపక్షాలు తమ మాటని నెగ్గించుకోడానికి నెలల తరబడి పార్లమెంటు నడవకుండా అడ్డుపడుతూండగా –కేవలం మూడు అంశాల్లో రాజకీయ పక్షాలన్నీ భేషరతుగా ఏకాభిప్రాయానికి రావడం గమనార్హం. 1. పార్లమెంటులో మహిళల ప్రాతినిధ్యం బిల్లు. తమ ఉనికి ఎంతమాత్రం వదులుకోడానికి ఇష్టపడని మగనాయకుల నిర్ద్వంద్వమైన ధోరణి ఇది. 2. పార్లమెంటు సభ్యుల జీతాలు, భత్యాల బిల్లు. ఏ చిన్న కారణానికయినా ఎవ్వరూ విభేధించలేదు. 3. మూడోది మరీ ముఖ్యమైనది. ఈ మధ్య ఈ దేవుళ్ల బెడద మరీ రెచ్చిపోయే దశకి రావడాన్ని ఇటు దేశమూ, అటు న్యాయస్థానమూ గమనిస్తూ –నేర చరిత్ర ఉన్న ఏ రాజకీయ నాయకుడికీ ఎన్నికలలో పోటీచేసే హక్కులేదని సుప్రీం కోర్టు బెంచీ ఈ మధ్య చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది.

అయితే –ఈ ఒక్క విషయంలోనే దేశంలోని రాజకీయ పార్టీలన్నీ ఏకాభిప్రాయానికి వచ్చేశాయి! కారణం –దేశంలో ఎవరి పార్టీల దేవుళ్లు వాళ్లకి ఉన్నారు. వాళ్ల డబ్బు, జులుం, వర్గ బలం, కులం –మరేకారణంగానయినా వాళ్లని కదపలేని దుస్థితి ఆ పార్టీలకు ఉంది. కదపడం వారి అభీష్టం కూడా కాదేమో! నిజానికి సుప్రీం కోర్టు తాఖీదు అమలులోకి వస్తే మన మధ్యనుంచి చాలామంది దేవుళ్లు శాశ్వతంగా జైళ్లకి వెళ్తారు. వారి వర్గం ఓట్లు కారణంగా ఒకప్పుడు యెద్యూరప్ప ఆ పార్టీలో ఓ వెలుగు వెలిగి –పార్టీని బెదిరించిన కథలు మనము చదివాం. ప్రస్థుత ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి చిన్నాన్న కాస్త దోచుకుంటే పరవాలేదని ఐయ్యేయస్ ఆఫీసర్లకి హితవు చెప్పడం మనం విన్నాం. ప్రస్థుత కాంగ్రెస్ మంత్రి బేణీ ప్రసాద్‌గారు 37 కోట్లు పెద్ద అవినీతి కాదని చిరునవ్వు నవ్విన హాస్యాన్ని మనం ఆస్వాదించాం. రెండు వేలో, నాలుగు వేలో లంచం తీసుకుంటున్న స్థానిక ఉద్యోగిని అరెస్టు చేసిన కథలు మనం పేపర్లలో చదువుతూనే ఉంటాం. గుడుల్ని మింగే నాయకులు మనల్ని ఢిల్లీలో పాలిస్తూండగా, గతిలేక పదే పదే ఈ జైళ్లల్లో దేవుళ్లనే నిస్సహాయంగా ఎన్నుకునే ఈ ప్రజాస్వామ్యానికి ఎక్కడో అడ్డకట్ట వేసే రోజు ఏనాడయినా వస్తుందా అని తమ చికాకునీ, నిస్పృహనీ, కోపాన్నీ ఈ నాయకుల పట్ల వోటర్లు తమ విముఖతని ఎప్పటికప్పుడు స్పష్టంగా చెప్పి కుండబద్దలు కొడుతూనే ఉన్నారు. అయినా ప్రత్యామ్నాయం లేదు. మరో గతిలేదు.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

ఒక సమాచారం ప్రకారం పార్లమెంటులో క్రిమినల్ కేసులున్న ఎంపీలు 162 మంది ఉన్నారట. ఇందులో 76 మంది చేసిన నేరాలకు కనీసం 5 సంవత్సరాల కఠిన శిక్ష వేయవలసిన నేరాలు. అలాగే రాష్ట్ర శాసనసభలలో కేసులున్న 1460 సభ్యులు ఉండగా ఇందులో 30 శాతం వారి నేరాలు కనీసం అయిదేళ్ల శిక్ష పడవలసిన నేరాలు. చట్టసభల్లో ఉన్నవారిపైన విచారణలు సాగవన్న ధైర్యం, తమ పదవులతో, డబ్బుతో చట్టాన్ని లొంగదీసుకోవచ్చుననే ధైర్యం వీళ్ల చర్యలకి ఆజ్యం పోస్తున్నాయి. కేవలం మెజారిటీ బలం దన్నుగా విర్రవీగే నాయకమ్మన్యుల కథలు మనం ప్రతీరోజూ వింటూనే ఉన్నాం. ఈ తరుణంలో –ఇన్నాళ్లకి సుప్రీం కోర్టు తీసుకున్న గొప్ప నిర్ణయానికి నేలబారు మనిషి సంబరపడుతూండగా ప్రస్థుతం కేంద్ర ప్రభుత్వం –అన్ని పార్టీల సమన్వయంతో –పెట్టిన ఈ రివ్యూ పిటిషన్ విచారణకి వచ్చింది. "అయ్యో. ఓ గొప్ప తీర్పుకి అవకాశవాదులు మళ్లీ గండి వేస్తున్నారని బాధపడే నేపథ్యంలో నిన్నటి విచారణ –న్యాయస్థానం స్పందన –ఇంకా ఈ దేశంలో సబబైన జీవనానికి ఆస్కారం కల్పించే వ్యవస్థ పూర్తిగా నేలమట్టం కాలేదని ఊపిరి పీల్చుకునేటట్టు చేసింది.

మొన్న సుప్రీం కోర్టు ప్రభుత్వ రివ్యూ దరఖాస్తుని అతి స్పష్టంగా తోసిపుచ్చింది. "మీ వాదనలో బొత్తిగా ఆధారం లేదు. లోగడ ఇచ్చిన తీర్పులో ఏ లోపమూ లేదు. కేవలం కావేషాలతో –రాజకీయ దురుద్దేశాలకు ఎవరిమీదైనా ఎవరైనా కేసులు బనాయిస్తే –ఆయా కేసుల్ని వాటి మంచి చెడ్డల దృష్ట్యా పరిశీలించడం జరుగుతుంది" అని తెగేసి చెప్పింది సుప్రీం కోర్టు. ఈ తీర్పు ఇలాగే అమలులోకి వస్తే –మనకి ప్రతి నిత్యం కనిపించే చాలామంది నాయకుల ముఖాలను తప్పించుకునే అదృష్టం దేశానికి దక్కుతుంది. ఈ దేవుళ్ల అంతిమ గమ్యస్థానం జైలు గదులన్న ఆలోచనే ప్రస్థుతం ప్రజలకు ఎంతో ఊరటగా ఉంది. అయితే ఇందులో మళ్లీ కొన్ని దొడ్డిదారులున్నాయి. కేసుల విచారణ సంవత్సరాల తరబడి ఒక నిర్ణయానికి రాకుండా జాప్యం చేయగలిగితే? పండిత్ సుఖరాం కేసు 17 సంవత్సరాలు సాగింది. దశాబ్దాలు పైన తేలని –లేదా గడుసయిన వాళ్లు తేలనివ్వని సందర్భాలు ఉన్నాయి. ఇంకా ఎక్కువవుతాయేమో. అలాగే తమ ప్రయోజనాలకు దొంగ కేసుల్ని బనాయించి –త్వరగా శిక్షల్ని రాబట్టే కుతంత్రాలు జరిగితే? నేరం మోపడం అతి సులువు. కాని రుజువు చెయ్యడం కష్టం.

రుజువులున్నా తమ మాట సాగించుకునే ముఖ్యమంత్రులు (ఉత్తరప్రదేశ్ అఖిలేష్ యాదవ్ ఐయ్యేయస్ ఆఫీసరు దుర్గాశక్తి నాగ్‌పాల్ విషయంలో) పుష్కలంగా ఉన్న ఈ దేశంలో ఏదయినా అసాధ్యం కాదు. సమాజంలో చదువు, కులం, వర్గం, ప్రాంతం ప్రమేయం లేకుండా అందరికీ ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే, ప్రజా ప్రతినిధులు కాగలిగే అద్భుతమైన 'ప్రజాస్వామ్యం' అనే ఆలోచనని ఎంతగా ఈ 70 సంవత్సరాలలో దుర్వినియోగం చేశారో మనం చూస్తూనే ఉన్నాం. అవకాశవాది బుర్రలో ప్రతీ చట్టానికీ ఒక విరుగుడు ఉంటుంది. అయితే చట్టం ఎప్పటికప్పుడు ఆరోగ్యకరమైన దిశగా సమాజం నడిచే ప్రయత్నం మాత్రమే చేయగలదు. అదే ఇప్పుడు జరిగింది. ప్రతీ విషానికీ విరుగుడు ఉంటుంది. అలాగే ప్రతీ విరుగుడినీ చెడగొట్టే కొత్త విషాన్ని సృష్టించే ప్రబుద్ధులు పెరుగుతున్న దేశం మనది.

( సెప్టెంబర్ 09, 2013)









# (September 16, 2013) Jaillalo Chillara Devullu నేరము–శిక్ష

ఆ మధ్య అట్లాంటాలో ఓ మిత్రుడి ఇంట్లో ఉన్నాం నేనూ మా ఆవిడా. ఆయన రచయిత. ఆయన కూతురు చాలా అందమయినది. చురుకయినది. అయితే విపరీతమైన పెంకితనం. కాగా, ఏ కారణం చేతయినా తల్లిదండ్రులు పసిపిల్లల వొంటిమీద చెయ్యి వెయ్యరాదు –అనేది అమెరికాలో పెద్ద నిబంధన. ఆ విషయం స్కూలుకి వెళ్లిన తొలిరోజుల్లోనే పిల్లలకి చెప్తారట –అలాంటిదేదయినా జరిగితే ఫలానా నంబరుకి ఫోన్ చెయ్యమని. కనుక పిల్లలకి ఒక మొండి ధైర్యం వస్తుంది. తల్లిదండ్రుల్ని ఏడిపించే చిన్న విశృంఖలత్వమూ అలవడుతుంది. అది తొండ ముదిరినట్టు ముదిరి ఊసరవిల్లి అయితే ఏమవుతుంది? నిన్నటి 'నిర్భయ' నేరస్థుడవుతుంది. ఆ పసిపిల్ల పెంకితనం మీద క్రూరమయిన తీర్పుకాదు. ఇది కేవలం భయం నేర్పని వ్యవస్థ గతిని చెప్పడానికి ఉదాహరణ మాత్రమే. ఈ మిత్రుడు నాతో అన్నమాట గుర్తుంది: "ఇండియా వచ్చెయ్యాలనుంది. హాయిగా పిల్లల పిర్ర మీద రెండు దెబ్బలు వేసి భయం చెప్పే అవకాశం కోసం" అన్నాడు. మా చిన్నతనంలో చేతిలో బెత్తం లేని ఉపాధ్యాయుడి బొమ్మ ఎప్పుడూ అసమగ్రమే. బెత్తంతో దెబ్బలు తినని చిన్నతనమూ అసమగ్రమే. ఇప్పుడిప్పుడు ఉపాధ్యాయుల్ని పిల్లలే కొడుతున్నారు. ఉపాధ్యాయులూ కసిపెంచుకున్నట్టు పిల్లల్ని శిక్షిస్తున్నారు. గురువుల ఉద్దేశమూ శిష్యుల వినయమూ మూలబడ్డ రోజులివి. దేశంలో –రాష్ట్రాల పోరు, రూపాయి పతనం, ధరల పెరుగుదల, పెట్రోలు ఖరీదుల పెంపు, అవినీతి, మానభంగాల మధ్య అందరికీ తృప్తినిచ్చే విషయం నిన్న జరిగింది. 'నిర్భయ' కేసులో నిందితులందరికీ మరణ దండన. ఎక్కడో ఆమ్‌నెస్టీ ఇంటర్నేషనల్ సంస్థ వంటివారు వినా దేశమంతా –నిర్భయ తల్లిదండ్రులతో సహా –తృప్తిగా ఊపిరి పీల్చుకున్నారు. ఇందులో రెండు పార్శ్యాలున్నాయి. మొట్టమొదటిసారిగా 9 నెలలలో తీర్పురావడం. రెండు: అందరికీ ఉరిశిక్ష పడడం. ఇందులో చిన్న సబబు ఉంది. మనిషిలో ప్రాథమికమైన విధ్వంసక శక్తి –పశువు. మనిషికి ప్రాథమికమైన బెదిరింపు –భయం. ఈ రెండిటికీ పొంతన ఉంది. మరొకటి కూడా చెప్పుకోవాలి. ఈనాటి మానవునిలో అవకాశవాదానికి దగ్గర తోవ –మానవతా వాదం. ఇంట్లో కూచుని ఉరిశిక్ష రద్దు గురించి మాట్లాడే పెద్దలు –రోడ్డు మీద ప్రయాణం చేసే, మరో పదిహేను రోజుల్లో పెళ్లి చేసుకోబోతున్న అమ్మాయిని నిర్దాక్షిణ్యంగా ఆరుగురు కళ్లముందే మానభంగం చేసి, ఇనుప ఊచతో ఆమెనీ, ఆమె మిత్రుడినీ చావగొట్టి, ఢిల్లీ నడిరోడ్డుమీద నగ్నంగా శిధిలమయిన అమ్మాయి శరీరాన్ని తోసేసి, లారీ టైర్లతో తొక్కి చంపాలనుకున్న ఆరు పశువుల్ని ఏ మానవతా విలువలకి కట్టుబడి ఈ సభ్య సమాజంలో బతికించుకోవాలో గుండెలు మీద చెయ్యి వేసుకుని చెప్పాలి. మన చట్టాలు, మన న్యాయవ్యవస్థ, ఇలాంటి పెద్దల పుణ్యమా అని 'మానవత్వం', 'నిజాయితీ', 'సత్ప్రవర్తన' వంటివి నవ్వు కునే, సభల్లో నేరస్థులు చట్ట సభలకు ఎన్నిక కావడానికి వాడుకునే ఊతపదాలయాయి. వాటి విలువ ఏమిటో ఒక మంజునాధ్‌ని, ఒద దుర్గాశక్తి నాగ్‌పాల్‌ని, ఒక అశోక్ కేమ్కానీ అడిగితే తెలుస్తుంది. ఉరిశిక్ష రద్దుకావాలనే పెద్దలు అలనాడు రాజీవ్ గాంధీతోపాటు, కేవలం తమ విధులను నిర్వర్తిస్తున్న కారణంగా చచ్చిపోయిన 18 కుటుంబాలలో ఎవరినయినా ఒప్పించగలరా? అసలు వారెవరో –ఒక నేరస్థుడి కారణంగా 18 కుటుంబాలు ఎలా కుక్కలు చింపిన విస్తరులయాయో గుర్తుపట్టారా అని అడగాలనిపిస్తుంది. పట్టపగలు నేరం చేసినా ఈ వ్యవస్థలో నేరం రుజువుకావడానికీ, జైలుకి వెళ్లడానికీ మధ్య కనీసం 20 సంవత్సరాల అంతరం ఉంటుందని తెలిసిన పెద్దలు జైళ్లకి కాక సరాసరి చట్ట సభలకి వెళ్లడం మనం అనునిత్యం చూస్తున్నాం.



మన చట్టాలకు కాలదోషం పట్టినా, ఇప్పటి కాలానికి, ఇప్పటి నేర ధోరణులకూ వర్తించనంతగా పాతబడినా, పాడుబడినా –రుజువయేవరకూ నేరస్థుడిని కేవలం 'నిందితుడి'గానే పరిగణించాలనే అతి మానవీయమైన వ్యవస్థ –మనకు బ్రిటిష్ వ్యవస్థ ఇచ్చిపోయిన వారసత్వం. అతి చిన్న లొసుగు లేకుండా నేరం రుజువయేవరకూ నిందితుడు ఏనాడూ 'నేరస్థుడు' కానేరదు అని మన చట్టాలు నిందితులకు బాసటగా నిలిచాయి. కాగా చట్టాల విసులుబాటుని దుర్వినియోగం చేస్తూ, చర్మం మందమెక్కిన నేరస్థులను –మన 'నిర్భయ' నిందితులలాంటివారికి ఇలాంటి శిక్షలు –వారి వరకే ఆగవు. అలాంటి నేరాలు చేసేవారికి కనువిప్పో, హెచ్చరికో కాగలవు. అలాకావడం లేదని తెలిసిన ఈ నేరస్థుల డిఫెన్సు లాయరుగారు –"ఈ శిక్ష విధించాక ఈ దేశంలో రాబోయే రెండు నెలలలో ఎక్కడా మానభంగం జరగకపోతే –ఈ శిక్ష కనువిప్పు అయిందని నమ్ముతాను. పైకోర్టుకి అప్పీలు చెయ్యకుండా మా నిందితులు శిక్షని శిరసావహిస్తారు" అని ఛాలెంజ్ విసిరారు. ఆయన తప్పులేదు. ఈ దేశమూ, ఈ వ్యవస్థ అలాంటి నైరాశ్యంలో పడిన కారణంగానే ఈ దేశంలో ఈ తాజా హంతకులు –ఇలాంటి అలసత్వాన్ని ఆసరా చేసుకుని నేరాలు చేస్తూ తప్పించుకుపోవడం మనం చూడడం పరిపాటి అయిపోయింది. "బాబూ! డిఫెన్స్ వారూ! మీరు రైటే. కాని మీలాంటివారి వెన్ను విరవడానికి ఇది ప్రారంభమని మేం నమ్ముతున్నాం" అని నిరూపించాల్సిన సమయం వచ్చింది. నూటపాతిక మందిని వినోదంగా ఊచకోత కోసిన కసాబ్‌నీ, 'దమ్ముంటే నన్ను శిక్షించండి' అని బోరవిరిచిన అఫ్జల్‌గురుని ఎవరికీ చెప్పకుండా ఉరితీయాల్సిన దశలో వ్యవస్థ ఉంది. హత్యలు చేసి ఉరిశిక్ష పడిన నేరస్థులను విడిచిపెట్టాలని రాష్ట్ర శాసనసభలు (దక్షిణాదిన తమిళనాడు, ఉత్తరాదిన జమ్మూకాశ్మీరూ) తీర్మానాలు చేసే దశకి ఈ రాజకీయ వ్యవస్థ దిగజారిపోయింది. హత్య చేసి శిక్షపడిన నేరస్థుడిని రాజకీయ పార్టీల అలజడి కారణంగా బల్వంత్ సింగ్ రాజోనా ఉరిశిక్షని పంజాబులో అమలు చెయ్యలేని కథ మనం చదువుకున్నాం. మానవతా వాదులకు ఒక విన్నపం. అట్లాంటాలో మా మిత్రుడు రెండు దెబ్బలు వేయడానికి చేతులు దురద పెడుతున్నాయని వాపోయిన పాప –అతని సొంత కూతురు. (న్యాయవ్యవస్థకి ప్రారంభదశలో ప్రతి నిందితుడూ పసిబిడ్డే!) ఆమెని హింసించడం అతని ఉద్దేశం కాదు. కాని చేసిన తప్పిదానికి శిక్ష ఉం టుందన్న ఆలోచన ఆ మేరకు ఆమెని సంస్కరించగలదని అతని ఆశ. ఆ నిజాన్ని నిరూపించిన తరంలోనే మేష్టారి చేతిలో బెత్తంతోనే మేమంతా పెరిగాం. నేరం ఆ పసిపిల్ల ఆకతాయితనం దగ్గర ఆగితే ఈ సమాజమూ ప్రతి వ్యక్తినీ ఆ పసిపిల్ల స్థాయిలోనే బుజ్జగిస్తుంది. మరణశిక్ష అమలుకి –హైకోర్టు నుంచి సుప్రీం కోర్టుదాకా –అయిదారు దశలు ఉన్న నిజం పెద్దలకి తెలిసే ఉంటుంది. అయితే వ్యవస్థ మానవతా దృక్పథాన్ని 'అలుసు'గా ఆరుగురు పశువులు ఒక అమాయకురాలయిన అమ్మాయిమీద అత్యాచారం చేస్తే ఈ దేశంలో వారిశిక్షను బహిరంగంగా అమలుజరపాలని నమ్మేవారిలో నేనొకడిని. ఒక చిన్న ఉదాహరణ. దుబాయ్ వంటి దేశాలలో దొంగతనం చేస్తే చేతులు నరికేస్తారని చెప్పడం విన్నాను. చేతుల్లేని వ్యక్తిని ఒక్కడినయినా నేను చూడలేదు. కాని దొంగతనమూ చూడలేదు. "మీరిక్కడ సూట్‌కేసు వదిలివెళ్తే –అక్కడే ఉంటుంది" అని గర్వంగా, నమ్మకంగా చె ప్పిన తెలుగు మిత్రుల్ని నాకు తెలుసు. ఎందుకని? "భయం" మనిషిలోని "పశువుని" అదు పులో పెట్టే ప్రాథమిక శక్తి. వ్యవస్థకి దమ్ముంటే –చేతుల్లేని దొంగలు మనముందు కనిపించరు. చేతుల్ని కాపాడుకోడానికి తాపత్రయపడే దొంగబుద్ధి భయపడుతుంది. ఈ నాలుగు పశువు ల్నీ శిక్షించడం ఆ భయానికి ప్రా రంభం కాగలిగితే చాలామంది 'నిర్భయ'లు మహాత్ముని మాటల్లో అర్ధరాత్రి క్షేమంగా ఇంటికి నడిచిరాగలరు.

( సెప్టెంబర్ 16, 2013 )




# (September 23, 2013) Nurella Cinema నూరేళ్ళ సినిమా

నూరేళ్ల కిందట భారతీయ సినిమా మన దేశంలో అప్పటికి ఉన్న అన్ని పరిమితులనూ పుణికి పుచ్చుకుని పురుడుపోసుకుంది. ప్రపంచ సినిమాకు కలిసివచ్చిన అదృష్టం –సిమోన్ వాన్ స్టాంపర్, డి.డబ్ల్యూ. గ్రిఫిత్, చార్లీ చాప్లిన్ వంటి వైతాళికులు మనకి లేరు. అయితే మన అదృష్టం –చిత్తశుద్ధి, కర్తవ్య దీక్షాగల ఒక స్వాప్నికుడూ, కార్యసాధకుడూ మన సినిమాకి కలిసివచ్చారు. ఆయన దాదా సాహెబ్ ఫాల్కే. కదిలే ఫిలింల ఫ్రేములు దగ్గర్నుంచి, కెమెరా కవాటాల దగ్గర్నుంచి, ఎడిటింగు వరకూ ప్రతీదీ 'ఓం నమః' అంటూ ఆద్యంతమూ పరిశీలించి ఒడుపుని సాధించిన మహానుభావుడు ఫాల్కే. ఈ కృషిలో –సినిమాకు చరిత్రను సృష్టించిన ఈ స్వాప్నికుడు దాదాపు గుడ్డివాడయాడు. ఇతని కార్యదక్షతను గుర్తించిన బ్రిటిష్ నిపుణులు ఇంగ్లండులో ఉండమని ఆహ్వానించినప్పుడు –'మా దేశంలో మాదయిన మాధ్యమానికి సేవచేస్తాను. మరో దేశానికి వలసపోను' అంటూ మన దేశం తిరిగివచ్చిన దేశభక్తుడు ఫాల్కే. ఆయన తీసిన మొదటి చిత్రం ఈ దేశంలో ఈ పరిశ్రమకి మొదటి మైలురాయి –రాజా హరిశ్చంద్ర (1913). విచిత్రమేమిటంటే ఒక కొత్త మాధ్యమం రూపురేఖల్ని దిద్దుకునే సమయంలో ఆనాటి పరిమితుల కారణంగా రెండు వ్యవస్థలు ఈ ప్రక్రియలోకి దొడ్డిదారిన ప్రవేశించాయి. నాటకం, సంగీతం. ఈ నూరేళ్లలో సినిమా నాటక ప్రక్రియకు దూరంగా తనదైన గొంతుని సవరించుకుంటూ ఉండగా, ఇప్పటికీ –లేదా ఎప్పటికీ సంగీతం అతి నిర్దుష్టంగా భారతీయ సినిమాలో పీట వేసుకు కూర్చుంది. వాస్తవిక ధోరణి అయినా, మరే ధోరణి అయినా కథానాయకుడు, నాయకీ "చెట్టులో ఏముంది? ఈ పుట్టలో ఏముం ది?" అంటూ చెట్లచుట్టూ పరిగెత్తుతూ ప్రేమగీతాలు పాడడం, "నినుబాసిపోవుదానా, కొనుమా సలాము ఖయస్" అంటూ ప్రేయ సి కంట తడి పెట్టుకోవడం –అప్పటికీ ఇప్పటికీ మన ప్రేక్షకులకి ఎబ్బెట్టుగా కనిపించదు. ఈ పని –సంగీత రూపకాలలో తప్ప మరే దేశంలోనూ, భాషలోనూ ఏ సినిమా చేయదు. విచిత్రంగా ఇది నూరు సంవత్సరాల పాటు ప్రేక్షకులు అంగీకరించి, రాజీపడిన విషయం. భారతీయ సినిమా ప్రత్యేకతగా గర్వపడేటట్టు చేయగల ఎందరో మహనీయులు –ఈ అసంబద్ధాన్ని అలంకరించారు. నౌషాద్, సి.రామచంద్ర, ఓ.పి.నయ్యర్, సుబ్బరామన్, కె.వి.మహదేవన్, ఇళయరాజా, ఏ.ఆర్.రెహమాన్, మహమ్మద్ రఫీ, లతా మంగేష్కర్, ఘంటశాల. పి.లీల, సుశీల, జానకి –ఈ జాబితా అనంతం. ఈ ఆనందం వర్ణనాతీతం. ఇక సినిమాలో ఇతివృత్తం. మెలోడ్రామాని ఆనాటినుంచీ ఈనాటివరకూ కొంగుబంగారంగా ఉపయోగిస్తున్న మాధ్యమం –సినిమా. నీతి జయించును, దుర్మార్గుడు శిక్షింపబడును, పాపికి ఏనాటికయినా రోజు మూడును, సత్యానికి పట్టంగట్టెదరు –ఇవన్నీ నికార్సయిన మూల సూత్రాలు. వీటికి అపజయంలేదు. ప్రేక్షకులలో రాణింపుకి ఢోకా లేదు. ఈ మెలోడ్రామాకి మూలనిధి మన పురాణాలు, ఇతిహాసాలు, జానపదాలు. ఇవన్నీ సినిమాకు అపురూపమయిన పెట్టుబడులయాయి. మొట్టమొదటి చిత్రమే 'సత్యానికే పట్టాభిషేకం' అని ఢంకా భజాయించే "రాజా హరిశ్చంద్ర". ఇక నాటకం. మన తెలుగు సినిమా గురించి చెప్పుకుంటే –అలనాడు –అంటే 1931లో "భక్తప్రహ్లాద" నాటకంలో నటించిన నటీనటుల్ని కెమెరాముందు నిలబెట్టి నటింపజేశారు. కెమెరా ఫీల్డుకి బయట నిలబడి హార్మోనిస్టు వాయిస్తూండగా పాటలు, పద్యాలు పాడారు. నాటకాన్ని చూసి ఆనందించడం అప్పటి ప్రేక్షకుల అలవాటు. తెరమీద కూడా ఆ పనినే చూసి అప్పటి ప్రేక్షకులు ఆనందించారు. సినిమాల్లోకి పాట వచ్చి చేరిన రూటూ అదే. మెల్లగా సినిమా తన గొంతు సవరించుకుంది. పురాణ పాత్రలు, వాస్తవిక సమాజంలో ప్రతీకలయాయి. ఈ కథలు కొత్త అంగీలు తొడుక్కున్నాయి. కొత్తరూపులు దిద్దుకున్నాయి. ఇతివృత్తం తనదైన ప్రక్రియని ఒడిసిపట్టుకునే పరిణామ దశ అది. ఆదర్శం, నీతి, శాశ్వత విలువలు, సామాజిక బాధ్యత –ఇలాంటి ఇతివృత్తాలను దాటి –సమాజ నీతిని ప్రశ్నించే, విమర్శించే,




ఎదురుతిరుగే కథలు వచ్చాయి. మనుషులు మారాలి, ప్రతిఘటన, కర్తవ్యం, ప్రతిధ్వని వంటివి 'యాంటీ హీరో'కి స్థానాన్ని కల్పించిన చిత్రాలు. సినిమా రూపురేఖలు మారే తరుణంలో మరో ఉప్పెన ఈ మాధ్యమం మీదకి వచ్చి పడింది –టెలివిజన్. డ్రాయింగు రూముల్లో 24 గంటలూ పలకరించే ఈ ప్రక్రియ అరుదైన మాధ్యమాన్ని అలవాటయిన స్థాయికి తీసుకువచ్చేసింది. వందలాది సినిమాలు అయాచితంగా డ్రాయింగు రూముల్లోనే కొలువు తీర్చాయి. మరి సినిమాకి మనుగడ ఏమిటి? చిన్న డబ్బాకి పరిమితం కాలేని, కేవలం తెరమీద మాత్రమే చూడగలిగిన విశ్వరూపానికి సినిమా విస్తృతమైంది. విస్టా విజన్, సినిమాస్కోప్, 70 ఎం.ఎం. మొదలైన 'విశ్వరూపాలు' వచ్చాయి –ప్రపంచమంతా. ఇక డిజిటల్ టెక్నాలజీ, గ్రాఫిక్స్ –ఒకటేమిటి? కొత్తదనాన్ని –గదుల్లో చూడలేని గొప్పదనాన్నీ పెద్ద పెద్ద తెరలమీద ఈ తరానికి మప్పారు నిర్మాతలు. ఉదాహరణకి –ఒకానొక సినిమాలో ఫారెస్ట్ గంప్ (టామ్ హాంక్స్) అనే పాత్ర –ఒకనాటి అమెరికన్ అధ్యక్షుడు జాన్ కెన్నెడీని కలిసే సన్నివేశాన్ని చిత్రించారు! ఇప్పుడు అభిరుచులు మారాయి. జీవనంలో వేగం పెరిగింది. విలువలు మారా యి. ఉద్దేశాలు మారాయి. సౌండాఫ్ మ్యూజిక్, టెన్ కమాండ్‌మెంట్స్, చంద్రలేఖ, శ్రీ వేంకటేశ్వర వైభవం, అవ్వయ్యార్, త్యాగయ్య, విప్రనారాయణ చూసే ప్రేక్షకులు వెనకబడ్డారు. కొత్తతరం, కొత్త అభిరుచులు ముందుకొచ్చాయి. కళ్లు మిరుమిట్లు గొలిపే దృశ్యాలు, నరాల్ని మత్తెక్కించే సంగీతం, స్పాట్ ఇంటరెస్ట్ –ఇవీ ఈనాడు చిత్రం రాణింపుకి పెట్టుబడులు. ఆదర్శం స్థానంలో ఆనందం మాత్రమే మిగిలింది. సందేశం స్థానంలో సందర్భం మాత్రమే మిగిలింది. ఒక తరం ధియేటర్లకు దూరమయింది. "మీరీ మధ్య సినిమాలలో నటించడం లేదేం?" అని అడిగే తరం నాకు కనిపిస్తూంటుంది. "మీరీమధ్య సినిమాలు చూడడం లేదా?" అంటూ నేను నటించిన అయిదారు చిత్రాల పేర్లు చెప్తే "మేం ఈ మధ్య సినిమాలు చూడడం లేదు సార్! కాని మీ 'సంసారం ఒక చదరంగం' అనే తరం కనిపిస్తోంది. మరి ప్రస్థుతం సినిమాలు చూసే కొత్తతరం ఎవరు? వారికి ఏం కావాలి? దురదృష్టవశాత్తూ సినిమా వ్యాపారం కూడా. దాదా సాహెబ్ ఫాల్కేలూ, బి.ఎన్.రెడ్డిలూ, శాంతారాంలూ వెనకబడి –వ్యాపారి సినీ నిర్మాత అయాడు. చెప్పే విషయం కన్నా దక్కించుకునే ఆదాయానికి ప్రాధాన్యం పెరిగింది. ఆ మేరకు ఇప్పటి సినిమా ఇంగువ గుడ్డని కట్టిన వంటకం అయింది. ఇది మనదేశంలోనే కాదు, ప్రపంచమంతటా జరిగింది. క్లియొపాత్రాలు, బెన్‌హర్ లూ వెనకబడ్డాయి. జురాసిక్ పార్క్‌లూ, చెన్నై ఎక్స్‌ప్రెస్‌లు వచ్చాయి. ఈ మాట చెప్తున్నప్పుడు సినీరంగంలో అమోఘమయిన ప్రతిభాపాటవాల్నిగాని, ప్రావీణ్యాన్నిగాని కించపరచడం ఉద్దేశం కా దు. ఆస్కార్ స్థాయిలో మన కళాకారులు నిలిచిన సందర్భాలివి. శ్రీకర్ ప్రసాద్ అనే ఫిలిం ఎడిటరు 9 సార్లు జాతీయ బహుమతినందుకున్నారు. రెసూల్ పూకుట్టీ సౌండ్ మిక్సింగ్‌కి (స్లండాగ్ మిలియనైర్) ఆస్కార్ పుచ్చుకున్నారు. ఈయన ఈ మధ్య నిర్మించిన అపూర్వమైన చిత్రం "ఐ.డి."కి దర్శకత్వం వహించిన కమాల్ కె.ఎమ్. అనే యువ దర్శకుడికి ఈ సంవత్సరం మేం గొల్లపూడి శ్రీనివాస్ జాతీయ బహుమతినిచ్చాం. రేపు ఇర్ఫాన్ ఖాన్ నటించిన, మొట్టమొదటి చిత్రంగా దర్శకత్వం వహించిన యువ దర్శకుడు రితేష్ భాటియా చిత్రం "లంచ్ బాక్స్" ఆస్కార్ బహుమతికి వెళ్లనుంది.

ఇక మిత్రుడు, నటుడు తణికెళ్ల భరణి ఇటీవల నిర్మించిన "మిధునం" తెలుగువారి మనస్సుల్లో పచ్చగా, గొప్ప జ్ఞాపకంగా మిగిలే ఉంది. ఇప్పుడు కమర్షియల్ సినిమా, ఆర్ట్ సినిమా అని రెండు విభాగాలకు గుర్తులు ఏర్పడ్డాయి. ఇవి న్యాయంగా విభాగాలు కానక్కరలేదు. ఒకే కుటుంబంలో తండ్రుల విభాగం, తల్లుల విభాగం అని ఉండదు కదా? కాని వ్యాపారం మూలసూత్రంగా వచ్చే చిత్రం, కళని మూల సూత్రంగా పెట్టు కుని తీసే చిత్రానికి ఇవి గుర్తులు. ప్రస్థుతం భారతీయ సిని మా –ఆ మాటకి వస్తే ప్రపంచ సినిమా ఈ రెండు ఎల్లల మధ్యా తనదైన గొంతు విప్పుతోంది.




ఒకపక్క అపూర్వమైన అభిరుచి, మరొకపక్క –బాగా డబ్బు చేసుకోవాలనే వ్యాపారి యావ –ఈ రెండే ఎల్లలుగా సినిమా రూపుదిద్దుకుంటోంది. అయి తే కళ మీద వ్యాపారం పెద్దరికం వహిస్తే –రెండు పనులు జరుగుతాయి. అభిరుచి, మంచి ఇతివృత్తం శలవు తీసుకుంటాకుంటాయి.

(సెప్టెంబర్ 23, 2013 )

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (September 30, 2013) Kreeda Kshetramlo Karnudu క్రీడా క్షేత్రంలో కర్ణుడు

కురుక్షేత్రంలో కర్ణుడు అర్జునుడి బాణాలకు కూలిపోయాక – రణరంగంలో పాండవులు శ్రీకృష్ణుడు వెంటరాగా అతని దగ్గరకు వచ్చారు. "ఇదా నువ్వు సాధించదలచిన విజయం?" అంటూ ఎకసెక్కం చేశాడు ధర్మరాజు. కర్ణుడు చిరునవ్వుతో ఒక మాట అన్నాడు: "నేను జీవితమంతా అక్కరతో చెయ్యిజాచిన వాడిని లేదనకుండా ఆదుకున్నాను. జీవితమంతా ఒకే వ్యక్తితో (భార్యతో) జీవనం గడిపాను. జీవితంలో ఒక్కరికే (దుర్యోధనుడు) విధేయుడిగా జీవించాను. జీవితం ఆఖరి క్షణాలలో దేవుడిని తలుచుకోవడం లేదు. దేవుడే నా సమక్షంలో నిలబడ్డాడు. నాకన్న అదృష్టవంతుడు ఎవరుంటాడు?"

నిన్నకాక మొన్న క్రికెట్ బోర్డు జీవితకాలం బహిష్కరించిన లలిత్ మోడీని కర్ణుడంతటివాడిని చెయ్యడం నా ఉద్దేశం కాదు. కానీ ప్రతీ కార్యసాధకుడి మనస్సులో – అతను గొప్ప పనిని సాధించినా, గొప్ప అనర్ధాన్ని తెచ్చిపెట్టినా కర్ణతత్వం ఉంటుందన్నది నా ఉద్దేశం. నలుగయిదు పేర్లు – హిట్లర్, స్టాలిన్, దుర్యోధనుడు, మోడీ, మహాత్ముడు – ఎవరయినా. తను చేస్తున్న పనికి మనస్సులో తన సమర్ధన – ఆ కృషికి – అది మంచయినా, చెడయినా ఊతాన్ని ఇస్తుంది. ముఖ్యంగా అంతకు ముందెన్నడూ జరగని, జరపని ఒక కొత్త ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నప్పుడు. విచిత్రమేమిటంటే – ఆ కృషి మంచి చెడ్డల్ని – దరిమిలాను – మామూలు కొలబద్దలతో చూసేవారు – ఆ విలువలకు, ఆ దశలో కట్టుబడని అతడిని వెలి వేసినపుడు అతడు తప్పనిసరిగా చాంపియనో, యుగపురుషుడో, ఏదీ కాకపోయినా 'హీరో' అవుతాడు. అలాగని లలిత్ మోడీ దేవుడు కాదు. రాజస్థాన్ రాయల్స్ లో అతని పరోక్షమైన వాటాలు, అతని నిరంకుశత్వం, క్రూరమైన వ్యవహారశైలి – ఇవన్నీ ఈ విషయాన్ని నిరూపిస్తాయి. అయితే ఒక్కటి మరిచిపోకూడదు. అతను దేవుడు కాదు కనుకే కర్ణుడయాడు. అవకాశం అవినీతికి పురికొల్పుతుంది. అహంకారం అంటేనే అవినీతి. ఈ రెండూ లలిత్ మోడీకి కలిసివచ్చాయి.

అసలు హీరోయిజాన్ని ఎలా గుర్తుపడతాం? సాధించే విజయాన్ని బట్టికాదు. సాధనలో అతని చిత్తశుద్ధిని బట్టి ప్రతీ వైతాళికుడూ ఇదివరకు ఎవరూ వెళ్ళని ఊహించని మార్గాన్ని వెదుకుతున్నాడు. అది కొత్తగా, వింతగా ఉంటుంది. సంప్రదాయవాదులకు అబ్బురంగా, కొండొకచో ఎబ్బెట్టుగానూ ఉంటుంది. ఊహించని పద్ధతిలో ప్రయాణం చెయ్యడమే మౌలికమైన కృషి. ఇందులో 'నిబంధన 'లకు తావులేదు. కొత్తవి ఏర్పరచుకోక తప్పదు – అసలు ఆ పనే కొత్తది, ఆ దారి ఎవరూ తొక్కనిదీ కనుక. ఇల్లు తగలబడుతోం,ది ఒకాయన చుట్టూ చూశాడు. పట్టుబట్టల మూట కనిపించింది. ఒక్కొక్క బట్టనీ తాడులాగ అతికించాడు. ఆరుగురి ప్రాణాలు కాపాడాడు. అంతా జరిగాక – దూరంగా నిలబడి ఏడుస్తున్న వాళ్ళు 'నిక్షేపంలాంటి బట్టల్ని వృధా చేశాడు కనుక ఇతను నేరస్థుడు' అన్నారు. ఏది సబబు? మౌలిక కృషిని వివరించడానికి వ్యాకరణం పుట్టింది. వ్యాకరణాన్ని దగ్గర పెట్టుకుని ఏ రచయితా రచన చెయ్యలేదు. గొప్ప రచనలో గొప్ప ఆలోచనకి వ్యాకరణం ఒదిగింది. షేక్స్పియర్ ఒక్కడు చాలు – ఈ విషయాన్ని సమర్ధించడానికి. ఒక కొత్త కృషిలో ఎన్నో నిబంధనలు నలిగిపోతాయి. కొత్తవి ఏర్పరచుకోవాలి.




అయితే ఇక్కడ ఒక దుర్మార్గం ఉంది. చేసే వ్యక్తీ మనిషేకదా? కొత్తదారిలో ఒక వజ్రం దొరికింది. జేబులో వేసుకున్నాడు – ఎవరూ తన వెనక నడవడంలేదు కనుక. అవకాశం, అందులో కలిసివచ్చిన కొండంత ఐశ్వర్యం అతనినీ మనిషిని చేశాయి. కక్కుర్తిపడ్డాడు. లలిత్ మోడీ ప్రైవేటు జెట్ లో ఊరేగాడు. తను చెప్పిందే వేదమన్నాడు. అడ్డొచ్చిన వారిని నేలరాసేశాడు. అతని కార్యదక్షతకి నిర్ఘాంతపోయిన వారంతా ఆయన అహంకారానికి వెక్కసపడ్డారు. వారి దగ్గర అతని దగ్గర ఉన్నన్ని ఆయుధాలు లేవు. కాని వారికి తెలిసినవి అతను పట్టించుకోడు. ఏమిటవి? రూల్స్. తెలియని దారిలో ఊహించని ఉద్యమాన్ని ప్రారంభించి క్రికెట్ సంస్థకి కోట్లు ఆర్జించి పెట్టిన ఒక ఉద్యమకారుడిని చుట్టూ ఉన్న వ్యాపార వేత్తలు – (వారూ సామాన్యులు కారు. వారికీ వారి వాటా అవినీతి ఉంది. శ్రీనివాసన్ ని గురునాధ్ మెయ్యప్పన్ ఉన్నాడు!) తమకి తెలిసిన ఆయుధాలతో ఎదిరించారు. ఏమిటవి? రూల్స్.

లలిత్ మోడీ తనని తాను సమర్ధించుకుంటూ ఒక మాట అన్నాడు: "నేను కొత్తదారులని ముందుగా వెతికాను. అందరికంటే ముందు నడిచాను. మిగతావారు అనిశ్చితంగా ఆగిపోయిన చోట నేను ఒక అవకాశాన్ని గుర్తుపట్టాను. అందులో లోతుపాతుల్నీ, ఎగుడు దిగుడుల్నీ ఆకళించుకున్నాను. తప్పటడుగు వేసిన చోట అడుగు తప్పించుకున్నాను. కొత్త విజయం వెనుక మరో కొత్త విజయానికి దారులు వెదికాను. ఇందులో నేను రిస్క్ తిసుకున్నానా? అవును. తీసుకున్నాను. గొప్ప కృషికి, కొత్త కృషికి ఆ పని అవసరం. ఒక కొత్త 'కలని' గుర్తుపట్టినప్పుడు – కొత్తగా, గొప్పగా ఆలోచిస్తూ పోవాలి. నేనాపనే చేశాను."

ఇప్పుడు క్రికెట్ బోర్డు లలిత్ మోడీని శాశ్వతంగా వెలివేసింది. ఐ.పి.ఎల్ వంటి ఉద్యమాన్ని, వ్యాపారాన్ని ప్రారంభించినవాడిగా క్రికెట్ బోర్డు తనకి హారతులు పట్టి, తన లోపాలను అర్ధం చేసుకోవాలంటాడు లలిత్ మోడీ.

ఆయన మాటలివి:"నన్ను దూరం చేసుకోవడం వారికే నష్టం. కారణం – నేను విజయం సాధించాను. నన్ను సముదాయించాలి. నాతో కలిసి నడవాలి"

కురక్షేత్రంలో కూలినా తనదే విజయం అన్న కర్ణుడి ధోరణి ఇక్కడ కనిపిస్తోందా?

క్రుంగిపోయే ప్రతీయోధుడికీ 'నేను' అనే అహంకారం పటిష్టంగా ఉంటుంది. కానీ ఎదుటివాడికి అతని ప్రవర్తనలో అపశృతులే కనిపిస్తాయి. అందుకే ప్రస్తుతం అతను కృంగిపోయాడు. అలనాటి కర్ణుడికీ, ఈనాటి లలిత్ మోడీకీ ఈ ఒక్క విషయంలోనూ చక్కని పోలిక కుదురుతుంది.

**(సెప్టెంబర్** 30, 2013)




# (October 07, 2013) Amma Kodukula Bhagotam అమ్మా కొడుకుల భాగోతం

వ్యాపార లావాదేవీలలో ఎప్పుడూ ముగ్గురుండాలి (రాజకీయం వ్యాపారమయి చాలాకాలమయింది). మొదట ఇద్దరు చర్చలు జరుపుతారు. మూడో వ్యక్తి ఆ చర్చలకి దూరంగా ఉంటాడు. తీరా నిర్ణయాలన్నీ జరిగిపోయాక –వాటిని ఆ మూడో వ్యక్తి వింటాడు. ఇందులో ఎవరికి నచ్చకపోయినా, కొత్త కిరికిరి పెట్టాలన్నా ఈ మూడో వ్యక్తికి వెసులుబాటు ఉంటుంది. అన్నీ తమకి అనుకూలంగా లేకపోతే ఆ ఒప్పందాన్ని గంగలో కలిపే అవకాశమూ అతనికే ఉంటుంది. అంటే ఏతా వాతా ఏ ఒప్పందానికయినా ఆఖరి నిర్ణయం దూరంగా నిలిచిన ఈ మూడో పెద్దమనిషిది.

అలాంటి మూడో పెద్దమనిషి కాంగ్రెస్‌కి కొంగు బంగారంగా ఒకరున్నారు. ఆయన రాహుల్ గాంధీ. ఆయనెప్పుడూ ఏ విషయం మీదా తన అభిప్రాయాలు చెప్పరు. తన చుట్టూ జరిగే అవినీతులూ, కుంభకోణాలకి స్పందించరు. బొగ్గు కుంభకోణం, టూ జీ కుంభకోణం, ఆదర్శ కుంభకోణం, కామన్వెల్తు క్రీడల కుంభకోణం, ఇస్రో –ఎస్ బాండ్ కుంభకోణం –ఏదయినా సరే. వారు నిమ్మకు నీరెత్తినట్టుంటారు. కాని అవసరమైనప్పుడు ముందుకు వస్తారు. ఎవరికి అవసరమైనప్పుడు? అమ్మగారికి. సోనియా అమ్మగారికి. అన్ని మార్గాలూ మూతపడి, ప్రభుత్వం ఏమీ చెయ్యలేని ఊబిలో పడినప్పుడు –ఈ మూడో పెద్దమనిషి అవసరం వస్తుంది. అసలు ఏ సమస్యకు ఎలా మేడం సోనియాగాంధీగారు స్పందిస్తున్నారో మనకు తెలీదు. ఎవరో చెప్పగా మనం వింటూంటాం. వారెంత గట్టిగా చెప్తే మేడం అంత గట్టిగా స్పందిస్తున్నారని మనం సరిపెట్టుకుంటాం. ఇదేమిటి? ప్రభుత్వ వ్యవహారాలలో ఈ ఏకాంత సందేశాలేమిటి? అదంతే. తప్పనిసరి అయినప్పుడు, తప్పేది లేనప్పుడు అమ్మగారు కొడుకుగారి భుజం గిల్లుతారు. కొడుకుగారు పత్రికా సమావేశాన్ని ఏర్పాటు చెయ్యరు. ఏదో సమావేశంలో జొరబడతారు. ఆయన చెప్పాల్సిన నాలుగు మాటలూ చెప్పేసి మాయమౌతారు. చంద్రబాబుగారు ఓ మాట అన్నారు: మన యువరాజుగారు కాస్త ఆలశ్యంగా నిద్రలేచినట్టున్నారు. కాంగ్రెస్ అధ్యక్షురాలి సమ్మతితోనే ఈ ఆర్డినెన్స్‌కి రెక్కలొచ్చాయి. ఏమయినా మన 43 ఏళ్ల యువరాజుగారు ఇంకా రాజకీయ భాష ని వంటబట్టించుకోలేదు. కేంద్ర మంత్రివర్గమంతా చర్చించి, ప్రతిపక్షాలతో చర్చ లు జరిపి, సుప్రీం కోర్టు తీర్పుకి తూట్లు పొడిచే శాసనాన్ని రాష్ట్రపతి సమ్మతికి పంపాక –ఈ పెద్దమనిషి –జరుగుతున్న పత్రికా సమావేశంలోకి దూసుకు వచ్చి "ఇది నాన్సెన్స్. ఈ శాసనాన్ని చించేసి పారెయ్యాలి" అని చెప్పి తప్పుకున్నాడు. దేశం నిర్ఘాంతపోయింది. ఇలా ఖండించడం ప్రధానమంత్రిని బజారున పెట్టడం కదా? ఆయన అప్పుడు అమెరికాలో అధ్యక్షుడు బరాక్ ఒబామాతో మంతనాలు జరుపుతున్నారు. ఆయన్ని ఇరకాటంలో పెట్టడం కదా? బయటికి వస్తూనే అర్జంటుగా రాహుల్ గాంధీ మన్మోహన్ సింగుగారికి ఒక వర్తమానం పంపారు. "మీరంటే నాకు అపారమైన గౌరవం ఉంది" అంటూ. ఇదెందుకు ఇప్పుడు? ఆ రోజు వీధిన పడి పరోక్షంగా ఆయన్ని వీధిన పెట్టారు కనుక. ఇలా చెయ్యడంలో గూడుపుఠాణీ ఏమయినా ఉందా? బొత్తిగా నోరు తెరవని యువరాజు పరపతిని ఆకాశానికి దూసుకెళ్లేటట్లు చెయ్యాలన్న సంకల్పం దీనివెనుక ఉన్నదా? ఇలాంటి చర్యలు ఆయన పరపతిని పెంచవు. ఆయన అనుభవలేమిని, కుర్రతనాన్నీ చాటి చెప్తాయి. ఎప్పుడూ నోరు విప్పని నాయకుడు హఠాత్తుగా, వేళమించిపోయాక ఔచిత్యాన్ని మరిచి, బహిరంగంగా తమ నాయకుని మీదే విరుచుకు పడడం –నిజాయితీ అనిపించుకోదు. ఆకతాయితనం అనిపించుకుంటుంది.అసలు ఇప్పుడెందుకీ శాసనం? ఏ విషయంలోనూ ఏకాభిప్రాయానికి రాకుండా, పార్లమెంటుని వివాదాల, ఆవేశాల రచ్చబండగా మార్చిన రాజకీయ పార్టీలు –దాదాపు ఏకీభావంతో రాష్ట్రపతిదాకా పంపిన ఈ శాసనం ఎవరిని కాపాడడానికి? గడ్డి

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

కుంభకోణంలో ఇరుక్కున్న లల్లూ ప్రసాద్ గారిని రక్షించడానికా? (తీరా తీర్పు వచ్చి లల్లూగారు జైలుకి వెళ్లారు). కరుణానిధి కుటుంబమంతా ఇరుక్కున్న అవినీతి నేరాలనుంచి కాపాడడానికా? పవన్‌సింగ్ బాన్సల్ గారిని ఉద్ధరించడానికా? సుప్రీం కోర్టు తీర్పునే సవరించడం తప్పనిసరయిన ఈ శాసనం తమ చేతులు దాటిపోతున్నదని గుర్తుపట్టిన అమ్మగారు కొడుకుని రంగంలోకి దింపారా? ఎన్నడూ నోరిప్పని కొడుకుశ్రీ ప్రస్థుతం హఠాత్తుగా నోరుచేసుకోవడంలో కేవలం ఆయన నిజాయితీయే తెలుస్తోందా? ఇవన్నీ విడని చిక్కుప్రశ్నలు.

ఒక పక్క సుప్రీం కోర్టు నానాటికీ పెచ్చురేగిపోతున్న రాజకీయ నాయకుల జులుంని గుర్తుపట్టి, అవినీతిపరులని పరిపాలనా వ్యవస్థ నుంచి దూరంగా ఉంచాల్సిన సమయం వచ్చిందని ఎరిగి ఇచ్చిన తీర్పు –నిన్నకాక మొన్న సాధికారికంగా ఎన్నికలలో అవినీతిపరులని తిరస్కరించే అవకాశాన్ని చట్టబద్ధం చేసింది. దీన్ని రూలు 49–ఓ అంటారు. 2001లోనే అప్పటి ఎన్నికల కమిషనర్ టి.ఎస్.కృష్ణమూర్తిగారు వోటరుకి అభ్యర్థుల్ని తిరస్కరించే హక్కుని ఇవ్వాలని, బాలెట్ కాగితం మీద "నేనెవరినీ ఎన్నుకోవడం లేదు" అనే అవకాశం ఉండాలని, ఇది రాజ్యాంగం ప్రకారం వోటరు హక్కని ప్రతిపాదించారు. అయితే ఎన్నికల ఉద్దేశం నాయకుని ఎన్నుకోవడం కాని, ఎవరినీ ఎన్నుకోని వోటరు హక్కుని –కోట్లు ఖర్చు పెట్టి సమర్థించడం కాదని అప్పట్లో ఆ ప్రతిపాదనని అటకెక్కించారు. కాని నానాటికీ పెరుగుతున్న అవినీతి, చట్టాన్ని, నిబంధనల్ని తమకు అనుకూలంగా మలుచుకుంటున్న నాయకుల కుతంత్రాలు, సమాజం భ్రష్టు పట్టే వాతావరణాన్ని గుర్తించిన సుప్రీం కోర్టు ఈ హక్కుని సమర్థించింది. ఇంతలో ఆలశ్యంగా కన్నువిప్పిన యువరాజులో నిజాయితీ ఉందా లేక మనకి అర్థం కాని మరేదయినా మెలిక ఉందా అని చాలామంది ముక్కుమీద వేలేసుకున్నారు. జరగకూడని, జరగని, జరగరాని పని చేసిన రాహుల్ గాంధీగారి కుండబద్దలు కొట్టే చర్య కొందరిని ఉత్సాహపరిచినా, చాలామందిని అనుమానంగా చూసే అవకాశాన్ని కల్పించింది. ఏమయినా అర్ధాంతరంగా చొచ్చుకువచ్చిన రాహుల్ గాంధీ నిజాయితీ –ప్రభుత్వం ఉద్దేశాలకి పట్టం గట్టదు. పార్టీలతో లాలూచీలో తమవంతు వాటాలేవో కుదరలేదేమోనన్న అనుమానం దగ్గరే ఆగుతాయి. ***నిజాయితీ ఉన్నట్టుండి ఒక్క వెలుగు వెలిగే మతాబు కాదు. అనునిత్యం ఆకాశాన ప్రజ్వరిల్లే సూర్యుడు. సూర్యరశ్మికి కాలదోషం లేదు. మతాబుకి ఎక్కువ ఆయుష్షు లేదు.***

( **అక్టోబర్** 07, 2013)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (October 14, 2013) Sarikotta Devudi Katha సరికొత్త దేవుడి కథ

మా పెద్దబ్బాయి చెన్నైలో ట్రావెల్స్ సంస్థని నడుపుతాడు. ప్రతీ రెండు మూడేళ్లకీ పాతబడిన, మరమ్మత్తుకి వచ్చిన కార్లని అమ్మి కొత్త కార్లని కొంటూంటాడు. కాని ఎన్ని ఏళ్ళయినా మార్చని, అమ్మని ఓ పాతకారుండేది. నాకు అర్థం కాలేదు. "అన్నీ అమ్ముతున్నావు. దీన్ని ఎందుకు అమ్మవు?" అన్నాను. మా అబ్బాయి నవ్వాడు. గర్వంగా సమాధానం చెప్పాడు. చెన్నైలో చీపాక్ గ్రౌండుకి ఒకసారి సచిన్ టెండూల్కర్ ఆ కారులో వెళ్లాడట. అది ఒక గొప్ప అనుభవానికి గుర్తు. ఈ కారు ఒక జ్ఞాపిక. అదీ 41 సంవత్సరాలుగా క్రికెట్‌ని ఆరాధిస్తున్న ఓ భక్తుడి తాదాత్మ్యం.

41 సంవత్సరాలు సచిన్ వయస్సు కాదు. మా అబ్బాయి క్రికెట్‌తో ముడిపడిన వయస్సు. నేను హైదరాబాద్‌లో ఆలిండియా రేడియోలో చేరినప్పుడు మా అబ్బాయి పుట్టాడు. నా పని డ్యూటీ ఆఫీసర్. అది 1963. వెస్టిండీస్ జట్టు హైదరాబాద్ ఫతే మైదాన్ స్టేడియంలో టెస్టు మాచ్ ఆడుతోంది. మా రేడియోకి వందలాది ఫోన్లు వచ్చేవి –క్రికెట్ స్కోర్ అడుగుతూ. నాకు ఆటంటే బొత్తిగా అవగాహన ఉండేదికాదు. ఆసక్తీ లేదు. పక్కన ఉన్నవాళ్లని అడిగేవాడిని. 1963 లో ఫతేమైదాన్ గ్రౌండులో భారత వెస్టిండీస్ మధ్య జరిగిన చరిత్రాత్మకమైన క్రికెట్ ఆటని రేడియో ప్రత్యక్ష ప్రసారం జరిగే బాక్స్‌లో ఉండి చూసిన అవకాశం నాది. కాని అది అవకాశమని అప్పుడు తెలీదు. గారీ సోబర్స్, డెస్మండ్ హేన్స్, వెస్లీ హాల్, జయసింహా మొదలయినవారు ఆడిన సందర్భం. ఆనాటి వెస్టిండీస్ జట్టులో అందరిలోకీ కుర్ర ఆటగాడు క్లైవ్ లాయడ్! ఒక పెద్ద పోలీసు ఆఫీసర్ నారాయణ స్వామి ప్రత్యక్ష ప్రసారం చేసేవారు. నాతో పనిచేసిన గోపాల కృష్ణ మరార్ నాకు జయసింహని పరిచయం చేస్తే యధాలాపంగా తలూపాను. మరి క్రికెట్ మీద ఆసక్తి ఎలా కలిగింది? పదేళ్ల మా పెద్దబ్బాయి 30 రూపాయల గేలరీ టిక్కెట్టు కోసం రాత్రంతా చెన్నైలో చీపాక్ పేవ్‌మెంటు మీద జాగారం చేసినప్పుడు నేనూ మా ఆవిడా తెల్లవారుఝామున వెళ్లాం కంగారుగా. 30 రూపాయల టిక్కెట్టుతో గర్వంగా ఎదురయాడు మా అబ్బాయి. ఉదయమే 5 గంటలకి అన్నం వండి, చిన్న డబ్బా సర్ది బస్సు దగ్గర దింపి వచ్చేది మా ఆవిడ. గేలరీలో తొమ్మిదిన్నర దాకా నిద్రపోయేవాడట. ఎంపైర్లు వస్తున్నప్పుడు ప్రేక్షకుల హాహాకారాలతో లేచేవాడు. తర్వాత ఆట. అదిగో, అప్పుడూ –మా అబ్బాయి కారణంగా క్రికెట్ మీద ఆసక్తి కలిగింది. ఆ ఆటలో జి.ఆర్.విశ్వనాథ్ 97 పరుగులు చిరస్మరణీయం. క్లైవ్ లాయిడ్ ఇంటర్వ్యూకి రేడియోకి వచ్చినప్పుడు మా అబ్బాయిని తీసుకెళ్లాను. మరొకసారి ఓ హిందీ నిర్మాత ఇంట్లో సునీల్ గవాస్కర్, చేతన్ చౌహాన్ లను కలవడానికి తీసుకెళ్లాను. అవి మా అబ్బాయి జీవితంలో గొప్ప క్షణాలు. తర్వాత నాకూ. సంవత్సరాల తర్వాత కేవలం సచిన్ ఆటని చూడడానికి, సాయంకాలం నాతోపాటు వెస్టెండులో 'మౌస్ ట్రాప్' చూసే ఒప్పందం మీద మేమిద్దరం ఇంగ్లండు వెళ్లాం. అది 20 జూన్ 1996. ఆ రోజుల్లో మా పక్క సచిన్ మామగారు (అంజలి తండ్రి) కూర్చునేవారు. ఆ ఆటలో చిరస్మరణీయమైన సంఘటన సౌరవ్ గంగూలీ మొదటి టెస్టు కావడం. అతని సెంచరీ. 40 సంవత్సరాల కిందట –ఓ మహారాష్ట్ర మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన మూడో కొడుకుకి వాళ్ల నాన్న తన అభిమాన సంగీత దర్శకుడు సచిన్ దేవ్ బర్మన్ –పేరు పెట్టుకున్నారు. సచిన్ రమేష్ టెండూల్కర్. అల్లరి చిల్లరగా ప్రవర్తించే ఆకతాయి కుర్రాడిని అన్న అజిత్ రమాకాంత్ అచ్రేకర్ అనే మేష్టారికి అప్పగించారు. కుర్రాడిలో అల్లరి ఏకాగ్రత అయి, నైపుణ్యమయి, అసాధారణమయిన ప్రజ్ఞగా రూపుదిద్దారు అచ్రేకర్. మరో రెండు గుణాలు సచిన్‌కు వారసత్వంగా వచ్చాయి –వినయం, వివాదాలకు చోటివ్వని ప్రవర్తన.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!






అకుంఠితమైన దేశభక్తుడు. 1999 ప్రపంచ కప్పులో ఆయన తండ్రి పోయినప్పుడు -మరోకారణానికి భారతదేశం క్రుంగిపోయింది. సచిన్ లేని జట్టుతో ఆడాలని. తండ్రి అంత్యక్రియలకి ఇండియా వచ్చి, వెంటనే బ్రిస్టల్‌లో ప్రపంచకప్పు ఆటకి తిరిగి వచ్చాడు. ఆనాడు కీన్యాతో ఆటలో 101 బంతులకి 140 పరుగులు చేసిన ప్రదర్శనకి -రెండు కారణాలకి ప్రపంచం ఆనందంతో నివాళు లర్పించింది. ఏమిటీ 26 ఏళ్ల కుర్రాడి కర్తవ్యదీక్ష? ఏమిటి ఈ నైపుణ్యం? ఎక్కడ దాచాడు తన వ్యక్తిగత విషాదాన్ని? మాతృదేశం మీద, తన కర్తవ్యం మీదా ఎంత ప్రగాఢమైన ఏకాగ్రత? భారతీయులంతా సచిన్‌కి మనస్సులో నివాళులర్పించారు. నేనూ ఆనందంతో ఉప్పొంగిపోయాను. కొద్ది రోజుల క్రితమే కన్నుమూసిన తండ్రికి ఆ సెంచరీని ఆ కుర్రాడు అంకితమిచ్చాడు. ఒక ఆటలో ఎవరూ ఊహించనంత గొప్పగా 136 పరుగులు చేశాడు. కాని తన జట్టు ఓడిపోయింది. అయితే సచిన్ 'మాన్ ఆఫ్ ది మాచ్'గా నిలిచాడు. కాని ఆ బహుమతిని పుచ్చుకోడానికి మనస్కరించలేదు. బహుమతిని పుచ్చుకోలేదు. తన జట్టుతో 'అపజయం'నే పంచుకున్నాడు! షార్జాలో ప్రపంచ ప్రఖ్యాత స్పిన్నర్ షేన్‌వార్న్‌ని గడగడలాడిస్తూ షార్జాలో 131 బంతులకి 142 పరుగులు చేసిన అద్భుతం క్రికెట్ అభిమానుల కలల పంట. ఆ తర్వాత సచిన్ టెండూల్కర్ తన కలలను చెడగొట్టాడని షేన్ వార్న్ చెప్పుకున్నాడు. ఒప్పుకున్నాడు. ఇవన్నీ చరిత్రలు. ఇవాళ -ప్రపంచం విస్తుపోయేలాగ -క్రికెట్ ఆటలో ఉన్న అన్ని రికార్డులనూ ఛేదించిన సచిన్ ఆటనుంచి నిష్క్రమించడం -ఓ చరిత్రకి తెరదించడం.ఆ మధ్య ఏదో ఛానల్‌లో కిషోర్ బిమానీని ఓ ఏంకర్ ఇంటర్వ్యూ చేస్తోంది. "అందరూ సచిన్ దేవుడులాంటి వాడంటారు...' అని ఏదో చెప్పబోయింది. బిమానీ ఆపాడు. "మాకు సచిన్ దేవుడు లాంటివాడు కాదు. దేవుడే! అన్నాడు. ఆస్ట్రేలియా ఆటగాడు మేథ్యూ హేడెన్ అన్నాడు: "నేను దేవుడిని కళ్లారా చూశాను. అతను ఇండియా జట్టులో నాలుగో స్థానంలో క్రికెట్ ఆడుతున్నాడు" అని. సచిన్ ఆడుతున్నప్పుడు ఈ దేశంలో ఉపవాసాలు చేసినవారున్నారు. కూర్చున్న చోటు నుంచి కదలకుండా, వేసుకొన్న బట్టలు మార్చుకోకుండా, గెడ్డం చేసుకోకుండా కూర్చోవడం వల్ల సచిన్ గొప్పగా ఆడగలడనే విశ్వాసం పెంచుకున్నవారిని నాకు తెలుసు. ఒక ఆటముగిశాక ఎవరో సచిన్‌ని ఆటోగ్రాఫ్ అడిగారట. ఆయన సంతకం చేస్తున్నాడు. దూరంగా ఉన్న సునీల్ గవాస్కర్ పక్క ఆయనతో అన్నాడట: "వెళ్లి సచిన్‌తో చెప్పు -అక్షరాలు సరిగ్గా చూసుకోమని. ముందు ముందు ఆ కాగితం పరమై, జ్ఞాపిక అయి, ఓ దేవుడికి గుర్తుగా కోట్ల విలువ చేస్తుంది".సంవత్సరం కిందట ఆర్నాడ్ గోస్వామి ఓ ఇంటర్వ్యూలో సచిన్‌ని అడిగాడు: "జావేద్ మియదాద్ వంటివారు మీరు ఆటలో అగ్రస్థానంలో ఉన్నప్పుడే రిటైరవాలంటున్నారు. మీరేమంటారు?" అని. సచిన్ సమాధానం ఇది: "ఆటలో రాణిస్తున్నప్పుడు తప్పుకోవడం స్వార్థం. అప్పుడే ఆటకీ, మన జట్టుకీ -వెరసి దేశానికి సేవ చేసే అవకాశం ఉంది. బాధ్యత వహించడానికీ, నావంతు కృషి చెయ్యడానికీ అదే తరుణం" అని.

ఓ గొప్ప వ్యక్తి, గొప్ప వినయ సంపన్నుడు, గొప్ప ఆటగాడు, గొప్ప దేశభక్తుడు చేసే ఆలోచనలో నిస్వార్థమైన కోణమిది. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ఓ భయంకరమైన విషాద సమయంలో -జాతిపిత కన్నుమూసినప్పుడు ఓ మాట అన్నారు: "రాబోయే తరాలు ఈ భూమిమీద ఇలాంటి వ్యక్తి రక్తమాంసాలతో తిరిగారా అని ముక్కు మీద వేలు వేసుకుంటారు". సచిన్ ఆట విరమణ క్రికెట్ ప్రపంచానికి పెద్ద విషాదం. రాబోయే తరాలు ఈ 24 ఏళ్ల క్రీడా చరిత్రని, సాధించిన 40 ఏళ్ల క్రీడాకారునీ, అతని విజయాలనీ తలచుకుని దాదాపు అంతగానూ ముక్కుమీద వేలేసుకుంటారు.



2011 లో బెంగుళూరులో ఇంగ్లండుతో జరిగిన ఆటలో ఒక అభిమాని ఓ బోర్డుని పట్టుకున్నాడు: "నేను దేవుడిని చూసేవరకూ సచిన్‌తో సరిపెట్టుకుంటాను" (నా అనువాదం నాకేనచ్చలేదు). ఇదీ వాక్యం:

***Until I see God, I will settle for Sachin..!!***

(**అక్టోబర్** 14, 2013)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులా పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (October 21, 2013) Arachakaniki Ellalu అరాచకానికి ఎల్లలు

ఓ యింటిముందు రాలుగాయి కుర్రాళ్లు సీనారేకు డబ్బాలు మోగిస్తూ అల్లరి చేస్తున్నారు. ఇంట్లో ముసలాయన గుండె ఆ శబ్దానికి రెపరెపలాడుతోంది. ఆపమంటే ఆగరని తెలుసు. రోజూ అదేవరస. ఏం చెయ్యాలి? ముసలాయన అఖండమైన మేధావి. బయటికి వచ్చి వాళ్లందరినీ పిలిచాడు. ముసలాయన్ని అనుమానంగా చూశారు కుర్రాళ్లు. ఆపమంటే రెచ్చిపోవడానికి సిద్ధంగా ఉన్నారు. కాని వాళ్లని ఆపమనలేదు. "మీరెంతమంది?" అన్నాడు.

"ఆరుగురం. ఏం?" అన్నారు కుర్రాళ్లు రొమ్ములు విరిచి.

జేబులోంచి పదిరూపాయల నోటు తీశాడు. "నా చిన్నతనాన్ని గుర్తుచేస్తున్నారయ్యా. ఈ డబ్బుతో బఠాణీలు కొనుక్కోండి. రోజూ యిస్తూంటాను. ఆ పక్కన కిటికీ దగ్గర వినిపించేలాగ వాయించండి. నా చిన్నతనాన్ని గుర్తుచేసుకుంటాను" అన్నాడు. కుర్రాళ్లు ఆనందించారు. పదిరూపాయలు తీసుకుని మరీ రెచ్చిపోయి మ్రోగించారు. నాలుగు రోజుల తర్వాత ముసలాయన బయటికి వచ్చాడు. కుర్రాళ్లు పదిరూపాయల కోసం ఎదురుచూస్తున్నారు. కాని అయిదు రూపాయలే బయటికి తీశాడు. "జీతం ఇంకా రాలేదు. వచ్చాక మళ్లీ యిస్తాను. మీ కృషి అమోఘం. కానివ్వండి" అన్నాడు. కుర్రాళ్లకి ఉత్సాహం తగ్గింది. అయినా ఎంతో కొంత ముట్టిందికదా? యధాలాభంగా కిటికీ ముందు రెచ్చిపోయారు. మరోవారం తర్వాత దిగాలుగా ముఖం పెట్టి వచ్చాడు ముసలాయన. "మీరెంత ఉపకారం చేస్తున్నారు? ఈమాట చెప్పడానికే సిగ్గుగా ఉంది. నా చేతిలో డబ్బులు అయిపోయాయి. అయినా ఆపకండి. రాగానే యిస్తాను" అన్నాడు. కుర్రాళ్లు ఎదురు తిరిగారు. "అప్పనంగా వాయించడానికి మేమేం వెర్రికుట్టెలనుకున్నారా? అదేం కుదరదు. రండిరా" అంటూ కుర్రాళ్ల లీడర్ వాళ్లని తోలుకుపోయాడు. ముసలాయన హాయిగా కిటికీ తలుపులు మూసుకుని ప్రశాంతంగా నిద్రపోయాడు. ఈ కథ ఇక్కడితో ఆగవచ్చు. ఒక జోక్‌గా. కాని దీనిలో ఒక ఆసక్తికరమయిన కోణం వుంది. కుర్రాళ్ల అరాచకాన్ని వాళ్ల మానాన వారిని వదిలేస్తే –వారిని నియంత్రించడం జరిగే పని కాదు. కాని వాళ్ల అరాచకానికి ధర కట్టాడు ముసలాయన. అంటే పిల్లల దృష్టిలో వారు చేస్తున్న అల్లరి ఆదాయమయింది. ఒక 'విధి' అయింది. ఒక సంపాదన అయింది. దానికి ఒక ప్రయోజనం, ఒక కొత్తకోణం సంతరింపు జరిగింది. ఇప్పుడు వారి దృష్టి అరాచకం మీదనుంచి తద్వారా వచ్చే ఫలితం మీదకి మళ్లింది. ఆ ఫలితం ఇప్పుడు ఆగిపోయింది 'అరాచకం' అనే విధిని వాళ్లు ఆపేశారు. మామూలుగా అయితే ఆ అరాచకానికి గమ్యంలేదు. ఇప్పుడు వచ్చింది. లేదా ఎవరో కల్పించారు. అది ఆగిపోయింది. పనీ ఆగింది. ఓ అద్భుతమైన సినిమా –ప్రముఖ హాలీవుడ్ నటీమణి కాథరిన్ హెప్‌బర్న్ తన తొంభైయ్యవ పడిలో నటించింది. ఆ సినిమా పేరు 'గ్రేస్ క్విగ్లీ'. ఆమె బజారులో పేవ్‌మెంట్ మీద నడుస్తోంది. ఎదుటి పేవ్‌మెంట్ మీద ఒకాయన ఆగి వున్న కారుని దాటాడు. దాటిన క్షణంలోనే కారు స్టీరింగు ముందు కూర్చున్న డ్రైవరు తల వాలిపోయింది. అతన్ని చంపేశాడు. ఈవిడ చూసింది.అతన్ని వెంబడించింది. అతను వెళ్లిన ఇంట్లోకి వచ్చి తలుపు తట్టింది. ముసలమ్మని చూసి ఆశ్చర్యపోయాడు హంతకుడు.

"నేను చూశాను" అంది ముసలమ్మ.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

హంతకుడు అనుమానంగా చూశాడు. లోపలకి వచ్చి కూర్చుంది. "నువ్వు చాలా సునాయాసంగా మనిషిని చంపావు" అంది. తనని బ్లాక్ మెయిల్ చేస్తుందా? హంతకుని నరాలు బిగుసుకున్నాయి. ఈ సాక్షిని చంపడం ఎంతసేపు? కాని ఆమె ఆలోచన వేరు. ఆమె తర్వాతి ప్రశ్నే ఆ విషయాన్ని చెప్పింది.

"చంపడానికి ఎంత తీసుకుంటావు?"

సమాధానం చెప్పలేదు.

"నువ్వొకరిని చంపాలి"

ఆశ్చర్యపోయాడు. "ఎవరిని?"

"నన్ను. ఆ కారు డ్రైవరు లాగే ఎక్కువ బాధలేకుండా సునాయాసంగా చచ్చిపోవాలి"

"ఎందుకు?" అని అడగలేదు. అదే ఇంగ్లీషు సినిమా గొప్పతనం. మన సినిమా అయితే ఆ ముసలమ్మ వృద్ధాప్యం, కలిసిరాని కొడుకు, కోడలి దుర్మార్గం, అనారోగ్యం –యిలాంటి వాటి గురించి ఊదరకొట్టేసేది.

"ఎంత?"

"400 డాలర్లు"

"నేనంత యిచ్చుకోలేను. కాని యివ్వగలిగే మనిషిని రేపు తెస్తాను. నిజానికి యిద్దర్ని తెస్తాను. నాకు కన్సెషన్ యివ్వు." మరో 87 ఏళ్ల వృద్ధుడిని తెచ్చింది. అతనికేం సమస్యలు. ఏమో?కళ్లు తిరిగిపోయే కథ యింతవరకే చెప్తాను. ఏతావాతా దుశ్చర్యకి డబ్బు పుచ్చుకునే అతను ఆశ్చర్యకరమైన కారణానికి –ఉదారంగా డబ్బు చెల్లించి నిరపాయంగా చావడానికి సిద్ధపడిన వీరిని చంపలేకపోయాడు. ఎందుకని? అరాచకం ఆర్ద్రతముందు నిర్వీర్యమవుతుంది. చంపే క్రూరత్వం చచ్చిపోయే దయనీయమైన కారణం ముందు వీగిపోయింది. మరో కథ. ప్రపంచ ప్రఖ్యాత వస్తాదు మహమ్మదాలీ ఆత్మకథని చదివాను. అతను ఏనాడూ జీవితంలో వస్తాదు కావాలని కలలు గనలేదు. కాని తన చుట్టూన్న తెల్లవారి దౌష్ట్యమూ, హింసాపూరితమైన ఎదిరింపులూ –తట్టుకుని బతకడానికి ఓ నల్లకుర్రాడు తను ఉన్నపట్టణం వెనుక వీధుల్లో తనదయిన మార్గానికి పదును పెట్టాడు. ఎదిరించే పనితనాన్ని పెంచుకున్నాడు. తప్పనిసరిగా తన రక్షణకు కొత్త శక్తుల్ని కూడదీసుకున్నాడు. ఒక అరాచకాన్ని ఎదిరించక తప్పని నిస్సహాయత అతన్ని ప్రపంచపు స్థాయిలో నిలిపింది. ఇది అరాచకానికి మరో కొత్త ఆవలిగట్టు. మరో అందమయిన కథతో ముగిస్తాను. ముంబై శివాజీ పార్కులో రమాకాంత్ అచ్రేకర్ సారథ్యంలో తన ఆటకి మెరుగులు దిద్దుకుంటున్న కుర్రాడి పేరు సచిన్ టెండూల్కర్. సచిన్‌ని రెచ్చగొట్టడానికి అచ్రేకర్ ప్రతీరోజూ వికెట్‌మీద ఒక రూపాయి ఉంచేవాడట. రోజంతా ఆ నాణం పడిపోకుండా ఆడాలి. పడిపోతే పడగొట్టిన బౌలర్‌కి ఆ రూపాయి దక్కుతుంది. అలా 33 రూపాయలు సచిన్ సంపాదించుకున్నాడు. అవి చాలా విలువయినవి అంటాడాయన.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

కాదు. ఓ విలువైన ఆటగాడి జీవితానికి అవి పెట్టుబడి. ఆనాటి రూపాయి ఒక సాకు. ఒక ప్రోత్సాహం. సచిన్ సాధనకు ఒక లక్ష్యం. మరో దృష్టితో చూస్తే బౌలర్ చేసేది అరాచకం –వికెట్‌ని పడగొట్టడం. దానికీ రుసుం ఉంది –రూపాయి. సచిన్ ప్రతిభని మరో విధంగా చెప్పాలంటే – 24 సంవత్సరాలు ఓ అరాచకం నుంచి తన వికెట్‌ని కాపాడే కృషికి ఆనాడు 33 రూపాయలు పెట్టుబడి. ఇతివృత్తమూ, నేపథ్యమూ భిన్నమయినా ఈ నాలుగు కథల్లోనూ ఓ సామాన్యమైన గుణం ఉంది. మొదటి, ఆఖరి కథల్లో దృష్టి ప్రాధాన్యం. రెండూ మూడు కథల్లో సామాజిక అపశృతి ప్రాధాన్యం. అంతే తేడా

( **అక్టోబర్** 21, 2013)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (October 28, 2013) Malli Taj మళ్ళీ తాజ్

నేనూ మా ఆవిడా తాజ్‌మహల్ చూసి 51 సంవత్సరాలయింది. అప్పుడు ముగ్గురం కలిసి చూశాం. మేమిద్దరం, మా చేతిలో పదినెలల మా పెద్దబ్బాయి. అప్పుడే ఆలిండియా రేడియోలో చేరిన రోజులు. నా వయస్సు 24. మా ఆవిడ 22. ఢిల్లీ ట్రెయినింగ్‌కి పదిరోజులు పిలిచారు. ఢిల్లీ వెళ్లడం మా ఆవిడకి కొత్త. అప్పుడు నా జీతం 260 రూపాయలు (1963 మాట). అయితే అప్పటికే 'డాక్టర్ చక్రవర్తి' రాసి ఉన్నాను. కనుక కాస్త డబ్బు చేతిలో ఉన్న పరిస్థితి. మళ్లీ ఇలాంటి అవకాశం ఎప్పటికో? ఇద్దరం వెళ్లాలని నిశ్చయించుకున్నాం.

కరోల్ బాగ్‌లో మకాం. పార్లమెంటు స్ట్రీట్‌లో ఆకాశ్‌వాణి భవన్‌లో ట్రెయినింగ్. సాయంకాలం పదినెలల అబ్బాయిని, ఓ బుట్టలో పాలగుండ డబ్బా, ఫ్లాస్కుతో వేడినీళ్లు, గ్లాసులు, చెంచాలు, రెండు గాజు పాలసీసాలతో మా ఆవిడ బస్సులో వచ్చి మా భవన్‌కి ఎదురుగా రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందు బస్సుస్టాప్ దగ్గర నిలబడేది. అయిదు గంటలకి ఆఫీసులోంచి బయటకి వచ్చి ఆటోలో డిప్లొమాటిక్ ఎన్‌క్లేవ్ (ఈనాటి చాణిక్యపురి), రాష్ట్రపతి భవన్, ఇండియా గేట్, పార్లమెంట్ హౌస్ –యిలా చూసేవాళ్లం. మధ్యలో ఒకే ఆదివారం వచ్చింది. ఆ రోజు ఆగ్రా వెళ్లాలని ప్లాన్ చేసుకున్నాం. కాని ఆనాడు భయంకరమైన తుఫాను ప్రారంభమయింది. ఆ రోజు మానుకుంటే మళ్లీ వెళ్లే అవకాశం లేదు.

కుండపోత వర్షంలో రాత్రి పదిగంటలకి పాత ఢిల్లీ స్టేషన్‌కి చేరాం. రాత్రి పదకొండున్నరకి ఆగ్రా పాసింజరు. ఉదయం ఆగ్రా చేరాం. అప్పటికి తుఫాన్ ఇంకా తీవ్రరూపం దాల్చింది. ఆనాటి ఆగ్రా స్టేషన్లో ఆచ్ఛాదన లేదు. జల్లులో ఇద్దరం తడిసి ముద్దయాం. కాస్త వెచ్చని చోటు మాచేతిలో అబ్బాయి. ఎలాగో ఏదో హోటల్ చేరాం. ఆటోలూ, టాక్సీలూ లేని రోజులు. ఈ వర్షంలో ఎవరొస్తారు? కూటికి గతిలేని ఓ పాత టాంగావాలా –పేరు నందలాల్ రావడానికి ఒప్పుకున్నాడు. వాడికి కురూపి భార్య. తలమీదా, ముఖంమీదా ముగుసు తియ్యదు. ఇత్‌మదుద్దౌలా, ఎర్రకోట, దయాల్బాగ్, తాజ్‌మహల్– అన్నీ చూపించారు. బురద రంగునీటితో ఒడ్డుని ఒరుసుకుంటూ ప్రవహిస్తోన్న యమున. కాని చూసి ఆనందించే మనసేది? రొజ్జ గాలి. వర్షం. చేతిలో నెలల బిడ్డ. ఆ వర్షంలోనే తాజ్‌మహల్ దగ్గరికి తీసుకొచ్చాడు. సంవత్సరాల తరబడి విన్న, మనస్సులో ఊహించుకున్న కల ఆవిష్కృతమౌతున్న మధురమైన క్షణమిది. మలుపు తిరిగాం. గుండె ఝల్లుమంది. ఇదేమిటి? తాజ్‌మహల్ ఇంత పేలవంగా వుంది? ఎవరేనా "ఇది తాజ్‌మహల్ కాదు" అంటే బాగుణ్ణనిపించింది. క్రమంగా కారణం అర్థమయింది. 1653 నుంచీ –అంటే నిర్మించినప్పటి నుంచీ 350 సంవత్సరాలపాటు క్రమంగా శిధిలమవుతున్న కట్టడం ఇది. కాని నా మనస్సులో తాజ్ నా ఆలోచన అంత కొత్తగా, నేను విన్న, ఊహించుకున్నంత గొప్పగా అనుక్షణం వృద్ధి పొందుతున్న కట్టడం. A tear of melody glistening on the cheek of time అన్నాడు టాగూర్. కాలం చెక్కిలిమీద ఘనీభవించిన కన్నీటి చుక్క –అని. జాషువా "ఒక్కొక్క రాతిలో నిమిడియున్నదు షాజహాను భూభుక్కు నెడందలో నుడికి పోయిన రక్తపుం జుక్కలలోని చక్కదనమ్ము..." అన్నాడు.

వర్షం ధారలమధ్య –బూడిదరంగు కట్టడంలో ఆ చక్కదనం కనిపించలేదు. తాజ్ అనుభూతి నా మనస్సులో ప్రతీక్షణం నిత్యనూతనం అవుతోంది. నా మనస్సులో తాజ్‌మహల్ నా ఆలోచనలంత నూతనమయినది. ఈ కట్టడం కాలం చేతిలో 350 సంవత్సరాలుగా పాతబడుతున్నది. నా మనస్సులో నిలిచిన మొదటి అనుభూతి –అసంతృప్తి. వెనక్కి తిరిగాం. ఆ రోజు వర్షంలో ఒక్క ఆగ్రాలోనే 8 మంది చచ్చిపోయారు. ఆ తర్వాత చాలాసార్లు ఢిల్లీ వెళ్లాను. మరోసారి తాజ్ చూడాలని అప్పుడప్పుడు అనిపించేది. కాని అవకాశం కలిసిరాలేదు.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

మొన్న ఢిల్లీ తెలుగు అకాడమీవారు నాకు జీవన సాఫల్య పురస్కారం యిచ్చి సత్కరించారు. ఈసారి –51 సంవత్సరాల తర్వాత తాజ్‌మహల్‌ని చూసే ఏర్పాటు చేసుకున్నాను. అప్పుడు చూసింది– ముగ్గురం –నేనూ, మా ఆవిడా, చేతిలో పది నెలల మా పెద్దబ్బాయి. ఇప్పుడు మా అబ్బాయి వయస్సు 51. నేనూ వస్తానన్నాడు. ఈసారీ ముగ్గురం కలిసి బయలుదేరాం.

ఢిల్లీ నుంచి భారతదేశంలో కల్లా అద్భుతమైన యమునా ఎక్స్‌ప్రెస్‌వే వేశారు. కారులో కేవలం రెండున్నర గంటల ప్రయాణం. ఈసారి మంచి యెండ. గత కొన్ని యేళ్లుగా కార్బన్ కాలుష్యాన్ని ఆపడానికి తాజ్‌కి కిలోమీటరు ముందుగానే కార్లను నిలిపివేస్తారు. అక్కడినుంచి బేటరీ బళ్ల మీద వెళ్లాలి. ఇప్పుడూ ముసిలి టాంగాలు అక్కడా అక్కడా కనిపించాయి. ఆ రోజు శనివారం. ఇప్పుడు గొల్లపూడి ప్రముఖుడు. తెలుగువారందరికీ సుపరిచితుడు. వందల తెలుగు ముఖాలు పలకరించాయి. తాజ్ ముందు గొల్లపూడితో ఫొటో ప్రత్యేక ఆకర్షణ వారికి. ఇక ఆటోగ్రాఫుల ముమ్మరం. 72 ఏళ్ల మా ఆవిడ సగం దూరం నడిచి –తృప్తిగా చూసి, ఇకరానంది. నేనూ, మా అబ్బాయీ నడిచాం.



1653 లో నిర్మించిన ఈ కట్టడానికి గుర్తుగా చుట్టూ 16 లాన్లు, 53 నీటి ఫౌంటెన్లూ ఉన్నాయి. 22 సంవత్సరాలు వేలాదిమంది నిర్మించినప్పుడు "తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీల" ఇళ్ల మధ్యనుంచి నడిచివెళ్లాం. అన్నిటికన్నా అద్భుతం –తాజ్ ప్రాకారం చుట్టూ అంచున చెక్కిన కొరాన్ సూరాలు. కాలిగ్రఫీ. నిజానికి అక్షరాలను చెక్కలేదు. తెల్ల పాలరాయిలో అక్షరాలుగా నల్లపాలరాయిని తాపడం చేశారు. ఈ పనికి ప్రత్యేకంగా అబ్దుల్ హక్ అనే పనివాడిని రప్పించాడు చక్రవర్తి. ఈ గొప్ప కృషికి ఆయనకి 'అమానత్ ఖాన్' అనే బిరుదునిచ్చి సత్కరించాడు. ఎదురుగా నిలిస్తే హాయిగా ఉర్దూ అక్షరాలను చదవవచ్చు. అయితే వందలగజాలు దూరమయినా –అంటే –ప్రాకారం చివర ఉన్న సూరానీ అంతే సౌలభ్యంతో అక్కడే నిలిచి చదవగలం. ఇదెలా సాధ్యం? అక్షరం దూరమవుతున్నకొద్దీ కన్ను ఏ సౌలభ్యాన్ని నష్టపోతోందో –ఆ సౌలభ్యాన్నివ్వడానికి అక్షరం

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పొల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

ఎంత పెద్దదికావాలో ఆ నిష్పత్తిలో అక్షరాన్ని పెద్దదిగా చేశాడు శిల్పి. దూరంగా వున్నది కంటి పరిమితిని గుర్తెరిగిన 'పెద్ద' అక్షరం. Art is larger than life అనడానికి ఇంతకన్న గొప్ప ఉదాహరణ ఎక్కడ దొరుకుతుంది? ఈసారి తాజ్ గొప్పగా ఉంది. కొత్తగా ఉంది. నిజానికి కళ యిచ్చే తృప్తి కళలో లేదు. చూడగల చూపులో వుంది. ఆనాడు తప్పనిసరిగా తుఫాన్‌లో నిస్సహాయంగా చూసి అనుభూతిని వాస్తవంతో పొదగలేని కుర్ర రచయిత అసంతృప్తి. వెచ్చటి దుప్పటి కప్పి, పసిబిడ్డని కాపాడుకుంటూ యిద్దరం నడిచాం ఆనాడు. ఇవాళ మా యిద్దరినీ చెయ్యి పట్టుకు నడిపించుకు వచ్చాడు 51 సంవత్సరాల పెద్దబ్బాయి. అందమయిన కారులో, అద్భుతమైన రోడ్డుమీద ప్రయాణం చేసివచ్చాం. వెయ్యి రూపాయల భోజనం పెట్టించాడు. అయిదు నక్షత్రాల సుఖం పరిచాడు. ఈ అనుభవంలో పరిణతి ఉంది. సాధించుకున్న తృప్తి ఉంది. 51 సంవత్సరాల ప్రస్థానంలో ఎక్కిన మెట్లున్నాయి. వృద్ధాప్యానికి బాసటగా నిలిచే రెండు చేతులు మా చుట్టూ ఉన్నాయి. ఈ జీవితం గొప్పగా, తృప్తిగా, నమ్మకంగా, ధైర్యంగా ఉంది. విచిత్రం! ఈసారీ తాజ్‌మహల్ మమ్మల్ని జయించలేకపోయింది! ఈసారీ తాజ్‌మహల్ కన్నా మా జీవన ప్రస్థానమే అందంగా ఉంది! ***కళ –ఎదురుగా ఉన్నది కాదు. మనం చూసే చూపు.***

(**అక్టోబర్** 28, 2013)




# (November 05, 2013) Tagore Nobel Prize టాగోర్ నోబెల్ కి నూరేళ్ళు

చాలామందికి గుర్తుండకపోవచ్చు. భారతదేశంలో మొట్టమొదటి నోబెల్ బహుమతి సరిగ్గా నూరేళ్ళ కిందట – 1913లో విశ్వకవి రవీంద్రనాధ్ ఠాకూర్ అందుకున్నారు. నిజానికి యూరోపియన్ దేశాలకి చెందని రచయిత మొదటిసారిగా సాహిత్యపు బహుమతిని అందుకున్న మొదటి సందర్భం ఇదే. అటు తర్వాతే పెరల్ బక్, నయాపాల్ వంటివారిని నోబెల్ బహుమతి వరించింది. తూర్పుదేశాల ఆలోచనా స్రవంతిని, తాత్విక చింతననీ మరో 20 సంవత్సరాల ముందే పాశ్చాత్యులకు పరిచయం చేసి, వారిని నిశ్చేష్టులను చేసిన ఘనత మరొకరికి దక్కుతుంది. ఆయన స్వామి వివేకానంద. ఇద్దరూ భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవనానికి ప్రతీకగా నిలిచిన బెంగాలు దేశస్థులు కావడం యాదృచ్ఛికం.

ఈ మధ్య స్వీడన్ వెళ్ళాను. నిజానికి ఈ విషయాన్ని నాకు గుర్తుచేసింది – స్వీడన్ లో ఒక మిత్రుడు ప్రవీణ్ రంగినేని. ఆ ఉదయాన్నే నోబెల్ బహుమతి గ్రహీతలకు విందుని ఏర్పరిచే సిటీ హాల్ ని సందర్శించాం. బహుమతి ప్రదానం తర్వాత నోబెల్ గ్రహీతలకు ఇక్కడ స్వీడన్ రాజు, నోబెల్ సంస్థ విందుని ఇస్తుంది. వారి గౌరవార్ధం నాలుగు రకాలయిన ద్రావకాలను సేవిస్తారు (టోస్ట్). విశాలమయిన హాలు, మీదకు వెళ్ళడానికి మెట్లు ఎక్కుతూ – వంద సంవత్సరాల కిందట 52 ఏళ్ళ రవీంద్రులు ఈ మెట్లు ఎలా ఎక్కారా అనుకున్నాను. తర్వాత రెండు విషయాలు తెలిశాయి. 1913లో విందుని ఈ సిటీ హాలులో కాక రాజుగారికి పాలస్ కి ఎదురుగా ఉన్న గ్రాండ్ హోటల్ లో ఇచ్చారని. బహుమతిని అందుకోవడానికి రవీంద్రుడు రాలేదని. ఆయన ఒక టెలిగ్రాం నోబెల్ కమిటీకి పంపారు. దానిని అప్పటి బ్రిటన్ రాయబారి క్లైవ్ చదివారు. కారణం – భారతదేశం అప్పటికి బ్రిటిష్ పాలనలో ఉంది. అటు తర్వాత 1921, 1926లలో టాగూర్ నార్వేకి వెళ్ళారు.

1913 సంవత్సరానికి నోబెల్ సాహిత్యానికి బహుమతిని నోబెల్ కమిటీ ప్రకటిస్తూ – అద్భుతమైన కవిత్వాన్ని, ప్రతిభావంతంగా అభివ్యక్తీకరించిన కవికి ఇస్తున్నట్టు పేర్కొన్నారు. అటు తర్వాత విచిత్రంగా రవీంద్రుడి నోబెల్ బహుమతికి కారణమైన "గీతాంజలి" అనువాదం మొదట స్వీడన్ లో ప్రచురితం కాలేదు. ఆయన 'గార్డెనర్ ', 'క్రిసెంట్ మూన్ ' ప్రచురితమయాయి. 2004 ఆగస్టు 4న శాంతినికేతన్ లో ఉన్న ఆయన నోబెల్ మెడల్ దొంగతనం జరిగింది. శాంతినికేతన్ మళ్ళీ దానిని ఇవ్వవలసిందిగా నోబెల్ కమిటీకి విజ్ఞప్తి చేసింది. ఆ మెడల్ నమూనా బంగారు పతకాన్నీ, మరో బ్రాంజ్ పతకాన్నీ నోబెల్ కమిటీ పంపింది. ఇదీ చరిత్రలో మొదటిసారీ, ఆఖరిసారీను. ఒక కవి రాసిన పాటల్ని రెండు దేశాలు తమ జాతీయగీతాన్ని చేసుకున్నాయి – భారతదేశపు 'జనగణమణ ', బంగ్లాదేశ్ ' 'అమోర్ సోనార్ బంగ్లా '. ఇది ఒక కవికి దక్కిన అరుదైన గౌరవం.

అన్నిటికన్నా రవీంద్రుని జీవితంలో తలమానికమైన సంఘటన ఒకటిఉంది. ఆయనకి 'సర్ ' బిరుదునిచ్చి బ్రిటిష్ ప్రభుత్వం గౌరవించింది. కానీ జలియన్ వాలా బాగ్ మారణ కాండ తర్వాత బ్రిటిష్ చర్యని నిరసిస్తూ ఆ గౌరవాన్ని రవీంద్రులు తిరస్కరించారు. అప్పటి ఆయన బ్రిటిష్ ప్రభుత్వానికి రాసిన లేఖ గుర్తుంచుకోదగ్గది. "మాకు జరిగిన అవమానం, అన్యాయాన్ని ఈ గౌరవాలు మరింత ప్రస్ఫుటంగా ఎత్తి చూపిస్తాయి.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

వీటన్నిటినీ తిరస్కరించి, నా ప్రజల సరసన నిలబడే సమయం ఆసన్నమయింది. మానవాళి ఊహించని పరాభవానికి లోనైన జాతికి చెందినవాడిగా ఇది నా కనీస కర్తవ్యం" – ఇదీ స్థూలంగా ఆయన లేఖ సారాంశం.

తన జీవితకాలంలో రవీంద్రులు 30 దేశాలు, 5 ఖండాలు పర్యటించారు. ఆ తరానికి చెందిన ఎందరో ప్రముఖులను కలిసి, వారితో సంబంధాన్ని పెట్టుకున్నారు. డబ్ల్యూ.బి.ఈట్స్, ఎజ్రా పౌండ్, జార్జ్ రాబర్ట్స్, గాంధీ అనుచరులు చార్లెస్ ఏండ్రూస్, ఇంకా అప్పటి ఇటలీ నియంత ముస్సోలినీని కూడా కలిశారు.

అన్నిటికన్నా గొప్ప విషయం – ఏ ప్రయత్నానికయినా కాలం చెల్లదంటూ తన అరవైయ్యవ ఏట చిత్రకళనీ, తన డెబ్బైవ ఏట సంగీతాన్నీ అభ్యసించి – సంగీతంలో 'రవీంద్ర సంగీతం 'కు ఒరవడి దిద్దారు.

సంవత్సరాల కిందట హైదరాబాదు రవీంద్ర భారతిలో శంభుమిత్ర (ఆ పేరు గుర్తురాని చాలామందికి – రాజ్ కపూర్ నిర్మించిన అద్భుతమైన చిత్రం 'జాగ్ తేరహో ' చిత్ర దర్శకుడు. నిజానికి ఆయన ఒకే చిత్రానికిదర్శకత్వం వహించారు) తన నాటక సంస్థ 'బహురూపి 'తో రవీంద్రుని రెండు నాటికలు 'రక్త కరబీ (రెడ్ ఓలియండర్స్), క్షుధిత పాషాన్ (హంగ్రీ స్టోన్స్) చూసిన అద్భుతమైన అనుభవం గుర్తుంది నాకు. ప్రముఖ కవి, దర్శకులు గుల్జార్ తర్వాత 'క్షిథిత పాషాణ్ ను చిత్రంగా నిర్మించారు.

"ఎక్కడ శిరస్సు ఉన్నతంగా నిలుస్తుందో.." అన్న కవితను తెలుగులో 46 మంది కవులు అనువదించారు. ఆ కవితల్ని ప్రముఖ పాత్రికేయులు బి.యస్సార్ కృష్ణగారు "నివేదన" అనే పేరిట పుస్తకంగా ప్రచురించారు. శంకరం బాడి సుందరాచారి, కొంగర జగ్గయ్య చలం, కనకమేడల, కేతవరపు రామకోట శాస్త్రి, బెజవాడ గోపాలరెడ్డి, దాశరథి, బెల్లంకొండ రామదాసు వంటి వారెందరో ఆ కవితకి మురిసి తెనుగు చేశారు. దానిని పునర్ముద్రిస్తానని నా దగ్గర ఉన్న ఒకే ఒక్క కాపీని తీసుకున్నారు బియస్సార్. కాని పునర్ముద్రణకి వేళ మించిపోయింది. వెళ్ళిపోయారు. ఈ పుస్తకం మళ్ళీ పునర్ముద్రణ కావలసినంత విలువైంది. ఆ కవితని చదవనివారూ, చదివి స్పందించని వారూ ఉండరు. అది కవితగా మిగిలిపోయింది కాని పాట అయితే – ఏదేశానికయినా – లేదా మానవజాతికంతటికీ 'జాతీయగీతం ' కాగలిగిన కవిత అది. ఆ పాట ఒక్కటి చాలు రవీంద్రుని 'విశ్వకవి 'ని చేయడానికి.

నాకనిపిస్తుంది – కొందరి కవితలు గొప్పగా ఉంటాయి. కొందరు కవులు చూడ ముచ్చటగా ఉంటారు – తిలక్, గుంటూరు శేషేంద్ర శర్మ వంటివారు. రవీంద్రుడు – పెద్ద అంగీతో, పట్టుదారాల వంటి తెల్లటి జుత్తుతో, గెడ్డంతో, నిలిపి పలకరించే ఆర్ద్రమైన కళ్ళతో – అపూర్వమైన, పవిత్రమైన కళాఖండంలాగ దర్శనమిస్తారు. కవితకి సౌందర్యాన్ని సృష్టి జతచేసిన సందర్భమిది. మతానికి సౌందర్యం జత కలిసిన మరొక అపూర్వమైన, పవిత్రమైన రూపం – గౌతమ బుద్ధుడు. ఈ మధ్య గణేశునికీ అలాంటి కళాత్మకతను జతచేస్తున్నారు – మన కళాకారులు. లౌకికమైన సౌందర్యానికి పారలౌకికమైన కోణాన్ని జతచేసిన అరుదైన సందర్భాలివి.

(**నవంబర్** 05, 2013 )




# (November 11, 2013) EvaDabba Sommu ఎవడబ్బ సొమ్ము?

బస్సు చార్జీలు పెరిగాయి. సందేహం లేదు. సామాన్య మానవుడి జీవితం మీద ఇది గొడ్డలి పెట్టు. ఈ కారణంగా ఖర్చులు, నిత్యావసర వస్తువులు, ఇతర సంభారాల ధరలూ – అన్నీ పెరుగుతాయి.

ఇవాళ పేపర్లో ఒక సుందర దృశ్యాన్ని (ఫోటో)ని ప్రచురించారు. ఓ పార్టీ హర్తాళ్ చేస్తూ బస్సుని తాళ్ళతో లాగుతున్నారు. ఇది ఊహించిన, సబబైన నిరసన. కానీ దీనికి బాధ్యులు?

దాదాపు 45 ఏళ్ళ కిందట "నీలయ్యగారి దయ్యం" అనే నాటిక రాశాను. అందులో ఓ కాలేజీ కుర్రాడిని అతని బాబాయి అడుగుతాడు. "ఏమిట్రా నీ శక్తి?" అని. కుర్రాడి సమాధానం. "నీకేం తెలుసు బాబాయ్? ఏ క్షణాన బడితే ఆ క్షణాన , ఏ కారణానికి బడితే ఆ కారణానికి సిటీబస్సులు తగలబెట్టడానికి 60 మంది మిత్రులున్నారు. ఏ రకమయిన సత్యాగ్రహం – అంటే నిరాహారదీక్ష, హర్తాళ్, ఘొరావ్ వగైరా వగైరా జరపడానికి పాతికమంది నిగ్గుల్లాంటి వీరులున్నారు. బస్సులు తగలబెట్టడానికి ఉచితంగా పెట్రోలు సరఫరా చేసే సర్వీసు స్టేషన్ ఉంది. నాశనం చెయ్యడానికి కావలసినంత దేశం ఉంది. ఇంతకంటే మాకు కావలసినదేముంది?" అని బోరవిరుస్తాడు.

ఈ దేశంలో ఎవరయినా ఏ కారణానికయినా నిరసన తెలుపాలన్నా బస్సులు తగలడాలి. రాజకీయ కారణాలకి, నిర్భయ పట్ల అన్యాయానికి, మంత్రిగారి మనుమడిని బస్సు కండక్టరు టిక్కెట్టు అడిగిన కారణానికి, పరీక్షలు వాయిదా వెయ్యడానికి, దేశనాయకుల విగ్రహాలు కూల్చిన కారణాలకి – దేనికయినా బస్సులు తగలడతాయి. తాళ్ళతో బస్సుల్ని లాగి నేలబారు మనిషి కష్టాన్ని వీధిన పెట్టి సమర్ధించే ఈ పార్టీలు ఏనాడయినా, ఏ ఒక్కసారయినా "బాబూ! ఇది మన సొమ్ము. తగలెట్టొద్దు. నష్టపోయేది మనమే" అని ధర్నాచేశారా? ఏ కారణానికయినా, ఏ దేశంలోనయినా బస్సులు తగలడడం మనం చూశామా? అంతెందుకు? మన పొరుగు రాష్ట్రాలలో ఈ అనర్ధం కనిపించిందా?

ఈ మధ్య రాజకీయ కారణాలకి నెలల తరబడి బస్సులు నిలిచిపోయాయి. 2849 బస్సులు రోడ్లమీంచి మాయమయాయి. ఒక్క ఉత్తరాంధ్రలోనే రవాణాశాఖకి 160 కోట్లు నష్టం వచ్చిందని తెలిపారు. ప్రజలు కదలలేక, ఆటోల జులుముని తట్టుకోలేక కకావికలయిపోయారు. ఒకాయన వాపోయాడు: "ప్రత్యేక రాష్ట్రం కావాలన్న వారిమీద కోపాన్ని మన రాష్ట్రంలో ఉన్న ప్రజానీకం మీద చూపడం ఏం సబబు?" అని. సిబ్బంది ఆరాటం, వారి చిత్తశుద్ది గొప్పదే. కానీ ఈ చర్య దరిమిలాను – మనమే భారాన్ని మోయవలసిన స్థితికి వస్తుందని తెలియదా?

బాపూజీ విదేశీయుల పాలనలో – ఆ పాలకుల వ్యవస్థని అతలాకుతలం చేసే సమ్మెలను చేపట్టారు. రవి అస్తమించని బ్రిటిష్ సిం హాసనం పునాదులు కదిలాయి. వారిని దిక్కుతోచకుండా చేసింది. జపాన్ లో ఇప్పటికీ సిబ్బంది తమ నిరసనని తెలపాలంటే యజమానిని నష్టపెట్టరు. తమ విధుల్ని యధావిధిగా నిర్వర్తిస్తూనే – లంచ్ వేళలో అదనంగా పనిచేసి – మరింత ఉత్పత్తిని చూపి – మా కోరికలు తీరిస్తే ఈ ప్రయోజనాన్ని ఇవ్వగలమని నిరూపిస్తారు. యాజమాన్యం దిగివస్తుంది.




అయితే మనకి కరెంటు ఆపేసి, బస్సులు నిలిచిపోయి, పరిపాలన స్థంభించినా – ఢిల్లీలో నాయకులు స్పందించరు. వారి చర్మం మొద్దుబారిపోయింది. అది మన ఖర్మ. లేదా మన హక్కుని పదే పదే వాడి దుర్వినియోగం చేసుకున్నామా? మందుకూడా మితి మించితే వికటిస్తుంది.

మరి ఇంత నష్టం – ఇన్ని విధాలుగా జరిగాక – ధరలు పెంచకపోతే ఎలా? ఎవడబ్బ సొమ్ము తీసుకొచ్చి – బస్సులు తగలెట్టడానికి, ఆదాయానికి గండికొట్టడానికి కూడా ప్రభుత్వం వెసులుబాటు కల్పించగలదు? అర్ధంలేని ఆవేశాన్ని ఆనాడు ఆపలేని వ్యవస్థ అవసరమయిన వడ్డింపుల్ని నోరు మూసుకు భరించక తప్పదని ఈ పార్టీలకి తెలియదా? ధ్వంసమయిన ప్రతీ బస్సూ, బస్సు నడవని ప్రతీరోజూ సామాన్యుడి జేబులోంచి రొక్కాన్ని బెల్లించుకు పోతోందని గ్రహించకపోవడం దురదృష్టం.

సామూహిక ఉన్మాదం (mob frenzy) తరచుగా విచక్షణని కోల్పోతుంది. ఫాక్టరీకి నిప్పెడితే యజమాని కత్తి దూస్తాడు. ఇంటికి నిప్పెడితే ఎవరూ ఎదురు తిరగరు. ఎందుకని? అది నీ సొత్తు కనుక. నీ చేతిని నువ్వే కాల్చుకుంటున్నావు కనుక. రేపు నీ ఆవేశం చల్లబడ్డాక నువ్వే డబ్బు చెల్లించాలి కనుక. ఇప్పుడాపనే చేస్తున్నాం

లోగడ ఇలా తగలెట్టిన బసుల్ని ప్రభుత్వం ఊరేగించింది. "బాబూ! ఇదెంత అర్ధరహితమైన పనో మీరే తేల్చుకోండి" అంటూ. కాని ప్రాధమికమైన ఆవేశానికి విచక్షణ కలిసిరాదు. అప్పుడదే జరిగింది.

నేను ప్రభుతాన్ని సమర్ధించడం లేదు. నేలబారు మనిషి మీద భారానికి బాధపడుతున్నాను. కానీ పొయ్యిలో చెయ్యిపెట్టి కాలిందని వాపోవడం ఆత్మవంచనేమోనని అంటున్నాను.

ప్రజానీకం మానసిక భావాల్ని గ్రహించి గౌరవించలేని వ్యవస్థ, చెప్పుతీసి కొట్టడం తప్ప మరొక మార్గం లేని సిబ్బంది, ప్రజల ఆవేశం, అర్ధం లేని ఆక్రోశానికి అనర్ధాన్ని ఆశ్రయించే ఆలోచనాలేమి – ఇవన్నీ సమష్టిగా ఎదురు తిరిగిన పరిణామమే – బస్సు చార్జీల పెంపు. సందేహం లేదు. సామాన్య మానవుని జీవితం మీద ఇది గొడ్డలి పెట్టు. కానీ 'గొడ్డలిని' ఎంతో కొంత నియంత్రించే శీలం సామాన్య మానవుడి పరిధిలోనే ఉన్నదని నాకనిపిస్తుంది. వ్యవస్థని నిలదీయండి. కానీ మన కాళ్ళని మనం నరుక్కుని కాదు.

(**నవంబర్** 11, 2013)




# (November 25, 2013) Manishi Mahatmudu మనిషి మహాత్ముడు

ఈ మధ్య నార్వే, స్వీడన్ దేశాలకు వెళ్ళాను. ఆ దేశాలలో పర్యటించేటపుడు నన్ను ఆకర్షించేది చుట్టూ కనిపించే భవనాలూ, కట్టడాలు కాదు. వాళ్ళ జీవన సరళి, వ్యక్తిత్వ వికాసం, సామాజిక శీలం.

మొదట బ్రిటన్ లో నా అనుభవం. బ్రిటన్ చాలా చిన్నదేశం. మాంచెస్టర్ దగ్గర విగాన్ అనే చిన్న ఊరు. అక్కడికి ఉదయాన్నే 7 గంటల ఆరు నిముషాలకు రైలు వస్తుందని రాశారు. నేను నవ్వుకున్నాను. 7 గంటల ఆరునిముషాలేమిటి? ఏడుంపావు లేదా ఏడుగంటల అయిదు నిముషాలు అనవచ్చుకదా? మనదేశంలో కనీసం గంటన్నరయినా లేటుకాకుండా ఏ రైలు ఎప్పుడు వచ్చి చచ్చింది అనుకుంటూ స్టేషన్ కి వచ్చాను. 7 గంటల 5 నిముషాల 50 సెకన్లకి ప్లాట్ ఫారం చివర ఇంజను కనిపించింది. ఏడుగంటల ఆరు నిముషాలకు మా ముందు రైలు ఆగివుంది. అయ్యా, ఈ చిన్న దేశం గత శతాబ్దంలో కనీసం యాభై ఏడు  అతి పెద్ద దేశాలను పాలించింది. ఆ పాలకులు చేసిన ఉపకారాన్ని మించి చేసుకోలేక – ఇప్పటికీ అదే బ్రౌను నిఘంటువునీ, అదే కాటన్ నీటి వనరులనీ వాడుకుంటూ దేశాన్ని కొల్లగొట్టుకుంటున్నాం. ఇక నార్వేనావికులు ఒకప్పుడు సముద్రం మీదుగా వచ్చి ఇంగ్లండుని ఆక్రమించుకున్నారు. ఇప్పుడున్న ఆంగ్లేయులు నార్వే, ఆంగ్లోశాక్సన్ జాతుల సమ్మిశ్రమని చెప్పుకుంటారు. నార్వేలో జనాభా మన విశాఖ జిల్లా అంత. ఏమిటి వీరి గొప్పతనం? ప్రత్యేకత? మొన్ననే మన దేశంలో మన పార్లమెంటు సభ్యులు ఇద్దరిని మానభంగం చేసి చంపిన వార్తల్ని చదువుకున్నాం. అదీ మన ఘనత.

నన్ను ఆశ్చర్యపరిచిన విషయాలు – 2013లో – ఇవి. నార్వేలో మనదేశంలో టాక్సీల్లాగా సైకిళ్ళను అద్దెకిస్తారు. మంత్రిగారి దగ్గర్నుంచి, పార్లమెంటు సభ్యుడు దాకా అంతా వీపుకి సంచి తగిలించుకుని వెళ్తారు. కొందరయితే బస్సుల్లో వెళ్తారు. మా మిత్రుడి భార్య చెప్పింది. అ మధ్య ఆవిడ రైలుకోసం ప్లాట్ ఫారం మీద నిలబడిందట. ఎదుటి ప్లాట్ ఫారం మీద ఆ దేశపు రాజుకొడుకు, అతని పి.ఏ రైలుకోసం నిలబడి ఉన్నారట. – కేవలం ఇద్దరే. మన దేశంలో పంచాయితీ అధ్యక్షుడి దగ్గరునించి, ఎమ్మెల్యే చుట్టూ  నలుగురయిదుగురు చెంచాలు, ఇద్దరు సాయుధ రక్షక భటులూ, నాలుగు కార్లూ, రెండు తుపాకులూ ఉంటాయి. ఆ మధ్య టోల్ గేట్ దగ్గర పేరడిగినందుకు తుపాకీ తీసిన రాజకీయనాయకుడి వీరంగం మనం చూసి తరించాం కదా! (ఇక్కడో ఆసక్తికరమైన పిట్ట కథ. తొలి రోజుల్లో మహానుభావులు, ప్రజానాయకులు పుచ్చలపల్లి సుందరయ్యగారు పార్లమెంటుకి నిక్కరుతో సైకిలు మీద వచ్చేవారట. నెహ్రూగారి దృష్టికి ఆ విషయం వెళ్ళింది. సుందరయ్యగారంటే నెహ్రూగారికి అమితమైన గౌరవం. వారిని పిలిచి సభా మర్యాదకోసమయిన – కనీసం పైజమా వేసుకోమన్నారట! – ఈ విషయం సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్ గారు నాకు చెప్పారు.)

ఏదీ? పట్నంలో – కాలుష్యం కారణంగా – ఆటోలను ఆపే ప్రయత్నం చేయమనండి. అయిదుగురు మంత్రులు, పది యూనియన్లు, కొన్ని బడుగు వర్గాల పార్టీలు ఎదురు తిరుగుతాయి. రెండు ధర్నాలు జరుగుతాయి. పదిమంది ప్రధానిని కలుస్తారు. మనం మెజారిటీ కుసంస్కారాన్ని, అజ్ఞానాన్ని కాపాడుకునే హక్కు కోసం మనం పోరాడుతాం. దీని పేరు ప్రజాస్వామ్యం. మరి ఆరోగ్యం? కాలుష్యం? – ప్రభుత్వం ఏం చేస్తోంది?

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

వీరిని ఎందుకు ఎన్నుకున్నాం? మనకి నినాదం కావాలి. ఓటు కావాలి. పదవి కావాలి. సమాజ శ్రేయస్సు? అది ఉపన్యాసాల్లో కావాలి. వాస్తవానికి – ఎవడిక్కావాలి?

ఇక – స్వీడన్ లో ఏ దరఖాస్తులోనూ, ఎక్కడా రెండు అవసరం లేదు. కులం, మతం. అసలు జన జీవన సరళిలో వాటి ప్రసక్తి లేదు. అవి రెండూ వ్యక్తికి వ్యక్తిగతమయిన విషయాలని ప్రభుత్వం నమ్ముతుంది. ఇది అద్భుతం. మన దేశంలో ఆ రెంటినే మూల సూత్రాలుగా మన పార్టీలు, సమీకరణలు, ఓట్లు, నోట్లు, సిగపట్లు ... ఇది 2013లో స్వీడన్ వంటి చిన్నదేశం మాట. ఇక కాలుష్యం. కార్లు. మన దేశంలో రోజూ కొన్నివేల కార్లు రోడ్లమీదకు వస్తున్నాయి. కాలుష్యాన్ని ఆపే ఏర్పాట్లు వాటికి జరుగుతున్నాయా? పక్కన పెట్టండి. ఒక్క సింగపూరులోనే ఒక గడువు దాటాక ఆ కారు రోడ్డుమీద నడవడానికి అనుమతిలేదు. కార్ల వాడకాన్ని స్వీడన్ లో ఎలా నియంత్రించారు? ఎవరయినా, ఎక్కడయినా, వారి వారి సొంతకార్లు వారి ఆఫీసుల్లో ఉంచినా చార్జీలు కట్టాలి. సిటీలోకి వస్తే – వచ్చేటప్పుడూ, వెళ్ళేటప్పుడూ చార్జీలు కట్టాలి. ఇదికాక – రద్దీ సమయాల్లో సిటీలోకి వస్తే మరీ ఎక్కువ చార్జీలు కట్టాలి. ఇది కారుల రద్దీని నియంత్రించడానికి పరోక్షమయిన ఆంక్ష. మనకి? ఇలాంటి ఆంక్షని పెట్టండి. మంత్రిగారికీ, మంత్రిగారి బావమరిదికీ, ఎమ్మెల్యేలకీ, వారి చెంచాలకీ, బడుగు వర్గాలకీ, ప్రత్యేకమయిన మత పెద్దలకీ, వృద్ధులకీ, ప్రొఫెసర్లకీ, రాబర్ట్ వదేరాలకీ, సోనియాగాంధీ అనుచరులకీ – ఇదీ మన దరిద్రం. ఈ ఏర్పాటు మినహాయింపులు కోరేదికాదు. సమాజ ఆరోగ్యాన్ని సమూలంగా నాశనం చేసేది – అని ఈ నాయకమ్మన్యులకి ఎవరు చెప్తారు?

ఇక పార్లమెంటులో మహిళలకు రిజర్వేషన్లు. స్త్రీలు సంవత్సరాలుగా జుత్తు పీక్కొంటున్నారు. మనం మన తల్లుల్ని గౌరవిస్తాం. పిల్లల్ని నెత్తిన ఎత్తుకుంటాం. కానీ చట్ట సభల్లో మన పెద్దరికమే చెల్లాలి. ఈ నిష్పత్తి చూడండి. స్వీడన్ లో 47 శాతం స్త్రీలు ఉన్నారు. ఫిన్లెండులో 43 శాతం. నార్వేలో 38 శాతం. మనకి వోక్స్ వాగన్ ఫాక్టరీ డబ్బు తినేసిన మంత్రులూ, టాటా కార్ల ఫాక్టరీని రాష్ట్రంలోంచి తరమేసిన ముఖ్యమంత్రులూ ఉన్నారు – ఏ కారణానికయినా. స్వీడన్ వంటి చిన్న దేశం ప్రపంచ స్థాయిలో నిలిచే అద్భుతమయిన పరిశ్రమల కూడలి. వోల్వో, ఎరిక్ సన్, స్వాన్ స్కా, స్కైప్, ఐకియా, హె అండ్ ఎం, ఎలక్ట్రోలక్స్, భోఫోర్స్ – ఇలా ఎన్నయినా చెప్పవచ్చు. బోఫోర్స్ అనగానే మనకి కోట్ల కుంభకోణం గుర్తుకు వస్తుంది. మన నాయకుల అవినీతి, ఇప్పటికీ బయటపడని కోట్ల దోపిడీ గుర్తొస్తుంది. కానీ బోఫోర్స్ శతఘ్నులు లేకపోతే అలనాడు కార్గిల్ యుద్ధాన్ని మనం జయించలేకపోయేవారమన్న నిజం చాలామంది మనస్సుల్లోనయినా లేదు. 90 డిగ్రీల వాలులో పేలే శతఘ్ని ప్రపంచంలో అదొక్కటేనని చాలామందికి తెలీదు. మనకి అంగారకుడిదాకా ఉపగ్రహాల్ని పంపే మేధస్సుం ది. మానవజాతికి మార్గదర్శకం కాగల సంస్కృతి ఉంది. ప్రపంచాన్ని దిగ్భ్రాంతం చెయ్యగల కళా వైదగ్ధ్యం ఉంది. కానీ స్వప్రయోజాన్ని దాటి చూడలేని, చూడడానికి ఇష్టపడని, చూడనివ్వని నీచమయిన పశుత్వం రాజ్యమేలుతోంది. అలాంటి కారణానికే మనం అడుక్కుతింటున్నాం. ఇంగ్లండు వంటి అతి చిన్న దేశాలు మనల్ని శతాబ్దాలుగా బానిసల్ని చేశాయి.

మనకి మహాత్ములున్నారు. కానీ వ్యక్తిగత శీలాన్ని గర్వంగా నిలుపుకోగల, చాటుకోగల 'మనిషి 'లేదు.

( **నవంబర్** 25, 2013)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (December 02, 2013) Taliban Deshabhakti తాలిబన్ దేశభక్తి

నాకెప్పుడూ తాలిబన్ల మీద అమితమైన గౌరవం ఉంది. ఈ మాట వ్యంగ్యంగానో, వెక్కిరింతగానో అనడం లేదు. అజ్ఞానమో, సుజ్ఞానమో, ప్రాథమికమో, పాశవికమో –తాము నమ్మిన నిజాన్ని –మాయాబజారులో సియెస్సార్ మాటల్లో 'సిగ్గులేకుండా' ప్రదర్శించగల నిజాయితీ వారికుంది. వారి విశ్వాసాలు మధ్యధరా సంస్కృతి కాలంలోనే ఆగిపోయి ఉండవచ్చు. వారి ఆచరణలు రాతియుగం నాటివి కావచ్చు. కాని అందుకు వారు సిగ్గుపడరు. ఆడపిల్లలు చదువుకోరాదు. ఎందరు పెళ్లాలను మగాళ్లు పెళ్లిచేసుకున్నా –వారికి పెళ్లాలయి, పిల్లల్ని కంటూనే బతకాలి అని వారు నమ్ముతారు. వారి మతాన్ని, వారి జాతిని ఉద్ధరించాలని కంకణం కట్టుకున్న ఒసామా బిన్ లాడెన్ కూడా నలుగురు పెళ్లాల్ని పెళ్లి చేసుకొని పద్నాలుగుమంది పిల్లల్ని కన్నాడు. మలాలా అనే అమ్మాయి దొంగతనంగా చదువుకోవాలనుకొంది. ఆ అమ్మాయిని నిర్ధాక్షిణ్యంగా కాల్చేశారు. తమ మతానికి వ్యతిరేకమైన బుద్ధుని విగ్రహాలను –భామియన్ బుద్ధుడి విగ్రహాలను ధ్వంసం చేశారు. తమని ఎదిరించినవారిని ఆత్మత్యాగం చేసుకుని అయినా చంపుతారు. ఇవన్నీ ఒక యెత్తు. ఈ మధ్య ప్రపంచ ప్రఖ్యాత క్రికెట్ ఆటగాడు సచిన్ తెండూల్కర్ ఆట నుంచి రిటైరయాడు. ప్రపంచమంతా ఆయన్ని తలకెత్తుకుని ప్రశంసించారు. పాకిస్థాన్ పత్రికలు కూడా తెండూల్కర్‌ని ఆకాశానికి ఎత్తేశాయి. ఇది తాలిబన్‌కి బొత్తిగా నచ్చని విషయం. ఎందుకు? ఇది దేశ భక్తికి సంబంధించిన విషయం కనుక. పాకిస్థాన్‌లో బహిష్కరించిన తెహరీక్ –ఏ –తాలిబన్ సంస్థ ప్రతినిధి షహీదుల్లా షహీద్ ఏకే 47 తుపాకీని ధరించి ఒక సందేశాన్ని పాకిస్థాన్ మాధ్యమాలను వీడియో ద్వారా హెచ్చరించాడు. "ఈ మధ్య క్రికెట్ ఆటనుంచి రిటైరయిన ఒక ఆటగాడిని –సచిన్ తెండూల్కర్‌ని పాకిస్థాన్ మాధ్యమాలు ఆకాశానికి ఎత్తేస్తున్నాయి. ఇది చాలా దురదృష్టకరం. ఎందుకంటే అతను ఇండియన్. మరి మన పాకిస్థాన్ ఆటగాడు మిస్బా –ఉల్ –హక్‌ని దుయ్యపడుతున్నాయి. ఇది మరీ విచారకరం. తెండూల్కర్ ఎంత గొప్పవాడయినా అతను ఇండియన్ కనుక పొగడడానికి వీలులేదు. మన మిస్బా ఎంత దరిద్రంగా ఆడినా మనవాడు, మన పాకిస్థానీవాడు కనుక పొగడండి –అంటూ వీడియో సందేశమిచ్చారు. మాధ్యమాలు వారి తాఖీదుల్ని పాటించకపోతే? చేతిలో ఆయుధం వారికి హెచ్చరిక. మనం హిరణ్యకశిపుడిని దుర్మార్గుడుగా దుయ్యపడతాం. ప్రహ్లాదుడిని మహాత్ముడని నెత్తికెత్తుకుంటాం. ఏనాడయినా –తన విశ్వాసాన్ని –ఆఖరి ఊపిరివరకూ మార్చుకోని నిర్దుష్టమయిన స్థైర్యం కల వ్యక్తిగా హిరణ్యకశిపుడిని పొగిడామా? ఇది విచక్షణ కాదా?

దలైలామా దేవుని అవతారం టిబెటన్లకి. కాని చైనా ప్రభుత్వానికి ఆయనొక పొరుగు దేశపు పాలకుడు. ఆయన్ని పొమ్మనలేక పొగపెట్టారు. నేను దిన పత్రికలో నా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించాను. రాయ్‌టర్ అనే బ్రిటిష్ వార్తాసంస్థ –ఆనాటి కాంగోలో స్వాతంత్ర్య పోరాట శక్తుల్ని విప్లవ శక్తులని పేర్కొనేది. కాని మేము 'జాతీయ దళాలు' అని అనువదించేవారం. బ్రిటిష్ వారికి కాంగో ప్రజల పోరాటం తిరుగుబాటు. కాని ఆ దేశీయులకి జీవన్మరణ సమస్య. తమది స్వాతంత్ర్యపోరాటం. ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వానికి గాంధీ తిరుగుబాటు దారుడు. మనకి మహాత్ముడు. ఇండియన్ తెండూల్కర్ గొప్పవాడయినా నిషిద్ధం. మిస్బా ఉల్ హక్ మరుగుజ్జు అయినా ఆదరణీయం. సగటు ప్రతిభని అపూర్వమైన ప్రతిభగా 'సాగదీసే' పని ఎవరు చెయ్యగలరు? చేతిలో తుపాకీ ఉన్నవారే చెయ్యగలరు.




రాచకొండ విశ్వనాథ శాస్త్రిగారి గొప్ప కథ ఒకటి –ఆరు సారాకథల్లో ఉంది. ఇద్దరు దొంగసారా వ్యాపారులు –విశాఖలో. ఇద్దరూ అవినీతితో ఒకరినొకరు పోటీపడుతూ రహస్య వ్యాపారం చేస్తున్నారు. ఒకరంటే ఒకరికి పడదు. బద్ధ శత్రువులు. అందులో ఒకడు మహా శివభక్తుడు. వాడికో ఉంపుడుకత్తె కూడా ఉంది. ఒకానొక సందర్భంలో ఈ భక్తుడి శత్రువుని ఎవరో ఓ హోటల్లో చంపేశారు. న్యాయంగా ఇతనికి ఆటవిడుపు కలగాలికదా? కాని వాడు మహాశివరాత్రినాడు చచ్చిపోయాడు. కనుక కైలాసానికి వెళ్లిపోతాడని జుత్తుపీక్కొన్నాడు. అదీ కథ.

చాలా సంవత్సరాల కిందట 'మాన్ ఫ్రైడే' అనే చిత్రాన్ని చూశాను. ప్రఖ్యాత నవలా రచయిత డేనియల్ డెఫో రాసిన నవల ఆధారంగా తీసిన చిత్రమిది. 1719 నాటి నవల అది. ఈ రెండు వందల సంవత్సరాలలో ఈ రచన ఎన్నో ప్రక్రియలలో తలమానికమయి నిలిచింది. కార్టూన్లు, సినీమాలు, టీవీ రూపకాలు –ఒకటేమిటి? కారణం? వొంటిరంగు కారణంగా, తెల్లవాడయిన కారణానికి మరొకరిమీద అధికారాన్ని చెలాయించే పెత్తనాన్ని అతి ప్రాథమికంగా ప్రశ్నించే గొప్ప రచన ఇది. ఒకానొక ద్వీపంలో ఒక ఓడ చిక్కుకుని ఆగిపోతుంది. గొప్ప శ్రీమంతుడు –రాబిన్సన్ క్రూసో అనే నావికుడు ఏకాకిగా మిగిలిపోయాడు. అతని దగ్గర తుపాకులు ఉన్నాయి. బంగారం ఉంది. కాని ఆ ద్వీపం నుంచి బయటపడే మార్గం లేదు. ఆటవికుడిలాగ జీవిస్తున్నాడు. ఒకసారి –ఆ రోజు ఫ్రైడే –ఒక పడవ అటుకొట్టుకు వచ్చింది. ఒక నల్లవాడు అక్కడ ఇరుక్కున్నాడు. అతను ఫ్రైడేనాడు 'దొరికాడు' కనుక అతనికి ఫ్రైడే అని పేరుపెట్టాడు. సమాజంలో స్థిరపడిపోయిన ఎన్నో విషయాలని అతి ప్రాథమికంగా ఈ నల్లమనిషి ద్వారా ప్రశ్నించాడు రచయిత. ఇలా మనం ఎప్పుడూ ఆలోచించం. నిజానికి కొన్ని ప్రశ్నలకు మనం సమాధానం వెదకం. ఉదాహరణకి క్రూసో ఫ్రైడేతో "నేను నీ యజమానిని" అన్నాడు. "అంటే?" అనడిగాడు నల్లవాడు. "నేను చెప్పినట్టు నువ్వు నడుచుకోవాలి?" అన్నాడు. "ఎందుకు?" మళ్లీ ప్రశ్న. రాబిన్సన్ క్రూసోకి వెంటనే సమాధానం దొరకలేదు. తన చేతిలో తుపాకీ ఉంది. దాన్ని చూశాడు. వెంటనే అన్నాడు "నాచేతిలో తుపాకీ ఉంది కనుక". తుపాకీతో ఎప్పుడయినా ఎవరినయినా నాశనం చెయ్యగలగడమే అతని శక్తి. పెద్దరికానికి కారణం. "మనిద్దరం కుస్తీ పడదాం" అన్నాడు. "అంటే?" ఎలా చెప్పాలో తెలియలేదు క్రూసోకి. "ఒకరినొకరు కొట్టుకోవడం". "ఎందుకు?" మళ్లీ ప్రశ్న. సమాధానానికి వెతుక్కున్నాడు. "అదొక క్రీడ" అన్నాడు. "క్రీడ అంటే?" ఎంత గొప్ప ప్రశ్న! "ఎదుటివాడి వినోదానికి ఒకరినొకరు హింసించుకోవడం". ఇంతకంటే మానవ వికారాన్ని ప్రశ్నించే ఆయుధం లేదు 1719 నాటి రచన. 2013లో తాలిబన్‌లు సరిగ్గా అదే జులుంని నిరూపిస్తున్నారు. రచయిత కాలం కంటే ముందుంటాడనడానికి ఇంతకంటే మంచి ఉదాహరణ ఏముంటుంది? తెండూల్కర్ గొప్పతనంతో తాలిబన్లకేమీ తగాదాలేదు. ఆయన్ని ప్రపంచమంతా పొగిడితే నిజానికి వారికి అభ్యంతరం లేదు. కాని పాకిస్థాన్‌లో శత్రుదేశం ఆటగాడిని నెత్తికెత్తుకోవడం వారికి నచ్చని విషయం. మీకు మరీ మోజుగా ఉంటే మన మిస్బా –ఉల్ –హక్‌ని పొగడండి. అతనంత గొప్ప ఆటగాడు కాదా? 'కొంచెం' పొగడండి. తెండూల్కర్‌ని అస్సలు పొగడకండి. తద్వారా కొన్నాళ్లకయినా మన మిస్బా మీ పుణ్యమా అని తెండూల్కర్ స్థాయికి 'సాగదీసి' నట్టవుతుంది. మన చేతిలో తుపాకీ ఉండాలికాని –మలాలా చదువుని ఆపగలం, బుద్ధుని విగ్రహాలను నాశనం చెయ్యగలం, తెండూల్కర్ గొప్పతనాన్ని అటకెక్కించగలం, మన పాకిస్థాన్ ఆటగాడు మిస్బాని ఆకాశంలో నిలబెట్టగలం. అదీ తాలిబన్ల విశ్వాసం.

ఒకజాతి సంస్కృతిని, విశ్వాసాలనీ, వైదగ్ధ్యాన్ని, వైభవాన్ని, ప్రతిభనీ –కేవలం అధికారంతో, కేవలం తుపాకీతో, కేవలం దౌర్జన్యంతో సాధించవచ్చని నమ్మే వ్యవస్థ ఇంత ప్రాథమికంగా ఆలోచించగలగడం, ఈ 2013లో ఇంతగా బరితెగించి ఆలోచించగలగడం –విడ్డూరంగా




కనిపించవచ్చు. కొండొకచో నవ్వు పుట్టించవచ్చు. కాని పొరుగు దేశంలో అది వాస్తవమని మరిచిపోకూడదు. తుపాకీని చూపించి ఈ సిద్ధాంతాన్ని నేర్పుతున్నారని మరిచిపోకూడదు. మానవ చరిత్ర ఇన్నివేల సంవత్సరాలలో ఏమయినా నేర్చుకుందా? నాగరికత పేరిట అధ:పాతాళానికి కృంగడం అద్భుతంగా ప్రాక్టీసు చేస్తోంది. ప్రపంచ చరిత్రలో గొప్ప శక్తి ఏది? ఈ ప్రశ్నకీ సమాధానం ఉంది. పక్కవాడిని నాశనం చెయ్యగల శక్తి, ఉద్దేశ్యం, అవకాశం అవసరం.

(**డిసెంబర్** 02, 2013)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (December 09, 2013) Nalla Suryuni Astamayam నల్ల సూర్యుని అస్తమయం

2003లో మా అబ్బాయి క్రికెట్ ప్రపంచ కప్పు ఆటలకు దక్షిణాఫ్రికా వెళ్లి వస్తూ నాకో బహుమతిని తెచ్చాడు. నెల్సన్ మండేలా ఆత్మకథ –ఎ లాంగ్ వాక్ టు ఫ్రీడమ్. "స్వాతంత్ర్యానికి సుదీర్ఘ ప్రయాణం" దాదాపు తెనుగు సేత. అప్పటికి ఆత్మకథల మోజులో ఉన్న నేను –నా ఆత్మకథ రచనకు ఉపక్రమించబోతున్న నేను –వదలకుండా కొన్ని రోజులు చదివాను. చదివాక కొన్ని సంవత్సరాలు నన్ను వెంటాడిన పుస్తకం –కాదు –వెంటాడిన జీవితం మండేలాది. మండేలాకీ మన దేశానికీ దగ్గర బంధుత్వం ఉంది. మహాత్ముని అహింసాయుతమైన పోరాటాన్ని –శాంతియుత సమరాన్ని స్ఫూర్తిగా తీసుకున్న రెండో వ్యక్తి –నెల్సన్ మండేలా. మొదటి వ్యక్తి –మార్టిన్ లూథర్ కింగ్.

దక్షిణాఫ్రికాలో తెల్లవారి పాలన మీదా, వారి ఆంక్షల మీదా, విధించిన శిక్షల మీదా కొన్ని దశాబ్దాలపాటు జరిగిన పోరాటంలో –ఎంతోమంది మరణించగా, ఎందరో పాలకుల దౌష్ట్యానికి బలిఅయిపోగా –వారిపై తిరుగుబాటు చేసి –వారు విధించిన శిక్షకు 27 సంవత్సరాలు తలవొంచి కేవలం తన చిత్తశుద్ధితో, ఆత్మవిశ్వాసంతో, ధృడమైన కర్తవ్య దీక్షతో –నిశ్శబ్ద విప్లవం జరిపి –తెల్ల పాలకుల తలలు వంచిన ఏకైక వీరుడు నెల్సన్ మండేలా. దుర్మార్గాన్నీ, దౌష్ట్యాన్నీ, అన్యాయాన్నీ –కేవలం సంయమనంతో, నిర్దుష్టమైన ఆత్మవిశ్వాసంతో ఎదిరించిన యోధుడు మండేలా. తమ పోరాటానికి ఫలితాన్ని తన జీవిత కాలంలోనే చూసి –దక్షిణాఫ్రికా రిపబ్లిక్‌కు మొదటి అధ్యక్షుడయ్యాడు. ఓర్పు, సంయమనం, అకుంఠితమైన చిత్తశుద్ధిలో తన గురువు కంటే నాలుగు అడుగులు ముందు నిలిచిన అద్భుత మానవతావాది మండేలా. చరిత్ర మలుపులో తనని జైలులో పెట్టిన నాయకత్వంతో (డి క్లార్క్‌తో) ప్రపంచ స్థాయి గౌరవాన్ని –నోబెల్ శాంతి బహుమతిని పంచుకున్న యోధుడు.

శుక్రవారం మండేలాకు నివాళులర్పిస్తూ ఆర్చిబిషప్ డెస్మండ్ టుటు అన్నారు: "రేపు సూర్యుడు ఉదయిస్తాడు. ఎల్లుండీ, ఆ తర్వాతా ఉదయిస్తాడు. కాని నిన్నటి సూర్యుడి ప్రకాశాన్ని, ఆశనీ చూపలేడు" అన్నాడు –మండేలాలేని జాతిని ఊహించుకుంటూ.

ఆయన ఒకసారి చెప్పారు. "మా కుటుంబంలో ఎవరూ స్కూలుకి వెళ్లలేదు. కాని నా చిన్నతనంలో నేను స్కూలుకి వెళ్లాను. అప్పటి మా టీచరు ఎమ్‌డింగానే స్కూలులో చేరిన మొదటి రోజునే నాకో కొత్తపేరు పెట్టింది. మా పెద్దలు పెట్టిన ఆఫ్రికన్ పేర్లతో కాక –సులువైన పేర్లు టీచర్లు పెట్టడం ఆనవాయితీ. ఆవిడ పెట్టిన పేరు –నెల్సన్. నెల్సన్ అని ఎందుకు పెట్టిందో తెలీదు" మనకి ఇప్పుడు తెలుసు. మానవాళి ఎల్లకాలం గుర్తుంచుకోడానికి. మానవత్వపు విలువలకి మన్నికైన మారుపేరుగా శాశ్వతంగా నిలవడానికి.

జైళ్లలో ఐదు నక్షత్రాల సుఖాల్ని అనుభవిస్తున్న మన నాయకమ్మన్యుల కథలు మనం చదువుకుంటున్నాం. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, భారతరత్న, దక్షిణాఫ్రికా మొదటి అధ్యక్షుడు, అమెరికా శాంతి బహుమతిని, రష్యా లెనిన్ పతకాన్ని అందుకున్న మండేలా అనే స్వాతంత్ర్య యోధుని జైలు జీవితాన్ని ఒక్కసారి పరిశీలిద్దాం.

మండేలా రాబిన్ ద్వీపంలో 18 సంవత్సరాలు జైలులో ఉన్నారు. బి తరగతి ఖైదీల విభాగంలో ఒంటరిగా అతన్ని బంధించారు. 8 అడుగుల పొడవు, 7 అడుగుల వెడల్పుగల గదిలో కాంక్రీటు నేలమీద ఒక గడ్డి చాపమీద పడుకునేవాడు. ఎందరో తెల్లజాతి వార్డన్లు రాసి రంపాన పెట్టేవారు. పగలు రాళ్లని పిండికొట్టే చాకిరీ. తర్వాత చెక్కసున్నం క్వారీని తవ్వేపని. నల్లకళ్లద్దాలు పెట్టుకోవడాన్ని వార్డన్లు నిషేధించారు. సున్నం

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ
కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

తాకిడికీ, వెలుగు సున్నంలోంచి కళ్లమీదికి ప్రతిబింబిస్తూండగా కంటిచూపు శాశ్వతంగా దెబ్బతింది. రాత్రివేళల్లో ఎల్ఎల్‌బి (న్యాయ శాస్త్రం) చదువుకునేవాడు. వార్తాపత్రికలు ఆయనకి ఇచ్చేవారు కాదు. తోటి ఖైదీలు దయతలిచి ఆయనకి పేపర్ల కట్టింగులు అందిస్తే –వాటిని సంపాదించుకున్నందుకు ఎన్నో సందర్భాలలో ఆయన్ని ఏకాంతంగా బంధించి ఉంచేవారు. ఆయన నాలుగో తరగతి ఖైదీగా లెక్క. ప్రతీ ఆరునెలలకీ ఒక్కరు మాత్రం కలిసేవారు. ఒక్క ఉత్తరాన్ని బాగా సెన్సారు చేసి యిచ్చేవారు. ఆయన జైల్లో ఉన్నప్పుడు –1968లో ఆయన తల్లి ఒక్కసారే ఆయన్ని చూడనిచ్చారు. తర్వాత ఆమె కన్నుమూసింది. ఆయన కొడుకు కారు ప్రమాదంలో మరణించాడు. కాని రెండు విషాదాల్ని పంచుకోడానికి ఆయనకి అనుమతి లభించలేదు. ఆయన భార్య విన్నీ ఒకటి రెండుసార్లు మాత్రమే ఆయన్ని చూడగలిగింది. తర్వాత రాజకీయమైన ఉద్యమాలకు ఆమెనీ అరెస్టు చేశారు.

1982 –88 మధ్య పోల్స్ మూర్ జైలులో నిబంధనలను సడలించారు. ఈ పీడనని ఇంత విపులంగా వ్రాయడానికి కారణం –ఒక జాతి జీవనాన్ని మలుపు తిప్పే నాయకుడి ఆత్మస్థైర్యాన్ని చెదరగొట్టడానికి మానవ హృదయం –ఒక నిర్వేదంతో, నిస్పృహతో, నిర్వీర్యం కావడానికి ఎంత ప్రయత్నం జరిగిందో అర్థం కావడానికి.

నేను అండమాన్‌లో అలనాటి స్వాతంత్ర్య యోధులెందరినో బంధించిన సెల్యులర్ జైలుని చూశాను. తెల్లవారిలేస్తే వందలాది మందిని ఉరితీసే దృశ్యం అనుక్షణం కళ్లబడేటట్టు –ఉరికంబం పక్కనే ఉన్న జైలుగదిలో అలనాడు వీర సావర్కార్‌ని ఉంచారట. ఒక నిర్దుష్టమైన మానవ సంకల్పం, అకుంఠితమైన కార్యదీక్షా వీరుల చిత్తశుద్ధిని ఛిన్నాభిన్నం చేయలేకపోవడమే చరిత్ర. 1988 –90 మధ్య విక్టర్ వెర్ట్సర్ జైలుకి మార్చారు. తర్వాత డి క్లార్క్ దక్షిణాఫ్రికా నాయకత్వాన్ని చేపట్టడం –దేశ స్వాతంత్ర్యం తర్వాతి చరిత్ర.

మండేలా జీవితంలో మూడుసార్లు పెళ్లి చేసుకున్నారు. ఆయనకి ఆరుగురు పిల్లలు. 29 మంది మనుమలు, ఆరుగురు మునిమనుమలు. ఆయన 80 వ యేట తనకంటే 27 సంవత్సరాలు చిన్నదయిన వ్యక్తిని పెళ్లి చేసుకున్నారు. జీవితమంతా తను నమ్మిన నిజాల కోసం పోరాటం సాగించాడు. జీవితమంతా తనకోసం జీవిస్తూనే ఉన్నాడు. తొమ్మిది సంవత్సరాల క్రితం మన రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ దక్షిణాఫ్రికా మాజీ రాష్ట్రపతిని ఆయన ఇంటి దగ్గర కలిశారు. ఆయన శలవు తీసుకుంటున్నప్పుడు మండేలా గుమ్మందాకా నడుస్తూ చేతికర్రని వదిలేసి కలామ్ భుజాన్ని ఊతం చేసుకున్నారట. అప్పుడు కలామ్ అడిగారట: "డాక్టర్ మండేలా! దక్షిణాఫ్రికాలో జాతి వివక్షని ఎదిరించి పోరాడిన తొలి నాయకులు ఎవరు" మండేలా నవ్వి ఒకే ఒక్కపేరు చెప్పారు –గాంధీ. "ఇండియా మాకు ఎమ్.కె.గాంధీని ఇచ్చింది. మేము మీకు మహాత్మాగాంధీని అందజేశాం"అన్నారట.

ఆయన హయాంలోనే మన దేశ స్వాతంత్ర్యానికి తొలి బీజాలు పడిన దక్షిణాఫ్రికా రైలు స్టేషన్ –పీటర్ మారిట్స్ బర్గ్‌లో –స్టేషన్లోనే మహాత్మాగాంధీ విగ్రహాన్ని స్థాపించారు. విచిత్రమేమిటంటే అహింసా పోరాటాన్ని జీవితాంతం జరిపిన ఈ వీరుని విగ్రహం ఉన్నచోట ఇంకా హింస కొనసాగుతూనే ఉంది. మా అబ్బాయి –ఆ విగ్రహాన్ని చూడడానికి పీటర్ మారిట్స్ బర్గ్ స్టేషన్‌కి వెళ్లాడు టాక్సీలో. టాక్సీని ఓ నల్ల అమ్మాయి నడుపుతోంది. ఇతని ఉద్దేశాన్ని గమనించి ఆమె ఆశ్చర్యంగా చూసిందట. "ఎందుకంత రిస్కు తీసుకుంటున్నావని" "బడీ! నేను కారు ఇంజన్ నడుపుతూ ఏక్సలరేటర్ మీద కాలు పెట్టి ఉంటాను. నీ అదృష్టం బాగుండి పరిగెత్తుకు రాగలిగితే ఇక్కడినుంచి దూకేద్దాం" అన్నదట.




నేనప్పుడు విశాఖపట్నంలో ఉన్నాను. మా అబ్బాయి మారిస్ పీటర్స్ బర్గ్ స్టేషన్‌లో గాంధీని దర్శిస్తున్నప్పుడు –నేను రోడ్డుపక్క కారు ఆపి –అతని ఫోన్‌కి ఎదురుచూస్తున్నాను –కొన్ని వేల మైళ్లలో టాక్స్ డ్రైవరు లాగే ఆతృతగా.

మండేలా చెప్పిన రెండు మాటలు ఆయన జీవితాన్నీ, ఆయన ఆదర్శాన్నీ, ఆయన వ్యక్తిత్వాన్నీ కళ్లకు కట్టినట్టు నిర్వచిస్తాయి. ఆయన అంటారు: జీవితంలో గొప్పతనం ఎ ప్పుడూ ఓడిపోకుండా నిలవడం కాదు. కాని ప్రతీసారి కింద పడినప్పుడూ లేచి నిలబడగలగడం గొప్పతనం –అని. మరొక్కమాట: భయం లేకపోవడమే ధైర్యం అని నేను నమ్మడం లేదు. భయాన్ని జయించడం ధైర్యమని నమ్ముతాను. జీవితంలో ఎప్పుడూ భయపడనివాడు కాదు ధైర్యస్థుడు. భయాన్ని శాశ్వతంగా జయించినవాడు –అంటారు ఆయన. మండేలా ఈ రెండు సూత్రాలను కేవలం నోటితో చెప్పలేదు. జీవితంలో 95 సంవత్సరాలు పాటించి ఆకాశమంత ఎత్తున నిలిచాడు. కొందరు సత్యాన్ని గుర్తిస్తారు. కొందరు సత్యానికి గుర్తులు పెడతారు. కొందరు ఆ సత్యానికి తమ జీవితాన్నే అభిజ్ఞలు చేసుకుంటారు. జీవితమంతా మహాత్ముని అడుగుజాడల్లో నడిచి మరో మహాత్ముడుగా నిష్క్రమించిన ఆకాశం పేరు నెల్సన్ మండేలా.

(**డిసెంబర్** 09, 2013)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

# (December 16, 2013) Cheepuru Rajakeeyam చీపురు రాజకీయం

చీపురుని ఎన్నికల గుర్తుగా ఉంచాలని ఆలోచించిన వారెవరో నిజంగా మహానుభావులు. ఇంతకంటే ఇంటి ముంగిట్లో, వీధుల్లో, గదుల్లో తిష్ట వేసుకు కూర్చునే సాధనం మరొకటి ఉండదు. దాని అవసరం లేని రోజూ, అవసరం లేని మనిషీ, అవసరం లేని సందర్భమూ ఉండదు. నిజానికి 'చీపురు'ని ఎన్నికల గుర్తు చేయగానే సగానికి సగం విజయం సాధించినట్టే లెక్క. అందునా ఈ మధ్య సమాజంలో చెత్త ఎక్కువయి, చెత్త రాజకీయాలు తల బొప్పి కట్టించే నేపధ్యంలో ఎలాంటి చీపురుతో ఈ చెత్తని బుట్టదాఖలు చెయ్యాలా అనే ఆలోచనతో దేశంలో చాలామంది జుత్తు పీక్కుంటున్నారు. ఈ నేపథ్యంలో 'చీపురు' పార్టీ ఎంతగానో స్వాగతించవలసిన సంఘటన. గాలిలో వందలాది చీపుర్లు ఎగరేస్తూ "మాకు ఓటు వెయ్యండి. చెత్త సంగతి మాకు వదిలేయండి" అన్న దృశ్యం అత్యంత హృద్యమయినదీ, ఈ దేశం కలలు కంటున్నదీను. చెత్తని వదిలించినా వదిలించకపోయినా –చీపురు దాన్ని 'చెత్త' అని గుర్తు పెట్టడం, దాన్ని సమూలంగా తుడిచి పెట్టాలని తలపెట్టడం –దేశభక్తి, సమాజ సేవ అని దొంగపేర్లు పెట్టి బొర్రలు, ఖజానాలు నింపుకునే నాయకమ్మన్యుల మీద 'ఏవగింపు' ఈ నినాదానికి గొప్ప పెట్టుబడి. ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఇలాంటి ప్రయత్నం ఎన్నడూ జరగలేదు. అంతేకాదు. ఆ కారణానికే పార్టీ అవతరించగానే సగం విజయాన్ని సాధించేసింది. అంతేకాదు. పార్టీ అవతరించిన 9 నెలల్లో –170 సంవత్సరాల చరిత్ర ఉన్న పార్టీని మట్టి కరిపించి, 15 సంవత్సరాలుగా ఢిల్లీలో రాజ్యమేలుతున్న ముఖ్యమంత్రిని గద్దె దింపడం కన్న వోటరు 'కసి'కీ, ఈ రాజకీయ వ్యవస్థ పట్ల అతని 'అసహ్యానికీ' మరొక నిదర్శనం అక్కరలేదు. "వాళ్లూ మాలాగే హామీలిచ్చారు. ఏదీ? చేసి చూపమనండి" అని మొన్న ఓ రాజకీయ నక్క టీవీలో పెద్ద కబుర్లు చెప్పాడు. ఇది సిగ్గులేని మాట. అయితే సిగ్గు వంటి గుణాలు వీరినుంచి ఆశించడం నిజానికి అన్యాయం. మొదట వారి రాజకీయ నీతిని ఎండగట్టినందుకు సిగ్గుపడడం పోయి, ఎదురు తిరగడం దయనీయం. ఈనాటి సిగ్గులేని రాజకీయ వ్యవస్థకి ఇది కేవలం నీచమైన ఉదాహరణ.

ఈ చీపురు పార్టీ తాము ఇచ్చిన హామీలను తీర్చలేకపోవచ్చు. వాళ్లూ సమాజంలో అవినీతికి, దురాశకీ, దుర్మార్గానికీ బలికావచ్చు. వాళ్లూ క్రమంగా మిగతా పార్టీలలాగే నేలబారు స్థాయికి దిగజారిపోవచ్చు. అవుతుందని కాదు. అయితే ఆశ్చర్యంలేదని మాత్రమే. ఒకవేళ అయినా ఈ విప్లవాన్ని, ఈ దశలో చరిత్రనీ ఏనాటికీ మరిచిపోదు. మరిచిపోకూడదు. పదవిలోకి వచ్చినప్పటి నుంచీ పెట్టెలు సర్దుకున్న నాయకుల పట్ల వోటరు 'ఏహ్యత'కు ఈ ఎన్నిక అద్దం పడుతోంది. నిర్దాక్షిణ్యంగా అవినీతిని వోటరు గద్దెదించడం ఈ దేశానికి శుభసూచకం. చరిత్ర. సిగ్గులేకుండా రోజూ టీవీలముందు కనిపించే ఎందరి మొహాలనుంచి తమకు విముక్తి కావాలని ఈ దేశ ప్రజలు కలలు కంటున్నారో ఈ ఎన్నిక –కుండ పగలగొట్టి నిరూపించింది. తప్పని సరిగా కోడి గుడ్డుమీద వెంట్రుకలు పీకే ప్రబుద్ధులు ఆయా పార్టీలలో ఉన్నారు. నిజానికి అదే వారి ఘనత. ఈ ఎన్నికలో వోటరు 'విసుగు'ని రహస్యంగానయినా ఈ అవకాశవాదులు గుర్తుపడతారని ఆశిద్దాం.

ఇక రాజస్థాన్‌లో, మధ్యప్రదేశ్‌లో తమ 'హవా' చెల్లుతోందని రొమ్ము విరుచుకునే నాయకులూ ఒకటి గుర్తుపట్టాలి. ప్రతీసారీ –నాయకుల పట్ల తమ కోపాన్ని, అసహ్యాన్నీ, అసమ్మతినీ చూపడానికి మరో ఆస్కారం లేని ఓటరు –తప్పనిసరిగా, నిస్సహాయంగా, ఏడుస్తూ –బాచా బూచులలో మరో పాత 'బూచి'నే ఎన్నుకుంటున్నాడు మరో గతిలేక. ఈ రాజకీయ నాయకులు "మిమ్మల్ని తిట్టారంటే మ మ్మల్ని పొగుడుతున్నట్టు లెక్క" అని చంకలు గుద్దుకుని తమ బ్రాండు అవినీతిని అయిదు సంవత్సరాలు ఆచరణలో పెడతారు. అప్పుడు నిస్సహాయంగా వీళ్లని గద్దె దించుతున్నాడు




వోటరు –అప్పుడూ మరో గతి లేక. దీనికి ఒకే ఒక ఉదాహరణ –తమిళనాడు. గత 46 సంవత్సరాలలో డిఎంకెని గద్దె దించి, ఎడీఎంకెనీ, అలాగే వీళ్లని దించి వాళ్లనీ ఎన్నుకుంటున్నాడు ఓటరు –నిస్సహాయం గా. కారణం –అతనికి మరో ప్రత్యామ్నాయం లేక. "బాబూ! రాజస్థాన్‌లో, మధ్యప్రదేశ్‌లో బలమైన 'చీపుర్లు' ఉంటే నిజమైన వోటరు 'అభిప్రాయం' దేశానికి తెలిసేది. ఈ చీపురు పార్టీ విజయాల్ని చూద్దాం. మూడుసార్లు ఎన్నికయిన ముఖ్యమంత్రి షీలా దీక్షిత్‌నే కాదు. గత 60 సంవత్సరాలుగా అలవాటుగా అంబేద్కర్ నగర్ నుంచి తప్పనిసరిగా ఎన్నికవుతూ, గిన్నిస్ పుస్తకం ఎక్కిన రాజకీయ భీష్ము డు చౌదరీ ప్రేమ్ సింగుని అశోక్‌కుమార్ చౌహాన్ అనే కుర్రాడు ఓడించాడు. ఆ వోటమిలోనూ మూడోస్థానంలో ఉన్నారు ప్రే మ్‌సింగుగారు. ఇది మరో కారణానికి గిన్నిస్ పుస్తకం ఎక్కాల్సిన చరిత్ర. సోమ్ దత్తా శర్మ అనే విద్యార్థి నాయకుడు ఉచితంగా వైద్య శిబిరాన్ని నడిపి, పేద విద్యార్థులకి చదువుకి సహాయం చేసే పని చేస్తున్నాడు. అతను ఈ చీపురు పార్టీ అభ్యర్థి. సంజీవ్ ఝా పై రాష్ట్రాల నుంచి ఢిల్లీ వచ్చి స్థిరపడాలనుకున్న వారికి సహాయం చేసే 'నవ పల్లవ్' అనే సంస్థని నడుపుతున్నాడు. సత్యేంద్రకుమార్ జైన్ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి విసిగి ఉద్యోగానికి రాజీనామా చేసి –పుట్టుకతో మానసికంగా దెబ్బతిన్న పిల్లలకు సహకరించే సంస్థని నడుపుతున్నాడు. మిగతా పార్టీలలో –రాజకీయ నాయకుల కొడుకులు, పెళ్లాలు, మేనల్లుళ్లు, కూతుళ్లు, పినతండ్రులు –వీరుకాక గూండాలు, మానభంగాలు చేసేవారు, దోపిడీదారులు, మాఫియా పెద్దలు, హంతకులు –వీరంతా ఎన్నికయి –మన శాసన సభల్లో, పార్లమెంటుల్లో ఉన్నారు. వీళ్లు చిన్న చిన్న అవినీతులు చేస్తే తప్పులేదని ఐయ్యేయస్‌లకు గీతాబోధ చేస్తారు. 17 కోట్లు దోచుకుంటే పెద్ద అవినీతికాదని పెదవి విరుస్తారు. ఇళ్లలో టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లు నిర్మించుకుంటారు. గడ్డి తింటారు. అమ్మాయిలతో రంకు జరిపి, హత్యలు చేసి శవాల్ని మాయం చేస్తారు. పేరు అడిగినందుకు గుమాస్తాల మీద తుపాకులు తీస్తారు. పోలీసు స్టేషన్లలోకి వెళ్లి పోలీసుల్ని కొడతారు. వీళ్ల అరాచకాలు వర్ణనాతీతం. అత్యంత జుగుప్సాకరం.

ఈ నేపథ్యంలో వీరి అవినీతికి ప్రజలు ఎంతగా విసిగిపోయి ఉన్నారో, ఎక్కడయినా రవంత చల్లగాలి ప్రసరిస్తే ఊపిరి పీల్చుకోవాలని ఎంత తహతహలాడుతున్నారో –నిన్నటి ఢిల్లీ ఎన్నిక చెప్తోంది. చీపురు అవసరాన్ని వోటరు ఎంతగా ఆశిస్తున్నాడో నిరూపిస్తోంది. బాబూ! మిగతా పార్టీల నాయకులూ! తమకొక మనవి. ఆమ్ ఆద్మీ పార్టీలోనూ ఒకరిద్దరి అవినీతిపరులు దొంగ దారి గుండా ప్రవేశించారని నిన్న ఎవరో పరాయి పార్టీవారు దేశాన్ని హెచ్చరించబోయారు. వారూ తమ హామీలను తీర్చలేకపోతారా? వారూ నిజాయితీగా రాజకీయాల్ని నిర్వహించలేక మెల్లగా దిగజారిపోతారా? అయినా వారితో ప్రయాణం చెయ్యడానికి చెయ్యి కలుపుతాం. ఎందుకో తెలుసా? వాళ్లు మీలాగ చెడిపోవడానికి మరో 60 ఏళ్లు పట్టవచ్చు. కాని 2013 లో హంతకులతో, ఖూనీకోర్లతో సతమతమవుతున్న మేము, 1947 తర్వాతి కాలంలో అవినీతిని భరిస్తూ ఇంకాస్త మనశ్శాంతితో జీవించగలం. అయిదేళ్ల కుర్రాడిలో తొలినాటి అవినీతి –వేళ్లు నిలదొక్కుకొని మమ్మల్ని సమూలంగా కబలించే చెయ్యి తిరిగిన అవినీతి కంటే మేలయినది. అయితే –రవీంద్రుని మాట మాకు ఊరట. ఈ ప్రపంచంలో కళ్లు విప్పుతున్న ప్రతీ పసివాడూ –మనిషి అనునిత్యం చెడిపోతున్నా ఏనాటికయినా బాగుపడడా అనే భగవంతుడి నిరంతనమైన ఆశాభావానికి, విశ్వాసానికి ప్రతీక –అన్నారు రవీంద్రులు. ఈనాటి చీపురు ఏనాటికయినా ఒక నిజాయితీపరుడిని గద్దె ఎక్కించదా అని మా ఆశ. అందుకు వోటరు ఏనాటికీ అలసిపోడు. కారణం మీ దౌర్భాగ్యపు అవినీతితో క్రుంగి, కృశించి విసిగి వేసారి ఉన్నాడు కనుక.

(డిసెంబర్ 16, 2013)



# (December 23, 2013) Oka Neram Oka Nirupana ఒకనేరం ఒక నిరూపణ

ఈ మధ్య మన దేశంలో రెండు అపురూపమైన సంఘటనలు జరిగాయి. శంకర రామన్ హత్యకేసులో అరెస్టయి నూరు రోజులు జైలులో ఉన్న కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతీ స్వామి మీద నేరం రుజువు చేయలేకపోయారని పుదుచ్చేరి కోర్టు కేసు కొట్టివేసింది.

ఆయనతోపాటు అభియోగం మోపిన 23 మందినీ కోర్టు నిరపరాధులని పేర్కొంది. నిజానికి 24 మంది మీద కేసు పెట్టారు. మరి 24వ ముద్దాయి ఎవరు? కదిరవానన్ అనే ముద్దాయి. ఆయన్ని ఆరేళ్ల కిందట నరికి చంపారు. శంకరరామన్‌ని కూడా నరికి చంపారు. (ఈ నేరంలో పద్ధతి ఒకే నేరస్థుడి పట్ల వేలుచూపిస్తోందా?) ఇప్పుడు కంచి స్వామిని అరెస్టు చేయించినందుకు తమిళనాడు ముఖ్యమంత్రి ఆయనకి క్షమాపణ చెప్పాలని సుబ్రహ్మణ్య స్వామి అన్నారు. నేను 33 సంవత్సరాలుగా ఈ కాలమ్ రాస్తున్నాను. నాకు సీనియర్ మాలతీ చందూర్ వెళ్లిపోయారు కనుక –ఈ రచనలో నేనే బతికున్న సీనియర్‌ని. ఈ మాట చెప్పడానికి కారణం ఈ కాలమ్ చరిత్రలో అంత ఆవేశంగా నేను కాలమ్ రాసిన గుర్తులేదు. ఈ సందర్భంలో ఆ కాలమ్‌ని మళ్లీ పాఠకులు చదవడం న్యాయమని నాకనిపిస్తోంది. ఈ దేశంలో హత్యలు చేసిన సినీతారలు జైళ్లకు వెళ్లకుండా కోట్లు ఖర్చుచేసి ఆసుపత్రులనుంచి ఇళ్లకు వెళ్తారు.

సల్మాన్ ఖాన్ అమ్మాయిలతో అడవులకు వెళ్లి చెయ్యకూడని పనులు చేసి, చంపకూడని పక్షుల్ని చంపితే –ఆయన ఒకరోజు జైలుదాకా వెళ్లడాన్ని పత్రికలు నెత్తిన పెట్టుకుని –అదేదో ఈ దేశానికి పట్టిన అనర్థం లాగ మోశాయి. లల్లూ ప్రసాద్ అనే గడ్డితిన్న రాజకీయ నాయకుడు జైల్లో ఉంటే జైలులో వారి జీవితం ఎలా సాగుతోందో పాత్రికేయులు మనకి కథలుగా చెప్పి మనల్ని ధన్యుల్ని చేశారు. జగన్మోహనరెడ్డిగారి జైలు జీవితాన్ని మనకి పత్రికలు అద్భుతంగా అభివర్ణించాయి. నిజాయితీని అటకెక్కించి, ఆసక్తిని అమ్మకానికి జర్నలిజం పెట్టి చాలాకాలమయింది. అదీ మన దౌర్భాగ్యం. జయేంద్ర సరస్వతి అరెస్టు రోజున పత్రికలు గొంతు చించుకోలేదు. కంచిస్వామి తలవొంచుకుని ఆనాడు జైలుకి వెళ్లి నూరురోజులు ఉన్నారు. ఇది మన పొరుగు ముఖ్యమంత్రిగారి నిర్వాకం. ఆ రోజు చాలామంది భోజనాలు చెయ్యలేదు. ఈ దేశంలో మరో ముఖ్యమంత్రి కరుణానిధి, ఆమె కొడుకులూ, కూతుళ్లూ, మేనల్లుళ్లూ దేశాన్ని దోచుకుతింటున్నారని, ఆయన పదవిలో ఉంచిన మంత్రి లక్షా డెబ్బై కోట్లని పంచాడని రుజువులొచ్చినా –ఈ ముఖ్యమంత్రి ఏమీ చెయ్యలేకపోయింది. కంచి స్వామిని విమానంలో తీసుకువెళ్లి జైలులో ఉంచారు. ఈ దేశంలో రాజకీయ నాయకుల బలం, జులుంకీ –2000 సంవత్సరాల చరిత్ర ఉన్న స్వామి చూపిన ధర్మ నిరతికీ వ్యత్యాసం చెప్పకపోయినా తెలుస్తూనే ఉంటుంది. ఇవాళ ఈ కాలమ్ రాయడానికి కారణం –ఒక పొరుగు రాష్ట్రపు న్యాయస్థానం స్వామి నిరపరాధిగా తీర్పు ఇవ్వడం.

పాఠకులకు గుర్తుంటే స్వామి నేరాన్ని నిరూపించే సాక్ష్యాన్ని అలనాడు ఇచ్చిన రవి సుబ్రహ్మణ్యాన్ని ఆనాడు అరెస్టు చెయ్యలేదు –అప్రూవర్ అయిన కారణానికి. అలనాడు అప్రూవర్ బురఖా జైలుకి వెళ్లకుండా తప్పించుకోవడానికి. సరిగ్గా అయిదు సంవత్సరాల తర్వాత రవి సుబ్రహ్మణ్యం –తన కథని మార్చేశాడు. ఇప్పుడిక నూరురోజుల స్వామి జైలు శిక్షకి ఎవరు సమాధానం చెప్తారు? శిక్ష అనుభవింపజేశాక నిర్దోషిత్వాన్ని తీర్పుగా చెప్పడం ఈ దేశపు న్యాయస్థానాలకి తీరని మచ్చ.

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

పదిమంది నేరస్థుల్ని విడిచిపెట్టినా ఒక్క నిర్దోషికి అన్యాయం జరగరాదన్న బ్రిటిష్ న్యాయవ్యవస్థ సూత్రాన్ని మన న్యాయ వ్యవస్థ అటకెక్కించి చాలారోజులయింది. నిన్ననే మాజీ అటార్నీ జనరల్ తరుణ్ తేజ్‌పాల్ రంకు గురించీ, ఆ మహానుభావుడిని పత్రికలు నేరస్థుడని దుయ్యపట్టడాన్ని ఖండిస్తూ –ఒక వ్యక్తిమీద అభియోగం నేరనిరూపణ కాదు. అప్పటి అరెస్టు కేవలం అతను సాక్ష్యాధారాలను, పరిశోధనను వక్రీకరించకుండా నియంత్రించే ప్రక్రియేనన్నారు. భేష్. ఆ ప్రక్రియను కంచి స్వామి విషయంలో నూరురోజులు పొడిగించారు. జైలుకి పంపితే అభ్యంతరం చెప్పని స్వామి న్యాయ విచారణను గల్లంతు చేయగల సమర్థుడా? ఆ ముఖ్యమంత్రి, ఆనాటి న్యాయస్థానం పెద్దలు చెప్పాలి. అధికారం నిస్సహాయుడి చేతులు ఎలా విరగదీస్తుందో ఆనాటి సంఘటన రుజువు చేసింది. అదొక్కటే కారణంగా ఆ ముఖ్యమంత్రిని ప్రజలు ఎన్నికలలో ఇంటికి పంపించారు.

మతం సమాజంలో జీవన సరళిని నిర్దేశించే మార్గసూచిగా అనాదిగా ఎందరో మహానుభావులు ప్రతిపాదిస్తూ వచ్చారు. ప్రవక్తలు –శంకరాచార్య, రామానుజులు, గురునానక్, రామకృష్ణ పరమహంస, అరవిందుల వంటివారంతా ఆయా కాలాలకు అనుగుణంగా మతాన్ని, వారి మార్గాల్ని సవరిస్తూ, నిర్దేశిస్తూ వచ్చారు. కేవలం మనిషి జీవనాన్ని సజావుగా తీర్చిదిద్దేదే మతం. కాని మన దేశంలో మతం రాజకీయాలలోకి పాకింది. విశ్వాసం ఒక సామూహిక మూర్ఖత్వంగా, మెజారిటీగా, హక్కుగా, అవకాశంగా మారింది. అది దురదృష్టం. ఆసారాం బాపూలు, నిత్యానంద స్వామి వంటి స్వాములు ప్రజల విశ్వాసాలను తప్పుతోవలు పట్టించే అవకాశవాదులయి –ఆ వ్యవస్థనే భ్రష్టు పట్టించారు.

రాజకీయాలలో కూడా ఈ భ్రష్టతని మరింత ఎక్కువగా ప్రతిదినం చూస్తున్నాం. ఒకప్పుడు ఈ దేశంలో అవినీతిని త్రవ్వి బయటపెట్టడంలో సవాలుగా నిలిచిన తెహల్కా అధిపతి –బ్రహ్మకైనా పుట్టు రిమ్మ తెగులు అని నిరూపించాడు. 2000 నాటి క్రికెట్ మాచ్ ఫిక్సింగు గూడుపుఠాణీ, బంగారు లక్ష్మణ్ కేసు వంటివి అనూహ్యమైన సాధనలు. అయితే తన కూతురు వయస్సున్న, తన కూతురు స్నేహితురాలితో జరిపిన ముచ్చట ఒక గొప్ప వ్యవస్థకి గొడ్డలిపెట్టు. ఈ రెండు సంఘటనలూ ఒకే వారంలో జరగడమే ఈ రెంటినీ కలిపి ఉదహరించడానికి కారణం. వ్యవస్థలోనూ, చరిత్రలోనూ ఏ విధంగానూ పొంతనలేని సంఘటనలివి. కంచిస్వామి నిర్దోషిత్వం ఈ దేశంలో కోట్లాది మందికి ఊరట మాత్రమే కాదు. వారి విశ్వాసాలకు మళ్లీ మదింపు.

అరెస్టు వెనుక రాజకీయ దురుద్దేశాలు అప్పట్లో వెలుగులోకి వచ్చాయి. అవన్నీ ఇప్పుడు తవ్వి ప్రయోజనం లేదు. కా ని ఆనాడు కంచిస్వామి పట్ల, ఆయన నిర్దోషిత్వం పట్లా అనేకమందికి గల నమ్మకాన్ని ఇన్ని సంవత్సరాల తర్వాత సాధికారికమైన వ్యవస్థ సమర్థించడం ఒక గొప్ప ఊరట. ***అవమానానికి నీతి తలవొంచుతుంది. అవినీతి రెచ్చిపోతుంది. ధర్మం తను నమ్మిన దారిలో సజావుగా ప్ర యాణం చేస్తుంది. ఆధర్మం అడ్డుపడి పగబడుతుంది.*** కంచిస్వామి కథ ముగింపు ఈ నిజాన్నే నిరూపిస్తోంది.

**(Old Column when Kanchi Swamy was arrested)**




గొల్లపూడి కాలమ్

## కంచి స్వామి

కంచి స్వామి హత్య చేయించారా, ఆయనే హత్యకు ప్రధాన కారకులా అన్న ప్రశ్నకీ ఈ కాలమ్‌కీ ఎటువంటి సంబంధం లేదు.

ఈ కాలమ్ లోనే పది సార్లయినా చెప్పిన ఓ సంఘటనని మళ్ళీ మళ్ళీ చెప్పినా తప్పు లేదు. స్వాతంత్ర్య పోరాట సమయంలో మహాత్ముడిని అరెస్టు చేశారు. కోర్టుకి తీసుకొచ్చారు. ఆయన కోర్టులోకి వస్తూనే న్యాయస్థానంలో వున్న వారంతా లేచి నిలబడ్డారు. చివరికి బ్రిటిష్ న్యాయమూర్తి లేచి నిలబడ్డారు. ఇంకా నేరం గురించి చర్చ ప్రారంభం కాలేదు. కాని సిద్ధాంత పరంగా– ఓ వ్యక్తికి వ్యవస్థ ఇచ్చే కనీసమైన గౌరవం అది.

ఈ దేశంలో ఎన్నో మారణహోమాలకి కారణమైన ఇక్బాల్ మసూద్ ని విదేశాంగ మంత్రి స్వయంగా తీసుకెళ్లి– కాందహార్ లో అప్పగించి వచ్చారు. హంతకులకీ, నేరస్తులకీ ప్రభుత్వం తలవొంచిన సందర్భమిది.

రివాల్వర్ తో కాల్చిన సినీ నటుడిని, కాల్పులు తిన్న ఇద్దరూ ఎదురుగ్గా కనిపిస్తూండగానే– చలవగదుల్లో– ఆసుపత్రిలో వుంచి సగౌరవంగా ఇంటికి పంపారు. ఓ సినీమా నటుడికి ఆసుపత్రి అధికారులు పెద్దమనస్సుతో చేసిన ఉపకారమిది.

ఉమా భారతి మీద నాన్ బెయిలబుల్ వారెంటులు పదే పదే వున్నా– ఏనాటికో లొంగిన ఆమెని గెస్టుహౌస్‌లో వుంచి– తరువాత ప్రభుత్వమే పూనుకొని విడుదల చేసింది. ఓ పార్టీ మరొక పార్టీకి చేసిన లోపాయకారీ సహాయమిది.

పెరట్లో ఆస్థి పంజరాల్ని తవ్వి తీస్తే, గూండాలు జైళ్ళల్లో పుట్టిన రోజులు చేసుకొంటూంటే, ముఠా నాయకులు (అరుణ్ గౌలీలు) ఆనందంగా పార్లమెంటుకి ఎన్నికవుతూంటే – ఈ వ్యవస్థ చేతికి గాజులు తొడిగించుకొని వేడుక చూస్తోంది.

ఆలనాడు ఇందిరాగాంధీని ఆరెస్టు చేసి ఓ గెస్టుహౌస్‌లో పెట్టారు. మరి ఇందిరాగాంధీ, మరెందరో రాష్ట్రపతులూ,రాజులూ మోకరిల్లే ఓ సన్యాసిని దీపావళి పండుగ పూటా జైల్లో పెట్టారు.

1975 జూన్ 25 అర్ధరాత్రి తలుపు తట్టిలేపి జయప్రకా ష్ నారాయణ్‌ని అరెస్టు చేస్తే 'వినాశకాలే విపరీత బుద్ధిః' అన్నారు. ఆయన గొంతు ఇవాల్టిదాకా వినిపిస్తోంది. ఈ మాట పండగ పూటా ఎన్ని కోట్ల మంది అనుకున్నారో తెలీదు.

పీలూ మోడీని రాత్రి ఆరెస్టుకు నిద్రలేపితే 'పొద్దుటి దాకా పడుకోనివ్వక నా



2

నిద్ర ఎందుకు చెడగొడతారయ్యా?' అన్నారట. 'నేనేం వీరప్పనా?' అని మాత్రం అన్నారట స్వామి.

మెహబూబ్ నగర్‌లో కంచి స్వామి ఆరెస్టుకి ముఖ్య మంత్రిగారు ఢిల్లీ అనుమతిని తీసుకొన్నారట. ప్రవీణ్ తొగాడియా చెన్నైలో స్పందిస్తూ 'ఢిల్లీ సూపర్ ప్రధానిని అడగండి. వాళ్ళ దేశంలో క్రిస్టమస్ నాడు వాటికన్‌లోకి వెళ్ళి పోప్‌ని ఎవరయినా ఆరెస్టు చేస్తారేమోనని'అన్నారు.

ముస్లిం మత గురువు సయ్యద్ బుఖారీ మీద చాలా కేసులున్నాయి. నాన్ బెయిలబుల్ వారెంట్లు వున్నాయి. ఆయన ఢిల్లీ లోనే వున్నారు. ఈద్ నాడు వారినెవరైనా ఆరెస్టు చేసే దమ్ముందా?

చెన్నై లో మస్తాన్ ఆలీ అనే ముస్లిం– ఉమాభారతికిచ్చిన పాటి మర్యాదకి– పవిత్రమైన ఓ సన్యాసి నోచుకోలేదా? అని అడిగాడు.

కేరళ కాథలిక్ చర్చి ఈ పనికి తీవ్రమైన నిరసనని తెలిపింది. ఎన్నో ముస్లిం సంస్థలు నిరసించాయి.

చట్టానికి ఎవరూ అతీతులు కారు అన్నారు– మానవాళి అభ్యుదయానికి మనుషుల్ని చంపే ఓ పార్టీ నాయకులు. వారు రష్యాలో వున్నారో, చైనాలో వున్నారో నా కయితే తెలీదుకాని– ఈ దేశంలో చట్టాన్ని మనం ఎంత ఘోరమైన స్థాయికి తెస్తున్నామో ఒక్క బెస్టు బాకరీ కేసు, ఓ జహీరా షేక్ కథా చాలు. డబ్బు, అధికారం, బెళ్ళింపూ ఈ దేశంలో చట్టాన్ని ముప్పతిప్పలూ పెడుతున్న నేపథ్యంలో ఏ చట్టానికి ఎవరు అతీతులు కారో నాలాంటి నేలబారు మనిషికి అర్థం కాదు.

మధుమేహంతో, రక్తపు పోటుతో బాధ పడుతున్న ఓ 70 య్యేళ్ళ ముసలి సన్యాసిని,తన చేతుల్తో తను వండుకు తినే నిష్ఠాపరుడిని జైల్లో పెట్టారు.

కాకీ చొక్కా వేసుకొని కార్పొరేషన్ మనిషి వస్తే పోలీసులని పారిపోయే పిరికివాళ్ళ ఈ దేశంలో హిందువులు అన్నారు నిన్న ఒకాయన చెన్నై లో.

కంచి స్వామి ఆరెస్టుకి చంకలు గుద్దుకొంటున్న కరుణానిధిని 'ఓవర్ యాక్షన్' అన్నారు సుబ్రహ్మణ్యస్వామి. దాదాపు రెండు దశాబ్దాలు ఓ రాష్ట్ర ం ఎన్నిక చేసిన నాయకుడు– ఆ రాష్ట్రంలోవున్న మెజారిటీ మతం sensitivities నయినా పరిగణించ కుండా– ప్రకటనలు యివ్వడం చాలా దయనీయమైన విషయం. ఇంత హీన స్థితిలో వున్నారా మెజారిటీ ఎన్నిక చేసిన నాయకులు!

కంచి స్వామికి యివ్వగలిగిన కనీస మర్యాదని యివ్వలేని ఈ దేశంలో 83 కోట్ల



3

హిందువులు political orphans (రాజకీయ అనాధలు) అన్నారు ప్రవీణ్ తొగాడియా.

మొన్ననే 90 సంవత్సరాలు నిండిన ఓ మహనీయ న్యాయమూర్తి వి.అర్. కృష్ణయ్యర్ మాటలు:'To be gentle is to be just and the quality of mercy is not strained"

మరొక్కసారి– ఈ కాలమ్ ఉద్దేశం కంచి స్వామి నేరాన్నో, నేరంతో ప్రమేయాన్నో విశ్లేషించడం కాదు. 83 కోట్ల మంది హిందువులున్న ఈ దేశంలో 2000 సంవత్సరాల వ్యవస్థ ఆధిపతికి– దక్కవలసిన మానవతా మర్యాద కూడా యివ్వలేనంత 'పరాయి' పాలనలో వున్నామా మనం? పరాయి పాలకులే మనల్ని గౌరవించిన మహత్తరమైన సంఘటనలు ఇంకా మన కళ్ల ముందున్నాయి కదా!

ఈ దీపావళి శోకాంధ తిమిరావళి– బెదిరించినప్పుడో, బ్లాక్‌మెయిల్ చేసినప్పుడో, స్వజనానికో, స్వలాభానికో– తలవంచే ఆధోగతిలో మన రాజకీయ వ్యవస్థ వున్నందుకు.

(తాజాకలం: నేను విశ్వహిందూ పరిషత్ సభ్యుడినికాను. ఆర్.ఎస్.ఎస్, భారతీయ జనతా పార్టీ సభ్యుడినీ కాదు. నేను ఓ హిందువును.)

------------------

(**డిసెంబర్** 23, 2013)

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

## (December 30, 2013) Samadhipai Akhari Raayi  సమాధిపై ఆఖరి రాయి

ఈ కుంభకోణం శతాబ్దాల చరిత్ర ఉన్న కాంగ్రెసు పార్టీకి చరమగీతమని చెప్పవచ్చు. "ఆదర్శం" అనే పేరుని, దాని అర్థాన్నీ భయంకరంగా అనుభవం, అధికారం, అన్నిటికీ మించి విచక్షణ, వివేచన తెలిసిన నాయకులు భ్రష్టు పట్టించడానికి ఇది పరాకాష్ట. దేశంలో ఒక న్యాయాధిపతి జె.ఏ.పాటిల్, ఒక మాజీ ప్రధాన కార్యదర్శి పి.సుబ్రహ్మణ్యం ఈ కుంభకోణాన్ని పరిశీలించి ఇచ్చిన రిపోర్టుని ఒక్కసారి చూద్దాం. ముందుగా ఈ కుంభకోణంలో తలదూర్చి లబ్ధి పొందిన పెద్దల జాబితా: నలుగురు ముఖ్యమంత్రులు, ఒక కేంద్ర హోం మంత్రి, ఇద్దరు జాతీయ కాంగ్రెసు మంత్రులు, పన్నెండు మంది ఐయ్యేయస్ ఆఫీసర్లు, ఇద్దరు రాష్ట్ర మంత్రులు, ఇద్దరు దేశ సైన్యాధిపతులు, ఇద్దరు మేజర్ జనరల్స్, ఒక కల్నల్, ఒక బ్రిగేడియర్, ఒక ఐ ఎఫ్ ఎస్, ముగ్గురు కలెక్టర్లు, ఎందరో పార్లమెంటు సభ్యులు, ఇంకా మరెందరో. బహుశా మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక జరిగిన కుంభకోణాల్లో ఇది తలమానికం. దేశంలో ఇంత పెద్ద పదవుల్లో ఉన్న ఇంతమంది సామూహికంగా జరిపిన కుంభకోణానికి ఇది గొప్ప చరిత్రని సృష్టించే కుంభకోణం. ఈ దేశంలో మానవ స్వభావం ఎంత నీచానికి ఒడిగట్టగలదో, ఎంత గొప్ప పదవుల్లో ఉన్నా స్వలాభం ఎంతగా పాతాళానికి కృంగదీయగలదో నిరూపించే గొప్పదరిద్రం. దీనిలో ఆయా అపార్టుమెంటుల్ని అవినీతితో పంచుకున్నవారంతా ఈ దేశపు విలువల్ని నిలిపే బాధ్యతల్ని చేపడతామని ఈదేశపు రాజ్యాంగం మీద ప్రమాణం చేసి ఆయా పదవుల్ని చేపట్టినవారు. తీరా కుంభకోణం వివరాలను సాధికారమైన కమిటీ బయటపెట్టినప్పుడు – కాంగ్రెసు ప్రభుత్వం ఏం చేసింది? మహారాష్ట్ర ప్రభుత్వం ఈ నివేదికని తిరస్కరించింది. ఎందుకు? మాజీ ముఖ్యమంత్రి మీద నేర పరిశోధన ప్రారంభించడానికి మహారాష్ట గవర్నర్ శంకర్ నారాయణ్ నిరాకరించినందుకు. నిజానికి ఈ విచారణ సంఘం నిర్ణయాన్ని దృష్టిలో పెట్టుకుని గవర్నర్ మహాశయులు తన నిర్ణయాన్ని తీసుకోవాలి. అలాక్కాక గవర్నర్ గారి ఏకపక్ష నిర్ణయాన్ని వెనకేసుకు వచ్చి కమిటీ రిపోర్టుని మహారాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించింది. ఇదేం విపరీతం? 2010 లో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చి రాజకీయ వర్గాలను పునాదులతో కుదిపినప్పుడు అశోక్ చవాన్ పదవికి రాజీనామా ఇచ్చారు. ఇప్పుడు విచారణ సంఘం అతి స్పష్టంగా ఆయా అధికారులు ఆయా దశలలో తీసుకున్న నిర్ణయాలు, సరైనవికావు, సమర్ధనీయాలుకావు, ప్రజాహితాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్నవికావు అని కుండబద్దలు కొట్టి తేల్చి చెప్పాక గవర్నరు సీ.బి.ఐ కి అనుమతిని తిరస్కరించడం ఏమిటి? దాన్ని ఆసరా చేసుకుని మహారాష్ట్ర ప్రభుత్వం కమిటీ రిపోర్టుని తిరస్కరించడం ఏమిటి? సరే. నిన్నటికి నిన్న కాంగ్రెసు యువరాజు రాహుల్ గాంధీగారు ఈ కుంభకోణం మీద విచారణ జరగాలి అన్న వెంటనే మహారాష్ట్ర ముఖ్యమంత్రిగారు వెనక అడుగు వేశారు. ఈ దేశపు నీతి ఒక 'నాయకుని' అభిప్రాయం చుట్టూ ఏర్పడడం – అదీన్నీ నెహ్రూ కుటుంబానికి కాంగ్రెసు నాయకత్వం తలవంచడానికి ఇది దయనీయమైన మచ్చుతునక.

అసలు ప్రజలి ఆస్తుల్ని కొల్లగొట్టిన దొంగలు ఎలా పంచుకున్నారో ఆ ముచ్చట చూద్దాం. ప్రతీ దశలోనూ ఈ "ఆదర్శాన్ని"కి కొమ్ము కాసిన ప్రతీ రాజకీయ నాయకుడూ, ప్రతీ గవర్నమెంటు ఆఫీసరూ తనవాటా గడ్డిని తిన్నాడు. 1980 ప్రాంతాలలో ఈ నిర్మాణం ప్లాన్లకు అశోక్ చవాన్ మద్దతు పలికారు. లాభం? వారి అత్తగారి పేరిట కోట్ల ఖరీదు చేసే ఒక ఫ్లాట్, ఆయన దగ్గరి బంధువులకి ఈ ఆదర్శ సొసైటీలో సభ్యత్వం. విలాస్ రావ్ దేశ్ ముఖ్ కొన్ని నిబంధనలను సవరించాక – ఇద్దరు ఈ దేశపు సైన్యాధిపతులు ఎన్.సి.విజ్, దీపక్ కపూర్ తమ తాంబూలాలను పుచ్చుకున్నారు – రెండు ఫ్లాట్ల రూపంలో. దేశ్ ముఖ్ గారు ఈస్థలం పక్కనున్న కొంత స్థలాన్ని కలుపుకోడానికి నిబంధనలను సడలించారు – తద్వారా ఈ కట్టడానికి ఎఫ్ ఎస్ ఐ పెరిగే అవకాశాన్ని కల్పిస్తూ. ఆయన తర్వాత ప్రస్తుత హోంమంత్రి సుశీల్ కుమార్ షిండేగారు ముఖ్యమంత్రి

అలరించే సీరియల్స్
ఆకట్టుకునే కథలు
ప్రతినెలా ప్రత్యేక కథనాలు
పాఠకులూ పాల్గొనే ఫీచర్స్
శ్రీ కౌముది
వినూత్నమైన సినీ విశేషాలు
కడుపుబ్బ నవ్వించే హాస్య వల్లరులు..
ప్రతి పేజీలో కొత్తదనం..
ప్రతి సంచికా ఒక ప్రత్యేకం ..!!

అయారు. ఈ విషయం మీద మంత్రివర్గం నిర్ణయం తీసుకోవాలని ఆర్థిక శాఖ సూచించగా వారు ఆ సూచనని తుంగలోకి తొక్కి తన సంతకం చేశారు. తత్కారణంగా ఈ సొసైటీలో ఉన్న 71 మందిలో 20 మందికి అపార్టుమెంటులు కేటాయించే అర్హతని సంపాదించుకున్నారు. ముఖ్యమంత్రి సెక్రటరీ సుభాష్ లల్లాగారు తెలివిగా ఈ ఫైలుని కదిపారు. తత్కారణంగా వారి తల్లికీ, కూతురికీ రెండు ఫ్లాట్లు దక్కాయి. ముంబై కలెక్టరు ప్రదీప్ వ్యాస్ సతీమణికి ఒక ఫ్లాట్ దక్కింది. అలాగే మహారాష్ట్ర నగర పాలక సంస్థ ప్రధాన కార్యదర్శి డి.కె.శంకరన్ గారికీ, సి.ఎస్ సంగీతరావు అనే మరో కలెక్టరుగారికీ వారి వారి కొడుకుల పేరిట ఫ్లాట్లు దక్కాయి. ఐ.కె.కుందన్ అనే కలెక్టరుగారికీ, నగర అభివృద్ధి సంస్థ కార్యదర్శి పి.వి.దేశ్ ముఖ్ గారు ఏమీ గజిబిజి లేకుండా తమ పేరిటే ఫ్లాట్లు నమోదు చేసుకున్నారు. ఇక మాజీ జనరల్ మేనేజరు ఉత్తం ఖోబ్రగాడే. ఆయన నేరంగానీ, గూడుపుఠాణీగానీ రుజువు కాలేదని ఈ కమిటీ పేర్కొందికానీ వారి సుపుత్రి – దేవయాని ఖోబ్రగాడేకి (ఈ మధ్య అమెరికాలో పోలీసుల అమర్యాదకరమైన అరెస్టుకు వార్తలలోకి ఎక్కిన సీనియర్ దౌత్య అధికారి) ఇందులో ఒక ఫ్లాట్ అనధికారికంగా కేటాయించారు. కారణం – తనకు ముంబైలో మరో ఆస్తిలేదని ఆమె తప్పుడు సమాచారాన్ని తన దరఖాస్తులో ఇచ్చారు. ఇది కేవలం స్థాలీపులాక న్యాయంగా మన పెద్దమనుషులు సిగ్గులేని దోపిడీకి కేవలం నమూనా.

ప్రారంభంలో ఈ ప్రాజెక్టుని కార్గిల్ సమరంలో ప్రాణాలు పోగొట్టుకున్న అమర వీరుల భార్యలకు నివాసాలు కల్పించే లక్ష్యాన్ని కాగితాల మీద చూపారు. నిజంగా ఈ లక్ష్యం అభినందనీయం. ఉదాత్తం. కానీ తమ తమ దోపిడీకి ఈ దేశంలో ఉత్తమ పదవుల్లో ఉన్న రాజకీయ నాయకులు, ముఖ్యంగా సైనికాధికారులు ఈ కుంభకోణంలో చేతులు కలపడం ఒక ఉదాత్తమైన ఆదర్శాన్ని అతినీచమైన లక్ష్యాలను, ఆదర్శాన్ని చూపవలసిన సైనికాధికారులు – అతినీచంగా రాజకీయ నాయకులతో, సిగ్గులేని, నిజాయితీ కొరవడిన ఆఫీసర్లతో ఈ దోపిడీని పంచుకోవడం – చరిత్రలో సైనిక శాఖ నీచానికి ఇది దయనీయమైన నిదర్శనం. మన దేశంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తుల రంకునీ, రాజ్ భవన్ లో గవర్నర్లు వేశ్యలతో కులికే నీచాన్ని దర్శించాం. ఇప్పుడు – మనం గర్వంగా తలకెత్తుకునే మరో వ్యవస్థ సైనిక వ్యవస్థ పతనానికి ఇది అతి దయనీయమైన ఉదాహరణ. ఇప్పటికే కాంగ్రెసు ఊపిరి పీల్చుకోడానికి, సమర్ధించుకోడానికి వీలు లేని పీకలోతు కుంభకోణాలలో మునిగి తేలుతోంది. ప్రజలు తమ విముఖతని ఈ మధ్య జరిగిన ఎన్నికలలో నిర్ద్వంధంగా చూపారు. కర్కశంగా కాంగ్రెసుని గద్దె దింపారు. తమ విముఖతని చెప్పుతీసి కొట్టినట్టు ప్రకటించారు. ఇప్పుడీ కుంభకోణం ఈ అవినీతికి పరాకాష్ట. ఇంతకంటే నీచాన్ని చరిత్రలో మనం ఊహించలేము. పైగా ఈ అవినీతిపై విచారణకు ఒక గవర్నరు, ఒక రాష్ట్ర ప్రభుత్వం నిరాకరించడం – ఏం జరిగినా పరవాలేదని మొండికేయడమా? ప్రజల ఏహ్యతను ఎలా ఎదిరించాలో తెలియని ఊబిలో కూరుకుపోవడమా?

ఓటరు విసుగుదలా, తిరస్కారాన్ని పూర్తిగా చవిచూసే సమయం ఇంక ఎంతదూరమో లేదు. తెలుగులో ఒక సామెత ఉంది. చాలా సంవత్సరాలకిందట ఇందిరాగాంధీ అర్ధరాత్రి అర్ధాంతరంగా ఎమర్జెన్సీని ప్రకటించి, తనని అరెస్టు చేయడానికి జయప్రకాష్ నారాయణ్ ని అర్ధరాత్రి నిద్రలేపినప్పుడు ఆ మాట అన్నారు – వినాశకాలే వీపరీత బుద్ధిః అని. ఈనాటి పాలకుల విపరీత బుద్ధి మరో వినాశకాలానికి కేవలం సూచన.

( **డిసెంబర్** 30, 2013)


